RNI No. APTEL/2003/12253

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

ज्ञान-विज्ञान विमुक्तये
UGC
University Grants Commission
UGC Care List Group - 1
Journal Sl. No 34 under
Arts and Humanities
Category

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

Vol : 18 Issue No. 10 Monthly October 2021 ISSN No. : 2456-4702 Rs. : 15/-



గంటిజోగి సోమయాజి

మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు



BHAVA VEENA (భావ వీణ)

Journal of Arts, Literary, Culture & Language Study

(కళలు - సాహిత్య-సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక)

Editor : Kolla Sri Krishnarao
E-mail : parisodhanatelugu@gmail.com

7989781963,
9490847482.
Rohini Towers,
2/11 Brodipet,
GUNTUR-2.

Vol. 18 - Issue. 10 - October 2021 - ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 - Rs. : 15/-

EDITORIAL BOARD

Chief Editor

PITTA SANTHI

M.A.(Tel), M.Sc(Psy).,M.Ed.,M.Phil(Edu),(Ph.D).,

C/o. Dr. Busi Venkataswamy

Holy Homes Apartment, Postal colony ,
4 Th Line,- 522 002, Guntur Dist., A.P. Cell no : 7386529274, 7989781963.

ADVISORY COMMITTEE

1. **Prof. G. Yohan Babu,** M.A., PhD.
Dept. of Telugu,
Andhra University, Visakhapatnam.
2. **Prof. K. Madhu Jyothi,** M.A., PhD.
Dept. of Telugu,
Sri Padmavathi Mahila University,
Tirupathi.
3. **Prof. C. Srirama Chandra Murthy,** M.A., PhD.
Dept. of Telugu, Faculty of Arts,
Benaras Hindu University, Varanasi, Utter Pradesh.
4. **Dr. Busi Venkataswamy,** M.A. (Tel)., M.A (San)., M.A (Ling)., PhD.
HOD & Research Guide, Dept. of Telugu
PAS College, Pedanandipadu.
5. **Thottempudi Sree Ganesh,** M.A., M.Phil (Computational Linguistics) (Ph.D)
Research Scientist, Centre for Applied Linguistics and Transalation Studies, Universityof Heidelberg, Germany.
6. **Dr. Ponnama Reddy Kumari Neeraja** M.A., Ph.D.
HOD, Dept. of Telugu,
Govt. Degree College, Puttur, Chittor Dist.

ASSOCIATE EDITORS

1. **Dr.N. R. SADASIVA REDDY**, M.A.,M.Phil,PhD.
Asst. Professor,
Dept. of Telugu & Comparative Literature,
Sri Krishna Deva Raya University,
Ananthapuram, Andhra Pradesh.
2. **Prof. V.SANKARA RAO**, M.A.,M.A.,M.Phil,PhD.
HOD, Dept. of Telugu,
Madras University,
CHENNAI, Tamilnadu.
3. **Dr. D. SESHUBABU**, M.A.,M.Phil,PhD.
Asst. Professor, Dept.of Hindi,
Moulana Azad National Urdu University,
HYDERABAD, Telangana.
4. **Dr. K. Lavanya,** M.A., M.Phil., PhD.
Board of Studies Chairman,
Telangana University, Dichpally,
Nizamabad, Telangana.
5. Prof. **N.V. KRISHNA RAO,** M.A.,M.Phil,PhD.
Dept. of Telugu & O.L.,
Acharya Nagarjuna University,
Nagarjuna Nagar, Guntur District.
6. **Dr. A. JYOTHI,** M.A.,M.Phil,PhD.
Associate Professor, Dept. of Telugu,
Kakatiya University, Warangal District.
Telangana.

7. **Dr. J. VENKATA RAMANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept.of Modern Indian Languages,
Madhurai Kamaraj University, Madhurai,
Tamilnadu.

8. **Dr. N. Eswar Reddy,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
Yogi Vemana University, Kadapa.

9. **Prof. P.R. Harinadh,** M.A., M.Ed., M.Phil,PhD.
Dept. of Telugu,
Regional Institute of Education (NCRT)
Manasa Gangothri, Mysore, Karnataka.

10. **Dr. B. Tirupathi,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
Dravidian University, Kuppam, Chittor Dist.

11. **Dr. T.SATYANARAYANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept. of Telugu,
Adikavi Nannaya University,
RAJAMUNDRY, East Godavari, A.P.

12. **Mr. D.ESWARA RAO,** M.A.,
Principal,
P.A.S.College, PEDANANDIPADU-522 235,
Guntur, A.P.

13. **Dr. P. VIJAYA KUMAR**, M.A.,M.Phil,PhD.
Asst. Professor, Dept. of Telugu,
Central University of Andhra Pradesh,
Ananthapuram District. A.P.

14. **Dr. K. RAVI**, M.A., M.Phil,PhD.
HOD, Dept. of Telugu, C.R. Reddy College,
West Godavari District. A.P.

15. **Dr. G. Swarnalatha,** M.A., PhD.
Asst. Proffesor, Dept. of Telugu,
Govt. Women's College (A), Guntur.

16. **Dr. V. Naga Rajyalakshmi,** M.A., PhD.
Rt Principal,Govt .Degree College,
Chebrole , Guntur, A.P.

17. **Dr. Guntupalli Gowri,** M.A., PhD.
Dept. of Telugu,
Govt. College for Women, Guntur - 522 002.

18. **Dr. Kakani Sudhakar,** M.A., M.Phil., PhD.
Dept. of Telugu,
S.S.N. College, Narasaraopet - 522 601.

19. **Dr. K. Pushpamma,** M.A., PhD.
HOD, Dept. of Telugu,
SVRM College,
Nagaram - 522 035.

20. **Dr. P. Srinivasa Rao,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Andhra University, Visakhapathan.

21. **Dr. Ch. Praveen Kumar,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Kakatiya University, Warangal.

22. **Dr. N. Rambabu,** M.A., M.Phil., PhD.
Project Senior Fellow, Dept. of Classical
Literature, Nellore.

23. **Dr. G. Sailamma,** M.A., M.Phil., PhD.
Editorial Assistat,
Centre for Publications Dravidian University,
Kuppam, Chittor Dist.

24. **Dr. M. Sangeetha Rao,** M.A., M.Phil., PhD.
Guest Faculty, Dept. of Telugu,
Central University of Andhra Pradesh,
Ananthapuram District. A.P.

25. **Dr. M. Prasad,** M.A., M.A.(San)., PhD. Diploma in Maliyalam.
School Assistant (Telugu)
Govt. High School,
Rapuru, SPSR Nellore.

26. **Dr. V. Triveni**
Head & Assistant Professor,
Dept. of Telugu Studies,
Telangana University, Dichpally, Nizamabad.

27. **Dr. Mark Poloneyes,** M.A., M.Phil., PhD.
Principal & HOD,
P.G. Centre, Gadwal,
Palamuru University, Mahabobnagar, Telangana.

LEGALADVISER

Dr. A. GURAVAIAH, ***M.A., L.L.M., PhD.,***
Principal & Research Guide, Dept., of Law, A. C. Law College, GUNTUR - 522 002, A.P.

DTP & PRINTING

TENALI PRAKASH, G.L.S. GRAPHICS, LEMALLE, Guntur. 94 94 660 509.

గమనిక : రచయితల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు - **ఎడిటర్.**

Edited, Printed, Published and owned by Kolla Srikrishna Rao, Rohini Towers, 2/11 Brodipet,
GUNTUR - 522 002. Andhra Pradesh. Cell : 7386529274, 7989781963.
E-mail : parisodhanatelugu@gmail.com.Printed at : GLS Enterprises, Kavitha Nagar, Guntur - 522 002. Ph. 94 94 660 509.

గంటిజోగి సోమయాజి

గంటిజోగి సోమయాజి ప్రముఖ తెలుగు భాషా శాస్త్రవేత్త. సోమయాజి విశాఖ జిల్లా అనకాపల్లిలో 1990 సంవత్సరం అక్టోబర్ 7న సూరమ్మ, అప్పల నరసింహ గార్లకు జన్మించాడు. వీరి విద్యాభ్యాసం విజయనగరం, కాకినాడ పిఠాపురం రాజా కళాశాలలో, మహరాజా కళాశాలలో డిగ్రీ స్థాయి వరకు పూర్తిచేశారు. తన 21 సంవత్సరంలోనే రసాయన శాస్త్ర ఉపాధ్యాయుడిగా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించాడు. సోమయాజి పినతండ్రి గంటి సూర్యనారాయణ శాస్త్రి వద్ద సంస్కృతం అభ్యసించారు. ఎం.ఎ సంస్కృతం పూర్తి చేశారు. చెన్నైలోని పచ్చయప్ప కళాశాలలో సంస్కృతోపన్యాసకుడిగా పనిచేశారు. ఆంధ్రకళాపరిషత్‌లో సర్వేపల్లి రాధాకృష్ణయ్య గారి పరిచయంతో తెలుగుశాఖలో అధ్యాపకుడిగా నియమితులై రీడర్‌గా, ఆచార్యులుగా ఉన్నత పదవులను అధిరోహించారు. ఆంధ్ర విశ్వకళాపరిషత్‌లో ద్రావిడ భాషలపై తులనాత్మక పరిశీలన చేశారు. సోమయాజీ ఆధ్వర్యంలోనే తెలుగుశాఖలో బి.ఏ ఆనర్స్ కోర్సును ప్రవేశపెట్టారు. తర్వాత ఎం.ఏ తెలుగు కోర్సును ప్రవేశపెట్టారు. పదవీలో ఉన్నంతకాలం తెలుగు భాషకి ఎనలేని సేవలందించారు. సోమయాజి భాష సేవలను గుర్తించి భారత ప్రభుత్వం ఉద్యోగ విరమణ అనంతరం కూడా "ప్రిన్సిపల్ సైంటిఫిక్ ఆఫీసర్ గానూ, Chairman of the Commission for Scientific and Technical Technology, Ministry of Education, Government of India వంటి అనేక సేవలను అందించారు. వీరి సుప్రసిద్ధ రచనలు అల్లాహో అక్బర్, రామచంద్రుని హంపీయాత్ర, మేఘ సందేశం, ద్రావిడ భాషలు, ఆంధ్రభాషా వికాసం, తెలుగు వ్యుత్పత్తి పదకోశం మొదలగునవి. సోమయాజి సేవలకు గాను ఆంధ్ర విశ్వకళాపరిషత్ 1963 సంవత్సరంలో కళాప్రపూర్ణ బిరుదునిచ్చి సత్కరించింది. 'భాషాశాస్త్ర చతురాసన' అనే బిరుదు కూడా కలదు. తెలుగు భాషా శాస్త్రానికి గంటిజోగి సోమయాజి చేసి కృషి ఎనలేనిది.

- సంపాదకవర్గం

Contents (విషయ సూచిక)

1.	చిత్తూరు జిల్లా గ్రామ నామాలు	- ఆచార్య ఎం. రామనాథంనాయుడు	5
2.	మల్లంపల్లి సోమశేఖర శర్మ వ్యాసాలు - బౌద్ధమతం	- డా॥. డి. విజయ కుమారి	13
3.	నూతలపాటి కవిత్వం - సమకాలీన సమస్యల చిత్రణ	- డా॥. జి. పార్వతి	22
4.	తెలంగాణ నవలలు - కుల వృత్తుల చిత్రణ	- ఆకుల లక్ష్మణ్	27
5.	ప్రయోగ కవిత్వం 'కూలిపోయే కొమ్మ'	- అందె కిష్టయ్య	35
6.	సింహాసన ద్వాత్రింశిక - వృత్తి చిత్రణ	- డా॥. బోయిన్‌పల్లి ప్రభాకర్	38
7.	హిజ్రాల సంస్కృతీ సంప్రదాయాలు	- డా॥. పి. కుమారి నీరజ	42
8.	నల్లగొండ జిల్లా భజన - భక్తి విధాన పరిచయం	- రాములు తోట	47
9.	శ్రీకృష్ణదేవరాయల పాలనలో తెలుగు భాషా వికాసం	- డా॥. వి. గోపాల్	51
10.	తెలుగు సాహిత్యంలో ప్రబంధ కేతనం - జయధ్వజం	- డా॥. జి.భాస్కర్ యాదవ్	55
11.	పదమూడో ఆళ్వార్ వట్టికోట	- గాదె చంద్రశేఖర్	59
12.	తెలుగు సినిమా ఆవిర్భావం	- గంజి శశిధర్	62
13.	తొలి తెలుగు సంకలన గ్రంథం 'సకలనీతి సమ్మతము'	- గోలి శ్రీలత	67
14.	నవరసభరితం- తెలంగాణ యక్షగానం	- కె. సురేష్	71
15.	తెలంగాణ ఉద్యమ, చారిత్రక, బహుజన, మాండలిక నవలలు...	- డా॥. కొప్పు సుభాష్ చంద్రబోస్	77
16.	కళ్లేపల్లి బంగారు మైసమ్మ జాతర - పరిశీలన	- కొర్ర ఝాన్సీ	81
17.	జానపద సాహిత్యం - శృంగార గేయాలు	- డా॥. లంకిపల్లె జ్యోతీశ్వర నాయుడు	84
18.	జాతీయోద్యమంలో గేయకవిత్వం - సామాజిక చైతన్యానికి సంకేతం	- యం. అనిత	89
19.	ఒంటి మిట్ట రామస్వామి చరిత్ర	- మందాల భాస్కర్	92
20.	సి.యస్.రావు నవలల్లో స్త్రీ చైతన్య పాత్రలు (సాహిత్య వ్యాసం)	- మొర్రి పిచ్చయ్య	96
21.	దళిత సాహిత్య ద్వారం - భీమన్న శంఖారావం	- నేతల లలిత	103
22.	సి.నా.రె ప్రపంచ పదుల్లోని మానవీయ విలువలు	- పెదనారప్పగారి సురేష్	106
23.	సరస్వతీ స్తుతి శతకాల పరిచయం	- శ్రీవైష్ణవ వేణుగోపాల్	110
24.	తెలుగు సినిమాపాటల్లో జాన'పద సౌందర్యం'	- తిరునగరి శరత్‌చంద్ర	117
25.	తెలంగాణ సంస్కృతిలో బతుకమ్మ పండుగ విశిష్టత	- వి. వినయ్ కుమార్	122
26.	వట్టికోట జైలు లోపల కథలు - ప్రజా రాజాకీయాలు	- చిరంజీవి వోనె	126
27.	స్త్రీ విముక్తి - సాధికారత	- డా॥. పెండ్యాల లావణ్య & డా॥. బూసి వెంకటస్వామి	130
28.	ఆధునిక జానపదం బుల్లెట్టు బండి పాట	- డా॥. చింతల రాకేశ్ భవాని	134
29.	Gandhian's "Sarva Dharma Sambhavi" and Indian Relion	- B. Venkateshwarlu	137
30.	Constitutional Provisions and Equality of Educational Opportunities of Scheduled Tribes in India	- Dr. Kotaiah Veturi	142
31.	Text, Theatrical Processions and Space :	- Dr. Pejjai Nagaraju	147
32.	Mental Health among University Students	- Dr. Vimal Kishor & - Mrs. Jyoti Walia	158
33.	Vedic Accents and Arthur Anthony Macdonell	- Shivarchit Mishra	166

BHAVAVEENA
Vol. 18, Issue. 10, October 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

చిత్తూరు జిల్లా గ్రామ నామాలు

- ఆచార్య ఎం. రామనాథంనాయుడు

ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమ జిల్లాల్లో చిత్తూరు జిల్లా ఒకటి. జిల్లాలో 08 మునిసిపాలిటీలు, 03 రెవిన్యూ డివిజన్లు, 66 మండలాలు ఉన్నాయి. జిల్లాలోని ప్రతి ఊరుకు, ప్రాంతానికి ఒక పేరుంటుంది. ఆ ఊరికి ఆ పేరెలా వచ్చిందంటే ఎన్నో ఆసక్తికర విషయాలు చెపుతారు.

జిల్లాలోని గ్రామ నామాల్ని పరిశీలిస్తే పల్లె, ఊరు, ఏరు, పేట, కోట, పెంట, గుంట, దొడ్డి, పట్ల, పురం, నగరం, నత్తం, కొండ, చెరువు, సముద్రం, పాళెం, వనం, బయలు, ఖండ్రిగ, పట్టడ, తాంగల్, కుప్పం మొదలైన పేర్లతో కలిసిన ఊర్లు ఎక్కువగా కన్పిస్తాయి.

ఉదా :

1. పల్లె : మదనపల్లె, చౌడేపల్లె, ఆవులపల్లె, దళవాయి పల్లె మొదలైనవి.
2. ఊరు : చిత్తూరు, పుత్తూరు, పుంగనూరు, కందూరు మొదలైనవి.
3. ఏరు : పీలేరు, పలమనేరు, కోగిలేరు మొదలైనవి.
4. పేట : సంతపేట, రాయలపేట, వడమాలపేట, పాపానాయుడుపేట మొదలైనవి.
5. కోట : ఎ.కొత్తకోట, బి.కొత్తకోట, వి.కోట, కురబలకోట, కదిరినాథునికోట మొదలైనవి.
6. పెంట : పెంట అంటే కేవలం మలం అనే అర్థంలోనే కాకుండా 'కసవు' అనే అర్థంలో 'పెంటపోగు' లో కనిపిస్తుంది. పెంట అంటే చెత్త, పనికిరానిది అనే అర్థాలున్నాయి. పశువులను రాత్రిపూట మంద పెట్టే స్థలాన్ని 'పెంట' అని అంటారు. అలాంటిచోట్లలో ఏర్పడిన ఆవాసాలకు పెంట అనేది వచ్చింది.
   - ఎలకమానిపెంట, రాళ్ళపెంట, వన్నిపెంట, సున్నిపెంట మొదలైనవి.
7. గుంట : ఓటిగుంట మొదలైనవి.
8. దొడ్డి : దేవదొడ్డి, బండ్లదొడ్డి మొదలైనవి.
9. పట్ల : పుదిపట్ల, మేలుపట్ల, కీలపట్ల మొదలైనవి.
10. పురం : శాంతిపురం, విజలాపురం, నాగులాపురం, సంతోషపురం, సమయపురం మొదలైనవి.
11. నగరం : కార్వేటినగరం, గోవిందరాజపట్టణం మొదలైనవి.
12. నత్తం : నత్తమనేది తమిళ శబ్దం. పన్ను మినహాయింపు కలిగిన భూమి, గ్రామం అని అర్థం. మాలేనత్తం, కడపనత్తం మొదలైనవి.
13. కొండ : గుర్రంకొండ, చంద్రగిరి, తిరుమల, కొండామారి మొదలైనవి.
14. చెరువు : దామలచెరువు, మొలకలచెరువు, కణితల చెరువు మొదలైనవి. పులిచెర్ల, కలిచెర్ల మొదలైనవి చెరువులకు సంక్షేపరూపాలు.
15. సముద్రం : రామసముద్రం, పాలసముద్రం, చిన్న తిప్పమహాసముద్రం, పెద్దతిప్ప మహాసముద్రం మొదలైనవి.
16. పాళెం : బంగారుపాళెం, ఎనుగొండపాళ్యం, సోంపాళ్యం, దిగువపాళెం, ఎగువపాళెం మొదలైనవి.
17. వనం : నారాయణవనం, వనదుర్గాలు మొదలైనవి.
18. బయలు : సంతబయలు, గుర్రాలబయలు, పుదిపట్ల బయలు మొదలైనవి.
19. ఖండ్రిగ : ఖండ్రిగ అంటే ఒక గ్రామం నుండి కొంత భూభాగాన్ని విడదీసి ఎవరికైనా సంక్రమింప జేయడం.

- బుచ్చినాయుడు కండ్రిగ, నైనారు కండ్రిగ, బలిజకండ్రి మొదలైనవి.

20. పట్టడ : పట్టె అంటే ఒకరి నుంచి పంచుకొన్న భూభాగం.

- సంజీవరాయపట్టడ, నాయుడు పట్టడ, కాశీపట్టడ, సింగరాజు పట్టడ మొదలైనవి.

21. తాంగల్ : తాంగల్ తమిళపదం. వరిపంటకు నీరిచ్చే చిన్న జలాశయం అని అర్థం.

- పెరుమాల్ తాంగల్, శెట్టియప్పన్ తాంగల్, బ్రాహ్మణ తాంగల్ మొదలైనవి.

22. కుప్పం : కుప్పం అంటే గ్రామం అని అర్థం.

- రామకుప్పం, పల్లికుప్పం, వెదురుకుప్పం, కంగుంది కుప్పం మొదలైనవి.

జిల్లాలోని ముఖ్యమైన కొన్ని గ్రామాలకు ఆ పేర్లు ఎలా వచ్చాయనేది పరిశీలిద్దాం.

1. ఐరాల : ఆంధ్ర రాష్ట్రం ఏర్పడక మునుపు "అయరాజగిరి" అనే కొండ ప్రాంతం తమిళనాడు రాష్ట్రం లోని నార్త్ ఆర్కాడ్ జిల్లాలో ఉండేది. తర్వాత ఈ ప్రాంతాన్ని చిత్తూరు జిల్లాలోకి చేర్చడమైంది. అయరాజగిరి సమీపంలోని గ్రామాన్ని ఆనాడు ఐరావతపట్టణంగా పిలిచేవారు. కాలక్రమేణ అది 'ఐరాల' గా పేరు మారింది.

2. కలకడ : 13వ శతాబ్దంలో వైదుంబ రాజవంశానికి చెందిన చంద్రగుప్త మహారాజు కడపజిల్లా సిద్ధవటం ప్రాంతాన్ని పరిపాలించేవాడు. అతనికి బిడ్డలు పుట్టలేదు. ఎన్నో పూజలు, వ్రతాలు చేసిన తర్వాత ఆడబిడ్డ జన్మిస్తుంది. ఆ బిడ్డకు సత్యవతి అని పేరు పెడతారు. ఆమెను అల్లారుముద్దుగా పెంచుతారు. యుక్తవయసుకు వస్తుంది. పెళ్ళి కాకుండానే గర్భం దాల్చుతుంది. న్యాయ పరిపాలనాదక్షుడిగా పేరున్న చంద్రగుప్త మహారాజు తనకు తలవంపు కాకూడదని, ఎవరికైనా ఒకే న్యాయమనే ఉద్దేశంతో నిండుసభలో తన కుమార్తెను దోషిగా నిలిపి న్యాయకోవిదుల తీర్పును అర్థిస్తాడు. అప్పుడు వాళ్ళు సత్యవతి తలపై ఒక సర్పాన్ని చుట్టగా పెట్టి, దానిపై పచ్చి కడవ వుంచి, అందులోకి కల్లుపోసి ఏడు పాలిమేరల దూరం నడిపించాలని చెపుతారు. కడవ పగలకుండా, కల్లుకింద పడకుండా, పాము కదలకుండా నిర్దేశిత దూరాన్ని పూర్తిచేసి తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవాలని, లేకుంటే అక్కడే శిరచ్ఛేదం చేయాలని ఆజ్ఞాపిస్తారు.

ఆమె అదేవిధంగా బయలుదేరి శేషాచలం మీదుగా ఏడు పాలిమేరలు దాటి నేటి కలకడ సమీపంలోని నదిని చేరగానే గర్భం మాయమై, కడవలో శివలింగం ఉద్భవించింది. తన పాతివ్రత్యాన్ని నిరూపించుకున్న సత్యవతి జీవితంపై విరక్తి చెంది తూర్పుదిక్కుగా వెళ్ళి అంతర్ధానమైందని చెపుతారు. సత్యవతి అడుగుపెట్టిన నదికి 'సత్యవతీనది' అని పేరు వచ్చింది. అలాగే కల్లు కడవలో శివలింగం పుట్టినందున 'కల్లుఘట' అయింది. కాలక్రమేణ కలకట, కలకడగా రూపాంతరం చెందింది.

3. కాణిపాకం : పూర్వం అవిటివారైన ముగ్గురు అన్నదమ్ములు పాతిక ఎకరా భూమిలో వ్యవసాయం చేసుకుంటూ వుండేవాళ్ళు. వాళ్ళ భూమిలోని బావినుండి వాళ్ళు యాతం తొక్కి పంటకు నీళ్ళు పారగట్టే వాళ్ళు. కొన్నాళ్ళకు వర్షాలు లేక బావి ఎండిపోయింది. ఆ ముగ్గురు సోదరులు ఆలోచించి బావిని ఇంకా లోతుగా తవ్వితే నీళ్ళు రావచ్చని భావించి, బావిని తవ్వడం ప్రారంభించారు. గునపంతో తవ్వుతుండగా ఖంగుమని శబ్దం వచ్చింది. ఏదో రాయి అనుకొని మళ్ళీ గునపం దించారు. అంతే రక్తం వీళ్ళపై చిమ్మింది. రక్తం వీళ్ళపై పడగానే వీళ్ళ అవిటితనం పోయింది. కేకలు పెట్టారు. దాంతో చుట్టుపక్కలనుండి రైతులు వచ్చి చూచి, బావిలో రక్తం రావడం చూచి ఆ ప్రాంతపు రాజుకు విషయాన్ని తెలియజేశారు. అతను భటులతో వచ్చి చూచి ఆశ్చర్యపోయి, ఏదో వుండచ్చని తవ్వించాడు. వినాయకుని విగ్రహం బయటపడింది. ప్రజలు స్వామికి పూజలుచేసి, టెంకాయలు కొట్టారు. ఒకటింకాలు ఎకరా టెంకాయ నీళ్ళతో తడిచింది. ఒకటింకాలు ఎకరాని 'కాణి' అంటారు.

కాణిపారకం అన్నారు. అప్పట్లో 'కావణిపాక్కం' అని పిలిచారు. అదే వ్యవహారంలో 'కాణిపాకం' అయింది. స్వామివారికి క్రీ.శ. 1235లో గుడి నిర్మాణం జరిగింది.

4. కూర్మాయి : 'కురు' అంటే చిన్ని అనీ, మావి అంటే మామిడి సంబంధించి కావచ్చు. కురుమావినే వ్యవహారంలో 'కూర్మాయి' అన్నారు. క్రీ.శ. 1559 సదాశివ రాయల కాలంనాటి శాసనంలో ఈ గ్రామనామం కన్పిస్తుంది. "పులినాటి సీమలో సాంపాతి రాజ్యానికి చెల్లె... దేవస్తానాలలోను నడిచె కురుమావి వరదరాజుల దేఉని గూడిస్తానంవారు".

5. కె.వి.బి. పురం : శ్రీకాళహస్తి ప్రాంతం చాలాకాలం రాజుల పాలనలోనే ఉండేది. నేటి కె.వి.బి. పురం ప్రాంతాన్ని కుమార వెంకట భూపతి అనే రాజు పరిపాలించాడు. దాంతో ఆయన నివాసంవున్న గ్రామానికి రాజావారి పేరుతోనే 'కుమారవెంకట భూపాలపురం' అన్న పేరు వచ్చింది. ప్రజలు దీనిని కుదించి ఆంగ్ల అక్షరాలతో 'కె.వి.బి.పురం' అని పిలుస్తున్నారు.

6. కందూరు : పూర్వం బాణ రాజుల సామంతుడు అయిన 'కందారప్ప' అటవీప్రాంతంలో నివాసం ఏర్పాటు చేసుకొని ఆ చుట్టుపక్కల ప్రాంతాన్ని పాలించాడు. ఆయన నివాసంవున్న ఊరికి కందారప్ప పేరుతోనే 'కందారపురం' అని వచ్చింది. నాటి కందారపురాన్నే నేడు 'కందూరు' గా ప్రజలు పిలుస్తున్నారు.

7. గుడిమల్లం : పరశు రామేశ్వరాలయం లోని గర్భాలయం భూమట్టానికి 5 అడుగుల లోతులో వుంది. భక్తులు స్వామిని దర్శించడానికి మెట్లు దిగి కిందికి వెళ్ళాల్సి వుంటుంది. గర్భగుడి పల్లంలో ఉండడంవల్ల 'గుడిపల్లం' అని పిలిచేవారు. తర్వాత వాడుకలో 'గుడిమల్లం' అయింది. క్రీ.పూ. 2-3 శతాబ్దాలలో అద్భుతశిల్ప నిర్మాణంతో నిర్మితమైందని చెపుతారు. ఇక్కడి స్వామి లింగం పురుషాంగంతో పోలివుండడం విశేషం.

8. గుర్రంకొండ : మైసూరు పులిగా పేరుగాంచిన టిప్పుసుల్తాన్ నేటి గుర్రంకొండ ప్రాంతాన్ని పరిపాలిస్తూ కొండపై కోటను నిర్మించి, తన బలగాలకు కొండపైన స్థావరం ఏర్పాటు చేశాడు. ఆ కాలంలో కొండకింద బయలు ప్రదేశంలో గుర్రపు పందేలు నిర్వహించేవాడు. నేటికీ ఆ ప్రదేశాన్ని 'గుర్రపు బయలు' అని పిలుస్తున్నారు. గుర్రపు పందేలలో టిప్పుసుల్తాన్ గుర్రమే గెలిచేది. దానిని ఎలాగైనా చేజిక్కించుకోవాలని రౌతుకుంట దొర రాత్రికి రాత్రే పేటుదారిన కొండ ఎక్కి సద్దులేకుండా నవాబు గుర్రాన్ని దొంగిలించాడట. గుర్రాన్ని కొండమీద నుంచి ఎంతో చాకచక్యంగా దొంగలించడంవల్ల ఆ కొండకు 'గుర్రంకొండ' అని పేరొచ్చింది.

9. చిత్తూరు : చిత్ అంటే మనస్సు అని అర్థం. మంచి మనస్సు, తెలివిగల అనేకమంది పండితులకు జన్మనిచ్చిన ఊరు 'చిత్తూరు' అని చెపుతారు. చిత్తూరు తమిళనాడుకు సరిహద్దు ప్రాంతం కాబట్టి తమిళంలో 'చిట్రూర్' అని పిలిచేవారు. 'చిట్' అంటే 'చిన్న' అనీ, 'ఊర్' అంటే 'గ్రామం' అని అర్థం. చిట్రూర్‌నే వాడుకలో చిత్తూరుగా పిలుస్తున్నారు.

10. చంద్రగిరి : నారాయణవనం రాజధానిగా కార్వేటినగరాన్ని పరిపాలిస్తుండిన నరసింహ యాదవ రాయలకు సువిశాలరాజ ప్రాసాదం వుండేది. కాని శత్రుదుర్భేద్యమైన కోట లేకపోవడంవల్ల చింతిస్తూ, ఇందుకు తరుణోపాయాన్ని సూచించమని కోరడానికి తన ఇలవేల్పు అయిన తిరుమల శ్రీనివాసుడి చెంతకు వెళ్ళాడు. రాయలు భక్తి పారవశ్యంతో తిరుమల పైనుండి నయనానందకరంగా పరచుకొన్న ప్రకృతిని ఆహ్వానిస్తుండగా గాలికి రెపరెపలాడుతున్న ఆయన ఎర్రటి తలపాగాను మాంసపు ముద్ద అనుకొని తన్నుకుపోయింది గద్ద. నివ్వెరపోయిన భటులు గద్దను వెంబడించారు. గద్ద రాజు తలపాగాను ఓ కొండపైన పడేసింది. ఇంతలో అక్కడకు చేరుకున్న రాజు ఇదేదో దైవఘటనగా భావించి, ఆ ప్రదేశాన్ని పరిశీలించి గిరిదుర్గం నిర్మాణానికి మంచి స్థలం అనుకొని కోట పనులు ప్రారంభించారు. ఈ

కోటలోనే శ్రీకృష్ణదేవరాయలు తన బాల్యాన్ని గడిపాడు. చంద్రవంకలాగా ఇక్కడి కొండలుండడంవల్లనో లేక పూర్వం చంద్రుడు శివుడిని మెప్పించడానికి ఈ గిరి దుర్గంపై తపస్సు చేశాడనో 'చంద్రగిరి' అని పేరొచ్చింది.

11. తరిగొండ : రామానాయుడు అనే వ్యక్తి చిట్టేచెర్ల నుండి ఆవులు మేపుకుంటూ నేటి తరిగొండ ప్రాంతానికి వచ్చాడు. ప్రొద్దు పోవడంతో అక్కడే ఆవులమంద పెట్టాడు నాయుడు. రాత్రి పాలావుల దగ్గర పాలు పిండుకొని సల్ల పెట్టాడు. తెల్లవారి మజ్జిగ చిలుకు తుండగా సట్టిలో రాయి అడ్డం తగిలింది. ఎత్తి పారేస్తే మళ్ళీ వచ్చేది. ఆయనకు ఇదేంటో అర్థం కాలేదు. తరువాత రాత్రి నరసింహ స్వామి కలలో కన్పించి నాకు గుడి కట్టించమని, గుడి కట్టడానికి కావాల్సిన డబ్బు ఫలానా చోట దొరుకుతుందని చెప్పి అంతర్ధాన మయ్యాడు.

స్వామి చెప్పినట్టుగానే రామానాయుడు గుడి కట్టించాడు. తఱి అంటే మజ్జిగ. మజ్జిగ కుండలో స్వామి వెలిశాడు కాబట్టి అక్కడ వెలసిన గ్రామానికి 'తఱికొండ' అని పేరొచ్చింది. తర్వాత వాడుకలో 'తరిగొండ'గా పిలుస్తున్నారు.

12. తిరుచానూరు : 'తిరుచాన' అనగా 'మహాలక్ష్మి' అని అర్థం. శ్రీ మహాలక్ష్మిదేవి అనుగ్రహంకోసం వైకుంఠనాథుడైన శ్రీ వేంకటేశ్వర స్వామి తపస్సాధన చేసిన పుణ్యప్రదేశమే 'తిరుచానూరు'.

పూర్వం శుకమహర్షి ఈ ప్రాంతంలో నివాసం ఉండడం వల్ల శ్రీశుకుని ఊరుగా శ్రీశుకనూరు అని, తిరుచ్చుకనూరు (తిరు అంటే శ్రీ అని అర్థం) అని పిలువబడుతూ వాడుకలో 'తిరుచానూరు' అయింది.

తిరుచానూరు పుణ్యక్షేత్రానికి ప్రత్యేకమైన పురాణగాథ ఒకటి ప్రాశస్త్యంలో వుంది. శ్రీవారి కోరిక మేరకు మహాలక్ష్మి శుకమహర్షి ఆశ్రమ ప్రాంతంలోని పద్మసరోవరంలో అలమేలుమంగమ్మగా ఆవిర్భవించింది. అలర్ మేల్ మంగ అనగా పద్మంపై ప్రకాశించే దివ్య వనిత అని అర్థం. అందువల్లనే ఆ తల్లికి 'పద్మావతి' అనే పేరుకూడా వచ్చింది.

అలమేలుమంగగా అవతరించిన మహాలక్ష్మిని శ్రీ వేంకటేశ్వరుడు తన వక్షస్థలంపై వ్యూహలక్ష్మిగా నిలుపుకొని తిరుమలకు వెళ్ళారని పురాణం చెపుతుంది. ఆనాటినుంచి అలమేలు మంగమ్మ అర్చామూర్తిగా కొలువై భక్తులచేత ఆరాధింపబడుతున్నందువల్ల తిరుచానూరు క్షేత్రం అలమేలుమంగాపురంగా కూడా ప్రసిద్ధికెక్కింది. వాడుకలో 'మంగాపురం' అని పిలుస్తారు.

13. తంబళ్ళపల్లె : పూర్వం చిన్నేరు గట్టువద్ద పట్టుమంచాల పాపిరెడ్డి దంపతులు తమలపాకుల వ్యాపారం చేసేవారు. నీరుగట్టి కోటిరెడ్డి కూడా పాపిరెడ్డికి పోటీగా అదే వ్యాపారం చేస్తూ, తన తెలివితో అధిక లాభాలు గడించాడు. ఈ వార్త గుర్రంకొండ నవాబుకు తెలిసింది. నవాబు అతని వివరాలు కనుక్కోమని సైనికుల్ని పంపాడు. నవాబు సైన్యానికి తెలుగు భాష రాకపోవడంతో వారి భాషలో తమలపాకును 'తంబుల్' అనేవాళ్ళట. తంబుల్ వ్యాపారం చేసి లాభాలు గడిస్తున్న 'తంబూళ్ళోడు' ఎక్కడని అడిగాడు. అతడిని నవాబు దగ్గరకు తీసుకెళ్ళారు. కోటిరెడ్డి నివసిస్తున్న ఊరికి తంబూలోళ్ళపల్లెగా పేరొచ్చి తర్వాత 'తంబళ్ళపల్లె'గా రూపుదిద్దుకుంది.

14. తొండమనాడు : తొండమనాడు గ్రామానికి వేల సంవత్సరాల చరిత్ర వుంది. పురాణాలలో కూడా తొండమనాడుకు ప్రత్యేక స్థానం వుంది. తిరుమలేశునికి పిల్లనిచ్చిన ఆకాశరాజు సోదరుడే తొండమాన్ చక్రవర్తి. ఆయన వాసమున్న గ్రామానికి ఆయన పేరుమీదనే 'తొండమనాడు' అనే పేరొచ్చింది. పూర్వం 'తొండేరు' అని ఈ ప్రాంతాన్ని పిలిచేవారు.

వేంకటేశ్వరస్వామి అంటే తొండమాన్ చక్రవర్తికి విపరీతమైన భక్తి, రోజూ స్వామివారిని దర్శించుకునేవాడు.

తిరుమలలో ఆనందనిలయంగా పిలువబడే స్వామివారి గర్భగుడిని తొండమానుడు నిర్మించాడు.

తొండమాన చక్రవర్తి వయసుమీరిన తర్వాత తిరుమలకు వెళ్ళి స్వామివారిని దర్శించుకోలేక బాధపడుతూవుంటే స్వామివారే కలలో కన్పించి మీ కోటలో పశ్చిమాన కొలువై వుంటానని తెలియజేశాడు. స్వామి అదేవిధంగా శ్రీదేవి, భూదేవి సమేతుడై తొండమానుడి కోటలో ఆసీనుడయ్యాడు. స్వామివారు కూర్చొని దర్శనమివ్వడం ఇక్కడి ప్రత్యేకత. తిరుమలలోని ఆనందనిలయం లాగే ఇక్కడ స్వామివారికి గర్భగుడిని నిర్మించారు. తిరుమలేశుడు శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామిగా ఇక్కడ పూజలందుకుంటున్నాడు.

15. నిమ్మనపల్లె : పూర్వం అహోబిలనాయుని చెరువుకు 'నిమ్మడు' అనే వ్యక్తి కాపలా వుండేవాడు. ఒకనాటి రాత్రి భారీవర్షం కురిసింది. చెరువువద్ద నిద్రిస్తున్న నిమ్మడిని గంగాదేవి లేపి కట్ట తెగిపోయే ప్రమాదముందని వెంటనే గ్రామస్థులకు ఈ విషయం తెలియజేయమని చెపుతుంది. అయితే నిమ్మడు నేను గ్రామస్థులకు విషయం చెప్పి, వారిని పిలుచుకొని వచ్చేంతవరకు చెరువు కట్ట తెగకూడదని గంగాదేవి దగ్గర మాట తీసుకుంటాడు. నిమ్మడు పరుగు పరుగున వచ్చి గ్రామస్థులకు జరిగిన విషయం తెలుపుతాడు. గ్రామ ప్రజలు నిమ్మడు, మనం చెరువు దగ్గరకు వెళితే కట్ట తెగిపోతుందని నిమ్మడిని వెళ్ళనీయకుండా ఆపుతారు. అతను వెళ్ళాలని పట్టు బట్టడంతో విధిలేక అతనిని చంపేస్తారు. నిమ్మడు వాపసు వెళ్ళలేదు కాబట్టి చెరువుకట్ట తెగలేదు. గ్రామప్రజలు కృతజ్ఞతగా నిమ్మడికి సమాధికట్టి అతని పేరుతోనే ఆ ఊరికి 'నిమ్మడిపల్లె' అని పేరుపెట్టారు. అదే వాడుకలో 'నిమ్మనపల్లె' అయింది. నిమ్మడి సమాధివద్ద నేటికీ శిలాశాసనం చూడవచ్చు.

16. పలమనేరు : పల్లవన్ అంటే పల్లవరాజు. ఏర్ అంటే ప్రవాహమని అర్థం. పల్లవరాజు పేరుతో నిర్మించ బడ్డ చెరువుకు 'పల్లవనేరు' అని పేరు. అదే వాడుకలో 'పలమనేరు' అయింది.

పూర్వం యుద్ధసమయంలో పిలువకనే వచ్చి శ్రీకృష్ణ దేవరాయల పరంగా పోరాడి, నవాబుల సైన్యాన్ని తరిమికొట్టిన పల్లవరాజు జ్ఞాపకార్థం, ఆయన కోరిక మేరకు కృష్ణదేవరాయలు పల్లవనేరును నిర్మించారని చెపుతారు. చెరువు గట్టున ఏర్పడిన ఊరికి 'పలమనేరు' అనే పేరు స్థిరపడింది.

17. పాళెం : కల్లూరు సమీపంలోగల చిన్న గ్రామం పాళెం. పూర్వం కల్లూరు చుట్టుప్రక్కల ప్రాంతాల్ని పాళెగాళ్ళు తమ అధీనంలో వుంచుకొని పరిపాలించారు. అప్పట్లో పాళెగాళ్ళు మాత్రమే ఆ ప్రాంతంలోవున్నారు. ఆనాడు 'మంగమ్మ' ఈ ప్రాంతానికి నాయకురాలుగా చలామణి అయింది. తర్వాత శేషాచలపతి నాయుడు, నారసింహ నాయునివారు, వీరమల్లమ్మ పాలించారు. బ్రిటీషువారు పాళెగాళ్ళను రూపుమాపిన తర్వాత పాళెంలో రామచంద్రనాయుని వారు మాత్రం నివసించేవారు. తర్వాత చుట్టుప్రక్కల గ్రామాల్లోని కొన్ని కుటుంబాలు ఆయన చెంత చేరడంతో అది ఒక ఊరుగా పరిగణించ బడి దానికి 'పాళెం' అనే పేరు స్థిరపడింది.

18. పిచ్చాటూరు : అరుణానదికి అడ్డంగా అరణియార్ రిజర్వాయర్ నిర్మాణం చేపట్టక మునుపు ఈ ప్రాంతంలో 'గంగుంట' అనే కుగ్రామం వుండేది. రిజర్వాయర్ నిర్మించాక నదీ పరివాహక ప్రాంతంలో పిచ్చకాయలు ఎక్కువగా గూళ్ళు కట్టుకొని వుండేవి. వీటిని నాటు వైద్యంకోసం వాడతారు. తమిళంలో ఆతూ - ఆరు అంటే ఏరు లేదా వాగు అని అర్థం. పిచ్చకాయలు ఎక్కువగా దొరికే ఏటివద్దవున్న గ్రామమే పిచ్చ - ఆతూ - ఊరు అయింది. క్రమంగా 'పిచ్చాటూరు'గా మారింది.

19. పీలేరు : 'పీలి' అంటే 'నెమలి' అని అర్థం. ఏరు అంటే వాగు, ప్రవాహం అనే అర్థాలున్నాయి. 'పీలి ఏరు' ను నెమళ్ళవంకగా పూర్వం పిలువబడేవారు. 'పీలి ఏరు' వాడుకలో 'పీలేరు' అయింది.

పూర్వం పీలేరులోని పించానదీ తీరంలో మొగిలిచెట్లు చాలా దట్టంగా వుండేవి. మొగిలిపూల వాసనకు మిన్నాగులు ఎక్కువగా వచ్చేవని వాటినుండి తప్పించుకోవడానికి ఇక్కడి ప్రజలు నెమళ్ళను పెంచేవారని చెపుతారు. నెమళ్ళు సహజంగా నదీతీర ప్రాంతాలలో వుంటూ పించం విప్పి నాట్యం చేస్తుంటాయి. నెమలి పించం - ఏరు పదాల రూపాంతరమే 'పించానది' అంటారు. పించానదికి పీలేరు నామానికి అవినాభావ సంబంధం వుందని తెలుస్తుంది.

20. పుత్తూరు : 'పుదూ' అంటే తమిళంలో కొత్త అని అర్థం. ఊరు అంటే గ్రామం. 'పుదూర్' అనే గ్రామం నార్త్ ఆర్కాడు జిల్లా, నారాయణవనం సబ్ తాలూకా పరిధిలో వుండేది. 1911వ సంవత్సరం చిత్తూరు జిల్లా ఏర్పడిన తర్వాత పుదూర్ 'పుత్తూరు'గా మారింది. శల్యవైద్యానికి 'పుత్తూరు' పెట్టింది పేరు.

21. బంగారుపాళ్యం : తళ్లికోట యుద్ధానంతరం విజయనగర సామ్రాజ్యం నశించింది. దాంతో తమ అధీనంలోవున్న పాళ్యాలకు వారే అధిపతులయ్యారు. అలాంటి పాళేలలో బంగారుపాళెం ఒకటి.

బంగారుపాళ్యాన్ని మొదట 'రామ ప్రసన్నేశ్వరపురం'గా పిలిచేవారు. ఆ ప్రాంతాన్ని పాలిస్తున్న బంగారునాయని వారు 1642వ సంవత్సరం యుద్ధంలో ఒక నవాబుకు సాయపడి విజయం వరించేటట్టు చేసినందుకుగాను నవాబు కృతజ్ఞతగా చిత్తూరు, గుడియాత్తం తాలూకాలలోని కొన్ని గ్రామాల్ని, చిత్తూరు తాలూకా సుంకంలో 4వ వంతు భాగాన్ని ఇచ్చి దాంతోపాటు 'రాజా బహద్దూర్' అన్న బిరుదును ఇచ్చి సత్కరించాడు. బహద్దూర్ అంటే నాయకుడు, వీరుడు అనే అర్థం. బహద్దూర్ టర్కిష్ నుండి ఉర్దూలోకి వచ్చిన పదం.

నాటినుండి రాజా బహద్దూర్ బంగారు నాయని పేరుతో రామప్రసన్నేశ్వర పురాన్ని 'బంగారుపాళ్యం'గా పిలుస్తున్నారు.

22. మదనపల్లె : చోళరాజుల కాలంలో మదనపల్లెను 'మర్యాదరామన్న పురం'గా పిలిచేవారని చెపుతారు. తర్వాత విజయనగర రాజ్యపు పాళేగార్లు అయిన బసన్న, మాదన్న ఈ ప్రాంతాన్ని పాలించినట్లు తెలుస్తోంది. వీరి పేర్లమీదనే పట్టణ సమీపంలోని రెండు కొండలకు బసినికొండ, మాదన్న కొండ అని పేర్లు వచ్చాయి. మొదట మర్యాద రామన్నపురంగా పిలువబడి తర్వాత మదనపురి అయింది. నేడు 'మదనపల్లె'గా పిలువబడుతోంది.

పూర్వం మదనపల్లెలోని యోగ భోగేశ్వర స్వామి ఆలయ పరిసరాల్లో ఊరు వుండేది. గ్రామాభివృద్ధికిగాను అనాటి పాళెగారు అయిన అహోబిలనాయుని వారు అడవి ప్రాంతంలో ఒక ఆవును వదలి అది ఎక్కడ ఆగితే అక్కడ నూతన గ్రామాన్ని నిర్మించాలని అనుకున్నారు. గోవు మదనపల్లెలో నేడువున్న ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం ముందు నిలవడంతో అక్కడే గ్రామాన్ని నిర్మించారని తెలుస్తోంది.

పూర్వం మదనపల్లెలో చోళరాజులు ఓ కోట నిర్మించుకొని ఆ ప్రాంతాన్ని పరిపాలించారని తెలుస్తోంది. నేటికీ అనాటి వీధుల పేర్లు చరిత్రకు సాక్షీభూతాలుగా నిలిచే ఉన్నాయి. సిపాయివీధి, అగడ్తవీధి, కోటవీధులు.

23. మాదినేనిపాళెం : చిత్తూరు పాళెగాళ్ళు బ్రిటీషు దొరలతో గెరిల్లా యుద్ధాలు చేసి ఉరికంబాలు ఎక్కిన అమరవీరులు. పాళెగాళ్ల అధీనంలోవున్న మాదినేని పాళెం గ్రామాల్ని 1889లో థామస్ మన్రో స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నించాడు. అయితే వారిపై పాళెగాళ్ళు దాడి చేశారు. బలమైన బ్రిటీష్ సైన్యాన్ని ఎదుర్కొనలేక అడవులలో పొంచి వుండి అదనుచూచి బ్రిటీష్ సైన్యంపై దాడి చేసేవారు. ఆంగ్లేయులు పాళెగాడయిన మాది నాయుడుతో ప్రతినెల తవుర్జి ఇచ్చేటట్టు ఒప్పందం కుదుర్చుకొని మాదినేని పాళేన్ని రెవిన్యూ గ్రామంగా మార్చారు. మాదినాయుడు పేరుతోనే 'మాదినేనిపాళెం' ఏర్పడిందని చెపుతారు.

24. రామసముద్రం : రాయలసీమలో నీటికోసం ఒక పెద్ద చెరువును తవ్వించాలని పెనుగొండ పాలకులు నిర్ణయం తీసుకున్నారు. అగ్రహారం దగ్గర చెరువు పని మొదలైంది. వందలాది ప్రజలు ఎర్రటి ఎండలో చెమటలు కారుస్తూ పని చేస్తున్నారు. ఎండలో అలసి పోతున్నారు కూలీలు. పని మందగించింది. అప్పుడు పాలకులు దేవదాసి రామక్కను పిలిపించారు. ఈమె రామలింగేశ్వర, చెన్నకేశవ, జనార్ధన స్వామి ఆలయాల్లో ఆస్థాన నర్తకి. కుంభహారతినిచ్చి స్వామిని అర్చించే భక్తురాలు.

చెరువు పనిలో రాత్రింబవళ్ళు కష్టపడుతున్న కూలీల అలసట తీరేలా నాట్యం చేయమని రాజు ఆజ్ఞాపించాడు. రామక్క నాట్యం చూసేందుకు రెండు కళ్ళు చాలవు. ఏడు పచ్చికుండలమీద నాట్యం మనోహరంగా చేసింది. చెరువు పని పూర్తయింది. చెరువు నీటితో కళ కళలాడింది.

దేవదాసి రామక్క నాట్యంతో పూర్తయిన చెరువు కాబట్టి ఆమె పేరుతోనే ఆ చెరువుకు 'రామసముద్రం' అని పేరు పెట్టారు. అక్కడ ఊరు ఏర్పడడంతో 'రమా సుందరీ పట్టణం'గా పిలిచారు. కాని ఆ ఊరికి కూడా 'రామ సముద్రం' గానే పేరు స్థిరపడింది.

25. రాళ్ళ బూదుగూరు : త్రేతాయుగంలో రావణుడు సీతాదేవిని అపహరించి తీసుకెళ్తుండగా జటాయువు అనే పక్షి అడ్డుకుంది. రావణుడు జటాయువు రెక్కల్ని నరికి, దాని అడ్డు తొలగించుకొని సీతను తీసుకెళ్ళి లంకలో దాచాడు. ఆమెను వెతుక్కుంటూ బయలుదేరిన రామ లక్ష్మణు లకు ప్రాణాపాయ స్థితిలో జటాయువు సీతను రావణుడు అపహరించాడని తెలిపిన తర్వాత ప్రాణాలు వదిలింది. జటాయువుకు అంత్యక్రియలు జరిపిన తర్వాత రామలక్ష్మణులు ముందుకు సాగారు.

జటాయువు బూడిదైన ప్రదేశంలో ఊరు ఏర్పడడంతో 'బూడిదూరు'గా పిలిచేవారు. ఆ ప్రాంతంలో రాళ్ళు, కొండలు ఎక్కువగా వుండడంతో ''రాళ్ళబూడిదూరు''గా పిలువబడి క్రమేణ 'రాళ్ళబూదుగూరు'గా మారింది. జటాయువు త్యాగానికి గురుతుగా నేటికీ ఈ ఊరు శాంతిపురం మండలంలో అతిపెద్ద పంచాయతీ కేంద్రంగా వుంది.

26. వాయల్పాడు : కోతులపట్ల, నూరుకుప్పల కొండ, వీరన్న కొండల మధ్యన వుండే ఊరు వాల్మీకిపురం. ఈ ప్రాంతంలో వాల్మీకి మహర్షి తపస్సు చేశారని, ప్రతాప రామాలయంలో కొలువైన శ్రీరాముడిని సేవించారని స్థానికుల విశ్వాసం. ఆలయంలో వాల్మీకి మహర్షి విగ్రహం తరతరాలుగా పూజలందుకుంటోంది. ఆయన పేరిటే వాల్మీకిపురం ఏర్పడిందని చెపుతారు. ఆలయంలోని సీతా, రామ, లక్ష్మణ, భరత, శత్రుఘ్న, జాంబవంతుల ఏకశిలా విగ్రహాలు వల్మీకంలో లభించినందునే వాల్మీకిపురం అనే పేరొచ్చిందనే మరో నానుడి ప్రచారంలో వుంది.

పూర్వం ఇక్కడ ఆలయం, ఆలయానికి ఎదురుగా వావిలిపాటి వారి సత్రం తప్ప ఊరు వుండేది కాదు. తిరుమలకు వెళ్ళి వచ్చే యాత్రికులు ఈ సత్రంలో సేదదీరి దేవుడిని దర్శించుకుని వెళ్ళేవారు. తర్వాత ఊరు ఏర్పడడంతో సత్రం పేరిట వావిలిపాడు - వాయ ల్పాడుగా మారిందని చెపుతారు. మైసూరు పాలకుడు హైదర్ అలీ గుర్రంకొండకు వచ్చి పోతూ వావిలిచెట్లతో కూడుకున్న ఈ ప్రాంతానికి 'వావిల్ కా పహాడ్' అని పేరు పెట్టారని, అదే 'వాయల్పాడు'గా మారిందని కూడా చెపుతారు.

బోయలు అధికంగా వున్నందున 'బోయలపాడు' గా కూడా పిలువబడేదని కొందరి వాదన. వాయల్పాడుకు ప్రాచీన నామం వుండాలనే ఉద్దేశంతో నేడు 'వాల్మీకి పురం'గా పేరు మార్చారు.

27. వేపంజేరి : వేం, పాపం హరించే నారాయణ అని అర్థం. వేం, పంచ, హరి అనే పురాతన నామమే కాలక్రమంలో 'వేపంజేరి'గా మారింది. సామాన్య మానవులు తెలిసీతెలియక పంచేంద్రియాలతో చేసే

పంచ మహాపాతకాలను పోగొట్టే శ్రీమన్నారాయణుడు వెలసిన పవిత్ర క్షేత్రం 'వేపంజేరి'. ఇక్కడ దశావతార మహావిష్ణువు విగ్రహం అపూర్వం.

28. శెట్టియప్పన్ తాంగల్ : శెట్టియప్పన్ అనే వ్యక్తి పేరుతో ఏర్పడిన గ్రామం. తాంగల్ తమిళపదం అంటే వరిపంటకు నీరిచ్చే చిన్న జలాశయం, కుంట అని అర్థం. చివర 'తాంగల్' గల ఊర్లపేర్లు తమిళనాడు సరిహద్దు ప్రాంతాలలో ఎక్కువ.

29. సంజీవరాయని పట్టడ : సంజీవరాయుడు అనే వ్యక్తి పేరుమీద గ్రామం ఏర్పడింది. ఆంజనేయస్వామిని కూడా సంజీవరాయుడంటారు. ఎందుకంటే సంజీవిని పర్వతాన్ని మోసుకొచ్చాడు కాబట్టి. పట్టడ అనేది పట్టెశబ్ద సంబంధం. పట్టె అంటే భూభాగం. ఒకరి నుంచి పంచుకొన్న భూభాగం అని అర్థం. అలాంటిదే 'సంజీవ రాయని పట్టడ' గ్రామం.

30. సోంపాళెం : ఒకప్పుడు యజ్ఞయాగాలతో పునీతమైన నేల సోంపల్లె. సోమకుల పల్లెగా పిలువబడిన ఈ ప్రాంతాన్ని చాళుక్యులు, చోళులు, విజయనగర రాజులు పాలించినట్లు చారిత్రక ఆధారాలు వున్నాయి. యజ్ఞాలకు సంబంధించి గ్రామ నడిబడ్డున దేవనాగరి లిపితో వేయించిన పురాతన శాసనం నేటికీ వుంది. యజ్ఞం చేసేవారిని సోమకులు, సోమయాజులు అని పిలిచేవారు. నాటి సోమకులపల్లెనే నేడు సోంపల్లె, సోంపాళెం అని పిలుస్తున్నారు.

ప్రపంచంలోని ప్రతి పల్లెకు, పట్టణానికి, నగరానికి ఏదో ఒక పేరు ఉంటుంది. అన్నింటికీ చెప్పుకోదగిన చరిత్ర లేకపోయినా కొన్ని ఊర్లకు, పట్టణాలకు, నగరాలకు మాత్రం ఎంతో ఘనమైన చరిత్ర వుంటుంది. వాటిని పరిశీలిస్తే గ్రామ ప్రాచీనత, ఆనాటి సంస్కృతి, సంప్రదాయాలు ఎన్నింటినో తెలుసుకోవచ్చు. చరిత్రకారులు పట్టించుకోని నిజసత్యాల్ని, మరుగున పడ్డగాథల్ని వెలుగులోకి తెచ్చి చరిత్రనే తిరగరాయవచ్చు. కాబట్టి ముఖ్యంగా స్థానికులు మరుగునపడ్డ వారి వారి గ్రామ చరిత్రలను, వాటి ప్రాచీనతను వెలికి తీయాలి. అప్పుడే నిజమైన స్థలనామ చరిత్రలను తెలుసుకోవడానికి వీలవుతుంది.

BHAVAVEENA
Vol. 18, Issue. 10, October 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావ వీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

మల్లంపల్లి సోమశేఖర శర్మ వ్యాసాలు – బౌద్ధమతం

– డా॥. డి. విజయ కుమారి, సహాయ ఆచార్యులు, తెలుగు విభాగం, హైదరాబాద్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

మల్లంపల్లి సోమశేఖరశర్మగారు పశ్చిమ గోదావరి జిల్లా పోడూరు మండలంలోని మినిమించిలిపాడులో 1891 డిశంబరు 9వ తేదీన జన్మించారు. ఈయనవి అనేక కథలు, నాటకాలు, నవలలు, పద్యాలు వివిధ పత్రికలలో ప్రచురించారు. శర్మగారు డిగ్రీలు లేని పండితులే అయినా సుప్రసిద్ధ పరిశోధకులుగా ప్రఖ్యాతి గాంచారు. ఆయన చిలుకూరు వీరభద్రరావుగారికి సహాయంగా ఉండి ప్రాచీన కావ్యాలకు, శాసనాలకు ప్రతులు రాశారు. ఆ తరువాత కొమ్మఱ్ఱాజు లక్ష్మణరావుగారు, గాడిచెర్ల హరి సర్వోత్తమరావుగారు, ఆచంట లక్ష్మీపతిగారు, రాయప్రోలు సుబ్బారావుగారు మొదలైన వారితో కలసి ఆంధ్ర విజ్ఞాన సర్వస్వం నిర్మాతలలో ఒకరైనారు. ఆయన సేకరించిన శాసనాలను విశ్లేషించి, వివిధ అంశాలను ఎపిగ్రాఫియా ఇండియా, భారతి, శారద ఆంధ్రపత్రిక వంటి పత్రికలలో వ్యాసాలు రాశారు. నేలటూరు వెంకట రమణయ్యతో కలసి, ఆచార్య యజ్ఞానీ సంపాదకత్వంలో వెలువడిన 'Early History of Deccan' లో సమగ్రమైన కాకతీయుల చరిత్రను రాశారు. శర్మగారు అనేక జానపద సాహిత్యాన్ని 'అనాదృత వాఙ్మయమని' నిర్వచించారు. అనేక జానపద అంశాలను తన వ్యాసాలలో పేర్కొన్నారు.

అదే విధంగా అశోక చక్రవర్తి బౌద్ధమత స్థాపన గురించి, అమరావతి స్థూపం, నాగార్జునకొండలోని చిత్రాల గురించి, గోలీ స్థూపం, బౌద్ధ శిలాచిత్రాలు, భర్హుత్ స్థూపం, తథాగతుని దంతధాతు చరిత్ర, బౌద్ధ సంస్కృతి మొదలైన అంశాల గురించి వ్యాసాలు రాశారు. ఈ వ్యాసాలను మోదుగుల రవికృష్ణ తన సంపాదకత్వంలో పుస్తకరూపంలోకి తెచ్చారు. పై అంశాలను ఈ వ్యాసంలో చర్చించడం జరిగింది.

బౌద్ధవాఙ్మయం పరిశోధన :

క్రీ॥శ॥ 19వ శతాబ్దంలో ప్రాచ్య విజ్ఞాన పరిశోధన ప్రారంభమైంది. ఆ సందర్భంలో పాశ్చాత్య విద్వాంసుడైన బ్రియన్ హౌటన్ హాడ్గ్ సన్ బౌద్ధమత గ్రంథాలను పాళీ భాషలోనే గాక సంస్కృత భాషలో కూడ ఉన్నాయని క్రీ॥శ॥ 1821 మధ్య కాలంలో వెల్లడించారు. ఆయన 1821 నుండి నేపాళ దేశంలో బ్రిటీష్ రెసిడెంట్‌గా నియమింప బడ్డాడు. ఆనాటి నుండి దేశ ప్రజల మత, వాఙ్మయాలను తెలుసుకునే ప్రయత్నం చేశాడు. బౌద్ధ మతాచార్యులు విహారాలకు, మఠాలకు వెళ్ళి, 60 బౌద్ధమత గ్రంథాలను సంపాదించి వాటిని బెంగాలు ఏసియాటిక్ సొసయిటీకి పంపాడు. కాని అక్కడ ఎవరు ఆ గ్రంథాలపై ఆసక్తి చూపకపోవడం వల్ల, ఇంకా రెండు జతల గ్రంథాలను సంపాదించి, ఒక జత ''లండన్ సొసైటీ'' వారికి, మరొక జత ''పారిస్ సొసైటీ''కి పంపించాడు. తాను కూడా పరిశోధన చేసి వాటిపై వ్యాసాలు రాశాడు. హాడ్గ సన్ పరిశోధనల వల్ల బౌద్ధమత వాఙ్మయం నేపాల్ దేశంలో క్రీ॥శ॥ రెండువందల సంవత్సరాల నుండి ఉందని వెల్లడి అయ్యింది. క్రీ॥శ॥ 7, 8 శతాబ్దాలలో ఈ వాఙ్మయమంతా టిబెట్ భాషలోకి అనువదించబడింది. చైనా నుండి ముద్రణాయంత్రం టిబెట్‌కి వచ్చిన తరువాత ఈ గ్రంథాలన్ని ముద్రించబడ్డాయని శర్మగారు తెలియజేశారు.

అదే సమయంలో హంగరీ (ఆస్ట్రియా) నుండి అలెగ్జాండర్ - సోమ - డి - కొరోసీ పురాతన పరిశోధన యందు ఆసక్తి గలవాడు. అతడు కాలినడకన మధ్య ఆసియాకు వచ్చి, అక్కడ ఆదివాసీ స్థలాలు ఉండవచ్చని ఊహించి, భాష నేర్చుకుని బౌద్ధమత గ్రంథ బండారాలున్నట్లు కనుగొన్నాడు. వీటిని 'కంజూర్, తండూర్' అని పిలుస్తారు. కంజూర్ గ్రంథ బండారములో నూఱు, నూట ఎనిమిది సంపుటాలు, ఒక్కొక్క గ్రంథానికి పాఠ బేధాలు గల వేరు వేరు ప్రతులు, అసలు గ్రంథాలు నూట ఎనిమిది ఉన్నాయి. తంజూర్ గ్రంథ బండారంలో

225 సంపుటాలున్నాయని అతడు పత్రికలలో ప్రకటించాడు. అదే సమయంలో మంగోలియాలోని బౌద్ధ వాఙ్మయాన్ని, ష్మిట్ (Schmidt) సింహళము నందలి బౌద్ధ వాఙ్మయాన్ని జార్జి టర్నర్ పరిశోధించి లోకానికి పరిచయం చేశారు. హోడ్గ సన్ పారిస్ పంపిన బౌద్ధమత గ్రంథాలను యూజీన్ బర్నాఫ్ పరిశోధించి ఇంచుమించు అదే కాలంలో ప్రకటించాడు. ఈ పరిశోధనల వల్ల బౌద్ధమత గ్రంథాలు సంస్కృతంలో ఒక్క నేపాల్‌లోనే గాక చైనా, జపాన్, టిబెట్ దేశాలలో కూడా ఉన్నాయని వెల్లడి అయినది. సింహళ దేశంలో గల బౌద్ధమత గ్రంథాలు పాళీ భాషలో ఉన్నట్లే, బర్మా, సయామ్, అనామ్ మొదలైన ఆసియా ఖండ, దక్షిణ దేశాలలోని బౌద్ధమత గ్రంథాలు పాళీ భాషలోనే గలవు. పాళీ భాషలో గల బౌద్ధమతానికి, సంస్కృతంలో గల బౌద్ధమతానికి చాలా వ్యత్యాసముందని వీరు తెలియజేశారు. ఈ పాశ్చాత్యులు నేపాల్, టిబెట్, చీనా, జపానులలో వ్యాపించిన బౌద్ధమతానికి ఉత్తర బౌద్ధమని, సింహళము, సయామ్, బర్మా, అనామ్ దేశాలలోని బౌద్ధమతానికి దక్షిణ బౌద్ధమని పేరు పెట్టారు. కాని ఈ విభజన సరైనది కాదని, దీనివల్ల దక్షిణ బౌద్ధమే అసలయిన బౌద్ధమని వెల్లడి అయ్యిందని శర్మగారు అభిప్రాయపడ్డారు.

అశోకుని కాలంలో బౌద్ధమత బోధకులు సింహళ దేశానికి వెళ్ళారని, వారిలో అశోకుని కుమారుడయిన మహిందుడున్నాడని, శర్మగారు తెలిపారు. మహిందుడు త్రిపీటకములను (బౌద్ధమత వేదాలు) వినయ పీటకము, సుత్త పీటకము, అభిదమ్మ పీటకము వాటి భాష్యములైన 'అటకథ'లను సింహళ దేశానికి తీసికెళ్ళి, వాటిని సింహళ భాషలోనికి అనువదించినట్లు చెబుతారు. మహిందుని సోదరి అయిన సంఘమిత్తయే సింహళంలో మొట్ట మొదట బౌద్ధ మతాన్ని స్వీకరించింది. మహిందునితో పాటు ఇత్థియ, ఉత్తెయ, భద్దసాల, సుమనులు కూడ బౌద్ధమతాన్ని వ్యాపింపజేయడానికి సింహళానికి వెళ్ళారు.

అశోకుడు అనేక అభిప్రాయ భేదాలు గల బౌద్ధులందరిని ఏకం చేయడానికి ప్రయత్నించాడు. ఇతని కాలంలో స్థవిర, మహాసాంఘిక అని రెండు కక్షలున్నాయి. మహా సాంఘికులలో సరిపడని స్థవిరులు మగధను విడిచిపెట్టారు. వీరిలో వినయభాణకములు (వినయ ప్రాధాన్యం గల మతము) సింహళానికి వెళ్ళి స్థిరపడ్డారు. సూత్ర భాణకములు (ధర్మ ప్రాధాన్యం గల మతము) నవలంభించిన వారు కాశ్మీర, గాంధార దేశాలకు వెళ్ళి స్థిరపడ్డారు. తత్త్వబోధకు ప్రాధాన్యమిచ్చిన ఈ తెగవారికి సర్వాస్తి వాదులని పేరు. వీరు చైనా, టిబెట్ దేశాలకు వెళ్ళి, బౌద్ధమతాన్ని వ్యాపింపజేశారు. ఉత్తర బౌద్ధులకు మత గ్రంథాలు కొన్ని గ్రాంధికభాష (సంస్కృతం) లోను, కొన్ని ప్రాకృతంలోను, పాళీ భాషలోను ఉన్నాయి. క్రీ॥శ॥ 8వ శతాబ్దంలో 'వినీత దేవుడు' అనే విద్వాంసుడు సర్వాస్థివాదులు సంస్కృతాన్ని, అపభ్రంశమును, స్థవిరవాదులు పైశాచిని వాడుచున్నట్టు తెలిపారు. క్రీ॥శ॥ 19వ శతాబ్ది ప్రథమ భాగంలో ప్రాచ్య, పాశ్చాత్యులు చేసిన పరిశోధనల వల్ల బౌద్ధమతానికి ఈ విషయాలు వెల్లడి అయినట్లు మల్లంపల్లి సోమశేఖర శర్మగారు తెలియజేశారు.

చీనా, హిందూ దేశములు - వాని ప్రాచీన అనుబంధం :

చీనా, హిందూ దేశానికి ఉన్న అనుబంధం అతి పురాతనమైనది. అశోకుడు బుద్ధుడి సందేశాన్ని, వివిధ దేశాలకు సందేశ హరులను పంపి వ్యాపింపజేశాడు. పడమట సిరియాదేశం వరకు, దక్షిణాన లంకవరకు, తూర్పున యవద్వీపముల వరకు, ఉత్తరాన హిమాలయాలకు బుద్ధ భగవానుని సందేశాలను వ్యాపింపజేశాడు. కుషాణ వంశస్థులు హిందూదేశ వాయువ్య ప్రదేశాన్ని వశపరచుకొని రాజ్యాన్ని పరిపాలించారు. వారిలో కనిష్క భూపతి విఖ్యాతుడు. ఇతని రాజధాని పురుషపురము. ఇతడు యార్కండ్ ఖోటాన్, క్యాష్గర్ దేశాలను జయించాడు. ఆ సామ్రాజ్యానికి చీనా రాజ్యం పాలిమేర

అయ్యింది. ఈ విధంగా చీనా దేశానికి, భారతదేశానికి అనుబంధం ఏర్పడింది. కనిష్కుడు ఇచ్చిన ప్రోత్సాహం వల్ల బౌద్ధ భిక్షువులు తమ మతాన్ని మధ్య ఆసియాలోను వ్యాపింపజేశారు. క్రీ॥శ॥ 1వ శతాబ్దం నాటి బౌద్ధమత గ్రంథాలు బూర్జపత్రాల మీద హిందూదేశ లిపులలో ఉన్నవి లభించాయట.

చీనాలో భారతీయ బౌద్ధ భిక్షువులు :

చీనా దేశంలో హాన్ చక్రవర్తి మింగ్‌టి కాలంలో క్రీ॥శ॥ 67 ప్రాంతంలో కాశ్యప మాతంగుడు, ధర్మరత్నుడు బౌద్ధ గ్రంథాలను, బుద్ధుని విగ్రహాలను గుఱ్ఱాలపై వేసుకుని చైనాకి చేరారు. ఆ చక్రవర్తి వారికి స్వాగతం పలికాడు. అతడు మత గ్రంథాలను, నిగ్రహాలను మోసుకొచ్చిన గుఱ్ఱాల జ్ఞాపకార్థం ఒక విగ్రహాన్ని కట్టించి, దానికి శ్వేతాశ్వమని పేరు పెట్టాడు. వారు బౌద్ధ గ్రంథాలను చీనా భాషలోకి అనువదించారు. కాశ్యప మాతంగుడు రచించిన ''బుద్ధుని నలుబది రెండు సూత్రములు'' అను గ్రంథమే చీనా దేశీయుల బౌద్ధ విజ్ఞానానికి ఉపయోగపడింది. హాన్ వంశస్తుల కాలంలో 350కి పైగా బౌద్ధ గ్రంథాలు చీనా భాషలోకి అనువదింప బడ్డాయి.

ఈ కాలానికి చీనా దేశంలో 'కన్ ఫ్యూషియాన్' అనునతడు 'కాన్ ఫ్యూషియానిజమ్' 'లోసీ' అనునతడు 'టోయిజమ్' అనే రెండు మతాలను ప్రవేశపెట్టారు. ఈ మతాలు చీనలో పుట్టినవి. బౌద్ధమతం మూడవ మతంగా అక్కడ ప్రవేశించింది. క్రీ॥శ॥ 265 - 589 మధ్య కాలంలో బౌద్ధం చీనాలో బాగా బలపడింది. క్రీ॥శ॥ 50కి పూర్వమే బౌద్ధమతం చీనా దేశీయుల ప్రధాన మతమయ్యింది. ఉత్తర చీనా మాండలికులలో ఒకడయిన 'షీచీలుంగ్' అనునతడు బౌద్ధులకు ఆశ్రయమిచ్చాడు. ఇతని కాలంలో చీనా దేశీయులు కూడా బౌద్ధమతాన్ని అవలంబించారు. అప్పటి నుండి బౌద్ధమతాన్ని ప్రచారం చేసిన వారు, బౌద్ధసంఘాన్ని పరిపాలించినవారు చీనా దేశస్థులే.

ధ్యాన సంప్రదాయము :

ధ్యాన సంప్రదాయాన్ని చాన్ సంప్రదాయం అంటారు. క్రీ॥శ॥ 520లో బోధి ధర్మాచార్యుడు చీనాలోని కాన్‌టన్ పట్టణానికి వెళతారు. ఆ సమయానికి బౌద్ధం బాగా వ్యాపించింది. క్రీ॥శ॥ 530 నాటికి ఒక్క ఉత్తర చీనా దేశంలోనే 13,000 బౌద్ధ ఆలయాలు ఉన్నాయట. టాంగ్ వంశము (క్రీ॥శ॥ 618 - 907) పరిపాలనా కాలంలోను వారి అనంతరం రెండు శతాబ్దుల కాలంలో బౌద్ధం ఉచ్ఛదశకు చేరుకుంది. యువాన్ చాంగ్, ఇట్సింగ్ మొదలైనవారు ఈ కాలం వారే.

బౌద్ధ గ్రంథ ముద్రణ :

చీనా దేశీయులు 'దిమ్మల అచ్చుపని' కనిపెట్టారు. మొదట వీరు రక్షరేకులను, తాయెతులను ముద్రించారు. సంగ్ వంశంవారి పాలనలో 962 ప్రాంతంలో బౌద్ధమత వేద గ్రంథాలయిన 'పీటకములు' చీనాలో అచ్చు వేయబడ్డాయి. బౌద్ధ పీటక వాఙ్మయంలో 1521 విడి గ్రంథాలున్నాయి. వీటిని 1,30,000 పుటలు గల సంపుటాలలో అచ్చు వేశారట. ఈ దేశంలోనే మొట్ట మొదట కాగితాన్ని కనిపెట్టారు. ఈ విధంగా ఇక్కడ గ్రంథ ముద్రణ ప్రారంభమైంది.

బౌద్ధం క్షీణదశ :

సంగ్ వంశానంతర కాలంలో బౌద్ధం క్షీణించడం మొదలుపెట్టింది. వీరి తరువాత మంగోలు చక్రవర్తుల (క్రీ॥శ॥ 1289 - 1368) లో చాలామంది బౌద్ధాన్ని అభిమానించారు. ఆ తరువాత మింగ్ (క్రీ॥శ॥ 1368 - 1644), మంచూ (క్రీ॥శ॥ 1644 - 1922) వంశాలవారి పరిపాలనా కాలంలో బౌద్ధం క్షీణదశకు చేరుకుంది. చీనా హిందూ దేశాల మధ్య బౌద్ధమతం అనుబంధాన్ని పెంచింది. బౌద్ధం క్షీణదశలో ఈ ఉభయ దేశాలకు ఎడబాటు ఏర్పడింది.

గోలీస్తూప బౌద్ధ చిత్రాలు :

న్యూయెల్ దొర చెన్నై రాజధానిలోని ప్రాచీన వస్తు

శిథిలావశేషాలను పరిశీలించడానికి పర్యటిస్తుంటాడు. ఆయన గుంటూరు జిల్లా పల్నాడు తాలుకాలోని మల్లవరం అనే గ్రామం దగ్గర ఒక దిబ్బను చూశాడు. అక్కడ అతనికి అమరావతి స్థూపం వంటి రెండు శిలా ఫలకాలు కనబడతాయి. అందులో ఒకదాని మీద ఏడు తలల నాగము, మఱొకటి చాలా పాడవైన శిలా చిత్ర ఫలకము ఇది ఏడు అరలుగా విభాగింపబడింది. ఒక్కొక్క అరలో బౌద్ధమతానికి చెందిన గాథలు చిత్రాలు ఉన్నాయి. గ్రామస్తులు నాగశిలను తెచ్చి, దానికొక గది కట్టి నాగుమయ్య అనే పేరుతో పూజిస్తుంటారు. బుద్ధపాదాలు గల శిలా ఫలకాన్ని ద్వారం కుడి పక్కన స్థూపాకృతి గల శిలాఫలకాన్ని ఎడమ పక్కన స్థాపితం చేశారు. దీర్ఘ శిలాఫలకాన్ని గోడలో పెట్టి కట్టారు అక్కడ ప్రజలు బుద్ధ పాదాలను అమ్మవారి పాదాలు అంటారు.

1926లో ఆ దిబ్బను తవ్వించి ఆ శిలాఫలకాలను బయటకు తీసి, గవర్నమెంటు వాటిని మద్రాసు చిత్రవస్తు ప్రదర్శనశాలలో ఉంచింది. ఆ శిలాఫలకం దొరికిన స్థలానికి మల్లవరం మూడు మైళ్ళ దూరంలోను, గోలీకి అర మైల దూరంలోను ఉంది. అందువల్ల వీటిని గోలీస్తూప బౌద్ధ శిలాచిత్రములని పేర్కొన్నాడు. ఈ శిలాఫలకాల మీద బుద్ధుని జీవిత గాథలు చిత్రించ బడ్డాయి. గోలీస్తూప గ్రంథకర్త అయిన టి. యస్. రామచంద్రగారు ఆ కథలను గుర్తించినట్లు శర్మగారు తెలియజేశారు.

ఈ జాతక కథలలో ఛద్దంత, వెస్సంతర జాతకాలు శ్రేష్ఠమైనవిగా బౌద్ధులు చెబుతారు. ఇక్కడ ఉన్న స్త్రీ, పురుష చిత్రాలు, దుస్తులు, ఆభరణాలు మొదలైనవి పరిశీలించిన టి.యస్. రామచంద్రన్‌గారు అవి 3వ శతాబ్ధం నాటివని తెలియజేశారు. బౌద్ధాంధ్రుల శిల్పకళను చాటే అమరావతి తార్కాణంగా ఉంచేది. కాని అమరావతి స్తూప చిత్రాలలో ఉత్తమమైనవి ఖండాంతరాలకు చేరాయి. కొన్ని కలకత్తా చేర్చబడ్డాయి. ఈ అమూల్యమైన గోలీచిత్రాలను వెలువరించిన డుబ్రెయిల్, రామచంద్రన్ గార్లకు ఆంధ్రులు ఋణపడి ఉన్నారని శర్మగారు అభిప్రాయపడ్డారు.

నాగార్జునకొండ శిల్పాలు మన భారతీయ చిత్రకథకు తలమానికం వంటిది. అనాటి రాజులు వాడిన ఆసనాలు, శయ్యలు, కోట ప్రాకారాలు, కోట ద్వారాలు, రాచలోగిళ్ళ నమూనాలు, బౌద్ధుల ప్రార్థనాలయాలు, అనాటి ఆంధ్రులు, స్త్రీ పురుషులు ధరించిన ఆభరణాలు, కేశాలంకరణ, దుస్తులు మొదలైనవి ఈ చిత్రాలలో చూడవచ్చు. ఇక్కడ తొమ్మిది స్తూపాలు, 30, 40 శాసనాలు, ఎన్నో విహారాలు బయటపడ్డాయి. ఇక్కడ శాసనాలు ప్రాకృత భాషలో ఉన్నాయి. భాష ప్రాకృత మయినా, 1600 సంవత్సరాల కాలంలో వాడుకలో ఉన్న తెలుగు లిపిలో ఉన్నాయి. ఇక్ష్వాకుల వివరాలు ఇక్కడ శాసనాల వల్ల తెలుస్తున్నాయి. చాంతమూల రాజు సోదరి అయిన చాంతసిరి బుద్ధ భగవానుని ధాతువు ప్రతిష్టించి, దానిపై ఒక మహాస్థూపాన్ని నిర్మించింది. దీనికి మహాచైత్యమని పేరు. ఈ రాజు సోదరీమణులు, పత్నులు అనేక నిర్మాణాలు చేపట్టి, బౌద్ధమత ఉద్ధరణకు పాటు బడ్డారు. కాశ్మీర, గాంధార, చీనాచిలాత, అవంతి, అపరాంత దేశాల నుంచి, సింహళమొదలైన ద్వీపాల నుంచి బౌద్ధులు నాగార్జునకొండకు వచ్చేవారు. బౌద్ధంలో వచ్చిన మహాయాన విప్లవానికి ఆచార్య నాగార్జునుడు నాంది పలికారు. నాగార్జునకొండ శిల్పాలు ప్రాచీనాంధ్రుల సంస్కృతి, సభ్యతలకు దర్పణాలు, ప్రాచీన కాలంలో ఆంధ్రులు విజయవంతంగా సాగించిన మత విప్లవానికి సంకేతాలు, విప్లవ ఫలంగా వికసించిన నూతన మతం, సామాన్య జనంలో మంతేరోత్సాహ శక్తుల మూర్తులు, ప్రాచీన మహిళా లోకం భక్తుత్సాహాలతో చేసిన మత విషయక కృషికి చిహ్నాలు. కాబట్టి ఈ శిల్పకళను కాపాడుకోవలసిన బాధ్యత ఆంధ్రులపై ఉందని శర్మగారు తెలియజేశారు.

నాగార్జునకొండ చిత్రాల వివరణ :

ఒకటవ చిత్రంలో శుద్ధోధనుడి రాజ్యపాలన,

మాయాదేవి కలకన్న అంశాలు చిత్రించబడ్డాయి. రెండవ చిత్రంలో బుద్ధుని జననం చిత్రించబడింది. మాయాదేవి పుట్టింటికి బయలుదేరడం, లుంబినీ వనంలో సేద దీరడం, ఆ తర్వాత మగబిడ్డకు జన్మనివ్వడం మొదలైన అంశాలు చిత్తించబడ్డాయి. మూడవ చిత్రంలో బద్ధుడు జన్మించినపుడు అనేక వింతలు పొడసూపుతాయి. వాటని హిమవత్పర్వతాలలో తపమాచరిస్తున్న అసితుడనే ముని కనుగొని కపిలవస్తు నగరానికి వచ్చి, బుద్ధునికి ప్రణమిల్లి దుఃఖిస్తాడు. అతడు అప్పటికే కడు వృద్ధుడు కావడం వల్ల, బుద్ధుని లోకోత్తర ధర్మబోధ వినలేక పోతానని విచారిస్తున్నానని చెబుతాడు. ఈ విషయాలన్ని దీనిలో చిత్రించబడ్డాయి. నాలుగవ చిత్రంలో బుద్ధుని మహా నిష్క్రమణ చిత్రించబడింది. అయిదవ, ఆరవ చిత్రాలలో మారుడు బౌద్ధులకు శని వంటివాడు. బుద్ధుడు బోధి వృక్షం కింద కూర్చుని తపస్సు చేసుకుంటున్నపుడు, మారుడు తన కుమార్తెలను పంపి, అతని తపస్సును భగ్నం చేయడానికి ప్రయత్నించి విఫలమవుతాడు. ఈ కథ 5, 6 చిత్రాలలో చిత్రించబడింది. ఏడవ చిత్రము సర్వార్థ సిద్ధుడు బుద్ధుడయిన తరువాత తన ధర్మాన్ని మొదటి వారణాసి పక్కన గంగా తీరాన ఉన్న మృగ దానమునకు వెళ్ళి బోధిస్తాడు. ఈ బోధకు 'ధర్మచక్రమని' పేరు. ఈ విషయం ఇక్కడ చిత్రించబడింది. ఎనిమిదవ చిత్రంలో బుద్ధుని నిర్వాణము చిత్రించబడింది. బుద్ధుని ధాతువులు ఆ స్తూపంలోపల నిక్షిప్తమై ఉన్న విషయం, ఉపాసకులు ఆ స్తూపాన్ని ఆరాధించడం మొదలైనవి చిత్రించబడ్డాయి.

గోలీస్తూపము :

ఈ శిలాఫలకాల మీద బుద్ధుని కథలు చెక్కబడ్డాయి. ఒక్కొక్క ఫలకాన్ని అనేక విభాగాలుగా విభజించి ఒక్కొక్క దానిపై ఒక్కొక్క కథకు సంబంధించిన చెక్కారు.

ఒకటవ చిత్రము :

దీనిలో మూడు గడులున్నాయని, మొదటి గడిలో ఏనుగు మొదలైన జంతువులు, రెండవ గడిలో స్త్రీ పురుష ప్రతిమలు, మూడవ గడిలో నాగరాజు చిత్రము ఉన్నాయని ఈ చిత్రాలను చూచిన వారి మనస్సు రంజింప జేయడానికి ఇటువంటి చిత్రాలను చెక్కారని శర్మగారు తెలియజేశారు.

రెండవ చిత్రం :

బుద్ధుడు తన మతాన్ని బోధించడానికి తన శిష్యులతో కలసి, మగధలోని రాజగృహానికి వస్తాడు. అక్కడ ఒక సంపన్నుడు బుద్ధుని విందుకి ఆహ్వానిస్తాడు. అది తెలిసిన దేవదత్తుడు, బుద్ధుడు వెళ్ళే మార్గంలో 'నలగిరి' అనే భయంకరమైన ఏనుగును వదులుతాడు. అపుడా ఏనుగు భయంకరంగా ఘీంకరిస్తూ అనేకమందిపై దాడి చేస్తుంది. చివరకు బుద్ధుని వద్దకు వచ్చి, మోకరించి అతని పాద పద్మాలకు నమస్కరిస్తుంది. ఈ కథ రెండవ చిత్రంలో చిత్రించబడింది.

మూడవ చిత్రం :

వెస్సంతర జాతకం ఈ చిత్రంలో ఉంది. పూర్వ జన్మలలో ఒక జన్మలో బుద్ధుడు వెస్సంతరుడుగా జన్మిస్తాడు. పాళీభాషలో ఈ కథ ఉంది. అది ఈ చిత్రంలో చిత్రించబడింది. వెస్సంతరుడు కళింగరాజైన సంజయనికి కుమారుడు.

నాలుగవ చిత్రం :

కళింగదేశంలో క్షామం ఏర్పడడం వల్ల, ఆ క్షామాన్ని తొలగించడానికి బ్రాహ్మణులు వెస్సంతరుని వద్ద ఉన్న శ్వేతాశ్వాన్ని అడగడానికి వస్తారు. అతడు ఆ అశ్వాన్ని వారికి దానం చేస్తాడు. ఈ కథ నాలుగవ చిత్రంలో చిత్రించ బడింది.

అయిదవ చిత్రం :

వెస్సంతరుని దానాలకు ఆగ్రహించి, అతని తండ్రి అయిన సంజయరాజు వెస్సంతరుని రాజ్యం నుండి బహిష్కరిస్తాడు. ఆ కథ అయిదవ చిత్రంలో చిత్రించ బడింది.

ఆరవ చిత్రం :

వెస్సంతరుడు అరణ్యానికి వెళ్ళి, కుటీరంలో

జీవిస్తుంటాడు. అక్కడకు ఒక బ్రాహ్మణుడు వచ్చి, అతని సంతానాన్ని దానమిమ్మని అడుగుతాడు. వెస్సంతరుడు తన సంతానాన్ని అతనికి దానమిస్తాడు. అపుడు ఆ బ్రాహ్మణుడు వారిని కర్రతో కొడుతూ తీసికెళతాడు. ఈ కథంతా ఆరవ చిత్రంలో చిత్రించబడింది.

ఏడవ చిత్రం :

వెస్సంతరుని భార్య పండ్లు తీసుకురావడానికి అరణ్యానికి వెళుతుంది. ఆ సమయంలో వెస్సంతరుడు వారి సంతానాన్ని ఒక బ్రాహ్మణునికి దానం చేస్తాడు. ఆమె కుటీరానికి వచ్చి, సంతానం గురించి అడుగుతుందేమో అని, అతడు ధ్యానంలో నిమగ్నుడవుతాడు. ఆ బ్రాహ్మణుడు ఆ పిల్లలను రాజ ప్రసాదానికి తీసికెళతాడు. అపుడు రాజు తన మనమలను గుర్తించి, అతనికి తగిన మూల్యం చెల్లించి, తన మనవలను ఆ బ్రాహ్మణుని వద్ద నుండి తిరిగి స్వీకరిస్తాడు. ఈ కథ ఏడవ చిత్రంలో చిత్రించబడింది.

ఎనిమిదవ చిత్రం :

ఒక జన్మలో బుద్ధుడు ఛద్దంతుడి (షడ్దంతుడు)గా జన్మిస్తాడు. అతనికి ఇద్దరు భార్యలు. అతడు చిన్న భార్యను ఎక్కువగా ప్రేమిస్తాడు. పెద్ద భార్య అతనిపై కక్ష గడుతుంది. ఆమె చనిపోయి స్త్రీగా జన్మించి, కాశీరాజుని వివాహమాడుతుంది. ఆ తర్వాత ఆమెకొక వింత వ్యాధి వచ్చినట్టు నాటకమాడుతుంది. తనకు కలలో ఆరు దంతాలు గల ఏనుగు కలలోకి వచ్చిందని, ఆ దంతాలను తెచ్చి యిచ్చినచో, ఆ వ్యాధి నయమవుతుందని, భర్తతో చెబుతుంది. అపుడు కాశీరాజు శోణుత్తరుడు అను వేటగాడిని ఆ పనికి నియమిస్తాడు. ఆ వేటగాడు ఆ ఏనుగు దంతాలను ఖండించిన తరువాత అది మరణిస్తుంది. ఆ రాణి తాను చేసిన పనికి దుఃఖించి, ఆమె కూడ మరణిస్తుంది. ఈ కథ ఎనిదవ చిత్రంలో చిత్రించ బడింది.

బౌద్ధసంఘం :

శాక్యవంశంలో జన్మించి ఎన్ని సంవత్సరాలయిన బుద్ధుడు చిరస్మరణీయుడు. గాంధీ మహాత్ముడి ఉపదేశాలతో భారతదేశంలో బుద్ధుని ప్రవచనాలకు అంకురాలేర్పడ్డాయి. బుద్ధుని సందేశం ఇప్పటికి నవ్యమై, భవ్యమై లోకానికి నవ చైతన్యాన్ని ప్రసాదించింది. బుద్ధ చరితము యుగ యుగాల వారికి దివ్యపథాన్ని చూపే విద్యుద్దీపం. బౌద్ధము సమాజంలో ఉన్న అసమానతలను తొలగించిన సంస్కారోద్యమంగా ఖ్యాతిగాంచింది.

బౌద్ధ ధర్మాన్ని అవలంభించిన స్త్రీలను 'బిఖ్ఖులు' అని పిలుస్తారు. గృహస్థాశ్రమంలో ఉండి బుద్ధుని ధర్మోపదేశాన్ని అనుసరించి జీవించే పురుషులను 'ఉపాసకులు' అని, స్త్రీలను 'ఉపాసికలు' అని అంటారు. బౌద్ధ బిఖ్ఖు సంఘము ఒక 'జీవత్ సంస్థ'. బౌద్ధులు జీవితంలో పాటించాల్సిన నీతి నియమావళిని, ఆచార నిబంధనావళిని 'వినయము' అంటారు. బౌద్ధుల ఆచారాలను తెలియజేసే వినయ గ్రంథంలో గల శిక్షాసంహితకు 'పాతిమొఖ్ఖుమని' పేరు. బౌద్ధులు వ్యభిచారము, దొంగతనము, జీవహింస, అలౌకిక మహత్తులు కలవనిగాని, అర్హతుడనని గాని చెప్పరాడు. (ధర్మావలంబకులలో పరిపూర్ణతత చెందిన బిఖ్ఖుని అర్హతుడు అందురు.) బౌద్ధుల దృష్టిలో ఇవి మహా పాపాలు.

బౌద్ధులు ఉపోసధనాడు (ఉపవాస దినము) పాతిమొఖ్ఖమును పఠిస్తారు. ఈ ఉపోసథ నెలకు రెండు సార్లు వస్తుంది. ఈ రెండు రోజులు ఆత్మావలోకనం, ఆత్మ పరీక్షా దినములు. ఏ ప్రాంతంలో ఉన్న బౌద్ధులు ఆ ప్రాంతంలో సమావేశమవుతారు. బౌద్ధ బిక్కులలో పెద్దలు, ఆచార్యులు నలుగురు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరిస్తారు. అపుడు ఒక బిఖ్ఖువు పాతి మొఖ్ఖములోని ఒక్కొక్క శిక్షాపథాన్ని చదువుతాడు. ఆ తరువాత ఆ శిక్షాపదంలో గల ఎవరు చేయలేదుగదా అని మూడు సార్లు ప్రశ్నిస్తాడు. అక్కడ సమావేశమైన వారిలో ఆ పాపాలు చేస్తే బహిరంగంగా అంగీకరించి, ప్రాయశ్చిత్తం చేసుకుంటారు. ఇవి కాలక్రమేణ ఏర్పడ్డాయి. వినయము, సుత్తము అభిదమ్మము బౌద్ధ వేదాలు మూడు రకాలు.

బౌద్ధుల ఆచార కాండ వినయము, సుత్త పీటకములో బౌద్ధ ధర్మం చెప్పబడ్డాయి. అభిదమ్మము బౌద్ధ వేదాంతము. అభిదమ్మము ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

బుద్ధుడు ఒక మతాన్ని స్థాపించాలని అనుకోలేదు. బౌద్ధ ధర్మాన్ని అవలంభించిన వారిని ఒక సంఘంగా ఏర్పరిచి దానికి అధిపతిని నియమించాలని అనుకోలేదు. బుద్ధుని నిర్వాణ అనంతరం అతని శిష్యులే చక్కబెట్టారు. ఆచార వ్యవహారాలను, బుద్ధ ప్రోక్తమయిన ధర్మాన్ని క్రోడీకరించి గ్రంథస్థం చేయడానికి బౌద్ధులు పూనుకున్నారు. బౌద్ధ ఆచార, ధర్మ నిర్ణయానికి బౌద్ధులు మూడు సమావేశాలను జరిపారు. ఈ సమావేశాలకు బౌద్ధ సంగీతులు అనిపేరు. మొదటి సంగీతికి వినయ సంగీతి అనిపేరు.

బౌద్ధకళారంభములు - భర్హుత్ స్తూపము :

బుద్ధుడు మరణించిన తరువాత అతని అస్థికల కోసం వేర్వేరు రాజ్యాల వారు యుద్ధాలు చేస్తారు. అపుడు ద్రోణుడు అనే బ్రాహ్మణుడు వచ్చి, ఆ అస్థికలను ఎనిమిది భాగాలుగా చేసి, ఎనిమిది మంది రాజులకు ఇస్తాడు. వారు రాజగృహము, వైశాలీ, కపిలవస్తు, అల్లకప్ప, వేష్ణ ద్వీపము, రామ గ్రామము, పావా, కుశ నగరములలో ఎనిమిది స్తూపాలను ఏర్పాటు చేశారు. ఆ తరువాత మౌర్యవంశ రాజైన అశోక చక్రవర్తి వాటిని తెరిపించి, వాటిలో అస్థికలను తీసి 84,000 శకలాలను చేయించి వాటిని దేశమంతా పంచి పెట్టి, స్తూపాలను కట్టిస్తాడు. వాటిలో భర్హుత్ అనేది మధ్యహిందూ దేశంలోని బాఘేల్ ఖండ్ జిల్లాలో నగోడ్ సంస్థానంలోని ఒక గ్రామము. ఇక్కడ స్తూపాన్ని ఇటుకలతో నిర్మించారు. ఈ స్తూప శిల్పంలో రెండు దేవతా విగ్రహాలున్నాయి. అనాథ పిండికుని జేత వనదానము మిగజాతకమ్, చదంతియ జాతకమ్, జబూ నడదోపవతే, వడుకో కథాదోహతి నడదోపవతే, ముగపకయ జాతకమ్, తికోటి కోచకమో, భిసమారనియ జాతకమ్ అనే కథలు చెక్కబడ్డాయి.

అనాథ పిండకుని జేత వనదానము :

భాగ్యవంతుడైన ఒక వ్యాపారి బుద్ధునికి ఒక వనాన్ని నిర్మించి ఇస్తాడు దానిపేరు జేతవనం. ఈ కథ బార్హుత్ స్తూపంపై చెక్కబడింది.

మిగజాతకమ్ :

బుద్ధుడు తన పూర్వజన్మలో ఒకసారి రురుజాతి మృగంగా పుట్టాడట. ఆ జంతువు ఒక నది దగ్గర మామిడి వనంలో ఒంటరిగా నివసిస్తూ ఉంటుంది. ఒకరోజు ఒక వైశ్య కుమారుడు ఆత్మహత్య చేసుకోడానికి వచ్చి నదిలో దూకుతాడు. అపుడా జంతువు అతనిని రక్షించి, కొంత కాలం అక్కడే ఉంచి పోషిస్తుంది. ఆ తరువాత అతడు తిరిగి తన నివాసానికి వెళుతున్నపుడు, తాను అక్కడ ఉన్నట్టు చెప్పవద్దని ఆ జంతువు అతనితో చెబుతుంది. కాని అతడు కాశీరాజుకు ఆ జంతువు గురించి చెబుతాడు. ఆ రాజు దానిని వేటాడడానికి వస్తాడు. అపుడా జంతువు "రాజా బాణము విడువకము, నన్ను కొట్టకుముండుమని" మధురమైన కంఠంతో పలుకుతుంది. ఆ కంఠం విని రాజు బాణం నేలపై వదులుతాడు. అపుడా మృగం రాజా నేనున్న స్థలాన్ని నీకు ఎవరు చెప్పారు అని ఆ రాజుని అడుగుతుంది. ఈ కథ ఇక్కడ చెక్కబడింది. ఆ రాజు వైశ్య కుమారుని చూపిస్తాడు. "మనుష్యులు కృతఘ్నులు వారి నోటితో చెప్పున దొకటి చేయున దొకటి" అంటుంది. అపుడు రాజు నేను అలాంటి వాడిని కాను నన్ను వారితో జమ కట్టవద్దు అంటాడు. రాజు ఏదైనా వరం కోరుకోమని అంటాడు. అపుడా జంతువు "అట్లయిన నేనును నాతో పాటు ఇతర జంతువులు సురక్షితముగా నుండు"నట్లు అడుగుతుంది. అదే విధంగా ఒక చిత్రంలో ఛదంతియ జాతకమ్ చెక్కబడింది. అదే విధంగా ముగ పకయ జాతకమ్ దీనిలో బుద్ధుడు కాశీరాజు కుమారుడుగా జన్మించిన ఒక చిత్రంలో చిత్రించబడింది. ఇంకా అనేక కథలు భర్హుత్ స్తూప శిలలపై చెక్కబడ్డాయి.

అదే విధంగా 'తథాగతుని దంత ధాతు చరిత్ర' అను వ్యాసంలో బుద్ధుని ధాతు చరిత్ర చెప్పబడింది. దంత

పురము ఎక్కడ ఉందన్న విషయంలో పరశోధకులలో భిన్నాభిప్రాయాలు గలవు. కొంతమంది గంజాము జిల్లా లోని కళింగ పట్టణమని, మరి కొంత మంది పూరీ జగన్నాథమే దంతపురమని, ఇంకొంత మంది గంజాము జిల్లాలోని శ్రీకాకుళం రైల్వేస్టేషన్‌కి పదిమైళ్ళ దూరంలో దంతవరపుకోట అనే పాడుబడిన స్థలమే దంతపురమై ఉంటుందని నేటి చరిత్ర పరిశోధకులు చెబుతున్నారు. ఇపుడది ఒక పెద్ద దిబ్బవలె ఉంటుంది. దీనిని దంత వక్త్రునికోట అని వ్యవహరిస్తున్నారు. ప్రాచీన కళింగ గాంగ శాసనాలలో పూర్వగాంగ వంశస్తులు దంతపురాన్ని రాజధానిగా చేసుకుని పరిపాలించారు. బౌద్ధగాధలలో దంతపుర ప్రస్థావన కలదు. ఈ రెండు దంతపురాలు ఒకటో కాదో అనే సందేహాన్ని శర్మగారు వెలిబుచ్చారు.

'దలదావంస' 'దాట్ఠాధాతు వంసము' బుద్ధని దంత గాధను తెలిపే ప్రధాన గ్రంధాలు. ఇవి పాళీ భాషలోకి అనువదించబడ్డాయి. కాని కర్త ఎవరో తెలియదు. క్రీ॥శ॥ 310 కాలంలో రచింపబడిందని, ప్రాచ్య పరిశోధకులు నిర్ణయించారు. 'ధమ్మకిత్తిధేరుడు' అనే బౌద్దాచార్యుడు క్రీ॥శ॥ 13వ శతాబ్దంలో పాళీ భాషలోకి దట్ఠాధాతువంస (దంష్ట్ర ధాతువంశ) మనే పేరుతో అనువదించాడు. బుద్ధని నిర్వాణ అనంతరం పెద్ద వర్షం కురవగా బూడిద కొట్టుకుని పోతుందట. అపుడు కపాలము, అక్షక ధాతువులు రెండు, దంత ధాతువులు నాలుగు, మొత్తము బుద్ధ ధాతువులు ఏడు మిగిలాయట. కళింగ నగర రాజధాని అయిన దంతపురాన్ని పాలించే బ్రహ్మదత్తుడు బుద్ధుని ఎడమ కోరపంటిని (వామదంష్ట్ర ధాతువు) మణిమయ ఖచితమైన ఒక ధాతు పీఠమును చేయించి, అందులో ఆ ధాతువుని ఉంచి పూజించేవాడు. ఇతని తరువాత గుహసీవుడు రాజ్యాన్ని పరిపాలిస్తాడు. అతడు మొదట జైన మతాన్ని అవలంభించి, తరువాత దంత ధాతు మహిమను తెలుసుకుని, బౌద్ధమతాన్ని స్వీక రిస్తాడు. బౌద్ధేతరులను తన రాజ్యం నుండి వెళ్ళగొడతాడు. వారు జంబూ ద్వీపాధిపతి వద్దకు వెళ్ళి, అతని నిందలు మోపి అతనిపై దండెత్తేలా చేస్తారు. అపుడా రాజు గుహసీవుని, దంత ధాతువుతో సహా తీసుకుని రమ్మని చిత్తయానుడనే సామంతరాజుని పంపుతాడు. గుహ సీవుడు పాటలీపుత్రంలో కొంత కాలముండి తిరిగి కళింగకు వెళతాడు. ఈ దంత ధాతువుని ఆరాధించడానికి ఉజయిని రాజకుమారుడయిన దంత కుమారుడు కళింగ దేశానికి వస్తాడు. అతనికి తన కుమార్తె హేమమాల నిచ్చి వివాహం చేస్తాడు. ఖేరధారరాజు దంత ధాతువు కోసం గుహసీవునిపై యుద్ధం ప్రకటించడం, అతనికి ఆ దంత ధాతువు దక్కకుండా దంత కుమారుడు, హేమమాల కాపాడడం మొదలైన అన్ని విషయాలు తథాగతుని దంత ధాతు చరిత్రలో చెప్పబడింది.

ఈ వ్యాసాలలో బుద్ధుడు అనేక జన్మలెత్తినట్టు చర్చించ బడింది. హిందూమత పురాణాలలో, దేవతలు అనేక అవతారాలెత్తిన విషయం అందరికీ విదితమే. వీరు కూడా హిందూ పురాణాలను అనుకరించారా! అన్న సందేహం కలుగుతుంది. ఎందుకనగా బుద్ధుడు ఒక మతాన్ని స్థాపించాలని గాని, ఈ మతాన్ని అవలంభించిన వారిని, ఒక సంఘంగా నియమించాలని గాని అనుకోలేదు. బుద్ధుని నిర్వాణ అనంతరం, అతని శిష్యులు, బౌద్ధమత భిక్షువులు ఈ మత గ్రంథాలను రాసే క్రమంలో అనేక మార్పులు చేసి ఉండవచ్చు. కాబట్టి కొన్ని కథలు కల్పించబడ్డాయేమో అనే భావన కలుగుతుంది. హిందూ మత వాసనలు బౌద్ధమతంలో వ్యాపించాయా! అనిపిస్తుంది.

ఈ విధంగా మల్లంపల్లి సోమశేఖరశర్మగారు బౌద్ధమతానికి సంబంధించిన అనేక వ్యాసాలను రాశారు. శర్మగారు రాసిన కొన్ని వ్యాసాలలోని బౌద్ధమత అంశాలను తీసుకుని, ఈ వ్యాసంలో పొందు పరచడం జరిగింది. ఈ వ్యాసాలలో బౌద్ధమతం గురించే గాక చారిత్రక అంశాలను కూడా చర్చించారు. ఆయన రాసిన వ్యాసా లలో పరిశీలించవలసిన అనేక అంశాలున్నాయి.

ఉపయుక్త గ్రంథాలు :

1. ప్రతాపరెడ్డి, సురవరం. 2007. ఆంధ్రుల సాంఘిక చరిత్ర. చరిత్ర ఇండ్రెషన్, హైదరాబాదు.
2. రవికృష్ణ, మోదుగుల. 2011. చారిత్రక వ్యాసమంజరి. (మల్లంపల్లి సోమశేఖర శర్మ) మిత్రమండలి ప్రచురణలు, గుంటూరు.
3. రవికృష్ణ, మోదుగుల, 2011. బౌద్ధయుగము (మల్లంపల్లి సోమశేఖర శర్మ) మిత్రమండలి ప్రచురణలు, గుంటూరు.
4. శాస్త్రి, బి.యన్. 1975. ఆంధ్రుల సాంఘిక చరిత్ర. సరస్వతీ నిలయం, నారాయణగూడ, హైదరాబాదు.

BHAVAVEENA
Vol. 18, Issue. 10, October 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావ వీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

నూతలపాటి కవిత్వం – సమకాలీన సమస్యల చిత్రణ

– డా॥ జి. పార్వతి, సహ ఆచార్యులు, తెలుగు శాఖ, యోగి వేమన విశ్వవిద్యాలయం, కడప.

ఏ రచనకైనా వాస్తవం, చారిత్రక దృక్పథం ఎంత అవసరమే మానవతాకోణం కూడా అంతే అవసరం.

తార్కికత, హేతుబద్ధత, చర్చ, సంప్రదింపులు, పరిశీలన అనేవి ఆధునిక కవిత్వానికి ఆయువుపట్టులు. పైన చెప్పిన లక్షణాలుంటే తప్ప ఆ కవిత్వం ప్రజా జీవితాన్ని గురించి స్పందించదు. ప్రజా జీవితాన్ని గురించి స్పందించిన కవిత్వమే సమకాలీన సమస్యలను అవగాహన లోకి తెస్తుంది. సమకాలీన సమస్యల గురించి స్పందించని ఆధునిక కవిత్వం ఎక్కువ కాలం బతికి బట్టకట్ట లేదన్నది కఠోర వాస్తవం. నిరంతర సంఘర్షణకు, ఆందోళనకు అల్లకల్లోలాలకు, ఇబ్బందులకు, ఇడుములకు, రక్తతర్పణాలకు బలయ్యే సామాన్య ప్రజానికం గురించి ఏ కవిత్వం స్పందిస్తుందో అలాంటి కవిత్వమే సమకాలీన సమస్యలను గురించి చిత్రించగలదు. ఆ కోవకు చెందిన కవిత్వమే నూతలపాటిది. వారి కవిత్వం లోని సమకాలీన సమస్యల చిత్రణకు పరిమితమై ఈ పత్ర సమర్పణ సాగుతుంది.

రాయలసీమ ప్రాంతంలో చిత్తూరు జిల్లాకు చెందిన అభ్యుదయ రచయిత నూతలపాటి గంగాధరం. బతికింది కేవలం ముప్పయిదు సంవత్సరాలైనప్పటికీ తనదైన సొంత గొంతుకతో మేలిబంతుల్లాంటి రెండు కవితా సంపుటాలను వెలువరించాడు. ఈయన ప్రకటించిన 'చీకటి నుంచి', 'వెలుగు లోనికి' అనే రెండు కవితా సంపుటాలు కూడా అనేక సమకాలీన సమస్యలను మనతో చర్చిస్తాయి. ఆ చర్చలో గంగాధరం మనకు హేతుబద్ధమైన, తార్కిక మైన సూచనలు సలహాలు చేస్తాడు. వారి జీవితాన్ని గురించి, జీవితానంతర విశిష్టత గురించి రెండు విషయాలు తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నూతలపాటి గంగాధరం 1939 నవంబర్ 15న చిత్తూరు జిల్లా రామగిరిలో సామాన్య రైతుకుటుంబంలో పుట్టాడు. చిన్ననాటి నుండే రచనా వ్యాసంగం పట్ల మక్కువ కలిగినవాడు. ప్రాథమిక, హైస్కూల్ విద్య నింద్రలో సాగింది. తరువాత తిరుపతి శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య కళాశాలలో చేబ్రోలు సుబ్రహ్మణ్య శర్మ, ఆకెళ్ళ అచ్చెన్న శాస్త్రి శిష్యరికంలో ఆరితేరాడు. ప్రాచీన సాహిత్యంపట్ల, ఆధునిక సాహిత్యంపట్ల సమాన ఉత్సాహం చూపాడు. ప్రాచీన సాహిత్యం పునాదుల మీద ఆధునిక సాహిత్యం నృజించాడు నూతలపాటి. 1975 మే 29న తన ముప్పైయారవ యేటా పాముకాటుకు గురై కన్ను మూసాడు. నూతలపాటి గంగాధరం యువకవిగా కన్నుమూసినా ఆయన్ను సాహితీలోకం మర్చిపోలేదు. ఆయన మిత్రులు, శ్రేయోభిలాషులు గంగాధర సాహితీ కుటుంబంగా ఏర్పడి ప్రతియేటా కథ, నవల, కవితలకు బహుమతులు ప్రదానం చేయడం ప్రశంసించదగ్గ విషయం. ఆయన రాసింది రెండు కథలు. తివాచి, కల అనేవి మధ్యతరగతి మనస్తత్వంతో సాగుతాయి. ఆయన రాసిన ఏకైక నవల 'కాగితంపులి'. మనుషులమధ్య కనిపించే రాగద్వేషాల్ని విశ్లేషిస్తుంది. 'సాహిత్య గంగాలహరి' అనే వ్యాస సంపుటి కూడా ఆయన వెలువరించాడు. అది ప్రాచీన ఆధునిక విషయాలపట్ల వివేచన చేస్తుంది. ఇక నూతలపాటి కవిత్వం విషయానికొస్తే 'చీకటి నుండి' మొదటి కవితా సంపుటి. 1968లో సంక్రాంతి సందర్భంగా అచ్చు వేయబడింది. దాశరథి 'ఉషారేఖలు' అనే ముందు మాటతో వచ్చింది. కొంగర జగ్గయ్యకు అంకితం ఇవ్వబడింది. ఇందులో 39 ఖండికలున్నాయి. రెండోది 'వెలుగులోకి' 1974లో ఆరుద్రగారి హవణింపు ముందు మాటతో వచ్చింది. దీన్ని నూతలపాటి తన తల్లిదండ్రులకు అంకితం చేశాడు. ఇందులో 34 ఖండికలున్నాయి.

నూతలపాటి గంగాధరం అసలు సిసలైన అభ్యుదయ కవి. ఏ విషయాన్నైనా, ఎంతటి కష్టతరమైన సమస్యనైనా సామాన్యుని పక్కన నిలబడి కవితారూపంలో స్పందిస్తాడు. తన కవిత సామాన్యుని వ్యథను తీర్చేదిగా ఉండాలన్నది ఆయన ఆలోచన. అందుకే కవిత్వం గురించి

"సేద తీర్చేది ఒకటి
శక్తి నిచ్చేది ఒకటి
చైతన్యం కూర్చేది ఒకటి
ఇవి మూహూ చేకూర్చేది కవిత"

(వెలుగులోనికి... 55)

అని నిర్వచిస్తాడు. అసలు సేదతీర్చని కవిత నిప్పుల వాన లాంటిదని, శక్తిని ఇవ్వలేని కవిత కుళ్ళిన పండులాంటిదని, చైతన్యం కలిగించని కవిత చీకటి గుయ్యారం లాంటిదని స్పష్టం చేస్తాడు. ఇంతటి అభ్యుదయ భావాలతో ముందుకు సాగే ఆయన కవిత్వాన్నిలో సామాజిక సమస్యల గురించి కింది శీర్షికల ద్వారా విశ్లేషించవచ్చు.

1. అసమానత్వం
2. స్వతంత్ర భారతం
3. శ్రీమదోపిడీ
4. సమకాలీన రాజకీయాలు
5. రైతు సమస్యలు
6. తెలుగుకవి దుస్థితి

అసమానత్వం :

ప్రపంచంలోని అన్ని దేశాల్లో 'అసమానత్వ' సమస్య ఉంది. కానీ భారతీయ సమాజంలో ఈ అసమానత్వ సమస్య మరింత జఠిలంగా ఉంటుంది. ఆర్థిక పరిస్థితుల కారణంగా కులం ఆధారంగా, హోదాల వల్ల అసమానత్వ సమస్య వేళ్ళూనుకొని ఉంది. భారతదేశంలో ఒక పూరిగుడిసె కూడ కనబడకూడదని ప్రతిప్రభుత్వం పక్కా ఇండ్లు ఎన్ని ఇస్తున్నా గుడిసెలు పెరుగుతున్నాయి కానీ తరగడం లేదు.

"ఈవైపు ఒక మేడ - ఆకాశాన్నంటేవి!
మధ్య మా ఇల్లు - పూరిల్లు
రెండు పిల్లుల నడుమ
ఎలుకలాంటిది - మా యింటి ఉనికి!

(చీకటి నుంచి... 93)

అనే పరిస్థితిలా ఉంది ఊరు అని గంగాధరం పేర్కొంటాడు.

"ఆ మేడల దుశ్చేష్టలూ, దుర్మార్గాలు
చెప్పతరం కాదు
వాటి నన్నింటినీ కళ్లారా చూస్తున్నా
ఊళ్లో వాళ్లెవరూ ఇంతవరకు
ఇదేమిటని అడిగిన పాపాన పోలేదు!
అసలెప్పుడూ వాళ్ళడగరు!
అయినా! ఇది మా ఊరు!

(చీకటి నుంచి... 95)

అంటే భారతదేశంలో పేదల పరిస్థితి ధనవంతుల మధ్య ఎలా నలిగిపోతుందో వివరించాడు కవి. అలా నలిగిపోతున్నప్పటికీ వారి గురించి ఎవరూ కనీసం స్పందించడం లేదని అసమానత్వాన్ని గురించి ప్రశ్నించే స్వరమే లేదని నూతలపాటి వాపోతాడు.

"మట్టిమీద మనిషికన్నా మనీ మిన్న
నేటి మనిషిలో తెలివి ఉన్నా మనసు సున్నా"

(వెలుగులోనికి... 77)

అని డబ్బుకు ప్రస్తుత సమాజంలో ఉన్న విలువను అది మనిషికంటే కూడా ఎలా ప్రభావం చూపిస్తుందో ఒక్కమాటలో చెప్పాడు నూతలపాటి. ఆ డబ్బే ఈ అసమానత్వాలకు కారణమని వివరించే ప్రయత్నం చేసాడు.

స్వతంత్ర భారతం :

భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి గంగాధరం కవిత రాసిన నాటికి పాతికేళ్ళు గడిచింది. అయినప్పటికీ స్వాతంత్ర్య ఫలాలు అందవలసిన వాళ్ళకు ఇంకా

అందలేదన్న వాస్తవాన్ని కవిని తీవ్రంగా కలిచివేసింది. ఈ రెండు కవితా సంపుటాల్లోని అనేక ఖండికలు నూతల పాటికి స్వతంత్ర భారతదేశంలో జరుగుతున్న దుర న్యాయాలపట్ల అసంతృప్తులను వెళ్ళగక్కిస్తాయి.

పరదాస్యం నుండి బయటపడ్డాక పట్టుమని పది నాళ్ళు ఓపిక పడితే స్వాతంత్ర్య ఫలాలు అందరూ పొంద వచ్చునని నాయకుల ప్రబోధాలను తాను నమ్మానని అంటాడు కవి. ఇప్పటికీ పాతికేళ్ళు దాటుతున్నా ఏం ప్రగతి సాధించారని ప్రజలపక్షాన పబ్లిక్కులో నిలబడి ప్రశ్నిస్తాడు నూతలపాటి గంగాధరం. కనీస అవసరాలైన కూడు, గూడు, గుడ్డ, ఇల్లు, దానికి తగిన సౌకర్యాలు ఇంకా సామాన్య మానవున్ని చేరకపోవటం గురించి వ్యంగ్యంగా ఇలా ప్రశ్నిస్తాడు.

చీకటివానలో ఇంకా
షవర్ బాత్ చేస్తూనే వున్నాను.
బాధల ఎండలో ఎండి
ఇంకా బట్ట కట్టుతూనే వున్నాను
దుఃఖాల వేడి వేడి అన్నం
ఇంకా సుష్టుగా ఆరగిస్తూనే వున్నాను.
చన్నీళ్ళు తగిలితే జలుబు చేస్తుందని
వేడికన్నీళ్ళతోనే దాహం తీర్చుకుంటున్నాను.
కంటకశయ్యపై ఇంకా
హాయిగా పవ్వళిస్తూనే వున్నాను.
చలిగాలి కత్తులతో
ఇంకా క్రీడిస్తూనే ఉన్నాను.

(వెలుగులోనికి... 66)

అంటూ స్వతంత్ర భారతంలో సౌకర్యాల లేమితో చీకట్లో మగ్గిపోతున్న అనేక దృశ్యాల గురించి మనకళ్ళ ముందుంచుతాడు నూతలపాటి.

స్వతంత్ర భారతదేశం ఎన్నో త్యాగాలకు ప్రతీక. ఎన్నో కలలకు ప్రాణవాయువు. త్యాగధనుల ఆశయాలకు ఊపిరి. స్వరాజ్యం సాధించుకున్నాక పెరిగిన స్వార్థం, మోసం. ఆ త్యాగాల కలలను, ఆశయాలను అవిరి చేసిందని గంగాధరం ఆవేదన చెందాడు. లంచాలు తీసుకొని వెండికంచాలలో భోంచేస్తున్న వారిని అసహ్యించు కున్నాడు. అధికార దర్పాన్ని నెత్తిన పెంచుకొని అహం కారమనే బురదను ఒళ్ళంతా పనుకొని క్రూరంగా ప్రవర్తిస్తున్న అధికారులను చూసి భయపడ కూడదని, వారి రాక్షసత్వాన్ని నిర్భయంగా బయటపెట్టాలని అప్పుడే స్వతంత్ర భారతదేశ ఫలాలు అందరికీ అందుతాయని ప్రబోధించాడు.

మంచినీ, మానవతనీ తిని
వంచన కంచుకాల్ని కప్పుకుని
గుట్టుగా మట్టుగా
గాడనిద్రా ముద్రితులై ఉన్న కుంభకర్ణుల్ని గాంచి
నీతి న్యాయాల కాంచన చర్మం ధరించి
కుళ్ళునూ, కుట్రనూ శరీరమంతా నింపుకుని
ధర్మాన్ని నిలువునా దగా చేస్తున్న మారీచులను గాంచి
'బాబోయ్, ఇది రాక్షసలోకం' అని
భయపడి పారిపోతావా?
ధైర్యంగా నిలచి రాక్షసుల
నిజస్వరూపాల్ని బయటపెడతావా?

(వెలుగు లోనికి... 40)

అంటూ పాఠకులకి చక్కటి సందేశాన్నిచ్చాడు. స్వార్థాన్ని, కుట్రను ఎండగట్టమని ప్రబోధించాడు. ప్రజా కంఠకుల రాక్షసత్వాన్ని, నిజస్వరూపాన్ని బయటపెట్టాలని సూచించాడు.

శ్రమ దోపిడీ :

భారతీయ సమాజం వర్గ సమాజం. వర్గసమాజంలో శ్రమదోపిడీ ఎక్కువ. పేదవాళ్ళైన సమస్త ప్రజల పక్షాన నూతలపాటి గంగాధరం నిలబడి మాట్లాడాడు. భుక్తి కోసం, పనిని వెదుక్కొంటూ వచ్చి బజారులో, బస్టాండులో నిలబడ్డ కూలీల పక్షాన, ఫ్యాక్టరీలో పనిచేసే శ్రామికుడి వైపు నిలబడి వారి బాధను, వ్యథలను కవితా గానం చేస్తాడు కవి.

గాలిలో - ధూళిలో
ఎండనకా - వాననకా
పగలనకా - రేయనకా
అన్ని వేళల్లోనూ,
చాకిరీ! చాకిరీ!

(చీకటి నుంచి... 47)

కూలీల, శ్రామికుల, కార్మికుల చాకిరీ అంతా ఈ దేశం కోసం, ఈ దేశంలోని ప్రజల కోసం అని వారి శ్రమను గుర్తించాలంటాడు...

బీదలనూ - సాధులనూ
హింసించి - ధ్వంసం చేసి
వాళ్ళ నోటికూడు
దౌర్జన్యంగా దోచుకునే - నీచులనూ,
సృష్టించడానికి అలవాటు పడిన
ఆ బ్రహ్మదేవుని చేయి
నిన్ను సృష్టించడానికి
పాపం! ఎంత బాధపడిందో!

(చీకటి నుంచి... 49)

అంటూ ఆవేదన చెందుతాడు నూతలపాటి. నీ కష్టాలన్నీ తొలగిపోయే రోజులు దగ్గరలోనే ఉన్నాయని ఆశాభావాన్ని వారిలో కలిగించడానికి ప్రయత్నిస్తాడు.

సమకాలీన రాజకీయాలు :

ఏ దేశ సమాజాన్నైనా మార్చేది మార్పు తెచ్చేది సమకాలీన రాజకీయాలు. రాజకీయాలు సమాజాన్ని శాసిస్తాయి. సమాజాన్ని నడిపిస్తాయి. కానీ రానురాను రాజకీయాలు సమాజానికి శాపంగా మారుతున్నాయి. సమాజంలో కష్టాలను సృష్టిస్తున్నాయి. దానికి కారణం రాజకీయాల్లో రాజనీతిజ్ఞత కనుమరుగైపోవడం, అవినీతి అక్రమాలకు ఆలవాలమైపోయింది. రాజ్యం తన బాధ్యతల నుండి తప్పుకునే పరిస్థితికి రావడం నేడు గమనిస్తున్నాం. ఈ దశలో సామాజిక బాధ్యతగా సమాజ ఉన్నతిని ఆకాంక్షిస్తూ రచయితలు, కవులు సాహిత్యాన్ని సృష్టిస్తే తప్ప సమాజమనుగడ సాధ్యం కాదు. ఆ పనికే నడుం బిగించాడు నూతలపాటి.

నా చేతనే ఓటు వేయించుకుని
నా నెత్తినే చేతులు పెట్టేవాళ్ళూ

అంటూ రాజకీయాలు ఇంతగా భ్రష్టుపట్టడానికి కారణమైన రాజకీయ నాయకులను తూలనాడాడు. వారి హస్తాలను భస్మాసుర హస్తాలుగా చిత్రీకరించాడు.

నేడు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే 'రాజద్రోహం' నిందను ఎదుర్కోవలసిన సందర్భం. కానీ ఇంతపెద్ద ఆరోపణ నేడు ఉన్నప్పటికీ దీనికి బీజాలు పడింది 1970వ దశకంలోనే నని నూతలపాటి కవిత్వం చెబుతుంది.

పాత్ర మలినమైతే
పాలు చెడిపోతాయి
పాలకుడు దుష్టుడైతే
రూలు దుష్టమై పోతుంది.

(వెలుగు లోనికి... 53)

అంటూ నేరుగానే దుష్ట రాజకీయ నాయకులపై విల్లెక్కి పెట్టాడు. సచ్ఛీలత కలిగిన రాజకీయ నాయకులు మంచి సమాజాన్ని నిర్మిస్తారని చెప్పాడు. మంచి పాలకుడు ఉన్నప్పుడే రాజ్యాంగపరమైన, న్యాయపరమైన హక్కులు రక్షింపబడుతాయి. అభివృద్ధి అందరికీ అందు బాటులోకి వస్తుంది అని నూతల పాటి గంగాధరం అంచనా వేశాడు.

రైతు సమస్యలు :

దేశానికి వెన్నెముక రైతు. భూమిని నమ్ముకున్నరైతు సమాజానికి బువ్వపెడుతున్నాడు. రైతుకుటుంబంలో పుట్టిన నతూలపాటి గంగాధరం, వారి పక్షాన నిలబడ్డాడు.

"చేతికంటే పంట చివరి తడి కరువై సురిగి పోగా
ఇల్లుమరచి, ఒళ్ళు మరచి, నీళ్ళు నిప్పులూ మరిచి
రాత్రింబవళ్ళు గెనిమమీద నిర్జీవంగా పడివున్న
పెదకాపు గుండెస్వడి విన్నావా?"

(వెలుగులోనికి.... 34)

అంటూ రాయలసీమ రైతు దుస్థితి గురించి వినిపించాడు కవి. వర్షాలు పడక, సరైన విద్యుత్ సౌకర్యం లేక నీటికోసం ఎదురుచూపులు చూసే రైతు దయనీయ స్థితి కళ్ళముందుంచుతాడు. రైతులే గాకుండా పేద వలసకూలీల పరిస్థితిని కూడా

"పండక్కి తిరిగి వస్తానని, ఇన్ని మెతుకులు తెస్తానని
ఊరిలో బ్రతుకు లేక
పొలిమేరల్ని దాటి వెళ్ళిన భర్త రాకపోగా
తిండిలేక, తండ్రిలేక
ఏడ్చేపిల్లల్ని ఊరడించలేక
గడపలో వేచి ఎదురుచూచే ఇల్లాలి
ఎండిన కళ్ళలో పండుగ సంబరం ఎంతుందో
చూశావా?

(వెలుగోలనికి... 34)

అంటూ కళ్ళకు కట్టినట్లు చూపించాడు. అంటే వలస కూలీలు ఈనాడు ఎక్కువ అని మనం చూస్తున్నాం. కానీ ఇది 1970వ దశకంలో కూడా ఉండేదని, వారి పరిస్థితి దయనీయమైనదని ఈ కవితాఖండిక తెలియజేస్తోంది.

తెలుగు కవి దుస్థితి :

ఈ వ్యవస్థ మరింత ఉన్నతదశలో ఉండాలని కోరుకునేవాడు రాజనీతిజ్ఞుడైతే ఈ వ్యవస్థను ప్రక్షాళన చేసి సామాజిక రుగ్మతలపై సమరభేరి మోగించినవాడే కవి లేదా రచయిత. ఇంకా చెప్పాలంటే మేధావి. కానీ ఆ కవి పేదరికంతో అల్లాడుతుంటే కవిత్వం ఎలా సృష్టించబడుతుంది. సమాజం ఎలా సంస్కరించ బడుతుంది. సృష్టికర్త అనే కవితలో పేదరికంలో అల్లాడే తెలుగు కవిని గుర్తు చూస్తాడు కవి. సంపన్నుల ఉంగరపు వేళకింద బ్రతికే కవులగురించి కాకుండా, నాలుగువేళ్లు నోట్లోకి పోని పేద తెలుగు కవిని గురించి వర్ణిస్తాడు నూతలపాటి. జీర్ణించిన పాకలో, చిల్లులుపడ్డ గుడిసెలో, దీనంగా మూలుగుతున్న వ్యక్తే ఆదర్శాల కోసం వెంపర్లాడే తెలుగుకవి అని అంటాడు గంగాధరం.

గతించిన వాళ్ళను తలుచుకొని
నిరాశ, నిస్పృహలతో క్రుంగుతూ
బ్రతికి ఉన్నవాళ్ళమీద
గాలి మేడలు నిర్మించుకొని
ఆశపెంచుకొని పొంగుతూ
ఉత్పత్తి శక్తిగాని
పోషణ శక్తి శూన్యమైన
కవిని నేను తెలుగు కవిని నేను

అని ఆదర్శ తెలుగు కవుల కష్టాలను ఈ కవితా ఖండికలో వివరిస్తాడు నూతలపాటి.

ముగింపు :

ప్రాచీన సాహిత్య పునాదులపై ఆధునిక సాహిత్యాన్ని నిర్మించిన నూతలపాటి గంగాధరం సమకాలీన సమస్యలను కవిత్వీకరించిన వాస్తవిక వాది. ఆధునిక సాహిత్యకారుల్లో రాయలసీమ ప్రాంతానికి చెందిన నూతలపాటి కవిగా, విమర్శకుడిగా, కథకుడిగా, నవలా కారుడిగా అద్భుతమైన రచనాపాఠవాన్ని అందించాడు. అందుకే దాశరథి "ఆంధ్ర భారతి గళసీమలో విరాజిల్లె ముక్తాహారంలో ఒక మౌక్తికం యువకవి నూతలపాటి" అని ప్రశంసించాడు.

ఆధారగ్రంథాలు :

1. చీకటిలో నుంచి - నూతలపాటి గంగాధరం
2. వెలుగులోనికి - నూతలపాటి గంగాధరం
3. సాహితీ నీరాజనం - మధురాంతకం రాజారాం

BHAVAVEENA
Vol. 18, Issue. 10, October 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

తెలంగాణ నవలలు – కుల వృత్తుల చిత్రణ

– ఆకుల లక్ష్మణ్, తెలుగు ఉపాధ్యాయులు, దుబ్బాక, సిద్దిపేట.

మన సమాజం మొత్తం వృతులతో నిండుకొని ఉంది. ఈ వృత్తుల ఆధారంగానే కులాలు ఏర్పడ్డాయని చరిత్ర తెలుపుతుంది. భారతదేశంలో మాత్రమే వృత్తి అనేది కులంగా మారిందని చెప్పవచ్చు. చివరకు ఇవి సమాజంలో అసమానతలకు, వివక్షకు కారణమయ్యాయి. మన సాహిత్యంలో మొట్టమొదటిగా పాల్కురికి సోమన కులవృత్తులను గురించి ప్రస్తావించారు. ఆ తర్వాత తెలుగు సాహిత్యాన్ని స్వర్ణయుగంగా తీర్చిదిద్దిన శ్రీకృష్ణ దేవరాయలు, కదిరీపతి, శ్రీనాథుడు వంటి కవులు కులవృత్తుల్ని తెలుగు సాహిత్యంలో ప్రస్తావించారు. సమాజానికి అవసరమైన సమస్త సంపదను సృష్టించిన ఉత్పత్తివర్గాల్నే వృత్తిదారులుగా చెప్పాలి. శ్రీ శ్రీ మహా ప్రస్థానంలోని ప్రతిజ్ఞ ఖండికలో సహస్రవృత్తులు సమస్త చిహ్నాలుగా శ్రమైక జీవన సౌందర్యానికి సమానమైనది లేనేలేదని ఎలుగెత్తి చాటారు. ఆధునిక కవులు, రచయితలు వృత్తిదారుల కష్టాలు, నష్టాలు, వారి జీవన చిద్రదృశ్యాలను అక్షరీకరించారు. ఈ ప్రయత్నం వృత్తిదారుల్ని చైతన్యవంతుల్ని చేస్తున్నది. మండలికాల్లో రచనలు చేయడం వల్ల సాహిత్యం కూడా కొత్తధనాన్ని రూపుదిద్దుకుంటోంది.

నవలల్లో వృత్తి చైతన్యం బలంగా కన్పిస్తుందని చెప్పవచ్చు. తొలి వృత్తిచైతన్య నవల ముత్యాల పందిరి. ఇది తెలంగాణ మాండలికంలో పోరంకి దక్షిణామూర్తి రాశారు. ఆ తర్వాత తెలుగు సాహిత్యంలో కులవృత్తులను గురించి ఎక్కువగా రచనలు చేసి సాహిత్యాన్ని సుసంపన్నం చేసినవారు డా. కాలువ మల్లయ్య. ఇప్పటివరకు వీరు పద్నాలుగు నవలలు వెలువరించారు. భూమి పుత్రుడు, సాంబయ్య చదువు, బతుకు పుస్తకం, గువ్వలచెన్నా, (డబ్బు)-తృప్తి దుఃఖం, తెలంగాణ దేవదాసు, చీకట్లో చిరు దీపం, మెతుకు పుస్తకం, నీ బాంచెన్ కాల్మొక్త (నీల్ బనో గులాంగిరి చోడో), మంచియన్నది మాల అయితే, మాదిగ విజయం, అస్పృశ్య కోయిల మొదలగు నవలలు సామాజిక వాస్తవిక దృక్పథంతో రాయబడటం వల్ల సమకాలీన చరిత్రకు సాక్షాలుగా నిలువగలవు. 'భూమి పుత్రుడు' నవలలో కాపు కులవృత్తి జీవనపరిణామాలను చిత్రించారు. తెలంగాణలో కాకతీయులకు పూర్వ మే వ్యవసాయం జీవనాధారంగా చేసుకున్నట్లు చారిత్రక ఆధారాలు ఉన్నాయి. కాపు దాపు అన్న నానుడి విదితమే. కాపులు పంటను సంరక్షిస్తూ జనాలకు పట్టెడన్నం పంచుతూ వచ్చారు. అట్లాంటి కాపు రైతులు 1980 దశకంలో సంక్షోభాన్ని ఎదుర్కోవడం, అప్పుల క్రింద తల్లి వంటి భూమిని అమ్ముకొని కూలీలుగా మారి జీవనోపాధికి వలస వెళ్లాల్సి రావడాన్నిఈ నవల సూచిస్తుంది.

'సాంబయ్యచదువు' నవల ప్రదానంగా వెనుకబడిన కులానికి చెందిన గొల్లల జీవన పరిణామాలను చిత్రించింది. గొల్లకులంలో పుట్టిన కాలువ మల్లయ్య చదువుకొని ఎదిగి జీవితాన్ని గెలుచుకొని రామగుండం ఎరువుల ఫ్యాక్టరీలో ఉద్యోగిగా స్థిరపడటం జరిగింది. ఈ ఇతి వృత్తమే నవలలో కనిపిస్తుంది. 1952 నుండి 1986 మధ్య కాలంలో నవల ప్రవర్తిస్తుంది. ఒక విధంగా ఇది కాలువ మల్లయ్య గారి ఆత్మకథలో భాగమని భావించవచ్చు. ఈ నవలలో చిలుకయ్య ఆరేళ్లు నిండిన కొడుకును బడిలో చేర్పించడానికి దొర అనుమతి కోసం వెళ్తాడు. వెనుకబడిన బడుగు బలహీన కులాల వారు చదువుకొని ఎదగడం సహించలేని దొర 'చాకలోడు, మంగలోడు అందరు చదివితే డానికేం విలువుంటది? నా మాట విని నా కాడ ఎడ్ల కాయడానికుంచు మూడు గుంచాల మక్కలిత్త' అని మభ్య పెడ్తాడు. దొర సలహా నచ్చని చిలుకయ్య సాంబయ్యను చదివిస్తాడు. ఎన్నో అవాంతరాలు, ఉద్యమాలు అడ్డంకిగా మారిన

సాంబయ్య శ్రద్ధగా చదువుకొని ప్రయోజకుడై ఉద్యోగంలో స్థిరపడ్డాడు. గొల్లలతో హేళనగా మాట్లాడడం, తక్కువచేసి అవమానిచడం, అయినా గొల్లలు చదువుకొని ఎదిగి జీవితాలను గెలుచుకోవడం ఈ నవలలో కనిపిస్తుంది. తెలంగాణ పల్లెల్లో దొరల అధికార దర్పం, దళిత, బహుజన కులాలను ఎడగకుండా అణచివేచిన కుటిలత్వం చూడవచ్చు. నక్సలైట్ విప్లవోద్యమాల అనంతరందొరల అధికారానికి బీటలు పారడం,దళిత, బహుజన కులాలవాళ్లు ఊపిరి పీల్చుకోవడం గమనించ గలం.

'బతుకు పుస్తకం' 376 పేజీలతో వెలువడిన పెద్ద నవల. కాలువ మల్లయ్య గారి దృష్టిలో బాటుకునిచ్చేది ఊరు.అందుకే ఊరికి బతుకు పుస్తకమని నామకరణం చేసుకున్నారు, ఈ నవల గత యాభై ఏళ్ల గ్రామీణ జీవిత పరిణామాలను చిత్రించింది. గ్రామాల్లోని అగ్ర వెనుక బడిన, దళిత కులాల జీవన ప్రమాణం కాలంతో పాటు పరిణామం చెందడాన్ని సూచించింది. ఊరిలో చదువు అందుబాటులోకి వచ్చాక చదువుకున్నవారిలో కాపు లసుమయ్య కొడుకు రాజయ్య డిగ్రీ చదివి ఉద్యోగిగా స్థిరపడితే, మాలాల కులానికి చెందిన దొంత సాంబయ్య కొడుకు భూమయ్య పి.జి పూర్తిచేసి కాలేజీలో లెక్చరర్ అవుతాడు. కొండల్రావు దొర కొడుకు డిగ్రీ అయ్యాక కరీంనగర్ లో స్వంత వ్యాపారం చేస్తాడు. చదువుల వల్ల అన్నీ కులాల వారి జీవన ప్రమాణాలు పెరిగినప్పటికి ప్రపంచీకరణవల్ల గ్రామాల్లో వ్యాపార సంస్కృతి పెరగడం, నరళీకృత ఆర్థిక విధానాలవల్ల పారిశ్రామీకరణ, యాంత్రీకరణ మూలనా కుటీర పరిశ్రమలు దెబ్బతిని కులవృత్తులు ఉనికిని కోల్పోవడం, విప్లవోద్యమాల వల్ల దొరల అధికారం సన్నగిల్లి, దొరల గడీలు శిథిలమై అనవాళ్ళుగా మిగలడం మొత్తం మీద గత యాభై ఏళ్లలో పల్లెల స్వరూపం పూర్తిగా మారినట్లు రచయిత స్పష్టం చేయడం జరిగింది.

'గువ్వలచెన్నా' నవలలో మూడు తరాల పద్మశాలి కుల జీవన పరిణామాలను, వృత్తికి దూరమైన తప్పని వలసలను కాలువ మల్లయ్య గారు చిత్రించారు. ఈ నవలలో కాపు కొండయ్య కొడుకు రఘురాం వేణుగోపాల్ రెడ్డి దొర కూతురు రాజ్యలక్ష్మి హైస్కూల్ చదువుతున్నపుడే ఒకరంటే ఒకరు ఇష్టపడుతారు.ఇంజనీరింగ్ చదివిన రఘురాం ను తప్ప వేరొకరిని పెళ్లి చేసుకోనని అంటుంది, దొర పరువు కోసం రఘురాంను హత్య చేయడానికి పూను కుంటాడు. రఘురాం బతికిఉంటే చాలని విధిలేక తండ్రి తెచ్చిన సంబంధానికి తలొగ్గి తాళి కట్టించుకుంటుంది. రఘురాం కొన్నాళ్ళ వరకు స్తబ్ధతతో ఉండి పోతాడు. ఆతర్వాత ఇంజనీర్‌గా స్థిరపడి ప్రజాసేవలో నిమగ్నుడవు తాడు. రాజ్యలక్ష్మిని కలిసాక వాస్తవం తెలుసుకొని ఆమె సూచన మేరకు పెళ్లి చేసుకొని జీవితంలో స్థిరపడుతాడు.

కాలువ మల్లయ్య ఎంచుకున్న ఇతివృత్తాలు వారి అనుభవ పరిధిలోనివి కాబట్టే వాస్తవికతతో శోభిల్లుతూ తెలంగాణ సామాజికచరిత్రకు అద్దం పట్టేవిగా ఉంటాయి. వీరి పాత్రలన్నీ మన కు బాగా తెలిసిన వ్యక్తులుగా కనిపిస్తారు. ముఖ్యంగా వీరి అశు శిల్ప ధోరణి కట్టి పడేస్తుంది. ఒక ఆర్తితో ప్రాంతీయ ముద్రతో ,తెలంగాణ మాండలికానికి వన్నె తెచ్చిన ఘనత కూడా వీరిదే.

కాలువ మల్లయ్య రాసిన కులవృత్తి నవల భూమి పుత్రుడు. ఈ నవలలో చిత్రితమైన వృత్తులు, కులాలు, ఆ కులాల మధ్య సంబంధాలు, గ్రామీణుల పనులు, ఆటపాటలు, అలవాట్లు, ఆచార వ్యవహారాలు, విశ్వాసాలు, పండుగలు మొదలగు వాటిని దృష్టిలో పెట్టుకొని గ్రామీణ జీవనాన్ని పరిశీలించడం జరిగింది.

గ్రామీణ జీవనంలో కుల వ్యవస్థ అత్యంత ప్రాధాన్యత వహిస్తుంది. కుల వ్యవస్థ పునాదుల పైననే గ్రామీణ సామాజిక జీవనం నిలబడుతూ వచ్చింది. ముఖ్యంగా ఈ నవలలో కులవృత్తికి సంబంధించిన పాత్రలు చిత్రించబడ్డాయి. అలాంటి పాత్రలలో షాపుకారు రాజేశం పాత్ర ఒకటి. షాపుకారు గ్రామాల్లో ఎలా

బలపడ్డారో ఈ పాత్ర నిరూపిస్తుంది. షావుకారు రాజేశం కట్టు బట్టలతో ఆ ఊరికి వచ్చి, రైతులను మోసగిస్తూ క్రమంగా మోతుబరులు, రైతులకు అవసరానికి అప్పిచ్చే స్థితికి ఎదిగాడు "ధరలు యెంత పెరిగినప్పటికి, రైతులు మంచికి, చెడుకు, పెండ్లికి, చావుకు మొత్తం పైన అన్ని మత లేక సామాజిక ఆచారములకు సంబంధించిన కార్యములు వ్యయమునకై తగు సాహుకారి సహాయము యాచించు తప్పలేదు." అని అన్నారు ముందుముల నరసింగరావుగారు. కేవలం అప్పులు ఇవ్వడమే కాకుండా నిత్యావసర వస్తువులను తెచ్చి విక్రయించడం కూడా షావుకారు వృత్తి కాబట్టి గ్రామీణ జీవనంలో కోమట్లు భాగమయ్యారు. కొండ మల్లయ్య షావుకారు రాజేశం వద్ద అప్పు చేసి దోపిడికి గురయ్యాడు.

పద్మశాలీలు తాతముత్తాల నాటి నుండి ఊరిలో మగ్గం నేస్తున్న బట్టకు పొట్టకు కష్టంగానే ఉండేది. ఆదిలాబాద్ వంటి మారుమూల ప్రాంతాలలో బట్టలు అమ్మడం మూలాన కొంత డబ్బు గడించారు. కొంత భూమిని కూడా సంపాదించుకున్నారు. అట్లా బాగుపడిన వారిలో పద్మశాలి కిష్టయ్య కన్పిస్తాడు. పద్మశాలీలకు కులపరిధిలో పట్టింపులు ఎక్కువ. చిన్న తప్పుకు కూడా పంచాయితీలు పెట్టుకోవడం కన్పిస్తుంది" (పుట: 46)

వ్యవసాయాన్ని ఆశ్రయించి జీవించే కులవృత్తులలో కమ్మరి వృత్తి ఒకటి. కమ్మరులు రైతుల వ్యవసాయ పనిముట్లను తయారు చేసి ఇస్తూ, అందుకు ప్రతి ఫలంగా ధాన్యాన్ని ఆశిస్తారు. కొండ మల్లయ్య పెట్ట వలసిన బత్తెం గురించి కమ్మరి బక్కయ్య అడగడం కన్పిస్తుంది. (పుట :79) ఇలా ఆయా కుల వృత్తులకు సంబంధించిన అంశాలను కళ్ళకు కట్టినట్లు తెలియ జేశారు.

స్వాతంత్ర్యం వచ్చాకా 35సంవత్సరాలకి సరిగ్గా యిటువంటి రాజకీయ నేపథ్యంలోనే బీడీ కార్మికుల బతుకు వెతల్ని సజీవంగా చిత్రిస్తూ బి.ఎస్.రాములు రచించిన 'బతుకు పోరు' నవల వెలువడింది. బి.ఎస్.రాములు బతుకుపోరు రాసేనాటికి (1982) వుత్తర తెలంగాణలో యుద్ధవాతావరణం నెలకొని వుంది. శ్రీకాకుళం కొండల్లో చెలరేగిన గిరిజన రైతాంగ వుద్యమం ఆదిలాబాద్ అడవుల్లో కరీంనగర్ మైదానాల్లో జగిత్యాల పల్లెల్లో సింగరేణి బొగ్గు గుట్టల్లో గోదావరి అలల్లో వొళ్ళు విరుచుకొని కళ్ళు తెరచింది ('తెలంగాణ అన్వేషణ' సృజన సంపాదకీయాలు, పర్ స్పెక్టీవ్స్:హైదరాబాద్, పే.220). రైతాంగ వుద్యమాన్ని అణచివేయడానికి ప్రభుత్వం వలస పాలన కాలం నాటి కల్లోల చట్టాన్ని అమల్లోకి తెచ్చింది (1978). అయితే ప్రజా వుద్యమం వెనుకంజ వేయలేదు. రైతాంగంలో రగిలిన చిచ్చు బొగ్గు గని కార్మిక వాడల్లోకీ గిరిజన గూడేల్లోకీ వ్యాపించింది. 1981 ఏప్రిల్ లోనే యింద్రవెల్లి గిరిజనులపై మూకుమ్మడి హత్యాకాండా, మస్టర్ కోతకి వ్యతిరేకంగా సింగరేణి గని కార్మికుల 56 రోజుల సమ్మె జరిగాయి. వీటి ప్రభావం బీడీ పరిశ్రమ లాంటి అనంఘటిత కార్మికులపై కూడా పడింది. 'బతుకుపోరు' నవల తెలుగు ఉద్యమ నవలకు ఒక మంచి నమూనా. 1980 థకంలో గల తెలంగాణలోని వాస్తవిక పరిస్థితిని సృజనాత్మకంగా వ్యక్తీకరించింది. ఇందులో రచయిత అభిప్రాయాలకు, విశ్వాసాలకు ఎక్కడా తావు లేదు. అప్పటి పరిస్థితిని చిత్రిక కట్టి పాఠకుల ముందుంచుతుంది. ఆ రకంగా ఇది ఎల్లకాలం సాహిత్యంలో నిలిచిపోయే రచన. వివిధ వృత్తులతో జీవించే ప్రజల జీవితాన్ని ప్రదర్శించే నవలలు తెలుగులో తక్కువగా వచ్చాయి. ఆకులతో బీడీలు చుట్టి కట్టలు కట్టి ఫాక్టరీలు బ్రోకర్లిచ్చే కొద్దిపాటి కూలితో బతికే కార్మికుల స్థితిని 'బతుకుపోరు' నవల వర్ణిస్తున్నది.

ఇరుకు ఇళ్ళలో గాలి రాని గదుల్లో, పొగాకులో మునిగి తేలుతూ, తంబాకు నమిలి రోగాలు తెచ్చుకొని బాధలు పడే కార్మికుల దుస్థితిని రాములు బతుకు పోరులో వాస్తవికంగా చిత్రించారు. బీడి పరిశ్రమలో యజమానులు మిగుల్చుకునేది "బిల్డింగులూ సినిమా హాళ్ళూ, కార్లు" కార్మికులు మిగుల్చుకునేది "రోగాలు, రోష్టులు" ఫాక్టరీ

యాక్టులో నిర్దేశించబడినట్లు బీడి ఫాక్టరీలు వుండవు. రోగనిలయాలుగా వున్న పరిస్థితులు మారాలని రాములు కోరుతున్నారు. రాజయ్య దుకాణంలో పనిచేసే గుమస్తా అతని భార్య లక్ష్మి బీడీలు కట్టి డబ్బు సంపాదించి భర్తకు తోడ్పడుతూ వుంటుంది. వాళ్లకు ఒక కొడుకు, కూతురూ వున్నారు. కుటుంబం చిన్నదే అయినా వాళ్ళకు దినం గడవటం కష్టంగానే వున్నది.

రాజయ్య కూతురు సుగుణ బడి మానేసింది యింకా పెళ్ళికాలేదు. తల్లికి తోడుగా తాను కూడా బీడిలు చుడుతున్నది. సుగుణకు పదిహేను రోజుల పనికి ఎనభై రూపాయలు వస్తాయి. పదిహేను రూపాయలు తన ఖర్చులకు వుంచుకొని మిగిలిన డబ్బు తల్లికి ఇస్తున్నది. తమ తీసుకున్న పదిహేను రూపాయల్తో రెండు సినిమాలు చూస్తుంది. చిరుతిళ్లు కొనక్కుతింటుంది. బీడీల కంపెనీ హెడ్డాఫీసులో జీవితాలిచ్చే సమయంలో నారాయణ దాదాకు ఎదురుతిరిగాడు. జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించాడు. కష్టాలు భరించలేక బీడి కార్మికులు సమ్మెకు పూనుకున్నారు. దాదా చిక్కుల్లో పడ్డాడు. సేటు ఫోన్ చేసి చివాట్లేశాడు. "నాలుగు రోజులు సమ్మె చేస్తే ఏమిలే" అనుకోవటానికి వీలు లేకుండ బీడీలకు గిరాకీ పెరిగింది. ఇతర బీడీ కంపెనీ పనివాళ్ళు కూడ సమ్మెలో చేరారు. 'బతుకుపోరు' నవల యథార్థ జీవితపు వ్యధార్త జీవన చిత్రణమే. ఇతర ప్రాంతాలవారికి తెలియని బీడి కార్మికుల జీవితాన్ని రాములు కళాత్మకంగా తీర్చిదిద్దారు.

కమ్మరి వృత్తి నవల సుషుప్తి :

గ్రామీణ కుల వృత్తులు విధ్వంసం కాబోతున్నాయని, గ్రామీణ ప్రజల జీవితాలు చిన్నాభిన్నం అయ్యే విషయాన్ని మాదిరెడ్డి సులోచన 1975కు ముందే పసిగట్టారు. ముఖ్యంగా కుమ్మరి వృత్తికి సంబంధించిన అంశాన్ని వస్తువుగా తీసికొని "సుషుప్తి" అనే నవల రాశారు. ఈ నవలలో ఆర్థిక పరిణామాల పరంపరలో ఛిద్రమౌతున్న కుండతో ముడిపడి వున్న కుమ్మరి జీవితాన్ని చిత్రించారు రచయిత్రి. మాదిరెడ్డి సులోచన. 1975లోనే "సుషుప్తి" నవల ద్వారా కుమ్మరుల జీవితాలను అక్షరీకరించాలని అనాడే ప్రపంచీకరణ ప్రభావాన్ని గుర్తించి ప్లాస్టిక్, స్టీలు పాత్రలు ప్రవేశం పొంది కుమ్మరి కుండను మాయం చేసే ప్రయత్నం జరుగుతుందని, కుమ్మరి వాములో దుమ్ము పేరుకోబోతుందని గుర్తించారు.

కుమ్మరి బాలయ్య ఒకప్పటి కాలంలో తన వృత్తి ద్వారా కూజాలు చేయటంలో జిల్లాకే పేరుగాంచిన వ్యక్తి. కూరచట్నీలు, పెరుగుతోడు పెట్టే ముంతలు, పూలకుండీలు, ఇల్లు కప్పుకునే పెంకులు, కల్లు ముంతలు, నోములకు కొత్త కుండలు, ఈ విధంగా కుమ్మరి బాలయ్య ఏది చేసినా బాగా చేస్తాడని, గట్టిగా ఉంటాయని చాకలి, హరిజన, బెస్త వాడలకు చెందిన వారందరూ వచ్చేవారు. ఎంతో మెచ్చుకునే వారు. చేతి కింద నల్గురు వ్యక్తులు పనికోసం ఉండేవారు. బాలయ్య భార్య ఎంకమ్మ అనేక బంగారం, వెండి ఆభరణాలతో రచయిత్రి చెప్పినట్టు 'పూసిన తంగేడు"లా ఉండేది.

కుల వృత్తి నైపుణ్యంతో అందరి మన్ననలు పొంది హాయిగా జీవించే బాలయ్య ఎంకమ్మ కుటుంబం తర్వాతి కాలంలో కడుపునిండా తినలేని దుస్థితి ఎందుకు ఏర్పడింది ? గంగమ్మ గంపనిండా మిరపకాయ బజ్జీలు, బొండాలు, రొట్టెలు సంతకు తెస్తే సాయంత్రంలోగా అమ్ముడుపోయేవి. అలాంటిది తెచ్చిన పదార్థాల మీద ఈగలు వాలకుండా ఊపుతూ కూర్చునే దుస్థితి ఎందుకు ఏర్పడింది ? గాజులమ్మే పూసబెర్లోల్లు వీధి వీధి తిరిగినా గాజులమ్మిని లేదా గాజులబ్బీ అని పిలిచే కేకలు వినబడటం లేదెందుకు

కుమ్మరి వాము కోసం ఎంకమ్మ, చుక్క కంప కొట్టటం, తీసుకురావటం, మట్టిత్రవ్వుకరావటం స్త్రీ పురుషులు కలిసి పనిచేసే సంస్కృతి చక్కగా చిత్రించారు. కొన్ని జాతులలో కట్నాల పిశాచి లేకుండా తాహతును బట్టి ఒక్కపూట విందుభోజనంతో భార్యాభర్తలు కావటమనేది ఈ నవలలో మరొక విశేషం. పుట్టుక, పెళ్ళి, అప్పగింతలు, పాటలు, చావులు, కులకట్టుబాట్లు

మొదలగునవి వర్ణించటం ఈ నవలకున్న మరొక ప్రత్యేకతగా చెప్పవచ్చు. కుమ్మరి వాము పెట్టినపుడు కంపను తొయ్యటం, వాము ముఖద్వారం వద్ద కంప తోసినపుడు ఆ మంటతో పరిసరాలన్నీ ప్రకాశవంత మయ్యాయి. కాస్త కంప తగ్గినపుడు పరిసరాలు చీకటి అవుతున్నాయి.

వాళ్ళ బ్రతుకుల్లాగే అనే ఉపమానం కుమ్మరి బాలయ్య కుటుంబ స్థితిని తెలుపటంలో రచయిత్రి ఔచిత్యం కనిపిస్తుంది. సినిమాల ప్రభావం వ్యక్తుల మీద ఎంతగా ఉంటుందో గోవిందు పాత్ర నిరూపించింది. సినిమాలో జరిగినట్టుగా ఒక గొప్పింటి స్త్రీ తన జీవితంలోకి వస్తుందని పగటికలలు కనటం, దేవకి టీచర్‌ను చూసి గోవిందు ఊహల్లో బ్రతకటం గమనిస్తే చదువుకున్న వారైనా, చదువులేని వారైనా స్త్రీలు కలుపుగోలుగా మాట్లాడితే చాలు రకరకాల ఊహాగానాలు ఏర్పర్చుకుంటారు. స్త్రీని ఒక వస్తువుగా, ఆమెపై వాళ్ళు హక్కుదారులుగా కథలు అల్లుకునే పరిస్థితులు ఇప్పటికీ మారలేదు. కొందరు పురుషులు స్త్రీని అర్థం చేసుకోవటంలో వైఫల్యం కొట్టొచ్చినట్టుగా ఈ నవలలో చిత్రించబడింది.

బతుకుతాడు - నేరెళ్ల శ్రీనివాస్ గౌడ్

'బతుకుతాడు' నవల కల్లుగీత కార్మికుల బతుకె వెతలను తెలిపిన నవల. నవలా రచన వికాసదశకు చేరుకుంటున్న దశలో రచయితలు చాకలి, మంగలి, సాలి, కమ్మరి, కుమ్మరి, జాలరి, కల్లుగీత మొదలైన వృత్తులవారి జీవితాలు వర్ణించే నవలలు ఆనాడు రాలేదు. 'మాలపల్లి' తరువాత నిమ్నజాతులకు, కులవృత్తులకు సంబంధించిన నవలలు తక్కువగా వచ్చాయి. 1985 ప్రాంతాలలో తెలుగు సాహిత్యంలో దళిత చైతన్యం సమాజంలో కొత్త కోణాలను ఆవిష్కరించింది.

కులవృత్తుల గురించి సాధికారికంగా రాయటం అవృత్తి గురించి తెలియని వారికి కష్టతరమౌతుంది. ఆవృత్తికి చెందిన వారికి రచన చేపకు నీటిలో ఈదినంత సుకరమవుతుంది. శ్రీ నేరెళ్ల శ్రీనివాసగౌడ్ కల్లుగీసే గీత కార్మికుడు. వాళ్ళ కుటుంబపు తర తరాల కథ 'బతుకు తాడు'. తాటిచెట్టును తెలంగాణలో ఏకవచనంలో 'తాడు' బహువచనంలో 'తాల్లు' అని అంటారు. తాడిచెట్టు ఎక్కటానికి ఉపయోగించే మోకును తాడు అంటారు. మోకు బలంగా ఉంటే గీత కార్మికుడి ఆయుస్సు బలంగా ఉంటుంది. తాడు కల్లు బాగ పారితే అతని బతుకు సుఖంగా ఉంటుంది. ఈ నవలలోకి నడిచి వచ్చిన పాత్రలు మా అమ్మమ్మ తాలవ్వ. వేనమామలు మల్లయ్య, నాగన్న, పోచన్న, మా మామ గాజుల బక్కన్న. మా అత్త రాయమల్లు, నాతో పాటు కష్ట సుఖాల్లో నాకు తోడై నిలిచిన నా శ్రీమతి నత్తవ్వ. అని రచయిత స్వయంగా చెప్పుకున్నారు. " (బతుకుతాడు, ముందు మాట)

ఈ నవల ప్రధానంగా మూడు కుటుంబాల మధ్య నడుస్తుంది. ఈ మూడు కుటుంబాలు తాటిచెట్టును నమ్ముకొని బతికినవే. ఈ మూడు కుటుంబాల్లో ఒకటి మా పెదనాన్న కుటుంబం. రెండవది మా కుటుంబం. మూడవది మా చిన్నాన్న కుటుంబం. అంటే ఈ నవలలో నేను కూడా ఒక పాత్రనే అని రచయిత చెప్పుకుంటూ ఈ నవలను ఇలా ప్రారంభిస్తాడు.

'నేనేమి సేతూ.... నేనెట్ల బతుకుడు
బతుకుదెరువు కొరకు / బాధలెన్నో పడిన.
బాధ తీరలేదు / బతుకు మారలేదు...
నేనమి సేతూ... నేనెట్ల బతుకుడు...
ఈతకల్లు పారుతుంది / ఇంకేం పర్వకుంటి
ఈదుల్లకు పాయిరీ / నేనేమి సేతూ... నేనెట్ల బతుకుడు
పోద్దాడు ఎల్లింది / పొట్ట నింపుద్దనుకుంటి
మూడొద్దులే పారింది / మురిపించి పారింది
మురిపించి పోయిందీ / నేనేమి సేతూ నేనెట్ల బతుకుడు..."

సాయంత్రం నారాయణ గౌడ్ తాటిచెట్టుమీద గోల గీస్తున్నాడు. ఎవరిదో పిలుపువిని గొలను గీయడం ఆపి కిందికి చూసినాడు. కింద తన ఆటకందారు ఇట్నేని సివలింగం తనను పిలిచినట్టు గ్రహించి "ఆ వస్తున్నా...! అని ఆ గొలను గీసినాడు" అంటూ ఈ గౌడజీవితాన్ని తెలుపుతూ ఈ నవల ప్రారంభమవుతుంది.

కక్క - వేముల ఎల్లయ్య :

మాదిగ జీవన వృత్తి జీవనం చెప్పులు కుట్టడం, తోలు తోచేసిన కపిలి బానలను కుట్టడం అవకాశం వున్నప్పుడు రైతు పొలంలో కూలికి వెళ్లడం చేసే వారు. వీరికి కూడ రైతుల నుండి మేర, వరి మోపు లబిస్తుంది. రైతులందరూ వీరి వద్దనే చెప్పులు కుట్టించు కునేవారు. కరెంటు మోటార్లు వచ్చాక వీరి వృత్తి మరుగున పడిపోయింది. చెప్పుల షాపులొచ్చాక వీరికి ఆ పని కూడ లేకుండా పోయింది. చెప్పులు తయారు చేయడంలో వీరు సిద్ధ హస్తులైనా ఈ కులం వారు రైతులతో తమ మనుగడ లేకుండా పోయిన తర్వాత పెద్ద చెప్పుల షాపు పెట్టుకున్న దాఖలాలు అసలు లేవు. పెద్ద చెప్పుల షాపులను పెట్టుకోవడానికి అధిక మొత్తంలో ధనము కావాలి. అంత స్తోమత ఈ మాదిగ వారికి లేదు. అందు చేత చెప్పుల షాపులన్ని వేరె కులాల వారివే.

తెలంగాణ దళిత జీవితమే కక్క నవల ఇతివృత్తం. కులాభిమానం, వృత్తి గౌరవం నేపథ్యంలో మొలకెత్తినట్టి కాంక్ష మాదిగిర్కం నవలకు ప్రధాన వస్తువు. పాలేరు జీవితంతో తృప్తి చెందని ఓ దళితుడు కులవృత్తి వైపుగా మళ్లడంలోనే కథ మలుపు తిరుగుతుంది. సామాన్యంగా 'మాదిగిర్కం' (వెట్టి) పని కూడా ఆ వూళ్ళో ఉన్న మాదిగ కుటుంబాల సంఖ్యాబలం మీద కేటాయించబడుతుందే తప్ప కావాలనుకుంటే కాళ్ళకాడికి వచ్చిపడే వతన్ కాదు. అందని పండులాంటిదే ఈ మాదిగిర్కం కాబట్టే కులవృత్తి మీద 'కక్క' డు తరగని కాంక్షని పెంచుకుంటాడు. ఇది తెలంగాణ ప్రాంతంలోని 'మాదిగిర్కం' తీరు తెన్నుల్ని తట్టిలేపే కోర్కెగానీ సృజన మాత్రం గాదు. మోజున్న కులవృత్తినే కేంద్రబిందువుగా చేసుకుని దానిచుట్టే నవల కథంతా అల్లబడుతుంది. కక్కడు తన జీవితంలో కోల్పోయిందేదో తనకు తెల్సు. అభద్రతాభావం చోటు చేసుకున్నప్పుడు తనని కాపాడే ఓ నీడ కావాలి. తన ఉనికిని కాపాడేది ఒక్క మాదిగిర్కమనే గట్టి నమ్మకం కక్కనిది. అంతేగాదు అతి ఉండడం వల్లే కులపోల్లు ఆయన్ని ఆదిరిస్తూ వచ్చారు. సర్పంచి పదవిలో కనబర్చ నటువంటి శ్రద్ధ మాదిగిర్కంలో చూపించడం కూడా దీనికి ఊతమిస్తోంది. ఇలా ఈ వస్తువుతో రచయిత ఈ నవలను కొనసాగించి వారి అస్తిత్వాన్ని తెలిపారు.

దళితుడైన కక్కయ్య ఈ నవలకు నాయకుడు. కక్కని అయ్యమ్మ(నానమ్మ) మరణంతో కథ మొదలవుతుంది. కక్కని బాల్యం, వివాహం, సంతానప్రాప్తితో పాటు కుల వృత్తి మీద వానికున్న ఆసక్తే ప్రధాన కథగా సాగిపోతుంది. గ్రామంలో అనివార్యంగా సాగే సహజీవనం అతి సహజంగా కథనం చేయబడుతుంది. కుల సంఘర్షణలు, వర్గ సమీకరణలు చూపించడంలో చూపిన మెలకువ కథకి నిండుదనాన్ని ఇస్తుంది. వ్యక్తి జీవితాన్ని చిత్రించే క్రమంలోనే కాబోలు కథని నూటిగా నడిపాడు. అధ్యాయాలుగా సాగుకున్నప్పటికీ కథా పరిణామాన్ని బట్టి కాలాన్ని నిర్ణయించుకునే వీలుంది.

నల్గొండ జిల్లా సాయుధ పోరాటానికి అండగా నిలిచిన ప్రాంతం. రజకారు వ్యవస్థ లోపాల్ని సాయుధ పోరాట లక్ష్యాల్ని కక్కని పాత్ర ద్వారా అభివ్యక్తం చెయ్యడంలో చాకచక్యాన్నే ప్రదర్శించాడు రచయిత. 20 శాతంగా లేని అగ్రవర్ణాలకి 80 శాతం దళితుల అధికారాలు ఎట్లా దఖల్ పడ్డాయో చిట్టా తెరిచాడు. ఆ వూరు పటేలు ఇంటిపేరు కక్కని ఇంటిపేరు ఎట్లా ఒకటైయిందో రహస్యంగా ఉంచాడు. కానీ కక్కని ఇంటిపేరు మార్చడానికి పాపిరెడ్డి, వెంకట్రెడ్డి, కమ్మరామయ్యలు పదరుకొని కుక్కని చంపి కక్కని ఇంటిముందు వేయడం, ఆ కుక్కని తీసేస్తుంటే కుక్కల కక్కడని పిల్వడం, దేహి మీరు అట్లా పిలుస్తే నాయింటి పేరు మారుతాదని అనడం లాంటివి

నాటకీయంగా అలరినాయి. గ్రామం నుంచి వలస పోయిన అగ్రకులస్తుల మనోగతాన్ని వ్యావసాయిక నేపథ్యంలో అర్థవంతంగా వర్ణించాడు.

మాదిగిర్కం చేపట్టాలంటే చెప్పులు కుట్టడం, డప్పుకొట్టడం, కల్లం ఊడ్చడం లాంటివి నేర్చుకుని ఉండాలి. ఒంటి కుటుంబం కక్కనికి 'మాదిగిర్కం' ఎండమావి లాంటిదేనని తెల్సు. అయినా దానికోసం అన్ని పనులు పట్టుదలతో నేర్చుకోవడంలోనే కథావస్తువు దీప్తి నొందింది. తన కుటుంబం మాదిగిర్కం చేసే కుటుంబాని కంటే సాంస్కృతికంగా భిన్నంగా ఉందని గ్రహించడంలో కథా వస్తువు అమరి ఉంది. ఆ సామికి ఏ వస్తువులు చేసి అందించాలో వాటి గురించి తెల్సుకోవడం కులవృత్తికి కావాల్సిన వస్తు సామాగ్రిని సేకరించాలనుకోవడంలోనే కక్కనికి ఉన్న శ్రద్ధ ఆగిపోలేదు. 'మైసాసురని వ్యధ' భాగవతం నేర్చుకునేంత దాకా మోజు సాగింది. ప్రాసంగిక కథే అయినా ప్రధాన కథకు ప్రాణంలాంటిదై నవలకు వన్నె తెస్తుంది. ఓ సందర్భంలో ఫకీరు తాత మాదిగిర్కం అంటే బానిసత్వానికంటే భిన్నమైందేమీ కాదని చెప్పినా కక్కడు అదరలేదు బెదరలేదు. వెట్టిచేసే వాళ్లింట్లో తోళ్ళతొట్టి, గోడలకు డప్పులు, ఆరేసిన తోళ్ళు, చెప్పులు కుట్టే పనిముట్లు వగైరాలు చూసి చలించలేదు. మాదిగిర్కం చేస్తే వచ్చే ఆదాయం కూడా తక్కువని తెల్సికూడా దానిమీది ఆశను చంపుకోలేదు.

'సంకెళ్ళు తెగాయి' - మంగలి వృత్తి జీవిత చిత్రణ:

మనిషి పుట్టుక మొదలు మరణానంతరం వరకు జరిగే కార్యక్రమాల దాకా మంగలిరికం ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంది. మంగలి వారినే నాయి బ్రాహ్మణులు అని కూడా పిలుస్తారు. మంగలి వృత్తి కూడా ఆ నాటి సమాజంలో చాల ప్రధానమైన వృత్తి. ప్రతి సారి ప్రతి ఫలం ఆశించకుండా అందరికి క్షవరంచేసి, జుట్టు కత్తరించే వీరు ఆ పనికి గాను ప్రతి ఫలితానికి, మేర ద్వారా ఐదు బళ్లల వడ్లు, ఒక మోపు వరి తీసుకునేవారు. ఫలిత మంటే ఒక పంట కాలము. మంగలులు కేవలం మంగలిరికం కాక శుభశుభ కార్యక్రమాలలోనూ, దేవాలయాలలోనూ భజంత్రీలుగా సేవలు చేయడం లాంటివి కూడ కులవృత్తుల్లో భాగంగా చేస్తున్నారు.

ఈ నవలలో కథపరంగా కథనాయకుడికి ప్రాధాన్యం ఉంది. మంగలీ కులంలో పుట్టిన నారాయణ బాగా చదువుకొని ఉన్నత స్థితికి చేరుకోవాలనుకుంటాడు. పట్నంలోని కాలేజీలో చెరతాడు. అనల అతని జూనియర్. అనల తండ్రి లాయర్. తల్లి సామాజిక కార్యకర్త. వీరు కులాలకాతీతంగా ప్రేమించి పెళ్ళి చేసుకుంటారు. అనల తల్లిదండ్రులు ఆమెని స్వతంత్ర వ్యక్తిత్వంతో వ్యవహరించేలా పెంచుతారు. అనల నారాయణ అతని అభివృద్ధికి సహాకరిస్తుంది. నారాయణ ఐ.ఎ.ఎస్ సాధిస్తాడు. అనల ఉన్నత స్థితిని సాధించడం కోసం పెద్దగా కష్టపడే అవసరం లేదు. కానీ ఏ వసతులు లేకపోయినా ఒక ఆశయంతో కష్టించే నారాయణకి ఆలంబనగా నిలిచి తన ప్రత్యేకత నిలబెట్టుకుంది.

రాగిణి రామారావు, నీరజల కూతురు. తండ్రి లాయర్. తల్లి గృహిణి. తల్లిదండ్రుల ప్రేమలో ఏ లోటు లేకుండా పెరిగింది. తండ్రి ఒక యాక్సిడెంట్లో చనిపోవడంతో చిన్న వయసులోనే తల్లిని, తమ్ముడిని చూసుకోవాల్సిన బాధ్యత ఆమెపై పడుతుంది. స్టెనొగ్రఫీ కోర్సు చేసి ఇంద్ర దగ్గర పి.ఎగా చేరుతుంది. ఇంద్ర పురుషుల అవసరం లేకుండానే జీవితం గడపాలనుకునే యువతి. కొంతవరకు ఆచరణలో కూడా విజయం సాధిస్తుంది. ఇంద్ర తమ్ముడు రాజేంద్ర ఒక సాఫ్ట్వేర్ కంపెనీ నడుపు తుంటాడు. రాగిణి, రాజేంద్రలు ఇష్టపడతారు. ఇంద్ర, రాగిణితో లైంగిక సంబంధం పెట్టుకోవాలని ప్రయత్నించి విఫలం అవడంతో అవమానం తట్టుకోలేక ఆత్మహత్య చేసుకుంటుంది. చివరికి రాగిణి రాజేంద్రలు కలుస్తారు.

తలంటు స్నానం చేయించడం వంటి పనులు చేసే వారు. ప్రతి రోజు మంగలి పల్లెల లోనికి వచ్చి క్షురక వృత్తి చేసే వారు. తల క్రాపు చేయడం, పెద్దవారికి గడ్డం చేయడం వంటివి చేసే వారు. మంగలి వారు తాము

వాడే వస్తువులు 1. కత్తెరలు 2. మంగలి కత్తులు మూడు.,3. కాలి గోర్లు తీసే సాధనము 4. చిన్న కత్తెర, 5. సాన రాయి 6. చిప్ప లాంటి గిన్నె 7. బ్రష్, 8. అద్దము, 10. చెవులో గుమిలి తీయడానికి ఒక సాధనము.,. వీటిని పెట్టుకోవడానికి నాలుగు పొరలున్న నలుచదరంగా ఉన్న ఒక తోలు సంచి వుంటుంది. దీన్ని అడపము అంటారు, వారి భోజనం ఆరోజుకి వారు పనిచేసిన ఆ వూర్లోనే గడిచి పోతుంది. శుభ కార్యాలలో మంగళా వాయిద్యాలు వాయించేవారు. దానికి ప్రాతి ఫలం వేరుగా వుండేది. అది కూడా అప్పట్లో ధాన్య రూపంలోనే వుంటుంది. రైతులు తమ ఇంట్లో శుభకార్యాలకు ఎక్కడి నుండో మంగలి వాళ్లను తీసుకుని రావడానికి వీల్లేదు. వేరెవ్వరురారు కూడ ఒకవేళ ఎక్కువ మంది వాయిద్య కారులు కావలసి వస్తే ఆ వూరి మంగలే మిగతా వారిని సమకూర్చుతాడు. దానికొరకు వారికొక బృందం ఉం టుంది. ఇది వారి వంశ పారంపర్య హక్కు. మంగలి వారు ఎదురు పడితే శుభ సూచకంగా భావిస్తారు. పెళ్ళిల్లలో జరిగే అనేక కార్యక్రమాల వివరాలు మంగలికే బాగా తెలుస్తాయి. ఆ సందర్భాలలో వారిదే పైచేయి. పెళ్ళి చేసే పంతులు గారు కూడా కొన్ని సందర్భాలలో తర్వాత చేయవలసిన కార్యక్రమం ఏమిటని మంగలి వారిని అడిగే సందర్భాలు కూడా వుంటాయి. పెళ్ళి కొడుక్కి మంగళ స్నానం చేయించేందుకు మంగలి రావలసిందే. పెళ్ళి కూతురుకైతే మంగలి స్త్రీ రావలసిందే. ఆ సందర్భంగా మంగలి వారికి పరిహారము వేరుగా వుంటుంది. ఈ పరిహారము వారు చేసిన పనిని బట్టిగాక రైతు హోదాను బట్టి వుండేది. అశుభ కార్యక్రమాలకు కూడా మంగలి తప్పని సరిగా వుండాలి.

'సంకెళ్ళ తెగాయి' నవల మొత్తం పదిహేను భాగాలుగా ఉండి ధారాళమైన శైలిలో అందరిని చదివించే గుణం కలిగిఉంది. మారుమూల గ్రామాలలో మంగలి వృత్తి చేసుకుంటూ జీవితాన్ని గడుపుతున్న కుటుంబ పరిస్థితులను మన ముందుంచుతుంది. ఈ నవల పల్లెలోని వివిధ కులవృత్తుల ఆవిష్కరణను, వారిని ఇతరులు దోపిడి చేసే విధానాన్ని తెలుపుతూ విద్య అనేది వారిలో మార్పుకు సంకేతంగా మారుతుందన్న అభిప్రాయాన్ని సుజాతారెడ్డి మనముందుంచారు. ఇలా ఇంకా తెలంగాణ వృత్తిజీవితాలను గురించి ఆయా నవలలో సందర్భానుసారంగా ప్రస్తావించడం జరిగింది.

ముగింపు :

తెలంగాణ ప్రాంతం వేల సంవత్సరాల కాలం నుండి వెట్టిచాకిరి విధానం, కులవృత్తి జీవనాన్ని కేంద్రంగా చేసుకొని కొనసాగింది. తెలంగాణ నవలలో కులవృత్తులను ప్రస్తావిస్తూ వారి జీవన విధానాన్ని తెలంగాణ ప్రాంతాన్ని చక్కగా ప్రతిబింబించడం జరిగింది. ఆయా వృత్తుల అస్తిత్వాన్ని తెలుపుతూ వృత్తి గౌరవాన్ని, వారి స్థితిగతులను చక్కగా తెల్పడం జరిగింది. ఈ వృత్తి నవలల ద్వారా కులవృత్తుల ఆవశ్యకతను చక్కగా తెల్పడం జరిగింది. దాంతో పాటు ప్రపంచీకరణ నేపథ్యంగా కులవృత్తుల క్షీణత్వాన్ని కూడా వివరించడం జరిగింది.

ఆధార గ్రంథాలు :

1. కాలువ మల్లయ్య, బతుకుపుస్తకం, హైదరాబాద్.
2. కాలువ మల్లయ్య, చెన్నలగువ్వ, హైదరాబాద్.
3. కాలువ మల్లయ్య, సాంబయ్య చదువు, హైదరాబాద్.
4. బి.యస్. రాములు, బతుకుపోరు, విశాలసాహితి, హైదరాబాద్.
5. ముదిగంటి సుజాతారెడ్డి, సంకెళ్ళు తెగాయి, హైదరాబాద్.
6. లంకా వెంకటేశ్వర్లు, ఆధునిక తెలుగు సాహిత్యంలో వృత్తి చైతన్యం, హైదరాబాద్.
7. వేముల ఎల్లయ్య, కక్క, విశాలాంధ్ర ప్రచురణలు, హైదరాబాద్.

BHAVAVEENA
Vol. 18, Issue. 10, October 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

ప్రయోగ కవిత్వం 'కూలిపోయే కొమ్మ'

- అందె కిష్టయ్య, పరిశోధక విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

ఒకానొక బృహత్ కవి సమ్మేళన సభలో ఎంతో మంది ప్రసిద్ధులు ఉన్నారట. విశ్వనాథ సత్యనారాయణ ఈ కవిసమ్మేళనానికి అధ్యక్షులు. వరదాచార్య కవి సమ్మేళన కవుల్లో ఒకరు. నాటి సభోల చాలామంది వచన కవిత్వాన్ని చదివారట. వీరిలో వరదాచార్య కూడా ఒకరు. "సంప్రదాయ కవి వరదాచార్య కూడా మన కవిత్వం రచించడమేమిటి?" అని విశ్వనాథ ఆశ్చర్యపోయారు. ఈ సంగతికి లిఖిత ఆధారాలు లేవు. అయితే వరదాచార్య వచన కవిత్వ రచన చాలామంది సంప్రదాయ కవులకు, కవితాభిమానులకు విస్మయాన్ని కలిగించినట్టు పై ఘట్టం చెబుతోంది. వాస్తవికంగా అంచనా వేస్తే ఒక్క కథానిక మినహా వరదాచార్య రచించని ప్రక్రియ లేదు. ప్రక్రియా వైవిధ్యం పట్ల ఉన్న మక్కువతోనే ఆయన వచన కవితా రచన చేసినట్టు భావించాలి. అంతేకాదు, వచన కవిత్వ ప్రక్రియమీద ఆయనకు నిర్హేతుకమైన నిరసన కూడా ఏదీలేదు, అందుకే ఆయన ఒక వచన కవితా సంకలనాన్నే వెలువరిచారు. ఆ రచనపేరు 'కూలిపోయే కొమ్మ'. దాన్ని సమీక్షించే ముందు వచన కవితపై ఆయా అభిప్రాయాల్ని తెలుసుకోవడం సముచితం.

"సత్కవిత పద్య రూపములో ఉన్నా, గద్యరూపములో ఉన్నా ఉపాదేయమే" అని నా అభిప్రాయం. ఉత్కృష్టమైన కవితా కళ శోభిల్ల వలె కానీ అది ఏ రూపములో అందించబడినదన్నది ప్రధానము కాదు. ఐతే ఒక్క విషయమున్నది. శబ్దార్థాలు రసభావాలు రెంటిలో సమానమే అయినా పద్యకవితలో ఉన్న గతి సౌందర్యము వచన కవితలో లేదు. దానికి గల ఆకర్షణ దీనికుండ బోదు. కమ్మని పాయసాన్ని కమనీయ పాత్రలో అందించేది పద్యకవిత. ఆ సౌందర్యము, ఆ సౌఖ్యము వచన కవితలో లేదు. పద్యకవితలో దాని శిల్పానికి పరిశ్రమ కావాలి. ఛందోవిలసితమైన కవితకు విశేష ప్రయోజనాలున్నవి. వచన కవితకు ఆ పరిశ్రమ లేదు. పద్యము వలన కలిగే ప్రయోజనమూ అందు కానరాదు.."

వచన కవిత్వాన్ని తాను చేసిన ఒక స్వల్పకాలిక ప్రక్రియా ప్రయోగంగానే వరదాచార్య భావించారు. ఈ ప్రక్రియ తనకు సంపూర్ణ స్థాయి సంతృప్తిని కలిగించదనే అవగాహన ఆయనకు మొదటినుండి ఉంది. చెన్నూరుతో పాటు హైదరాబాద్, వరంగల్లు, కోరుట్ల, కరీంనగర్ వంటి పరిచయమైన పట్టణాలలో యువకవులు వచనకవిత్వ ప్రక్రియలో సాధన చేస్తున్నప్పుడు వరదాచార్య వారిని ఎంతమాత్రం నిరుత్సాహపరచలేదు. వచనకవిత్వం పట్ల ఆయనకు ప్రత్యేకమైన ఆదరమేదీ లేదు. కూలిపోయే కొమ్మ సంకలనాన్ని వరదాచార్య అప్పటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆరోగ్యశాఖమంత్రి కోదాటి రాజమల్లుకు అంకితం ఇచ్చారు.

ఇక్కడ ఆనాటి తెలంగాణ కవితా ప్రపంచంలోని సాహిత్య వాస్తవికతను సమీక్షించుకోవలసిన అవసరం ఉంది. ఈ ప్రాంతంలో ఒక ప్రక్రియగా వచన కవితకు బాగా ఆలస్యంగానే ప్రచారం దొరికింది. ఇక్కడి కవులు తొలుత ఈ ప్రక్రియలో రచనలు చేసేందుకు ఇష్టపడలేదు. "విశ్వంభర" వంటి సుదీర్ఘ వచన కావ్యాన్ని రచించిన సినారె సైతం మొదట పద్యాలే రచించారు. 1950వ దశకం చివరివరకు వచన కవితా ప్రక్రియా గమనం తెలంగాణలో మందకొడిగానే సాగింది. అయితే 1960 లలో కుందుర్తి ఆంజనేయులు ఫ్రీవర్స్ ఫ్రంట్‌ను స్థాపించిన తర్వాత వచనకవితా చైతన్యం అధికమైంది. ఈ సందర్భంలో సంప్రదాయ జీవితాభిమానులు కూడా వచన కవితా రచనకు శ్రీకారం చుట్టారు. వారిలో వరదాచార్యులు ఒకరు.

1970వ దశాబ్దినాటికి తెలుగు కవిత్వంలో "సమకాలీన సామాజిక వాస్తవికతా చిత్రణ" అత్యంత కీలకాంశమైంది. స్వాతంత్ర్యానంతర భారతంలో అంతకంతకు పెరిగిన అవినీతి, ప్రభుత్వ అసమర్థత, బీదవర్గాలవారి ఆకలి బాధలు, వరకట్న సమస్యలు, అధిక సంతానం, ఇట్లా ఎన్నో సమస్యలు కవితావస్తువులు అయ్యాయి. ఈ రకమైన సమకాలీన సామాజిక సమస్యల చిత్రణకు వచన కవిత్వమే శక్తిమంతమైన మాధ్యమమని ఇది పద్య-గేయ కవితలకంటే మేలైనదనే ఒక అభిప్రాయం బలపడింది. బహుశా వరదాచార్య కూడా మౌలికస్థాయిలో ఈ అవ గాహనకు వచ్చి ఉంటారు. "ఆచార్యులవారి భావనలో అడుగడుగునా సమతాదృష్టి అభ్యుదయ భావన పెనవేసుకొని కనిపిస్తాయి" అనే కందుర్తి సూత్రీకరణను పై అభిప్రాయంతో కలిపి చూడాలి.

వరదాచార్య తాను సాహితీ జీవితపు చరమదశలో వచనకవిత్వం వైపు దృష్టి సారించారు. అయితే ఈ ప్రక్రియలో పరిణతి కోసం సుదీర్ఘ సాధన అవసరం. ఆచార్యుల వారికి ఈ వ్యవధి దొరకలేదు. వృద్ధాప్యం అందుకు కారణం కావచ్చు. ఆచార్యులవారి శైలిని బాగా అంచనావేస్తూ కుందుర్తి వ్యక్తంచేసిన అభిప్రాయాలను పరిశీలిస్తే...

"వచన కవితా ప్రక్రియను ఆరంభించిన పూర్వ కవితాభిమానులలో అందరికీ ఈ కొత్త పద్ధతిలో చేయి తిరిగిందని చెప్పడానికి వీలులేదు. అసలు వచన కవిత రాణించాలంటే కవి తనకున్న పాండిత్య ప్రకర్షను సాధ్యమైనంత వరకు ఎక్కువగా తగ్గించుకోవడం అవసరం. కవిత సారళ్యం వైపు మొగ్గు అవసరం. బాగా పాండిత్యం ఉన్న వారికి ఒక్కొక్కప్పుడు ఇది అసాధ్యమైనా కావచ్చు. వరదాచార్యులవారు యీ ప్రక్రియను చేపట్టి నిర్వహించేటప్పుడు తమ పాండిత్య విషయంలో బాగా నిగ్రహాన్ని ప్రదర్శించి ఇందులోని వివిధ ఖండికలు వ్రాసి నట్లు కనిపిస్తున్నది. నిజానికి నా దృష్టిలో యీ కావ్యంలో ఉన్న శైలి ఇంకా సాధ్యమైనంత ఎక్కువగా సరళత్వం పొందాలని. అయినా కవిగారికి ఉండే పాండిత్య ప్రమాణం దృష్ట్యా ఇప్పటికీ చాలావరకు ఆయన ఈ విషయంలో విజయం సాధించాడని నేను అనుకుంటు న్నాను".

మానవత్వం, మమత, శాంతి, సమత కావ్యంలో నిండుగా ఉన్నాయి. చీకటిని ఉరితీయాలనే తపన, సామ్రాజ్యవాదం నశించాలనే సామ్యవాద భావన, అధికార దురన్యాయాలు సమసిపోవాలనే ఉద్దేశం కవిభావనల్లో కనిపిస్తాయి. కవి తనకు తాను సువిశాలమైన వ్యవస్థగా సంభాషించుకొని "నేను"తో పరిచయం చేసుకోవడం 1970ల నాటి తెలుగు వచన కవిత్వంలోని సగటు అంశం. ఇదే సంప్రదాయాన్ని ఆచార్యులవారూ పాటించారు :

"నేను కవిని - కవిత్వం వ్రాస్తాను
నేను భువిని - అన్నిటినీ నాలోపలే సృష్టిస్తాను.
నేను రవిని - ఆర్పరాని అగ్నినై చూస్తాను.
నేను సురగలిని - సుధారసాలు వర్షిస్తాను..."

'కూలిపోయే కొమ్మ కొత్త చిగురెట్టింది' అనే కవితలోని ఈ వాక్యం కవితాత్మక అభివ్యక్తితో ఉంది.

"క్రింద భిక్షులు, మీద పక్షులు, పక్షులూ భిక్షులూ
పక్షపాతంలేని పరమపుణ్య గంగ ఈ వృక్షం"

పదాలలో ఉండే ప్రాసకోసం వచన కవితలో ప్రయత్నం చడం ఈ కవితలో కనబడుతోంది.

"నేను కవిని నా గేయం అహింసా క్రాంతి
నా ధ్యేయం విశ్వశాంతి" అని తొలి పంక్తుల్లోనే చెప్పాడు వరదాచార్యులు.

"నేను హంసను పరమ హంసను
దైర్జన్యంపై దాడి వెడలిన అహింసు" అనే కవితా పంక్తులకు కవిమిత్రులు, ప్రసిద్ధ వచన కవి డాక్టర్ సి. నారాయణరెడ్డి వివరణ ఇట్లా ఉంది.

"కవిలో హంసత్వమూ పరమ హంసత్వమూ ఉం టాయి. మొదటిది వివేచనాపరం. రెండవది సంయ మనపరం. వివేచనతో సంయమనంతో ప్రస్తావించే కవి

దౌర్జన్యాలపై దాడికి వెడలుతారు. కత్తులతో కాదు మడమ తిప్పని వచశ్శక్తులతో. అప్పుడు పశుత్వం కొమ్ములు వంచుతుంది. రక్కసితనం నెత్తురు కక్కుకుంటుంది. అదే అహింసా క్రాంతి అంటే.

నా గేయం అహింసా క్రాంతి. అంటే తన పాట అహింసా క్రాంతి అని కాదు. తాను రచింపదగినది అని. ఆ గేయంలోనే ఒక ధ్యేయం. ఒక లక్ష్యం ఇమిడి ఉన్నాయి. ఈ సంపుటంలో అక్కడక్కడా వికీర్ణంగా ఉన్న సామాజిక చేతనా దృక్పథాలన్నీ పై పంక్తిలో ధ్వనిస్తున్నాయి".

కూలిపోయే కొమ్మ వచన కవితా సంపుటిలో రమా రమి 34 కవితలున్నాయి. తనకు తానుగా సంఘంలో దారిచేసుకుంటూ పోతూ తక్కినవారికి మార్గం చూపించే తత్వం ఈ రచనలో మనకు కనిపిస్తుంది.

"మీరు క్షరాలతో అక్షరాలను తూకం చేయకండి
మీరు నక్షత్రాలను నవరత్నాలతో కొనివేయకండి" అంటాడు ఈ కవి. ఫలపుష్పాన్ని అందించి పదిమందికి నీడనూ మేలునూ చేకూర్చే వృక్షాన్ని నరికివేసి కృతఘ్నులు కావద్దన్న సందేశం ఎంతో ఉదాత్తమైనది.

వరదాచార్య వచనకవిత్వంలో అడుగడుగునా సమతా దృష్టి, అభ్యుదయ భావనలున్నాయి. "నేను మానవుణ్ణి" అనే కవితలో సర్వమానవ సౌభ్రాతృత్వ భావన ఉంది. "ఎవరు మీరు" అనే ఖండిక ప్రగతి నిరోధక తత్వాన్ని ఖండిస్తుంది. "శాంతి కపోతి" మానవతకు ప్రతినిధి. "మానవతా వృక్షం" అనే మరో ఖండికను కూడా తప్పక పేర్కొనాలి.

పూర్వ సంప్రదాయాన్ని పాటిస్తూ, నిర్దిష్టమైన ప్రక్రియా లక్షణాల్ని పరిరక్షిస్తూ రచించబడిన పోతన చరిత్రము వంటి కావ్యాలలో, ఆధునిక భావనల అభివ్యక్తీకరణకు అరుదుగానే అవకాశం దొరుకుతుంది. ఇటువంటి భావనల్ని వచన కవిత్వం ఒక్కటే బాగా చెప్పగలుగుతుంది. పలు ఖండికల్లో వరదాచార్య తాను చెప్పాలనుకున్న ఆధునిక భావనల్ని చక్కగా వెల్లడించ గలిగారు.

అయితే వరదాచార్యను ప్రతిభా సంపన్నమైన వచన కవిత్వ కవిగా గుర్తించేందుకు అవకాశంలేదు. ఆయన రచించిన పద్య-గేయ కవిత్వంతో చూచినప్పుడు వచన కవిత్వం పెద్దగా లెక్కలోకి రాదు. అయినప్పటికీ, వచన కవిత్వంలోనూ ఆయన కొంత సాధన చేసినట్టు గుర్తు పెట్టుకునేందుకు "కూలిపోయే కొమ్మ" ఒక ఆధారం.

ఆధార గ్రంథాలు :

1. వానమామలై వరదాచార్యుల జీవితం - సమగ్ర సాహిత్యం.
2. తెలుగు సాహిత్య చరిత్ర-1.
3. తెలుగు సాహిత్య చరిత్ర-2.
4. తెలుగులో వెలుగులు.

BHAVAVEENA
Vol. 18, Issue. 10, October 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

సింహాసన ద్వాత్రింశిక – వృత్తి చిత్రణ

– డా॥. బోయినపల్లి ప్రభాకర్, తెలుగు అసిస్టెంట్ ప్రొఫెసర్, గిరిరాజ్ ప్రభుత్వ కళాశాల (స్వ), నిజామాబాద్.

ప్రాచీన తెలుగు కవిత్వంలో అత్యంత ప్రతిభావంతులైన కవుల్లో ఒకరైన 'కొరవి గోపరాజు'ను నిజామాబాదు జిల్లాలోని లబ్ధ కావ్యకర్తల్లో మొదటివానిగా ప్రతిష్ఠించవచ్చు. గోపరాజు 'సింహాసన ద్వాత్రింశిక' అనే కథాకావ్యాన్ని రచించాడు. ఇది రమ్యమైన, అద్భుతమైన కథా తరంగిణి. ఇది సంస్కృత విక్రమార్క చరిత్రకు అనుసరణం. తెలుగులో కేతన - దశకుమార చరితం, మంచన - కేయూరబాహు చరిత్ర, జక్కన - విక్రమార్క చరిత్రం, అనంతామాత్యుడు - భోజరాజీయంల తర్వాత కథా కావ్యాల ఒరవడిలో వచ్చిన ఐదవది గోపరాజు - సింహాసన ద్వాత్రింశిక.

గోపరాజు తండ్రి కసవరాజు వేములు పాలకుడైన రాణా మల్లనకు మంత్రిగా ఉన్నట్లు, తాను ఆ ఊరిలోనే పుట్టినట్లు తెలిపాడు. అవతారికలోని 'రాణామల్లన కీర్తి చంద్రికలు పర్వంబొగి మధ్యాశిత...' అనే పద్యాన్ని బట్టి వేములు రాణామల్లన రాజధాని అని, కొండల నడుమ ఉన్న వన దుర్గమని, అందులో శ్రీవిష్ణు మందిరం ఉందని తెలుస్తున్నది. గోపరాజు వేములు సమీపంలో ఉన్న పల్లికొండను పాలించిన రాణామల్లనకు ఆశ్రితుడు. కసవరాజుకు రాణామల్లనకు పరమ గురువైన బ్రహ్మదేవ వడియల కుమార్తె కామాంబికకు గోపరాజు జన్మించాడు. చాల మంది పరిశోధకులు గోపరాజు స్వస్థలం నిజామాబాదు జిల్లాలోని వేములు (నేటి భీంగల్)గా నిర్ణయించారు.

గోపరాజు కాలం గురించి చాల మంది పండితులు విశేషమైన చర్చలు చేసి భిన్నాభిప్రాయాలను ప్రకటించారు. వెంపరాల సూర్యనారాయణ శాస్త్రి, కందుకూరి వీరేశలింగం పంతులు, చాగంటి శేషయ్య, టేకుమళ్ళ కామేశ్వరరావు, మల్లంపల్లి సోమశేఖర శర్మ, నేలటూరి వేంకటరమణయ్య, పింగళి లక్ష్మీకాంతం, ఆరుద్ర మొదలైన పరిశోధకులు గోపరాజు కాలం గురించి తమ రచనల్లో ప్రకటించారు. అయితే ఎక్కువ మంది పండితుల అభిప్రాయాన్ని క్రోఢీకరిస్తే గోపరాజు - పిల్లలమర్రి పిన వీరభద్రునికి (క్రీ.శ. 1485 ప్రాంతం) సమకాలికుడై 15 వ శతాబ్దంలో ఎక్కువ భాగం మరియు 16వ శతాబ్దం ప్రథమ భాగానికి చెందిన వాడని చెప్పవచ్చు.

కొరవి గోపరాజు 'సింహాసన ద్వాత్రింశిక'కు మూలం సంస్కృత విక్రమార్క చరిత్ర. మూల గ్రంథం ఒక గద్య పద్యాత్మక (చంపూ) సంకలన గ్రంథం. గద్యం సరళంగా రాయబడింది. శ్లోకాలు స్మృతుల నుండి, సుభాషిత గ్రంథాల నుండి, నీతి శాస్త్రాల నుండి, కావ్యాల నుండి, పంచతంత్రం నుండి గ్రహించబడి సందర్భోచితంగా కూర్చబడ్డాయి. ఇందులో ద్వాత్రింశ (32) ఉపాఖ్యానాలు విడివిడిగా ఉన్నాయి. గోపరాజు మూలగ్రంథాన్ని పూర్తిగా అనుసరించడంతో పాటు, స్వతంత్రించి అందులోలేని అనేక అంశాలు, స్థానిక సంస్కృతులు, ఇంకా కొన్ని కథలను చేర్చి తన కథా కావ్యానికి పరిపుష్టిని కలిగించాడు.

విక్రమార్కుని సింహాసనాన్ని భోజరాజు అధిష్ఠించేందుకు వచ్చినప్పుడు దాని సోపానాలపై ఉన్న 32 సాలభంజికలు చెప్పిన కథలే 'సింహాసన ద్వాత్రింశిక'లోని ఇతివృత్తం. గోపరాజు రాజాశ్రయంలో ఉన్నప్పటికీ తన కావ్యాన్ని నరాంకితం చేయలేదు. తనకంటే ముందుగానే తెలంగాణలో లబ్ధప్రతిష్ఠులైన పాల్కురికి సోమన, బమ్మెర పోతనాదులు చూపిన మార్గంలో పయనించి, తన కావ్యాన్ని హరిహరనాథునికి అంకితమిచ్చాడు. గోపరాజు తనను అష్ట భాషావిదుడిగా చెప్పుకున్నాడు. తెలుగు, సంస్కృతం, షట్‌ప్రాకృతాలు కలిపి అష్ట భాషలవుతాయి.

కొరవి గోపరాజుకు సాహిత్యవ్యాకరణాలే కాకుండా అనేక శాస్త్రాలలో పరిజ్ఞానం ఉన్నట్లుగా అతని కావ్యం నిరూపిస్తుంది. సింహాసన ద్వాత్రింశిక సహజమైన శైలి, మనోహరమైన జాతీయాలు, లలితమైన వర్ణనలతో కూడుకున్నదని పరిశోధకుల అభిప్రాయం. ఇది 12 ఆశ్వాసాల కథా కావ్యం. ప్రాసంగికంగా స్త్రీ జాతులు, చేపల జాతులు, పక్షిజాతులు, వృక్ష జాతులు, సర్ప జాతులు, అశ్వజాతులు, చతుష్షష్టి కళలు, వేట పద్ధతులు, వస్త్ర ఆభరణ విశేషాలు, మల్లయుద్ధ పద్ధతులు, ద్యూత క్రీడా విశేషాలు, స్వప్నశాస్త్రం, జ్యోతిష్య శాస్త్రం, యోగ శాస్త్రం, ఛందశ్శాస్త్రం, గణకరీతులు, రాజనీతి, శకునాలు, వ్యవసాయం, పేదల కష్టాలు, చోర విద్య లాంటి అనేక అంశాలతో పాటు సమాజంలోని అన్ని కోణాలను వివరంగా వర్ణించి తన సర్వజ్ఞతను నిరూపించుకున్నాడు. ఈ వర్ణనలు 15వ శతాబ్దంలోని తెలంగాణ ప్రజల సమగ్ర సామాజిక జీవనానికి ప్రతిబింబాలుగా చెప్పవచ్చు.

ఇక 'సింహాసన ద్వాత్రింశిక'లో కొరవి గోపరాజు చిత్రించిన వృత్తుల గురించి ఇప్పుడు చర్చిద్దాం.

వ్యవసాయ వృత్తి చిత్రణ :

వ్యవసాయం గురించి గోపరాజు చక్కగా వర్ణించాడు. సాగునీటి కోసం రాజులు, మంత్రులు, సేనానులు, ధనికులు చివరికి ప్రజలు కూడా చెరువులు, కుంటలు, కాలువలు విశేషంగా నిర్మించినట్లుగా తెలిపాడు.

"ఈ యెడ కర్మభూమి యగు
డెవ్వరికైనను బుద్ధినేర్పునం
జేయగలేదు, కాల మెడ
సేసిన నేతము లెత్తి కాల్వలున్
పాయలు, కోళ్ళు, నూతులును,
బావులు, రాట్నములున్ జలార్థమై
చేయగ నాయెగాక మరి
చేయని నాడవి తామె పుట్టునే"
(ఆం.సాం.చ-పుట.86)

తెలంగాణలో తరీ సేద్యం ప్రధానమైంది. కాబట్టి మోట, ఏతం ద్వారా, చెరువు కుంటల ద్వారా నీటిని అందించేవారట. అరణ్య ప్రాంతాల్లో ఉన్న చెట్లను నరికి, ఆ ప్రాంతాన్ని చదునుచేసి వ్యవసాయం చేసేవారు. ఇలాంటి ప్రాంతాన్ని 'పోడుచేను' అనేవారు. ఇందులో మెరక పంటలైన కందులు, మినుములు పండించేవారట.

కమ్మరి వృత్తి చిత్రణ :

ఆనాటి సమాజంలో ఉపయోగించే వస్తువులను తయారుచేయడానికి ప్రత్యేకంగా నిపుణులైన కమ్మరి, కంసాలి, కుమ్మరి, శిల్పి, సాలెవారు, వడ్రంగం మొదలైన వర్గాల వారుండేవారు. కమ్మరి, కంసాలి, వడ్రంగి, కుమ్మరి, సాలె వారిని పంచాణం వారని వ్యవహించేవారు. రాజులకు నిరంతరం పక్క రాజ్యాల రాజులతో యుద్ధాలుండినందువల్ల వారు ఆయుధాలను విస్తారంగా తయారు చేయించేవారు. ఆ ఆయుధాలను కమ్మరివారు తయారు చేసేవారు. ముడి ఇనుము నుండి కత్తులు, బల్లాలు, ఛురికలు, బాణాలు, ఈటెలు మొదలైన యుద్ధ పరికరాలను తయారు చేసేవారు. అలాగే బండి చక్రాలు మొదలైన వ్యవసాయ పరికరాలు తయారు చేసేవారు. ఇనుమును కాల్చడానికి వయ్యంది (కుంపటి)ని ఉపయోగించినట్లు తెలుస్తున్నది.

"వయ్యంది గాచి కమ్మరి
చయ్యన బదనిచ్చు నుక్కు చక్రము మాడ్కిన్"
(సిం.ద్వా.4-95)

తెలంగాణలో ఆ కాలంలోనే ఉక్కు పరిశ్రమ ఉన్నట్లు గోపరాజు పేర్కొన్నాడు. వయ్యందిలో లోహాలను కరిగించే వారని, ఉక్కును తయారు చేశారని అర్థం చేసుకోవచ్చు. నిజామాబాదు జిల్లా భీంగల్ సమీప ప్రాంతమైన కోన నముందర్‌లో, నిర్మల్‌లో ఉక్కు కత్తుల తయారీ పరిశ్రమ ఉండేదని, అక్కడ తయారైన ఉక్కు కత్తులు డెమాస్కస్ లాంటి విదేశీ నగరాలకు ఎగుమతి అయ్యేవని చరిత్ర చెప్పుతోంది.

చేనేత వృత్తి చిత్రణ : (సిం.ద్వా.3-188)

ఆనాటి సమాజంలో చేనేత పరిశ్రమ బాగా అభివృద్ధి చెందినట్లుగా 'సింహాసన ద్వాత్రింశిక' ద్వారా గుర్తించవచ్చు. నూలు బట్టలే కాక పట్టుబట్టలు కూడా బాగా వ్యాప్తిలో ఉన్నట్లుగా తెలుస్తున్నది. దానికి తార్కాణంగా విక్రమార్కుని అంతఃపుర స్త్రీలు అనేక రకాలైన వస్త్రాలను ధరించేవారని అందులో భాగంగా 48 రకాలైన పట్టు చీరలను గురించి గోపరాజు పేర్కొన్నాడు. అందులో కొన్ని... చందన కావులు, పట్టెడు కావులు, చెంగావులు, కదంబ కావులు, కరకంచులు, బొమ్మంచులు, చిలుక చాళ్ళు, వేటచాళ్ళు, పుప్పొడి వన్నెలు, రుద్రాక్షవన్నెలు, నాగబంధాలు, పూజా బంధాలు, హంసావళులు, హరిణావళులు, గజావళులు, సింహావళులు, శ్రీతోపులు, శ్రీరామ తోపులు, వెలిపట్టు, పులిగోరు పట్టు, ఉదయ రాగ పట్టు, నేత పట్టు, వజ్ర పట్టు మొదలైనవి.

రంగులు చేయు వృత్తి వారి చిత్రణ :

వివిధ రకాల పేర్లు గల పట్టు అంచులను గురించి చెప్పేటప్పుడు రంగుల పరిశ్రమ కూడా బాగా వ్యాప్తిలో ఉండేదని అర్థమౌతుంది. చెంగావి (లేత రంగువి), కరకంచు (కరక్కాయ నీటితో రాసిన అంచు), బొమ్మంచు (తెల్లచీరల ఎర్ర అంచు), చిలుక చాళ్ళు (చిలక పచ్చ రంగు), ఉడుత చారల (ఉడుత చారల వంటి రంగు), రుద్రాక్ష రంగు, నీలి రంగు (చాల ప్రాచీనమైనది, ఉత్కృష్టమైనది - 'హిందువులు కనిపెట్టారని, పాశ్చాత్యులు దానికి ఇండిగో అని పేరు పెట్టారు'.) (ఆం.సాం.చ.పుట. 96) మంజిష్ట, లక్క, పసుపు మొదలైన వాటిని రంగులు తయారుచేయడానికి వాడేవారు. నీలి పట్టు (నీలి రంగు పట్టు), హొంబట్టు (జరీ అంచులు కల పట్టు) ల్లో కూడా రంగుల వాడకం ఉండేది. రంగులు చేయు వృత్తి వారు ఒక కులంగా కూడా తర్వాత ఏర్పడినట్లు తెలుస్తున్నది.

పౌరాణిక వృత్తి చిత్రణ :

ఆ కాలంలో బ్రాహ్మణులు మాత్రమే శ్రుతి, స్మృతి, పురాణ, శాస్త్రాదులలో విశేషంగా పాండిత్యాన్ని సంపాదించేవారు. తెలుగుభాషలోనికి పురాణాలు పూర్తిగా రాకపోవడం వల్ల ప్రజలకు పురాణ శ్రవణ భాగ్యాన్ని బ్రాహ్మణులే కల్పించేవారు.

"...వీనుల కెల్ల తేనియల్
చినుక పురాణ వాక్యములు
చెప్పెడు విప్రుని జూచి, యిమ్మహా
జన సభ జేరి"

అని గోపరాజు వర్ణించడం వల్ల బ్రాహ్మణులు పురాణాలు చెప్పగా జనులు తండోపతండాలుగా (మహా జన సభగా) వచ్చేవారని అర్థమౌతున్నది. ఇలాంటి విశిష్టత వల్ల బ్రాహ్మణులు రాజులకు మంత్రులై, సేనానులై, విద్యాధికారులై, దీక్షా గురువులై, బోధకులై, పురోహితులై తమ ప్రాధాన్యతను పటిష్టపరచుకున్నారు.

కరణాలు - గణక వృత్తి చిత్రణ : (సిం.ద్వా.11-95 నుండి 101 వరకు)

మూలంలో లేకపోయినప్పటికీ గోపరాజు గణకుని విధులు, ఆయా వ్యయాల లెక్కలు రాసే పద్ధతులు, రాయకూడని పద్ధతుల గురించి వివరంగా పేర్కొన్నాడు. రాజు యొక్క కోశాగారంలో పనిచేసే కరణాలు రాసిన లెక్కలను, రాతలను రాజే స్వయంగా పరిశీలించాలని తెలిపాడు. ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేస్కొని కరణాలు 'వహి' అనే పుస్తకాల్లో ఇష్టం వచ్చినట్లు రాసేవారని తెలుపుతూ, రాతగాన్ని నమ్మారాదనే అపఖ్యాతిని పొందారు.

'కరణము తన యేలికకుప
కరణము, నిర్ణయ గుణాధికరణము, ప్రజకున్
శరణము, పగవారలకును
మరణము నాజెల్లు నీతిమంతుడైనన్" అని సూటిగా ప్రకటించారు.

చోర వృత్తి చిత్రణ : (సిం.ద్వా.10-117, 121, 122)

మూల గ్రంథంలోలేని చోర వృత్తిని గోపరాజు విశేషంగా వర్ణించాడు.

''గాలి చీరయు నొల్కి బూడిద గ్రద్ద గోరును గొంకియున్...
...నల్లపూతయు నేర్పు తోడుగ ముచ్చులన్''
''పాలెమున్న వారిపై నొల్కి బూడిద / మందు చల్లి...
... కత్తిరించినట్లు గంటు పెట్టి''
''తొడి తొడి క్రోవుల పుర్వుల / విడిచి దీవియలార్చి...''

దొంగలు కాళికాదేవి లాంటి శక్తి ఆలయాలకు వెళ్ళి తమ దొంగతనం విజయవంతమైతే అమ్మవారికి కానుక లిస్తామని మొక్కుకునే వారట! చీకటి పడగానే కావలిగా తిరిగే తలారుల మీద దొంగలు శవాలు కాల్చిన బూడిదను చల్లేవారట! ఆ బూడిద మత్తు మందు వలె పనిచేస్తుందట. కన్నం వేసే ఇంటిని గ్రద్ద గోరుతో గోకే వారట. గీత మెత్తదనాన్ని బట్టి గోడకు కన్నం వేసేవారట. ఇండ్లలో దీపాలను ఆర్పడానికి పుర్వుల క్రొవ్వి (పురుగుల గొట్టం) వాడేవారట. ఒక కొంకికి తాడు కట్టి గదుల్లోకి దిగి దోచుకునేవారట. వారు చీకట్లో కనిపించకుండా ఉండడానికి ఒంటికి నల్లని పూత పూసుకునేవారట.

అలాగే గోపరాజు కళాకార వృత్తి, వేశ్యా వృత్తి మొదలైన వృత్తులను గురించి కూడా 'సింహాసన ద్వాత్రింశిక'లో విశేషంగా చిత్రించాడు.

ఈ విధంగా కొరవి గోపరాజులాగా మధ్యయుగంలోని తెలుగువారి (తెలంగాణ వారి) సాంఘిక జీవనాన్ని సజీవంగా వర్ణించిన కవి మరొకరు లేరంటే అతిశయోక్తి కాదు. సమాజాన్ని నిశిత దృష్టితో పరిశీలించిన విషయాలన్నింటికీ కావ్యగౌరవాన్ని కల్పించి, సాంఘిక జీవనానికి పట్టం కట్టిన గోపరాజు 'సింహాసన ద్వాత్రింశిక' తెలుగు సాహిత్య చరిత్రలోనే ఒక అద్భుత కథాకావ్యమని, విజ్ఞాన సర్వస్వమని భావించవచ్చు. ఇది తెలుగు వారి సాంఘిక చరిత్రకు ఎంతో ఉపయోగపడుతుందని సురవరం ప్రతాపరెడ్డి గారు పలికిన మాటలు నూటికి నూరు పాళ్ళు అక్షర సత్యాలు.

ఉపయుక్త గ్రంథాలు :

1. కొరవి గోపరాజు - సింహాసన ద్వాత్రింశిక
   పరిష్కర్త - గడియారం రామకృష్ణశర్మ
   ప్రచురణ - ఆం.ప్ర.సాహిత్య అకాడమీ, హైదరాబాద్ : 1982
2. సురవరం ప్రతాపరెడ్డి - ఆంధ్రుల సాంఘిక చరిత్ర
   ప్రచురణ -ఓరియంట్ లాజ్మన్ ప్రై. లిమిటెడ్, హైదరాబాద్ : 2007
3. ఆచార్య పేర్వారం జగన్నాథం (సంకలన కర్త) - సాహిత్యం - సమాజం - రాజకీయాలు
   ప్రచురణ - పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాదు : 1997
   ఆచార్య నేతి అనంతరామశాస్త్రి గారి 'తెలుగు కావ్యాలు - సామాజిక దర్శనం' అనే వ్యాసం
4. డా.వి.శంకర్ - నిజామాబాదు జిల్లా కవిత్వం
   ప్రచురణ - తెరసం : 2016.

BHAVAVEENA
Vol. 18, Issue. 10, October 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

హిజ్రాల సంస్కృతీ సంప్రదాయాలు

– డా॥. పి. కుమారి నీరజ, సహాయాచార్యులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పుత్తూరు.

స్త్రీ పురుష లక్షణాలున్న మిశ్రమ జాతిని నపుంసకులు అంటారు. వీరిని వ్యవహారంలో హిజ్రా, కొజ్జా, గాండు, పేడి అనే పేర్లతో పిలుస్తారు. పుట్టుకతో ఈ లక్షణాలున్న వారు కొందరు, తమ ఇష్టానుసారం మారే వారు మరికొందరు. వీరికి కుటుంబ, సామాజిక ఆదరణ లేకపోవడంతో సమూహాలుగా జీవిస్తారు. భిక్షాటన, వ్యభిచారం వీరి ప్రధాన వృత్తులు.

మనలాగా పుట్టి, మనలా ఉండలేక, మనతోపాటు ఉండలేక వారికంటూ ఒక సంస్కృతిని, సంప్రదాయాన్ని ఏర్పరచుకున్నవాళ్ళు హిజ్రాలు. ఈ సంస్కృతీ సంప్ర దాయాలు భిన్నంగా, ఆశ్చర్యకరంగా, ఆవేదనగా ఉం డటం బాధాకరం. మనమధ్య ఇలాంటి బతుకీడుస్తున్న జీవులున్నారంటే ఆశ్చర్యం.

పూర్వ గాథ :

పూర్వం హిజ్రాలు రాజుల కొలువులో పనిచేసేవారు. రాణులకూ రాజకుమార్తెలకూ సేవ చేసేవారు. ఇప్పుడు రాజులూ లేరు రాణులూ లేరు....ఢిల్లీలో హిజ్రాలను దేవతలవలె చూసేవారు. పాదాలంటి ఆశీర్వచనం కోరే వారు. వీరి హక్కు చాలా శక్తివంతమైందనీ, ఏం పలికితే అది నిజమౌతుందని అనేవారు. దుకాణాల్లోకి వెళ్ళి చప్పట్లు కొట్టి రాం రాం జీ నమస్తే బాబూ అంటే వాళ్ళు 5,10 రూపాయలు ఇస్తారు. ఇచ్చినది తీసుకుని నిబాగుండు నాయనా! నీ వ్యాపారం బాగా సాగాలి అని దీవిస్తారు.

ఒక కథ రాముడు 14 సంవత్సరాలు వనవాసానికి వెళ్ళినప్పుడు జనం వస్తూ వుంటే అడవి పొలిమేరల దగ్గర రాముడు స్త్రీ, పురుష, పిల్లలను ఇంటికి వెళ్ళమన్నాడట. స్త్రీ, పురుషులు కాని హిజ్రాలు మాత్రం రాముడు తిరిగి వచ్చేంతవరకు అక్కడే ఉన్నారుట. రాముడు అడిగితే స్వామీ మేము స్త్రీలమూ కాము పురుషులమూ కాము... మీ ఆజ్ఞానుసారం మేము పోలేదు అని చెప్పారు. రాముడు వారి మాటలకు చలించిపోయి వారికో వరమిచ్చాడు. మీ పలుకు ఎల్లప్పుడూ సత్యమౌగాక అని. అందుకే ఇక్కడి వాళ్ళు హిజ్రాల మాట నిజమౌతుందని నమ్ముతారు. రోజూ ఉదయం హిజ్రాను చూసి పని మొదలుపెడితే అది విజయవంతమవుతుందని నమ్ముతారు. వ్యాపారస్థులు వారి వ్యాపారం బాగుంటుందని నమ్ముతారు. అందుకే డబ్బిచ్చి దీవెనలందుకుంటారు.

గురు శిష్యబంధం :

గురువంటే తల్లితో సమానం. ఆమె తన శిష్యులను ఇంట్లో వుంచుకుంటుంది. వాళ్ళకు తిండీ, బట్టా ఇస్తుంది. సంప్రదాయబద్ధంగా శిష్యురాలిని దత్తత తీసుకుంటుంది. అలా చెయ్యాలంటే వాళ్ళ సంఘమంతా సమావేశమై శిష్యురాలిగా స్వీకరిస్తారు. జమాత్ రోజు సాయంత్రం ఈరోడ్, మధురైవంటి పట్టణాలనుంచి చాలామంది వస్తారు. వారంతా చీరలు కట్టుకుంటారు. పెద్ద పాత్రలో అన్నం వండి శిష్యులను వడ్డించమంటారు. ఇంకా చిల్లర పనులు చెప్తారు. నీళ్ళు తేవాలి.

కొత్తగా చేరిన వాళ్ళు పాన్ తెచ్చివ్వడం, ఎప్పుడు పాన్ ఇచ్చినా కాల్మొక్కుతా (హిందీలో పాన్ పడితి) అనాలి. ఉమ్మి వేసుకునే గిన్నె (తూక్తాని) శుభ్రంగా కడిగి తేవాలి. అసహ్యించుకోకూడదు. గురువుల బట్టలు కూడా ఉతకాలి. బహిర్భూమికెళ్ళేటప్పుడు పురుషాంగం బయట పడకుండా జాగ్రత్తపడాలని, ఆపరేషనయ్యేవరకు పురుషుడన్న విషయం తెలియకూడదని గురువు హెచ్చరిస్తుంది.

శిష్యురాలిగా స్వీకరించడం :

ఒక హిజ్రా తనొక శిష్యురాలిని తీసుకోవాలంటే ముందుగా జమాత్‌కు అర్జీ పెట్టుకోవాలి. వాళ్ళు దాన్ని

అంగీకరించి ధృవీకరిస్తారు. హిజ్రాలకు వారి హక్కుల గురించి తెలియజేసేదే జమాత్. జమాత్‌లో కూతురు చేలా(శిష్యురాలు)గా చేసుకుంటారు. ఒక పళ్ళెంలో తెల్లబట్ట పరిచి దానిమీద ఆకూ వక్కా ఒక రూపాయి పావలా పెడతారు. శిష్యురాలిగా చేర్చుకున్నట్టు ప్రకటిస్తారు. అందుకు రుసుము కింద 5 రూపాయలు, ఒక రూపాయి పావలా వుంచుతారు. తక్కిన వాళ్ళు ఆ గురువు పేరుతో ఆ డబ్బు తీసుకుంటారు. దాన్ని మళ్ళీ పళ్ళెంలో పెట్టి 5 రూపాయలు తీసుకుని ఇది ఎవరైతే శిష్యురాలిగా చేరారో వారి పేరుచెప్పి వారికోసం దీన్ దీన్ అని నెమ్మదిగా అంటారు. అందరూ తప్పట్లు కొడతారు. అప్పటినుంచి గురువును అమ్మా అని పిలవాలి. ఆమె శిష్యురాలిని కౌగలించుకుని ముద్దుపెట్టి తల నిమురుతుంది. తన కూతురనీ పేరుని ప్రకటిస్తుంది. పెద్దలందరికీ పాద నమస్కారం చెయ్యమంటుంది. తోటి వాళ్ళను గురూబాయ్‌లు (అక్క చెల్లెళ్ళతో సమానం), కాలగురు (అమ్మమ్మ చెల్లెలు)లను పరిచయం చేస్తుంది.

మాలాగా కష్టాలెందుకు అని గురువు మంచి కుటుంబమున్న వాళ్ళను ఇంటికివెళ్లి బాగా చదువుకుని ఉద్యోగం చూసుకోమంటుంది. ఏదైనా ఇబ్బందైతే ఈరోడ్‌లోని అమ్మమ్మ (గురువు గారి గురువు నానీ అమ్మమ్మతో సమానం) దగ్గరకు పొమ్మని చెప్తుంది. వీరికి కుల, మత, వర్గ వివక్ష లేదు. అన్ని కులాలనుంచీ ధనిక పేద వర్గాలనుంచీ వచ్చిన హిజ్రాలుంటారు.

వీరిలో కుల మతాలు లేకున్నా ఏడు తెగలున్నాయి. ప్రతి తెగకూ ఒక పేరుంది. హిజ్రాలు ఏ తెగనుంచైనా తమ గురువును ఎంచుకోవచ్చు. తర్వాత మారనూవచ్చు. ఒక్కో తెగకొక నాయకురాలుంటుంది. ఆమెను నాయక్ అంటారు. ఈమెకు అక్కా, చెల్లి, కూతురు, మనవరాలు వంటి సంబంధాలుంటాయి. వీళ్లెక్కడైనా వుండొచ్చు. పండగలకూ, జమాత్ సమావేశాలకు కలుసుకుంటారు.

తమిళనాడులోనైతే ఆ ప్రాంత గురుశిష్యులు ఆ ప్రాంతంలోనే వుండాలి. కొంతమందికి గురువు ఢిల్లీలో వున్నా ముంబైలోనూ కొత్త గురువును ఎంచుకోవచ్చు. గురువులే శిష్యుల పనితీరు, అందం, సంపాదనా విధానం, ప్రవర్తన అన్నీ చూసి మంచివాళ్ళను శిష్యులుగా చేసుకోవడానికి ఇష్టపడేవాళ్ళు. వాళ్ళకు తర్వాత గురువులే ఆపరేషన్ చేయించేవాళ్ళు. ముంబై, ఢిల్లీ హిజ్రాల పద్ధతులు ఒకరకంగా వుంటాయి.

వీళ్ళంతా హౌసింగ్ బోర్డ్ కాలనీలో వుంటారు. చీరలు కట్టుకుంటారు. లింగ మార్పిడి శస్త్ర చికిత్సలు చేయించుకుంటారు. స్త్రీలా కనబడాలంటే పొడవు జుట్టు అవసరం. జుట్టు పెరిగే వరకు పెద్దవాళ్ళ బట్టలు ఉతకడం, మంచినీళ్ళు తేవడం, బజారుకెళ్ళడం, వంటలో సాయపడ్డం కష్టమైన పనులైనా అందరికంటే చిన్న వాళ్ళకు తప్పదు. పొట్టెయ్ (హిజ్రా)గా పుట్టిన వాళ్ళంతా ఈ దశ అనుభవించి తీరాల్సిందే. ఈ కష్టాన్ని తట్టుకుని నిలబడిన వాళ్ళకే ఆపరేషన్లు జరుగుతాయి.

నిర్వాణం :

దిండిగల్‌లో నిర్వాణం (ఆపరేషన్) చేసే అమ్మ (ఇలాంటి వారికి పెద్ద) ఉందని ఆమె దగ్గరకెళ్లి నికాలు మొక్కతా అమ్మా అని పాద నమస్కారం చేస్తారు. అక్కడున్న తమకంటే పెద్దవాళ్ళందరికీ పాద నమస్కారం చేస్తారు. వాళ్ళు నిజియో జియో (వర్ధిల్లు) అని దీవిస్తారు. ఇది వీరి సంప్రదాయం.

వాళ్లతో పాటుండాలంటే ముక్కు చెవులూ కుట్టించుకోవాలి, జుట్టు పొడవుగా పెంచుకోవాలి. ఒక గురువుకు చేలా (శిష్యురాలి)గా వుండడానికి అంగీకరించాలి, గురువు చెప్పిన పనులన్నీ చెయ్యాలి. అలా ఒకటి రెండేళ్ళు గురువుకు సేవ చేసి ఆమెకు డబ్బుకూడా సంపాదించి పెట్టాలి. అలా చేస్తే ఆ గురువు స్త్రీగా మారడానికి సహాయం చేస్తుంది. అంతకు ముందున్న పురుష పేరును మార్చి స్త్రీ పేరు పెడుతుంది.

ఆపరేషన్‌కోసం వెళ్ళేటప్పుడు వీరి దేవత పోతిరాజమాత పటంముందు అగర్బత్తీలు వెలిగించి కొబ్బరికాయ కొట్టి కర్పూర హారతి ఇస్తారు. పసుపు గుడ్డలో ఒక రూపాయి

పావలా ముడివేసి మణికట్టుకు కడతారు. ఒక కొబ్బరికాయ, నిమ్మకాయ ఇచ్చి దగ్గరుంచుకోమంటారు. అవి దుష్టశక్తులను పారద్రోలతాయని నమ్మకం.

వీళ్ళకు డాక్టర్ ఆపరేషన్ చేస్తారు లేదా ఒక హిజ్రా మరో హిజ్రాకు (తాయమ్మ పద్ధతి) ఆపరేషన్ చేస్తారు. తాయమ్మ ఆపరేషన్ చేయించుకున్నవాళ్ళను బాగా గౌరవిస్తారు. ప్రత్యేక శ్రద్ధతో చూస్తారు. ఆపరేషన్ సమయంలో వీళ్ళు చాలా బాధపడతారు. శరీరంలో అత్యంత ప్రధానమైన అంగం తొలగింపు బతుకుతారో లేదోననే భయం.

ఇలాంటి ఆపరేషన్లు చేయించుకున్నవాళ్ళు 40 రోజులవరకు పాలూ పళ్ళూ తీసుకోకూడదు. చపాతీలు కాకరకాయకూర తినడం మంచిది. మాంసంతో చేసిన సూపు, మేక మాంసం మంచిది. బ్లాక్ టీ బాగా తాగాలి. ఒక నేతిబొట్టు వేసుకుని టీ తాగితే మంచిదట. అద్దంలో చూసుకోకూడదు. మగవాళ్ల వంక చూడకూడదు. తల దువ్వుకోకూడదు. 40 వ రోజు పోతిరాజు మాతకు పూజ చేస్తారు. కుండెడు పాలతో ఆమెకు ప్రీతి చేస్తారు.

ఆపరేషన్ తర్వాత కార్యక్రమాలు :

ఆపరేషన్ చేయించుకుని వచ్చిన వారికి కర్పూర హారతితో స్వాగతం పలుకుతారు. కాలగురు ఆపరేషన్ చేసుకున్నచోట శుభ్రం చేయడం, వారి రక్తపు బట్టలు తకడం చేస్తుంది.

12వ రోజు ఆపరేషన్ చేయించుకున్న వాళ్ళ నెత్తిన ఇరుగుపొరుగు హిజ్రాలతో నీళ్ళు పోయిస్తారు. హిజ్రాలు వీరి ఒంటికి పసుపురాసి, హారతిచ్చి నోట్లో పంచదార పెడతారు. చూడ్డానికొచ్చే హిజ్రాలు నెయ్యి, గోధుమలు, పంచదార బహుమతులుగా ఇస్తారు.

20వ రోజు రెండోస్నానం చేస్తారు. గాయం బాగా మానుతుంది. అప్పటినుండి ఇంటిపనుల్లో దిగాలి.

40వ రోజుకు వీరికి ముఖం, కాళ్లు చేతుల్లో స్త్రీ లక్షణాలు వస్తున్నట్లనిపిస్తుంది.

40వ రోజుకు హల్దీ మెహందీ ఉత్సవం చేస్తారు. ఆడపిల్ల పెద్దమనిషైనప్పుడు చేసే పేరంటంలాంటిది. మాతకు పూజచేసి ఇల్లు దాటి బయటకు వెళ్ళేందుకు అనుమతిస్తారు. ఈ ఉత్సవానికి ఖరీదైన రంగురంగు చీరల్లో చాలామంది హిజ్రాలు వస్తారు. సెక్స్‌వర్కర్లూ ఉంటారు. వీరిని ఒక గదిలో పెడతారు. బయట పాటలూ నాట్యం వంటల ఘుమఘుమలూ ఉంటాయి. వీరు తెల్లవారుఝాము 2గంటల సమయంలో పరికిణీలు కట్టుకోవాలి. వీళ్ళకప్పుడు పసుపురాసి, గోరింటాకు పెడతారు. మాతకు పూజ చేస్తారు.

జోక్ :

గురువు ఆపరేషన్ చేసుకున్న వాళ్ళకు జోక్ బహు మతిగా ఇస్తుంది. అందులో ఆకుపచ్చ చీర, రవిక, లంగా, కాలి పట్టీలు, మెట్టెలు, ముక్కుపుడక వుంటాయి. హిజ్రాలు వీరికి జడవేసి పూలు పెట్టి జోక్‌లో వున్న వస్తువులను ధరింపజేస్తారు. పమిటకొంగును తలపై ముసుగుగా వేస్తారు. మాత దగ్గరకు తీసుకెళ్ళి పూజ చేస్తారు. హిజ్రాలంతా జై సంతోషి మాతా అంటూ పాడుతారు. వీరి మెడలో పూల దండలు వేసి, కొంగులకు తాంబూలం ముడి వేస్తారు. ఉదయం 4 గంటల వరకూ పాటలు పాడుతూ నాట్యం చేస్తారు. వీరికి కూడా పూనకం వచ్చినట్లు ఆడటం మొదలు పెట్టగానే వీరి నెత్తిన పాలకుండ పెడతారు. హిజ్రాల సాయంతో ఒక బావి దగ్గరకెళ్లి ఆ పాలను బావిలో పోయిస్తారు. ఆ కుండతోనే బావి నీళ్ళు తోడించి రెండుసార్లు అందులోనే పోయించి మూడోసారి నీళ్ళ కుండతో ఇంటికొస్తారు. మాత పటం ముందు నిలబెట్టి ముఖానికున్న ముసుగులు తొలగించి ఆమెను సూటిగా చూడమంటారు. నన్ను నీలోకి తీసుకుని నిన్ను నాలోకి పంపించు తల్లీ అని ప్రార్థిస్తారు. అద్దం ఇచ్చి ముఖం చూసుకోమంటారు.

అప్పటికి స్త్రీలా మారిపోయుంచారు. మాతకు నైవేద్యంగా కొబ్బరిముక్కలు, రకరకాల పిండివంటలూ, తొమ్మిది రకాల పళ్ళు పెట్టి అందరూ తింటారు.

మాతకిరువైపులా రవ్వ కేసరి రాసిపోసి దానిమీద ఓం అని రాస్తారు. పూజ తర్వాత ఆపరేషన్ చేసుకున్న వాళ్ళు అక్కడున్న పదార్థాల్లో నచ్చినది తినాలి. మిఠాయిలూ పళ్ళు తిన్నవారి జీవితం ఆహ్లాదకరంగా వుంటుందని నమ్ముతారు.

భోజనం తర్వాత అక్కడున్న వాళ్ళందరికీ కాలు మొక్కుతా అని పాద నమస్కారం చెయ్యాలి. అందరూ వర్ధిల్లండి! ఇప్పటినుంచీ మీ గురువు పరివారమే మీ పరివారం, ఈ గురువు పేరుకు మీరు వన్నె తేవాలి. ఆమె చెప్పినట్లు వినాలి. మీకు నిర్వాణం అయిందని గుర్తుంచుకోండి. బహిరంగంగా ఎప్పుడూ చీర పైకెత్తి పట్టుకోకూడదు. హిజ్రాలు పాటించాల్సిన నియమాలు మరిచిపోకూడదు. ఇప్పుడు మీరు స్త్రీలు. స్త్రీలలా ప్రవర్తించాలి. జుట్టు కత్తిరించుకోవడం, ఇంటికి పారిపోవడం చేయకూడదు. మీరు పెళ్లి చేసుకుని ఒక భర్తను అంటగట్టుకో వద్దు అని మంచి మాటలు చెప్తారు.

తర్వాత వీళ్ళు నానీ దగ్గరకెళ్తారు. నానీకి పాద నమస్కారం చేస్తే ఆమె దీవిస్తుంది. ఆ బట్టలు అకువ పాట్టెయ్ (ఇంకా నిర్వాణం కాని వాళ్ళు)లకు ఇస్తారు. వీళ్ళకు నానీ వేరే బట్టలిస్తుంది.

మాత అనుగ్రహం లేనిదే నిర్వాణం జరగదని నమ్ముతారు. కొందరికి ఆరునెల్లకే జరిగితే కొందరికి మూడు సంవత్సరాలైనా ఆడవిల్లయ్యే అదృష్టం కలగలేదని బాధపడతారు.

రీత్ :

నాయక్‌లందరూ బైకుల్లాకు చేరి మొదటిసారి శిష్యురాలైతే జమాత్‌లో అందర్నీ పిలిచి ఫలానా వారి శిష్యురాలు ఫలానా అమ్మాయని అందరికీ చెబుతారు. అందరూ చప్పట్లు కొడతారు. పెద్దలందరికీ పాద నమస్కారం చెయ్యమంటారు. దీన్నే రీత్ అంటారు. రీత్ తర్వాత జత బట్టలు, బట్టలు పెట్టుకోవడానికి ఒక పెట్టె ఇస్తారు.

కట్టుబాట్లు :

ఒక వ్యక్తి ఇంకో గురువుకి చేలాగా మారినప్పుడు పాత గురువు ఇంట్లోనుంచి తెచ్చిన వస్తువులు డబ్బు, నగలు, అప్పులు ఏమైనా ఉన్నాయా? అన్నీ వివరంగా చెప్పాలి. అప్పులుంటే తీర్చడానికి వీళ్ళు ఏర్పాట్లు చేస్తారు. కొత్త గురువుకు చేలా అయ్యేటప్పుడు ఏడుమంది నాయక్‌లు అన్నీ అడుగుతారు.

వీరి సంపాదనంతా వారికే ఇస్తారు. వారే నిర్వాణం చేయించి ముక్కుపుడక, కాలి పట్టీలు లజ్జా ఇస్తారు. అవన్నీ తిరిగి వాళ్ళకు ఇచ్చేయాలి. నిర్వాణానికైన డబ్బుకూడా ఇచ్చేస్తారు. కొత్త గురువు దగ్గర చేరడం ఇష్టమేనా? బలవంతంలేదుకదా అని అడుగుతారు.

స్వంత గురువులు, చేలా నాతీలు వుంటే తప్ప గౌరవం వుండదు. వీరందరూ చేలా ఉత్సవానికి బెంగుళూరు నుండి హైదరాబాద్ వెళ్తారు. కొత్త గురువులు పాత గురువుకు ఇవ్వాల్సినవి ఏమైనా వుంటే ఇచ్చేస్తారు. ఆ తర్వాతనే కొత్త గురువు చేలాగా చేర్చుకుంటుంది.

పెద్దల్ని గౌరవించాలి, వాళ్ళు చెప్పిన పనులు చెయ్యాలి. పెద్దలు ఎదురైనప్పుడు కాళ్ళు మొక్కుతా అనాలి. పెద్దలకు చిన్నవాళ్ళ బట్టలు కూడా తగలకూడదు. వాళ్ళు అడిగినప్పుడు మంచినీళ్ళివ్వాలి. చెవి పోగులు, ముక్కు పుడకా, కాళ్ళకు కడియాలు గాజులూ ధరించకుండా వుండకూడదు. జుట్టు కత్తిరించుకోకూడదు. మొహంమీద మొలిచే వెంట్రుకలను క్షవరం చేసుకోకుండా పీకేసుకోవాలి. చిన్నవాళ్ళ సంపాదన వాళ్ళ గురువు, నానీలతో పంచుకోవాలి. వాళ్ళూ వీళ్ళను బాగా చూసుకుంటారు.

హిజ్రాలు జుట్టు కత్తిరించడాన్ని సిగ్గుపడాల్సిన పనిగా భావిస్తారు.

వీళ్ళు కోడిపుంజును అధిరోహించిన పోతిరాజ మాత అనే దేవత పటాన్ని పూజిస్తారు.

పమిట నిండుగా కప్పుకోవాలి. పురుషుడు ఎదురు

పడితే తల వంచుకుని అతనికి దారి ఇవ్వాలి. పెద్దల్ని గౌరవించాలి. వారి ఆజ్ఞలు శిరసావహించాలి.

బదాయి :

హిజ్రాలు ధోలక్ వాయిస్తూ ఆడి పాడడాన్నే డోలీ బదాయి అంటారు. పెళ్లిళ్ళప్పుడు, పిల్లలు పుట్టినప్పుడు వీళ్ళు నాట్యం చేస్తూ పాడుతారు. వాళ్ళిచ్చే బియ్యమో, గోధుమలో, చీరలో కానుకగా తీసుకుంటారు. ఎవరింటైనా ప్రసవం జరిగితే వీళ్ళే తాము ఫలానా రోజు పసిబిడ్డను దీవించడానికి వస్తామని కబురంపుతారు. అక్కడ పాటలు పాడుతూ తల్లిదండ్రులను ఆటపట్టిస్తూ ఆ బిడ్డను దీవించి కానుకలు తెచ్చుకుంటారు. పెళ్లిళ్ళు జరిగే స్థలాలకెళ్ళి వధూవరులను ఆశీర్వదించి కానుకలు తెచ్చుకుంటారు. వచ్చిన కానుకలు అందరూ పంచుకుంటారు.

నృత్యం :

నానీలు దేవాలయాల్లో నృత్యం చేసే బృందాలను ఏర్పాటు చేసుకుంటారు. అందులో ఆవిడ శిష్యులు, ప్రశిష్యులు చాలా ముందుంటారు. నృత్యంలో అందరూ ఆరితేరిన వాళ్ళు.

ఇన్ని బాధరబందీలతో, ప్రత్యేక జీవనంతో ఎవరికీ పట్టనట్టు, ఎవరికీ చెందనట్టున్న వీళ్ళను ఎలా చేరదీయడం?

BHAVAVEENA
Vol. 18, Issue. 10, October 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావ వీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

నల్లగొండ జిల్లా భజన – భక్తి విధాన పరిచయం

- రాములు తోట

భక్తి, కర్మ, జ్ఞాన మార్గాలు మూడు మోక్ష సాధనాలని భారతీయుల నమ్మకం. అందులో భక్తి మార్గం సులభ సాధ్యం. తక్కిన రెండు మార్గాలకున్న విధి నిషేదపు కట్టుదిట్టాలు ఈ భక్తి మార్గానికి లేవు. కనుకనే వైష్ణవ, శైవ వీరశైవాది భక్తి మతాలు ప్రజాబాహుళ్యం అధికంగా వ్యాప్తిగాంచాయి. భక్తి మార్గం అవలంబించుటకు చదువు సంధ్యలు కాని, అభిజాత్యం కాని అవసరం లేదు. భవదనుగ్రహం, విశ్వాసం, తదనుగ్రహం మోక్షప్రాప్తి కలుగుతుందనే నమ్మకముంటే చాలు.

భజన అంటే అనేక మంది క్రింది విధంగా నిర్వచనం చేశారు.

భ అంటే - భగవంతుని అన్ని అంశాలతోను
జ అంటే - జపించుట, పాడుట లయబద్ధంగా
న అంటే - నరక ప్రాప్తి ఉండదు.

ఇలా భజన అనగా 'సేవ' అని అర్థంగా భావించ వచ్చు. అనంతుని కల్యాణ గుణసేన భగవంతునికి అనేక కీర్తనలతో తమ తమ సేవలను బాధలను తెలపడమే భజన.

''భగవంతుని అనంత నామాలను రూప గుణ మహిమలను రాగ, తాళయుక్తంగా తన్మయత్వంతో సమిష్టిగా కీర్తించడం భజన'' అని చెప్పవచ్చు.

అతి ప్రాచీన కాలంలో వైదిక క్రియలైన యజ్ఞ యాగాదులు సామాన్య ప్రజానీకానికి అందుబాటులో లేనుందున దానికి ప్రత్యామ్నాయంగా జానపదులలో ఒక పవిత్ర పూజావిధానంగా ఏర్పడిందే భజనగా తెలుపవచ్చు.

భజన నామౌచిత్యం :

''భజన అంటే భగవంతున్ని ధ్యానించడం. ఇది బహుజనావళికి సంబంధించిన జానపద కళారూపం. ఈ భజనను కన్నడంలో భజన అనియు, తమిళంలో భజనై అని, తెలుగులో భజన అని అంటారు. జానపదులు భగవంతున్ని పూజిస్తూ, మహిమలు తిలకిస్తూ మనోగత ఆవేదనను, తమ తమ సాధక బాధలను విన్నవించు కుంటూ తమకు ముక్తిని ప్రసాదించమని దేవున్ని ప్రార్థించడం జరుగుతుంది.''

భజన గీతాలు శ్రుతిబద్ధంగా, స్వరయుక్తంగా ఉండాలని రాగబ్రహ్మ త్యాగరాజు బోధించుటనే భజనకు ఒక ప్రత్యేకమైన అలంకరణ శక్తి వచ్చింది.

''రామ నామ తారకమ్, భక్తి ముక్తి దాయకమ్
జానకి మనోహరమ్, పుణ్యనామ కీర్తనమ్''

అని భక్తాగ్రేశరులు చెప్పుతుంటారు. రామాయణ కథలు, కృష్ణలీలలు, వైవ కీర్తనలు, భజన పాటలుగా కట్టుకున్నారు. సమిష్టిగానంలో ఒకరు ఒక చరణం, ఇంకొకరు మరొక చరణం సరిదిద్దడం వల్ల సంస్కరింప బడ్డాయి. ఈ విధంగా ఈ పాటలు ఏర్పడ్డాయి హిందువు లలో సంఘీభావం కలిగించడానికి భజన అధిక ప్రాధాన్యత కలిగి ఉంది. ఈ భజన పండిత పామరజను లను సైతం ఆకర్షిస్తుంది.

భజన విశిష్టత :

భజనలు ఎందుకు చేస్తారనే విషయాన్ని పరిశీలించితే భజనలు ముఖ్యంగా దేవునికి సంబంధించినవి. దేవుడు వివిధ రూపాలలో ఉన్నాడు కాబట్టి ఆయా రూపాల నామాలను బట్టి భజన చేస్తారు. జానపదులు ఆది నుంచి తమ భక్తిని, విశ్వాసాన్ని వివిధ రకాలుగా చాటుకునే సందర్భాలు ఉన్నాయి. జానపదులు ప్రతిచెట్టుకు పుట్టకు, రాయికి పసుపు, కుంకుమ పూసి పూజలు చేస్తారు. ఆ సందర్భంలో వారి మనస్సు ఉప్పొంగి ఉత్సాహంతో గీతాలు పాడుతారు. ఈ విధంగా జానపదులు భజనలు చేయడానికి ఎన్నో ప్రత్యేకతలున్నాయి.

పల్లె సీమల్లో వర్షాలు కురవకపోవడంతో కరువులు సంభవించినప్పుడు ఒక గడ బొంగుకి మధ్యలో ఒక కప్పని కట్టి ఆ కప్పకి, గడ బొంగుకి పసుపు, కుంకుమ రాసి, ఆ బొంగును అటు చివరొకరు, ఇటు చివరొకరు పట్టుకొని వర్షాలు కురవాలని కొంతమంది బృందంతో 'భజన' గీతాలు ఆలపిస్తూ వాన దేవున్ని కరుణించమంటూ వేడుకొంటూ ఆయా చుట్టుపక్కల గ్రామాలు తిరుగుతారు. ఆ విధంగా ఒక్కో భజనకు ఒక్కో ప్రత్యేకత ఉంది. ప్రతి గ్రామంలో 'బొడ్డురాయి' తో పాటు రామాలయం, శివాలయం, సాయిబాబా గుడి, దుర్గమ్మ గుడి, ఊరిదేవత గుడి ఏదో ఒకటి తప్పనిసరిగా ఉంటుంది. ఆయా గుళ్ళలో పండుగలకు ఈ భజనలు నిర్వహిస్తూ ఉంటారు. ఈ భజనలు చేయడానికి ప్రత్యేకంగా 'భజన బృందాలు' భజన కళాకారులు అనేకమంది ఉన్నారు.

భజన విధానం :

ఒక నిర్దిష్టమైన సాంఘిక జీవనాన్ని అలవరచుకునే దశలో మానవునికి ఆధ్యాత్మిక చింతన ఏర్పడింది. ఆత్మ శరీరాన్ని వదలిపోవడాన్ని మరణమని తలచి ఆత్మ ఆరాధించడం మొదలుపెట్టాడు.

శబ్ద పరమైన సంకేతాలు, పేర్ల మంత్రాలు, ప్రార్థనలు, పాటలు, పద్యాలు, మొదలైనవన్నీ ఇందులో జానపదులు నిరంతరం ఆ భగవంతున్ని ఎలా ధ్యానిస్తున్నారో, వారల్లుకున్న, అమాయకంగా కనిపించే గేయాలే భజన రూపంగా రూపుదిద్దుకున్నాయి. అనంతమైన నీతిని విలక్షణమైన రీతిలో చెప్పడం భజన సంప్రదాయం. మానవులకు తెలివితేటలను తెలియ పర్చేందుకు వాటి మూలాల్ని తెలుసుకొంటూ, వాటిని వినినంతసేపు మనస్సు దేవుని వైపు మరల్చటం భజన శైలి.

అందరూ కలిసి భజన చేయడం సామూహికంగా గేయాలు పాడటం వల్ల సమైక్యతాభావం ఏర్పడటం భజనల విశేషం. అందుకే అందరిని ప్రేరేపిస్తుంది. తన్మయత్వంలో ముంచేస్తుంది.

ప్రతి అడుగు భగవంతుని వైపు వేయాలి
ప్రతి ఉద్యమం పునర్జన్మ ననుభవించాలి'

మోక్ష సాధన మార్గాలలో భక్తి మార్గం సులభం, జానపదులలో భక్తితో భగవంతునికి భజనలు చేసే అలవాటు ప్రతివారిలో అలవడింది. భజనలో భగవంతుని సేవించుతూ తమ బాధలను వేదనలను దేవుని ముందు విన్నవించుకొంటూ అంతే భక్తితో కొన్నిసార్లు దేవున్ని తిడుతుంటారు.

భజన కూటాలు :

నల్లగొండ జిల్లాలో భజన మందిరం లేని పల్లె లేదంటే అతిశయోక్తి కాదు. రామ మందిరాల్నే భజన గుళ్ళని కూడా మన వారు వ్యవహరిస్తున్నారు. భజన గుళ్ళలో ఆయా గ్రామాలలోని వారు చిన్నపిల్లలు మొదలుకొని పెద్దవారి వరకు ప్రతిరోజు రాత్రిపూట కొంత సమయం భజన చేస్తుంటారు. వీరి చేతుల్లో తాళాలు ఉంచుకొని దేవుని కీర్తిస్తూ పాటలు పాడుతూ భజనలు చేస్తారు. కొన్నిచోట్ల తాళాలతో పాటు, మృదంగం, తబల, డక్కి, హార్మోనియం, గజ్జెలు, తంబుర వంటి వంటి వాద్యాలను కూడా వాడ్తారు. వీరు ప్రతిరోజు రాత్రిపూటే కాకుండా పండుగలు, పబ్బాలప్పుడు పగలు కూడా భజనలు చేస్తుంటారు. ఇలా భజన కూటాలు ప్రతిపల్లెలోనూ మనకు కన్పిస్తుంటాయి. కూటమి అనే పదానికి గుంపు చేరిక, స్నేహం, చెలిమి వంటి అర్థాలున్నాయి.

ఈ విధంగా భజనలు భక్తిలో తాదాప్యం చెంది మానవులు ఈశరోపసనతో మోక్షం పొందేలా దారి చూపాయనే సత్యం మనకు అవగతమవుతుంది. ఎవరు ఏ విధంగా భజించినా వారి వారి కర్మ ఫలాన్ని అనుభవించటం తప్పనిసరి. ఇది ఈనాటి మానవజాతికే కాదు ఐతిహాసికి కాలంలో రామాయణం ఆధారంగా కూడా మనం పరిశీలించినపుడు రాముడి పాత్ర ద్వారా మనకు ఈ సత్యాలన్నీ కూడా బోధపడతాయి. నిజానికి రాముడు మానవ అవతారంలో నిరంతర ఉపాసనతో అమ్మవారి కటాక్షాన్ని పొందగలిగాడు. ఉపాసన కూడా ఒక విధంగా

భజన లాంటిదే. అయితే ఇది ఏకాంతంగా చేయడం వల్ల ఇది ఒక సాధనగా కూడా ప్రచారంలో ఉంది. అయితే భజనలో అందరూ ఒక చోట చేరి భగవంతున్ని స్తుతించటం వల్ల అటు వ్యక్తిగతంగాను, సమూహంగానూ వచ్చే ఫలితాలు మానవజాతి సజావుగా ధర్మ మార్గంలో కొనసాగటానికి దోహదపడుతుందనే సత్యంతోనే మన పూర్వీకులు ఈ సంప్రదాయాన్ని మనకు అందించారు. ప్రధానంగా భారతీయ సమాజంలో అధిక శాతం చోటు చేసుకున్న గ్రామాలు, వాటి సంస్కృతికి కూడా గౌరవాన్ని తెచ్చి పెట్టాయి. ఈ నేపథ్యంలో ఈ అధ్యాయపరంగా భజనకు సంబంధించిన అంశాలు భక్తిపరంగా ఏవిధంగా ప్రఖ్యాత మయ్యాయో తెలియజేసే ప్రయత్నం జరిగింది. ఐతే భక్తి యొక్క సాంద్రత ద్రవీకరణం కావటానికి ఏకైక తరుణోపాయం భజన అనే విషయాన్ని తొలిగా గుర్తించినవాళ్ళు మన జానపదులే. అందుకే వారు సంస్కృతి పరంగా అందించిన ఈ భజన సంప్రదాయం ఈనాడు నగరాల్లో కూడా దేవాలయాల్లో చోటు చేసుకున్నదనే విషయం ఇక్కడ చెప్పబడుతుంది.

భక్తి :

'భజ సేవాయం' అనే సంస్కృత ధాతువు నుండి 'భక్తి' అనే పదం పుట్టింది. భగవంతునిపై మానవుని కేర్పడిన అపార ప్రేమ -విశ్వాసాలను భక్తి అని దృఢంగా చెప్పవచ్చు.

మానవులు భగవంతుని మెప్పించడానికి పరిపరి విధాలుగా ప్రయత్నించారు. ఈ ప్రయత్నంలోనే భక్తి అనే ఆయుధాన్ని భగవంతుడిపై ప్రయోగించారని తెలుస్తుంది. 'భక్తి' అనేది అనిర్వచనీయమైన భయం - అభద్రత భావాల వల్ల పుట్టినదని చెప్పవచ్చు.

''ఈశ్వరుని మీద అంతులేని అనురక్తి కల్గి యుండటమే భక్తి'' అని శాండిల్యులు వారన్నారు. భక్తి ఉపాసనా రూపంలో తెలియజేయమబడుతుంది. దీన్నే 'ధ్యానం' అంటారు.

ప్రతి మానవుడు తన జీవితకాలంలో కలిగే ఒడిదుడుకులను, అద్భుతాలను ఏదో శక్తి కలిగిస్తున్నదని, ఆ శక్తి ఆవేదనతో, ఆత్మతో వేడుకొనడం 'భక్తి' అని చెప్పవచ్చు. ''భగవంతుని నిరంతర ప్రేమభావంతో స్మరించే ఉపాసనను భక్తి' అంటారు. భక్తి నదీ ప్రవాహంతో సమానం. భగవంతుని నిరంతరం ధ్యానించటం, అవిచ్ఛిన్న తైలధార వంటిది అని జ్ఞాన బిందువు గ్రంథంలో పేర్కొనబడింది.

భక్తి నిర్వచనం :

మానవ జీవితం సుఖశాంతులతో గడిచిపోవడానికి ధన, పుత్ర, పౌత్ర సంపదలు వృద్ధి పొందడానికి, గతించిన తర్వాత భగవంతునిలో లీనమైపోవడానికి సదా స్మరిస్తూ, మనసును నిల్పి ఉండటమే భక్తి అని నిర్వచించవచ్చు.

భక్తుడు భగవంతుని సన్నిధి చేరటానికి ఎన్నుకున్న ఒకానొక అత్యుత్తమ మార్గమే భక్తి. మానవుడు తన జీవనయాత్రలో జీవితావసరాలన సిద్ధింప చేసుకోవడానికి, భగవంతుని నిశ్చల మనస్సుతో నిరంతరం ధ్యానించడాన్ని కూడా భక్తిగా పేర్కొనవచ్చు.

మానవులు ఇహలోక సుఖాలను, పరలోక సుఖాలను వాంఛించి, వాటిని నెరవేర్చుకొనడానికి పరిపరి విధాల భగవంతుని త్రికరణశుద్ధిగా వేడుకోవడాన్ని భక్తి అని చెప్పవచ్చు.

ఒక విషయ సాధనకు తాను ఏర్పరచుకున్న ప్రత్యేక శ్రద్ధను భక్తి అని చెప్తారు. మానవ జీవితానికి, ఆత్మానందమే పరమార్థం. అలాంటి ఆత్మానందం పొందడానికి అవసరమైన విషయాల్లోనూ, దైవ పూజాది కాల్లోనూ ప్రత్యేకమైన అనురాగ భావాన్ని ఏర్పరచు కోవడాన్ని కూడా భక్తి అని చెప్పాలి.

భక్తి రూపం :

భక్తులు అనేక రూపాలుగా ఉంటారు. కాబట్టి భక్తి అనేక రూపాలుగా విరాజిల్లుతుంది. భక్తి ముఖ్యంగా మూడు రూపాలుగా పేర్కొనడం జరిగింది. అవి. 1. సాత్వికం, 2. రాజసం, 3. తామసం

పోతన భక్తిని తొమ్మిది రూపాలుగా పేర్కొన్నాడు. అవి.

1. శ్రవణంచ 2. కీర్తనం, 3. స్మరణం, 4. పాదసేవనం, 5. అర్చనం, 6. వందనం, 7. ద్యాసం, 8. సఖ్యం, 9. ఆత్మనివేదనం

''తను హృద్భాషల నఖ్యమున్ శ్రవణమున్
దాసత్వమున్ వందనా
ర్చనముల్ సేవయు నాత్మలో నెరయన్ సంకీర్తనల్, చింతనం
బసు నీ తొమ్మిది భక్తి మార్గముల సర్వాత్మున్ హరిన్ నమ్మి స
జ్జనుడై యుండుట భద్రమంచు దలతున్ సత్యంబు దైత్యోత్తమా''

అని స్పష్టంగా పేర్కొన్నాడు.

భక్తి ఎన్ని రూపాల్లో కన్పించినా మోక్షసాధనమే భక్తికి ప్రధాన లక్ష్యంగా కనబడుతుంది. భక్తుడు మోక్షాన్ని పొందడానికి ఇంకా కొన్ని యోగరూపాల్లో సేవిస్తున్నాడు. కర్మయోగం, జ్ఞానయోగం, భక్తియోగం అనే మూడు వద్ధతుల ద్వారా సేవించి ముక్తిని పొందడానికి ప్రయత్నిస్తున్నాడు.

ఆధునిక కాలంలో మానవులు పైన చెప్పిన పద్ధతులే కాక అనేక రూపాల్లో భగవంతుని ఆరాధిస్తూ, భక్తిని ప్రదర్శిస్తూ మోక్ష సంపాదనకు పూనుకుంటున్నారు. కొందరు జ్ఞానవంతులు దానధర్మాల ద్వారా, ఇంకొందరు సమాజసేవ ద్వారా మరికొందరు విద్యాలయ, దేవాలయ, వైద్యాలయాల స్థాపన ద్వారా మానవసేవే మాధవసేవ అని నిరూపిస్తూ భగవంతుని దయకు పాత్రులై మోక్ష సంపాదనకు ప్రయత్నిస్తున్నారు.

కొందరు అనాథలకు సేవా రూపంలో అనాథాశ్రమాలు నిర్మించి వృద్ధాశ్రమాలు స్థాపించి, వారిని పోషించి, విద్యాబుద్ధులు నేర్పించి, సమాజంలో వారి జీవితాల్లో వెలుగులు నింపి భగవంతుని కృపకు పాత్రులై తరిపిస్తు న్నారు. ఇలా భక్తి అనేక రూపాల్లో ప్రదర్శించి మోక్షాన్ని పొందుతున్నారు.

ఆధార గ్రంథాలు :

1. ఎడ్ల బాలకృష్ణా రెడ్డి, జానపద పారమార్థిక గేయ సాహిత్యం, చైతన్య ప్రచురణలు, శ్రీశైలం. 1986.
2. నేదునూరి గంగాధరం, ప్రజావాజ్మయం - భజనలు, మిన్నేరు, రాజమండ్రి, 198ర్.
3. ఆర్వీయస్, సుందరం, ఆంధ్రుల జానపద విజ్ఞానం, పొట్టి శ్రీ రాములు తెలుగు విశ్వవిద్యాలయం, నాంపల్లి హైదరాబాద్.
4. చింతల యాదయ్య, నల్లగొండ జిల్లా జాతరలు - పరిశీలన, హరి ప్రచురణలు, హైదరాబాద్. 1995.

BHAVAVEENA
Vol. 18, Issue. 10, October 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

శ్రీకృష్ణదేవరాయల పాలనలో తెలుగు భాషా వికాసం

– డా॥. వి. గోపాల్, అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రచురణల కేంద్రం, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

సాహితీ సమరాంగణ సార్వభౌముడు, ''ఆంధ్ర భోజుడు'' అని కొనియాడదగిన రాజకవి కవిరాజు అయిన శ్రీకృష్ణదేవరాయల కాలం ఆంధ్ర సాహిత్యం చరిత్రకు స్వర్ణయుగం. పాలకుల కీర్తి కవుల రచనల ద్వారా కలకాలం నిలుస్తుంది. కానీ రాజులే కవులుగా విలసిల్లిన సంఘటనలు అరుదు. శ్రీకృష్ణదేవరాయలు రాజ్య విస్తరణ, ప్రజారంజక పాలనతోపాటు సాహితీ పోషణ కూడా తన విద్యుక్త ధర్మంగా భావించాడు. అన్ని భాషలను సమానంగా ఆదరించి సమైక్యతకు దోహదం చేశాడు. సాహిత్యానికే కాదు సాహిత్యేతర కళలకు కూడా సమున్నత స్థానాన్ని కల్పించిన ఘనత రాయల కాలానికే దక్కుతుంది. రాయలు కేవలం రాజు మాత్రమే కాదు కవి, బహుభాషా కోవిదుడు, లోకజ్ఞానం మెండుగా కల నిండైన వ్యక్తి. అందుకే మహావిష్ణువు ఆముక్త మాల్యదలో-

"తెలుగదేల యన్న దేశంబు తెలుగేను
తెలుగు వల్లభుండ తెలుగొకండ
యెల్ల నృపులు కొలువ యెఱుగవే బాసాడి
దేశ భాషలందు తెలుగు లెస్స"

అని తెలుగు భాషా వైభవాన్ని చాటి చెప్తూనే రాయల కాలం నాటి సాహితీ వాతావరణాన్ని రాయల రాసిక్యాన్ని, కవిపోషణను, బహుభాషా ప్రావీణ్యాన్ని వ్యక్తం చేశాడు.

రాయలు తాను స్వయంగా కవి. తమిళాంధ్ర కర్ణాటక ప్రాంతాలు తమ ఆధీనంలో ఉన్న విజయనగరం (హంపి) రాజధానిగా రాయలు పాలన సాగించాడు. శాసనాలను తెలుగు, కన్నడ, తమిళ భాషల్లో రాయించాడు. సమస్త భాషలకు జనని అయిన సంస్కృతంలో "జాంబవతీ కళ్యాణం" (నాటకం) రాశాడు. సంస్కృత కవులయిన లొల్ల లక్ష్మీధరుడు, దివాకరుడు, బండారు లక్ష్మీనారాయణ మొదలగు వారికి ఆశ్రయమిచ్చాడు. ఆముక్తమాల్యద అనే ప్రౌఢ ప్రబంధాన్ని రసోత్కృష్టంగా రచించాడు. మదాలస చరిత్రము, సత్యావధూ పరిణయము, సకల కథారసార సంగ్రహం, జ్ఞాన చింతామణి, రస మంజరి వంటి బహుకావ్య స్రష్ట, రాయల ముందుకాలం వరకు సంస్కృత సాహిత్యంలోని సమస్త కావ్య ప్రక్రియలు శాఖోపశాఖలుగా విస్తరించడం వల్ల రాయల కాలం నాటి కవులు స్వతంత్రించి నూత్నకావ్య నిర్మాణాన్ని ప్రారంభించారు. నాటికాల జీవనంలో భోగం, వికాసం అధిక ప్రాధాన్యాన్ని సంతరించుకోవడం వల్ల విలాసవంతమైన జీవితాన్నే కవులు కూడా కాంక్షించారు. హితోపదేశాన్ని చేయడమే కావ్య పరమార్థం కాదని హృదయాహ్లాదాన్నందించాలనే భావన నాటి కవులలో అపారం. అందుకే కవిత్వకళలు ప్రబంధ యుగంలోనే కొత్తదారులు పట్టాయి. సాహిత్యంలో స్వర్ణ యుగ కాంతులను వెదజల్లాయి. మనుచరిత్ర, వసుచరిత్ర, పారిజాతాపహరణం వంటి రసప్రబంధాలు, పాండురంగ మహాత్మ్యం, శ్రీకాళహస్తీశ్వర మహాత్మ్యం వంటి క్షేత్ర మహాత్మ్య కావ్యాలు, రాఘవ పాండవీయం వంటి కవి ప్రతిభను చాటే ద్వ్యర్థి కావ్యాలు రాయల కాలం నాటి సమకాలీన పరిస్థితులను ప్రతిబింపచేస్తున్నాయి.

శ్రీకృష్ణ దేవరాయలు రెండవసారి కటకంపై దండెత్తి నప్పుడు మార్గమధ్యంలో దివిసీమలోని శ్రీకాకుళ ఆంధ్రదేవుణ్ణి దర్శించుకొని ఆ రోజు అక్కడే విశ్రమించాడు. ఆంధ్ర మహావిష్ణుడు ఆయనకు కలలో కనిపించి, అనేక కావ్యాలతో సంస్కృత భాష మెప్పపొందావు, ఆంధ్రభాషలో ఒక కృతిని వినిర్మించమని చెప్పి, తెలుగులో ఎందుకిన తానే ప్రశ్నించి దేశం తెలుగుదేశం కావటం వల్ల, తాను తెలుగు 'వల్లభు' (ఆంధ్ర విష్ణువు)డు కాబట్టి, తెలుగు కండకల్గిన భాష కనుకనూ ముఖ్యంగా ఎందరో నృపతులతో కృష్ణరాయలే ''దేశ భాషలందు

తెలుగు లెస్స" అని బాసచేసి ఉండటం చేత తెలుగు భాషలోనే, శ్రీరంగంలో తాముడిచిన మాలను తనతో ధరింపచేసిన గోదాదేవితో తన వివాహాన్ని కథా వస్తువుగా సూచించాడు. కావ్యాన్ని రాయలు ఎంతో ప్రేమతో కొల్చే వేంకటపతి కిమ్మని చెప్పాడు. రాయలు నిద్ర నుండి మేల్కొని కాలకృత్యాలు తీర్చిఅక్కడే ఉన్న మండపంలో ఆముక్తమాల్యద లేక విష్ణు చిత్తీయము అనే ప్రబంధ రచనకు ఉపక్రమించాడు. ఆ కావ్యం అనేక కారణాలుగా విశిష్టమైనది.

తెలుగు భాషలో ఒక మహాచక్రవర్తి సంతరించిన కావ్యమిది, విష్ణుపారిమ్యాన్ని సూచించే, పెరియాళ్వారుగా పిలువబడిన విష్ణుచిత్తుడనే హరిభక్తుని కథ, అతనికి అయాచితంగా లభించిన కూతురు గోదాదేవి. బాలకృష్ణ హరిని వలచి, వలపింప చేసుకొని పెండ్లాడిన కథ. ఇందులో విష్ణుచిత్తుని ముగ్ధ భక్తి, గోదాదేవి మధుర శృంగార భక్తి, ఖాండిక్య కేశిధ్వజుల ఆధ్యాత్మిక భక్తి యామునాచార్యుని జ్ఞానభక్తి, మాలదాసరి యొక్క దాస్యభావనా సంకలితమైన అనన్య నిష్ఠాభక్తి సందర్భోచితంగా అత్యద్భుత రీతిలో రచింపబడ్డాయి. ఆయా సందర్భాలకు, సంఘటనలకు అనుసంధానం కల్పిస్తూ కథలల్లిన తీరు అద్వితీయమనిపిస్తుంది. అక్కడక్కడ వచ్చే నగర, గ్రామీణ జీవన వైచిత్రి, ప్రకృతి వర్ణనలు, రాజసభలు, రాజుల విలాసాలు, విద్యాగోష్ఠులు, పండితుల ఈర్ష్యాసూయలు వెలయాండ్ర విశేషాలు, ఋతువుల విన్యాసాలు, ఎంత మనోజ్ఞంగా ఉన్నాయంటే ఈ విధమైన రచన వెనుక లేదు ముందు రాదు అనిపించేంతగా ఉంది. ముఖ్యంగా ప్రజా జీవనంపై అయనకున్న సదావగాహన రైతుల వైభవాలు ప్రకృతిలో గోచరించే సాధారణ వస్తువుల్లోని అసాధారణమైన అందాలు రాయల సునిశిత పరిశీలనా దృష్టికి, మదిలో మెదిలే ఊహలకు అయన రూపము కూర్చే శైలి అనితర సాధ్యమైన కల్పనా చమత్కృతికి తారణాలుగా నిలుస్తాయి.

ఆయన సంస్కృత రచనలు అయిదూ దొరక్క పోయినా ఆయన తెలుగు రచన ఆముక్తమాల్యద ఒక్కటి చాలు ఆయనను సాహిత్య సార్వభౌముణ్ణి చేయడానికి. అది మనకు లభించడం నిజంగా తెలుగు వారి అదృష్టం. అందుకే అది తెలుగువాళ్ళు స్థూలంగా ఎన్నిక చేసిన పంచకావ్యాల్లో (ఆముక్తమాల్యద, శృంగార నైషదం, మనుచరిత్ర, వసుచరిత్ర, పారిజాతాపమరణం) తలమానికమై భావిస్తుంది.

తెలుగు సాహిత్యం విషయంలో రాయల యుగం, చరిత్రలో తెలుగు జాతికి స్వర్ణయుగం. భోజునిఆస్థానంలో నవరత్నాలులాగా రాయల సభ అష్ట దిగ్గజాలతోనూ (తనతో పాటు నవరత్నాల తోనూ) కళకళలాడేది. అల్లసాని పెద్దన, ముక్క తిమ్మన, ధూర్జటి, యాదయగారి మల్లన, అయ్యం రాజు రామభద్రకవి, భట్టు మూర్తి, పింగళి సూరన, తెనాలి రామకృష్ణుడు కవులు అష్టదిగ్గజ కవులు మాత్రమే కాక, ఆయనతో సన్మానాలందుకొన్న వారు మరెందరో! ఆనాడు తెలుగు సాహిత్య వర్గం చూపంతా రాయల విజయనగరం వైపే ఉండేది. తామర తంపరగా వచ్చి తమ ప్రతిభా విశేషాలతో ప్రభువునలరించి కానుకలు అందుకొని మరీ వెనుదిరిగిన వారెందరో.

రాయల వారి ప్రేరణతో ప్రబంధ సాహిత్యం ఆనాడు సుగంధ పూరితములైన ఎన్నో కావ్య కుసుమాలతో వికసించి తెలుగు తల్లి సిగపూవుగా వాసికెక్కింది. ఆయన కేవలం తెలుగు భాషా కవులనే కాక అనేక సంస్కృత, కన్నడ, తమిళ, మలయాళ కవుల్ని కూడా ప్రోత్సహించాడు. తిమ్మన్న కవి రచిత అష్టోత్తర భారత పర్వాలు కన్నడంలో వెలువడ్డాయి. వీరశైవ మహాపురాణకర్త గుబ్బిమల్లణార్యుడు రాజు గారిచే బహుదా సన్మానింపబడ్డాడు. సంగీత కళాశాస్త్రం, వైద్యశాస్త్రం, అశ్వశాస్త్రం ఇలా అనేక శాస్త్రాల్లో కృతులు వెలువడి కీర్తికెక్కాయి. తమిళంలో మంజరిప్పా, ఇరుసమయ విళక్కం, గణపతి కూతురుతో రాయల వివాహం గురించిన కావ్యం మొదలైన కృతులతో ఆయన అన్య భాషాహిత్య ప్రియుంభావుకత్వం బోధపడుతుంది.

శ్రీకృష్ణదేవరాయల కాలంలో తెలుగు సాహిత్యంలో ప్రబంధ సాహిత్యంలాగే కన్నడ భాషలో దాస సాహిత్యం అనే ప్రక్రియ అత్యుచ్చదశకు చేరుకుంది. అధ్యాత్మిక గురువు వ్యాసరాయులు, కర్ణాటక సంగీత పితామహుడు పురందరదాసు, విప్లవవాదిగా పేర్కొనదగిన కనకదాసు రాయల అభిమానాదరాలు పొందినవారే.

శ్రీకృష్ణదేవరాయలు సంస్కృతాన్ని కూడా చక్కగా పోషించాడు. ఆయన స్వయంగా సంస్కృత భాషలో విద్వాంసుడు. రాయల ఆస్థానంలో లొల్ల లక్ష్మీధర పండితుడు అనే బ్రాహ్మణ విద్వాంసుడు ఉండేవాడు. రాయల మంత్రి అయిన తిమ్మరసు కూడా గొప్ప సంస్కృత విద్వాంసుడు. ఆయన అగస్త్య భారతానికి వ్యాఖ్యానం రాశాడు. అతని మేనల్లుడు నాదేండ్ల గోపన ప్రబోధ చంద్రోదయానికి టీక రాశాడు. విజయనగర ఆస్థానానికి పలువురు మతబోధకులు వచ్చి శాస్త్ర చర్చలు జరిపేవారు. ఈ కాలంనాటి రచయిత్రుల్లో వరదాంబికా పరిణయము రాసిన తిరుమలాంబ, మధురా విజయము రాసిన గంగాదేవి ప్రశంశార్హులు, ప్రఖ్యాత మత సంస్కర్తలు వల్లభాచార్యుడు, వ్యాస తీర్థులు, విజయేంద్రులు మొదలైన వారిని విజయనగర ప్రభువులు ఆదరించినట్లు తెలుస్తుంది.

తెలుగు సాహిత్యం మూడు పువ్వులు ముప్పై కాయలుగా రాణించడం గురించి చెప్పుకున్నాం. రాయల ప్రేరణతోనే శిరీషకుసుమపేశలమైన శైలిలో ద్రాక్ష గుళుచ్ఛ సుధాధర అయిన "మను చరిత్ర" అల్లసాని వారి జిగిబిగి అల్లికతో తెలుగు సరస్వతి మణిహారమై మొప్పారింది. మాధుర్యానికి, మంజులత్వానికీ ముద్దుపలుకులకూ పేరెన్నికగన్న "పారిజాతాపహరణం" వెలువడి తత్కావ్య నాయిక సత్యభామాదేవి, ఆంధ్రుల ఇంటి ఆడపడుచులా మన్ననలందించింది, "కాళహస్తి మహాత్మ్యం" లాంటి భక్తికావ్యం "రాజశేఖర చరిత్ర" లాంటి కవితకునిర్వచనం లాంటి గ్రంథమూ, రామాయణాంతర్గత కథా కావ్యం రామాభ్యుదయమూ, శ్లేషకు ఆత్మ స్వరూపంగా, సంగీతమయ కావ్యంగా "వసుచరిత్ర" చిత్రవిచిత్ర కల్పనల సమాహారంగా "కళాపూర్ణోదయం" ప్రౌఢకావ్యంగా పదగుంపనకు ప్రసిద్ధిగాంచిన "పాండురంగ మహాత్యమూ" రాయల ప్రేరణతోనే వెలుగు చూసి తెలుగుతల్లికి తొడువులై, జాతికి అంతులేని సిరిసంపదలై గణతికెక్కాయి. ప్రపంచ సాహిత్య చరిత్రలో ఏ భాషాకవి పొందని విధంగా అల్లసానిపెద్దన కవికి పల్లంకి బోయియై రాయలు భుజమిచ్చి వన్నించడం ఆయన అనితర సాధ్యమైన తెలుగు సాహిత్య ప్రేమకు అద్భుత నిదర్శనం.

రాయల సాహిత్య గోష్ఠులకు వేదిక నాటి "భువన విజయం" అనే భవనరాజం. అనంత వైభవంతో విలసిల్లేది. సమస్యాపురణం, కావ్యరచనలు, పరదేశాల నుంచి వచ్చిన వారి ఎదురు సవాళ్లు, వాళ్లకు ధీటైన జవాబులు, అశువులు, వర్ణనలు,రాయల వారి సాహిత్య పిపాసకు కొన ఎక్కడ. ఆయన సాహిత్యగోష్ఠులు కేవలం భువన విజయానికే పరిమితం కాలేదు. ఎక్కడకు వెళ్ళినా ఆంధ్రకవి బృందం వారిని వెన్నంటే ఉండేది. యుద్ధ భేరీలు నిరంరాయంగా మ్రోగుతుండిన రణభూమిలో సైతం యుద్ధమాగిన పిదప అల్లసానిపెద్దన, మాదయగారి మల్లన, ముక్క తిమ్మన మొదలైన కవివరులతో ఆనందంగా కవితా రసామృతపానం ఆయనకు నిత్యవిధి. ఆయన రచన ఆముక్తమాల్యదలో ప్రతి ఆశ్వాసాంత పద్యంఆయన అప్పుడే విజయం సాధించిన యుద్ధ నేపథ్యాన్ని కళ్లకు కడతాయి. ఈ సాహిత్యాభిమానం ముఖ్యంగా ఆంధ్ర సారస్వతాభిమానం ఆయనకే పరిమితం కాక ఆయన మంత్రులూ అపరనాయకులకూ కూడా విస్తరించడం విశేషం. చివరికి రాయల కుమార్తే మొహనాంగి (తిరుమలాంబ) కూడా తెలుగులో "మరీచీ పరిణయము" అనే సరసకావ్య రచన చేసి ఆనాటి బుధాళిలో పేరెన్నికగన్న రచయిత్రికి కుమ్మరి మొల్ల సరసన చేరింది.

ఏ దేశమైనా సాంస్కృతికంగా అభివృద్ధి చెంది, సృజనాత్మక రచనలపై కవి పండితులు, లలితకళల పట్ల కళాకారులు అధికమైన అభినివేషంతో నైపుణ్యాన్ని

సాధించాలంటే ఆదేశం ఆర్థికంగా, రాజకీయంగా సుభిక్షంగా ఉండాలి. కళాకధకులైన పాలకులుండాలి. ఉత్సాహవంతమైన, ఉల్లాసవంతమైన జీవన విధానం, ప్రజల్లో భోగతృష్ణ ఉంటే హృదయాలలో వినోదం వెల్లివిరుస్తుంది.

రాయలయుగం నాటి ప్రజా జీవనంలో స్వేచ్ఛామయ జీవనం ఉండడం వల్ల వారి ఆలోచనల్లో స్వేచ్ఛ ఉంది. అందుకే నాటి సాహిత్యం కూడా స్వతంత్ర లక్షణాలతో పుణికి పుచ్చుకుంది. రాజకీయంగా సుభిక్షంగా సిరి సంపదులతో తులతూగే రాజ్యంలోనే కళలు పోషింప బడతాయి. వినోదాత్మక కార్యక్రమాలకు ప్రాధాన్యత ఉంది. ఈ రకమైన వాతావరణం రాయల యుగ సమాజంలో ఉండడం వల్లనే సాహిత్యానికి, కళలకు స్వర్ణయుగం అయ్యింది.

BHAVAVEENA
Vol. 18, Issue. 10, October 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

తెలుగు సాహిత్యంలో ప్రబంధ కేతనం – జయధ్వజం

– డా॥. జి.భాస్కర్ యాదవ్, ఆంధ్ర విద్యాలయ కళాశాల తెలుగు శాఖ అధ్యక్షులు, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

''ఉపదేశము'' సాహిత్యమౌలిక ప్రయోజనాలలో ఒకటని మన ప్రాచీన అలంకారికులు స్పష్టంగా తీర్మానించారు. సాహిత్యానికి మరో మౌలిక ప్రయోజనం ఆనందం. ''ఉపదేశము'' అనే ఆనాటి మాట చోట దాదాపు అదే అర్థాన్ని ప్రకటించే "ప్రబోధము" అనే పదాన్ని తీసుకుందాం. కవిత్వం ప్రబోధించాలి. అయితే కేవల ప్రబోధ కవితలకు కళాత్మక విలువలు ఉంటాయను కోలేము. కళా విలువలున్న ప్రబోధ కవితలు బాగా అరుదు. ఇవి సుదీర్ఘ కాలంపాటు నిలబడతాయి. నాడు జాతీయోద్యమం ఉధృతదశకు చేరిన స్థితిలో కోస్తాంధ్ర ప్రాంతంలో ఎందరెందరో రచించిన ప్రబోధ కవితల్ని నేటి తరం కూడా పాడుకుంటోంది. కాపడుకుంటోంది. చక్కని కళావిలువలు ఉండడమే ఇందుకు కారణం. రాయప్రోలు వారి "ఏ దేశమేగినా ఎందు కాలిడినా" అనే పాటను ఇందుకు చక్కని ఉదాహరణగా తీసుకోవచ్చు. ప్రబోధావసరం బాగా ఉన్న సందర్భాలలో వెలువడిన కావ్యాలకు ఆయా సందర్భాలలో చక్కని గుర్తింపు లభిస్తుంది. ఇదివరకే పేర్కొన్నట్టు వాటిలోని కళావిలువల స్థాయి ననుసరించి ఆయా కావ్యాల ప్రచార గీతాలతో ఉత్తేజితులవుతారు. అటు తర్వాత అవి కళావిలవల కారణంగానే నిలబడతాయి. లేదంటే కాలగర్భంలో కలిసిపోతాయి. మన దేశానికీ చైనాకు మధ్య - మనకూ పాకిస్తాన్ దేశానికీ మధ్య జరిగిన యుద్ధాల నేపథ్యంలో ఎన్నో ప్రబోధ కావ్యాలు వచ్చాయి. 1999 నాటి కార్గిల్ యుద్ధ సందర్భంలోనూ ఇటువంటి కావ్యాలు వెలువడిన సంగతి ఈ తరానికి కూడా తెలసిందే. 1965లో భారత్ - పాకిస్తాన్ మధ్య ఘర్షణ ఏర్పడి అది యుద్ధానికి దారి తీసినపుడు వరదాచార్యుల ఎదలోని జాతయావేశం ఉప్పొంగింది. ఈ స్థితిలో ఆయన రచించిన కావ్యమే జయధ్వజము. ఈ రచనను నేటికీ విమర్శకులు ప్రశంసిస్తున్నారు. అందులో కవితా సాంద్రత ఉండడమే అందుకు కారణం. జయధ్వజము కావ్యం వెలువడిన తరువాత ఆనాటి రెండు ప్రపముఖ వారపత్రికలు ఆ కావ్యాన్ని సమీక్షిస్తూ ఇట్లా వ్యాఖ్యానించాయి.

''నాయకుల స్తుతి, మహావీరుల సంస్మరణ, వందన సమర్పణ శీర్షికలతో ఈ కృతి మన దేశ చరిత్రను ఒక్క మాటుగా కళ్ళకు గట్టినట్లు ప్రదర్శిస్తుంది. ఝాన్సీ, భగత్‌సింగ్, తిలక్, బోస్, వల్లభ భాయి, సరోజిని, విశ్వదాతల వంటి మహామహులు జ్ఞాపకానికి వస్తారు. చైనావాడిని పాకిస్తాన్‌ను ముఖ్యంగా భుట్టోను కవిగారు నిర్మొహమాటంగా దులిపి వదిలారు. ఈ ఘట్టాలలో పద్యరత్నాలు ఉద్రేకాన్ని రేకెత్తించి తీరుతాయి. ఒక్క భారతావని గురించేకాక అమెరికా వియత్నాముల విదేశీయ రాజకీయాలు కూడా ఇందులో అభివర్ణిత మైనాయి. మన శత్రువులను ద్వేషించడానికి తద్వారా జాతీయతను ప్రదర్శించడానికి ఇటువంటి కావ్యాలు గొప్పగా ఉపకరిస్తాయి.

ఆంధ్రపత్రిక - వారపత్రిక :

''పోతన జీవిత చరిత్రను మహాకావ్యంగా రచించి చిరకీర్తి సాధించిన అభినవ పోతన వానమామలై వరదా చార్యులుగారు భక్త కవులే కాదు, జాతీయతను దేశభక్తిని ప్రబోధించు ఉత్తమ జాతీయ కవులు కూడా. జయధ్వజం మనకు గల ఉత్తమ దేశభక్తి కావ్యాలలో నిస్సందేహముగా ఒకటియని చెప్పవచ్చును.''

కృష్ణా పత్రిక :

పై సమీక్షలో తెలిపినట్టు జయధ్వజం ప్రచురణపొందే నాటికి వానమామలై వారి పోతన చరిత్రము ఆంధ్ర దేశమంతటా విస్తారమై గుర్తింపును పొందింది. అనేక వందల పద్యాల ఆ మహాకావ్యం కాల్పనిక రీతికి మంచి

ఉదాహరణ. అయితే జయధ్వజంలో ఉన్నది ప్రధానంగా సమకాలీన వాస్తవికత. తాను ఒకేరీతి రచనలకు కట్టు బడననీ, వైవిధ్య ప్రవృత్తి తన కవిత్వ లక్షణమనీ జయధ్వజం కృతిద్వారా వరదాచార్య నిరూపించుకున్నారు. ఈ కావ్యం 1966లో ప్రచురణను పొందింది. ఇది ఆయన మూడవ ఖండకావ్యం. అప్పటి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఆర్థికమంత్రి డాక్టర్ మర్రి చెన్నారెడ్డికి ఈ కావ్యాన్ని అంకితం ఇచ్చారు. ఇందులో 1965లో భారతదేశంపై పాకిస్తాన్ దాడి ప్రయత్నాలు, కాశ్మీర్ దురాక్రమణ కుట్రలు, 1962లో చైనా అహంకారపూరిత దురాక్రమణ ఘట్టం - 1961లో పోర్చుగీసు నుండి గోవా విముక్తి వంటి అంశాలు ఉన్నాయి. 1961-65 వరకు సంభవించిన యుద్ధ సంగతుల్ని ఉద్విగ్న భరితంగా, జాతీయకాంక్షలు పదిలపడే విధంగా వరదాచార్య వ్యక్తీకరించారు. కావ్యంలో 74 పుటలున్నాయి. నందీశ్వరుడి వీపుమీద నగారాను మోగిస్తూ జ్యోతిర్మార్గంలో పయనిస్తున్న వీర భారతీయుని విజయదరహాసాన్ని ముఖచిత్రంగా తీర్చిదిద్దారు. మొట్టమొదటి ఖండిక త్రిశ్ర గతిలో నడిచింది. ఈ ఖండిక పేరు 'శాంతి దేవత'. చిట్టచివరి ఖండికపేరు 'జయధ్వజం'.

కావ్యమంతా ఒకే రచన కాదు. ఒక దీర్ఘకావ్యంలో లేదా ఆధునిక దీర్ఘకవితలో వస్తువు ఏకీకృతంగా ఉంటుంది. అందువల్ల ఆ వస్తువును తీర్చిదిద్దడం అతి సులువు. కానీ, జయధ్వజంలో మొత్తం 31 కవిత లున్నాయి. అయినప్పటికీ వస్తుగతమైన ఏకీకృత స్ఫూర్తిని నిలబెట్టడంలో వరదాచార్య ప్రతిభ వ్యక్తమైంది. ఆయనలోని నిసర్గమైన జాతీయవాది దాదాపు ప్రతి కవితలోనూ కనబడతాడు. జాతీయ ప్రబోధ కావ్యాలలోని సాధారణ లక్షణాలు జయధ్వజంలోనూ ఉన్నాయి.

భారతదేశాన్ని మాతృమూర్తిగా భావించే సంప్రదాయం ఈనాటిది కాదు. ఇది భావోద్విగ్నతలకు సంబంధించింది. జాతీయాభిమానాన్ని ఇతోధికంగా పెంపొందించే భావన ఇది. ఆనాటి వందేమాతర గీతం నుండి ఇప్పటివరకు అదే స్ఫూర్తిని జాతి యావత్తూ ప్రదర్శిస్తోంది. జాతి తొలి ఉపాస్య దైవం ఆ దేశపు మట్టి, అదే గొప్ప సంపద. మాతృదేశ సంకీర్తనం జాతీయ కవికి ఎంతో గొప్ప బాధ్యత. వరదాచార్య భక్తిపూర్వకంగా భారతమాతను కీర్తించారు. "జయగీతి", "వందనము" అనే రెండు గీతాలు ఇందుకు సంబంధించినవే. జాతీయత వరదన్న కవితకు ఆత్మ అని నిరూపించే రచనలివి.

"జయ భారతావనీ, జయలోక పావనీ
శాంతి సుఖదాయినీ జననీ నమస్తే
హిందు ముసల్మాను ఈసాయి సిఖ్ జైన్
బౌద్ధ చార్వాక మత బహుసుత కుటుంబినీ
సంస్కృతాంధ్ర ద్రవిడ వంగ హిందీ ఓఢ్ర
ఘూర్జర మరాఠ కర్ణాట కలభాషిణీ
నీమహోన్నతి హిమానీ గోత్ర శిఖరమ్ము
నీ పవిత్రత గాంగ నిర్ఝరప్రవాహమ్ము
నీ చేతి సొమ్మెలోరా శిల్పఖండమ్ము
నీదు వాక్యమ్ము శ్రీ గీతోపదేశమ్ము
(జయధ్వజం పుట 28, 29).

జాతీయ సమైక్యతా ప్రబోధం జయధ్వజంలో ప్రతిధ్వనిస్తుంది. జాతి జీవనంలోని విభిన్నత్వం చివరకు ఏకత్వంగా మారగలిగిన తీరు భారతదేశపు విలక్షణత్వం: జాతి పౌరులుగా ఉన్న వారందరూ ఒక్కటే అన్నది గొప్ప ప్రబోధం. "విభిన్నత్వ ఏకత్వ స్ఫూర్తి" ఈ రచనలో స్పష్టపడుతోంది.

"పుత్ర పుష్ప ఫలశాఖలు
బహుభేదమ్ములు నటువలె
పరికించుచు నొక బీజ
ప్రకారమ్ములే యనవలె
ఏకత్వపు పునాదిపై
యొసగునట్టి నానాత్వము
ఆవర్తతరంగ బుద్బు
దాకృతులగు జలధిత్వము
ఏ భక్తుండే దైవమ్మే దైతే మోయ్ వర్ణము
ఆచరణ విభేదమ్ములె అంతయు నొకే సువర్ణము"

యుద్ధకాలపు కవిత్వం ఉద్రేక పూరితంగానే ఉండాలి. శబ్దాలు అగ్ని పర్వతాల వలె కనిపించాలి. యుద్ధం వైపు సామాన్యుడు సైతం దృష్టిని సారించే తీవ్రత వాటిలో కనబడాలి. యుద్ధకాలంలో శత్రుదేశం పట్ల తీవ్రమైన ఆగ్రహం పెల్లుబుకడం సహజమే. ఈ ఆవేశానికి కవి కవితలు ప్రతిబింబాలు కావాలి. వరదాచార్య "ఖబడ్దార్" అన్న కవితలో మన శత్రువులను హెచ్చరించారు. సమైక్యంగా ఉండాలని భారతీయులకు ప్రబోధ చేశారు.

"ఖబడ్దార్ పాక్‌భాయ్, కాశ్మీరు మాదేనోయి
పరధన వనితా చోరుల భారతము సహించదోయ్" అంటారు కవి. "కట్టర్ భుట్టో", "శునకము పని", "ఏమి చేయగలవు", "కాకిగోల", "ఎవడు" వంటి ఖండికలన్నీ బలమైన అభివ్యక్తితో కూడినవే.

భారతీయ సహనాన్ని, దురాక్రమణలు చేయాలనుకునే వారిపట్ల భారతీయులు క్రియాశీలక పద్ధతిలో సాగించే సమర విన్యాసాన్ని "మా దేశం" తదితర కవితల్లో వరదాచార్యులు వ్యక్తీకరించారు. సామరస్యం - సమరం ఈ రెండూ సందర్భానుసారంగా తమ సంస్కృతిలో భాగాలని చెబుతున్నాడు కవి.

"ఎవ్వడు లేడిల పగవాడు, మేమెవ్వరికిని దలపము కీడు
మా జోలికి ఎవ్వడు రాబోడు మరి వచ్చిన ప్రాణంతో పోడు" (మా దేశం) అంటూ భారత సత్తాను ప్రకటించారు కవి.

స్వర్గీయ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రిని ఎన్ని సంవత్సరాలు గడిచినా భారత ప్రజానీకం గుర్తుంచుకుంటుంది. పట్టుమని పద్దెనిమిది నెలలే ప్రధాని పదవిలో ఉన్నా అపూర్వనేతగా అందరి మన్ననల్ని అందుకున్న ప్రజాస్వామ్య వీరుడు లాల్‌బహదూర్. 1965 లో జరిగిన యుద్ధంలో పాకిస్తాన్ పై మన సైన్యం ఘన విజయాన్ని సాధించడం వెనుక లాల్ బహదూర్ భూమిక అత్యంత కీలకం. అటు వ్యూహ చతురతతో ఇటు సాహసిక ప్రవృత్తితో యుద్ధకాలంలో ఆయన సముచిత నిర్ణయాలు తీసుకున్నారు. సైనికులకు ధైర్యాన్ని కల్పించారు. సామాన్యులకు వినూత్న స్ఫూర్తిని కల్పించారు. లాల్ బహదూర్ పట్ల వరదాచార్యకు అపరిమిత అభిమానం. అందుకే

"ముంచుకొండ గుండియలతో మాతృభూమి
రక్షకై దీక్షగొనిన హర్యక్షమీవు" అంటారు. ఇక్కడ హర్యక్షం శబ్దాలంకారం కోసం వాడిన ప్రయోగం కాదు, మూర్తి చిన్నదే అయినా కీర్తి గొప్పది అని చెప్పే హర్యక్షం.

1961లో పోర్చుగీసు పాలన నుండి గోవా విముక్తి సామాన్యమైన ఘట్టమేమీ కాదు. అయితే ఎందుకో ఏమో ఈ విముక్తి పోరాట ఘట్టానికి తెలుగు కవిత్వంలో తగినంత చోటు దొరకలేదు. కానీ వరదాచార్య ఆ అపూర్వ ఘట్టాన్ని కవితా వస్తువుగా తీసుకున్నారు.

చిలకమర్తివారి "భరతఖండంబు చక్కని పాడియావు" తరహాలో ఒక పద్యం చెప్పారు.

"గోవా నీ క్షీరమ్ముల
పావన వత్సముల బాపి పాపియయిన యా
కావలి గొల్లడు కాళ్ళుల
లోవడి బంధమిడి యమ్మరో పితుకకొనున్..."

'స్మృతి" మనలోని "విస్మృతి"ని తొలగిస్తుంది. స్మృతి కవితలు సహృదయుడిలోని ఆర్ద్రతను మరింతగా పెంపొందిస్తాయి. "బాబు వియోగము", "జోహార్లు" వంటి ఖండికలు స్మృతిరచనలు. గాంధీజీ, బోసు, తిలక్, ఝాన్సీరాణి, నెహ్రూ, భగత్‌సింగ్ ఇట్లా అనేకమంది మహానీయులను స్మరించారు వరదాచార్య.

నాయక ప్రశంన మాతృభూమిని కీర్తించడం, శత్రువుల్ని హెచ్చరించే తీరు, జాతీయ సమైక్యతను నొక్కి చెప్పడం, విజయాన్ని కోరుకునే తత్వం, జాతిని నిలబెట్టిన కర్మవీరుల స్మరణం - ఇవన్నీ ఉన్న జయధ్వజం అచ్చమైన జాతీయ కావ్యం.

"ఆచార్యులవారి జయధ్వజంలోని మొత్తం గేయాలలో అంతస్సూత్రంగా భారతదేశ యాత్ర సాగినది. ఇదే వీరి

ప్రత్యేకత'' అన్నారు ప్రసిద్ధ వక్త, విమర్శకులు డాక్టర్ ఇరివెంటి కృష్ణమూర్తి.

''ఇది శ్రీశ్రీ యుగమంటారు కొందరు. విశ్వనాథయుగ మనుకొంటున్నారు మరి కొందరు. ఈ రెండూ భ్రాంతులే, నిజానికది జాతీయ యుగమంటున్నాను నేను. ఈ యుగాని కెత్తిన గరుడస్తంభం శ్రీమాన్ వానమామలై వరదాచార్యులవారు'' అని జయధ్వజం కావ్యంపై ప్రతిస్పందించారు డాక్టర్ ముదిగొండ శివప్రసాద్.

''కావ్యమునందలి గేయములన్నియు ప్రశస్త దేశభక్తి గీతములై ఆచార్యులవారి జాతీయ కవితకు జయధ్వజ మెత్తినవి'' అని వ్యాఖ్యానించారు డాక్టర్ అందె వెంకట రాజం.

BHAVAVEENA
Vol. 18, Issue. 10, October 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావ వీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

పదమూడో ఆళ్వార్ వట్టికోట

- గాదె చంద్రశేఖర్, పరిశోధక విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం

దక్షిణ భారతదేశంలో విశిష్టమైన భక్తితత్వం నెలకొని ఉంది. చరిత్ర కూలంకషంగా పరిశీలించి చూచినట్లయితే, తమిళ సాహిత్యంలో ఆళ్వార్ల ప్రస్తావన మనకు కని పిస్తుంది. శ్రీమన్నారాయణుని ఆరాధనా సంకీర్తనాదులలో పరవశించి ఉన్నందున వారికి ఆళ్వార్లు అనే పేరు సార్థకమైంది.ఆళ్వార్ అనగా దైవభక్తిలో మునిగి ఉన్నవారు (విష్ణుభక్తులు) అని అర్థం.ఆళ్వార్ అనే పదానికి జ్ఞానఖని, కాపాడువారు, లోతును చూసినవారు, అనే అర్థాలు కూడా వాడుకలో ఉన్నాయి. ఆళ్వార్లు 12 మంది. వీళ్ళందరు అస్థికులు. వైష్ణవభక్తి తత్వాన్ని ప్రచారం చేసినవారు. మధ్యయుగ భారతదేశ చరిత్రను చూచినట్లయితే, చోళులు , చాళుక్యుల మధ్య విష్ణుతత్వం, శైవతత్వం ప్రబలంగా ఉండి, శివ, కేశవుల కోసం యుద్ధాలు చేసుకున్నారు. అవి చారిత్రక పుస్తకాల్లో స్పష్టంగా నిక్షిప్తం చేసి ఉన్నాయి. వైష్ణవభక్తి పరాయణులైన 12 మంది ఆళ్వార్లను పేర్కొన్నాను.1.పొయ్‌గయాళ్వార్ (సరోయోగి) 2.పూదత్తాళ్వార్ (భూతయోగి) 3.పేయాళ్వార్ (మహాయోగి) 4.పెరియాళ్వార్ (భట్టనాథులు) 5.తిరుమళిశైయాళ్వార్ (భక్తిసారులు) 6.కులశేఖరాళ్వార్ (కులశేఖరుడు) 7. తిరుప్పాణ్‌యాళ్వార్ (మునివాహనులు) 8.తొండరడిప్పొడి (భక్తాంఘ్రి రేణువు) 9. తిరుమంగయాళ్వార్ (పరకాలయోగి) 10.ఆళ్వారుక్కు అదియాన్ (మధురకవి) 11.అండాళ్ (గోదాదేవి) 12.నమ్మాళ్వార్ (శఠకోపముని). ఆళ్వార్లు గురించి నిర్దిష్టమైన ఆధారాలు లేవు.వీరు ద్వాపర యుగాంతంనుండి కలియుగారంభం మధ్య ఉద్భవించారని సంప్రదాయ గాథలు.

దాశరథి కృష్ణమాచార్యులు వట్టికోట ఆళ్వారుస్వామి జీవితాన్ని నిశితంగా పరిశీలించి జన్మతహ: వైష్ణవుడు కాబట్టి భక్తితత్వ భావజాలం మెండుగా ఉన్న ఆళ్వార్ స్వామిని 13వ ఆళ్వార్‌గా పేర్కొన్నాడు. యాదృచ్ఛికంగా జరిగిందో, ఆ దైవ సంకల్పమో చెప్పలేము కాని, వట్టికోట ఆళ్వారుస్వామి కూడా వైష్ణవభక్తుడే కావడం విశేషం. అట్టి విశేషాలను ఉదాహరిస్తున్నాను.

నిర్మలమైన మనస్సుకు నిజంగా అతడు ఆళ్వారే. కలదని లేదని కలత ఎందుకు మంచి హృదయంలోనే కలడు ఆ దైవం అని తాత్వాక గ్రంథాలు చాటుతున్నాయి. నిర్మలమైన నిష్కలమైన మనస్సులో మాత్రమే భగవంతుడు కొలువై ఉంటాడు. అట్టి నిర్మలమైన, నిష్కలమైన మనస్సు వట్టికోట ఆళ్వారుస్వామిది. దైవారాధన గొప్పదా?, జీవారాధన గొప్పదా? అనే మీమాంస ఒకసారి వట్టికోట ఆళ్వారుస్వామి పుర్రెలో జనించింది. ఆయన దైవారాధన కన్నా జీవారాధనే గొప్పదని చాటిచెప్పాడు. జీవి, జీవిని చంపి జీవికి వేయడం జీవహింసకాదా? అంటాడు ఆయన. అలాంటి జీవహింస చేయకూడదు ఆకలిగొన్న జీవికి ఆహారాన్ని నొనగవలె నంటాడు వట్టికోట ఆళ్వారుస్వామి. తాను తినకుండా ఇతరులకు అన్నం పెట్టగలవాడు. గుల్బర్గాలో జైలు జీవితం గడిపేరోజుల్లో ఖైదీలకు పెట్టే ఆహారం అరకొరగా ఉండేది. కర్కశక హృదయులైన జైలు సిబ్బంది చేసే అరాచకాలు అన్ని ఇన్నికావు. అక్కడి ఖైదీలందరికి అర్థకలి. తనతోటి ఖైదీలందరికి ఎన్నో సందర్భాల్లో తనవంతుగా వచ్చిన ఆహారాన్ని వారికి ఇచ్చి వాళ్ళు సంతోషంతో కడుపునిండా భోజనం చేస్తే, తాను కడుపు నిండా తిన్నంతా ఆనందాన్ని పొందేవాడు.

ప్రతినిత్యం యోగ విద్యలో తన శరీరం పై పట్టును సాధిస్తూ, ఆజానుబాహుడైన శరీరంలో ప్రతి అణువణువును ఆరోగ్యంగా ఉంచుకున్న వ్యాయామశాలి. అందుకే నిత్య యవ్వనుడిలా కనిపించేవాడు. నోముపై చెదరని చిరుదరహాసం, విశాలమైన నుదురు, నల్లని

త్రాచుపాములాంటి కనుబొమ్మలు, ఆ విగ్రహపుష్టి ప్రశాంతత, ఆ గంభీరత అన్ని కలగల్పి దైవాంశ సంభూతుడా అన్న ప్రశ్న ఉదయించకమానదు.అతని కలం వజ్రాయుధం. తెలంగాణలో మొదటి సామాజిక నవల ప్రజలమనిషి. జైలు జీవితాన్ని అనుభవిస్తున్నప్పుడు జైలులోపల లోపల అనే కథా సంపుటిని రచించాడు. తరువాత కాలంలో ప్రజలమనిషికి కొనసాగింపుగా గంగు నవలను రాస్తూ అర్ధాంతరంగా అస్తమించాడు.దానితో గంగు నవల అసంపూర్తిగా మిగిలిపోయింది.గంగు నవలను పూడ్చలేము. అతని లోటును తీర్చలేము. వారికివారే సాటి. రారు ఎవరు వారికి పోటి.

తెలంగాణ రైతాంగ సాయుధపోరాటం ద్వారా స్వేచ్ఛా యుత తెలంగాణ సిద్ధించాలనేది న్యాయమైన కోరిక అంటాడు. ఇట్టి న్యాయం కోసం తను మృత్యువునైన ముద్దాడుతానని శపథం చేశాడు.ఆ శపథమే మృత్యు కుహరమైంది. రాకాసి శూర్పణఖలాంటి మృత్యువుకు అతనంటే ఇష్టం కల్గిందేమో 1961 లో గుండెపోటుతో అనంతలోకాలకు పయనమయ్యాడు.'రామాయణంలో రాముడు బంగారు లేడికోసం పరిగెత్తి ప్రాణప్రథమైన సీతకు దూరమయ్యాడు. అలాగే బంగారు తెలంగాణ రైతాంగ సాయుధపోరాటం ద్వారా సిద్ధించాలని కలల గన్నాడు. తెలంగాణ కల సాకారమైంది. కాని సమైకాంధ్ర ఏర్పడగానే ఆంధ్ర పెత్తందార్ల కుట్రలు, కుళ్ళు రాజకీయాలు ఒక్కొక్కటి అవగతం కాసాగాయి. ముల్కీ నిబంధనలను సమైక్య పాలకులు మూసిలో కల్పడం. అదే తెలంగాణకు తీరని నష్టాన్ని కలిగించిందని మనసులో మథనపడుతూ తీవ్ర ఒత్తిడికి లోనై గుండెపోటుకు దారి తీసి ఉండవచ్చు.వట్టికోట ఆళ్వారుస్వామి మనకు భౌతికంగా దూరమైన చరిత్రాకారులకు, తెలంగాణ ప్రజానీకానికి పరిశోధకులకు, మేధావులకు, విశ్వ విద్యాలయ ఆచార్యులకు మానసికంగా చాలా దగ్గరగానే ఉంటాడు.తెలంగాణ ప్రజల హృదయాల పందిళ్ళ క్రింద చల్లనీ కరుణ కటక్షాలతో మన అందరిలో మమేకమై నిత్య చైతన్య స్రవంతియై ప్రజ్వలిస్తూనే ఉంటాడు. నీడలో వెన్నంటే ఉంటూనే మలిదశ తెలంగాణ ఉద్యమంలో వీరకిశోరాలు ఉద్యమించుటకు స్ఫూర్తి నిచ్చిన ప్రధాత.

ఏ దేశ చరిత్ర చూసిన ఏముంది గర్వకారణం నరజాతి చరిత్ర సమస్తం పరపీడన పరాయణత్వం అన్న శ్రీశ్రీ మాటలు తెలంగాణ విషయంలో నూటికి నూరు పాళ్ళు నిజమయ్యాయి. ఎక్కడైతే బానిసత్వం, నిరంకుశత్వం, అరాచకాలు, అన్యాయాలు, దోపిడీలు, దొంగతనాలు, లంచగొండితనాలు పేట్రేగిపోతాయో అక్కడ బానిస విముక్తికై ఆగ్రహావేశాలతో ఉద్యమం ఉప్పెనలా ఉబికివస్తుంది. అలాంటి సమయంలో బుద్దుడి బోధనలకు ప్రాధాన్యం లేకుండా పోతుంది అంటాడు వట్టికోట ఆళ్వారుస్వామి.అవతారపురుషుడైన శ్రీమహావిష్ణువు శత్రుసంహారం చేయడానికి దశవతారాలు ఎత్తితే, తెలంగాణ ప్రజలపై దౌర్జన్యాలు చేసే వారిపై తిరగబడి, వారికి స్వేచ్ఛ స్వాతంత్ర్యాలను కల్పిస్తానని ప్రతినబూనాడు వట్టికోట ఆళ్వారుస్వామి.వట్టికోట ఆళ్వారుస్వామి ప్రజలమనిషి. ఆయన అంటే దుష్టులకు సింహస్వప్నం, అతని పేరు చెబితే దుర్మార్గులకు గుండె దడదడలాడుతుంది. అబద్దాలు చెప్పే అధికారులకు అతను ఓ తల్వార్‌లాంటివారు.

ప్రజలమనిషి పార్థివదేహం పరమశివుడిలో శివైక్యం చెందినప్పటి నుండి తెలంగాణలో ఆంధ్రపాలకుల అరాచకాలను ఎదురించే నాథుడే కరువయ్యాడు. ఆయన తదనంతరం 8 సంవత్సరాలు పై చిలుకు తరువాత గాని తొలిదశ తెలంగాణ ఉద్యమం ప్రారంభంకాలేదు. అప్పటికి గాని వట్టికోట ఆళ్వారుస్వామి విలువ తెలంగాణ ప్రజానీకానికి తెలియరాలేదు.అచంచల విశ్వాసంగల, ఆ అమృత హృదయం వచ్చి మళ్ళీ తట్టిలేపింది. అప్పటివరకు దగాపడ్డ తెలంగాణలో ఆళ్వార్ లేని లోకంలో అంధకారం ఆధిపత్యం చెలాయించింది. అందుకే ఆంధ్రపాలకులు అధికారాన్ని అడ్డుపెట్టుకొని మనపై ఆధిపత్యం చెలాయించారు. అలాంటి నాయకులకు ఆళ్వార్ గుర్తుకు వస్తే

హడలిపోయేవారు. ఆళ్వారు అంటే చీకట్లు కూడా చిర్రుబుర్రులాడేవి. స్వార్థపూరితమైన రాజకీయ రాజ్యాధికారం, విప్లవవీరులను అణగద్రొక్కుతుంది. కాని ఏ అధికారాన్ని కాంక్షించని నిస్వార్థజీవి ఆళ్వార్ ఒక్కడే అంటే అతిశయోక్తి కాదు.

ఎవ్వరిని ఏది కావాలని అడగలేదు, ఆశ్రయించను లేదు. నిరంతరం పోరాటయోధుడు. అలుపెరగని బాటసారి, విశ్రాంతి అనే పదం ఆయనకు నచ్చదు. అందులో శాంతిని మాత్రమే ప్రేమించినవాడు మన 13వ ఆళ్వార్.తన స్వంత సుఖాన్ని కోరుకునే మనస్తత్వం మచ్చుకైన కానరాదు. మారని మనిషే మన ప్రజలమనిషి.

అవసరం అబద్దాలను ఆడిస్తుందంటారు. కాని వట్టికోట ఆళ్వారుస్వామి అవసరం ఉన్నా, చివరికి ప్రాణమే పోయిన తన వ్యక్తిత్వాన్ని మాత్రము మార్చుకోలేదు. అబద్దాలను పాతరేసి నివురుగప్పిన నిజాలను వెల్లడించిన ధీశాలి ఆళ్వార్. ఎదుటివారిలో మంచిని పెంచి, పోషించిన మన మనిషి ప్రజలమనిషి వట్టికోట ఆళ్వారుస్వామి.

BHAVAVEENA
Vol. 18, Issue. 10, October 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

తెలుగు సినిమా ఆవిర్భావం

– గంజి శశిధర్, పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

అనాది కాలం నుండి మానవుడు తన జీవితాన్ని ఆనందపర్చుకోవడానికి, ఆహ్లాదభరితం చేసుకోవడానికి ఎన్నో పనులను చేస్తున్నాడు. వీటిల్లో కొన్ని ఉపయోగ దృష్టితో మరికొన్ని సౌందర్యతృష్ణతో చేస్తున్నట్లనిపిస్తుంది. ప్రతిభానైపుణ్యాలకు నెలవులైన వీటినే మనం కళలని అన్నాము. చిత్రాలు గీయడమూ, శిల్పాలను చెక్కడమూ, రచనలు చేయడమూ, సంగీతం ఇలాంటివన్నీ కళ కిందికే వస్తాయి. ఈ కళలన్నీ కలిసిన సమాహార కళ సినిమా.

కళ :

'కళ'ను ఇంగ్లీషులో ఆర్ట్ అని అంటారు. ఇది లాటిన్ పదమైన 'ఆర్స్'(Ars) నుండి పుట్టింది. 'ఆర్స్' అంటే నైపుణ్యం(Skill) లేదా కళ(Craft) అనే అర్థాలున్నాయి. 'కళ'ను ఇంతవరకూ ఇదమిత్థంగా ఇది అని ఎవరూ నిర్వచించలేదు. మామూలుగా సౌందర్యానికి సంబంధించిన ఏదైనా కోణాన్ని లేదా మదిలో మెదిలిన భావ చిత్రాలను రూపుకట్టడానికి ఉపయోగించిన నైపుణ్యాన్ని గానీ 'కళ' అని పిలుస్తున్నాము. కళ యొక్క పరిధి విస్తృతమైనది. చతుష్షష్టి కళల్లో నాటకం లేదా రూపకం ఒకటి. ఇదే నేటి సినిమా కళకు మూలం. రంగస్థలం ఒక మహావృక్షానికి కనిపించని వేరు. సినిమా విస్తృతంగా కనిపించే కొమ్మలు, ఆకులు.

నాటకము :

సంస్కృత సాహిత్యంలో నాటకానికి మహోన్నత స్థానం ఉంది. నాటకంలో లలితకళలెన్నో సామరస్యంతో కలసిపోయి అనిర్వచనీయ రామణీయకతను ప్రసాదిస్తున్నాయి. ఆలంకారికులు కావ్యాన్ని 'దృశ్య'మని 'శ్రవ్య'మని రెండు విభాగాలుగా చేసి నాటకాదులను దృశ్యాలుగా పరిగణించారు. దృశ్యమనగా చూడదగింది. దృశ్య కావ్యాలనే రూపకాలని పిలిచారు. వేదపురాణేతిహాసాలలో నాటక ప్రస్తావన ఉంది. మహాభారతంలో 'నట' శబ్దమున్నది. హరివంశంలో నటులు 'రామాయణ కథ' ఆడినట్లు చెప్పబడింది. రామాయణంలో కూడా నట, నాటకాలను పేర్కొన్నారు.

రూపకోత్పత్తి :

'నాట్య' శబ్దము 'నట్' ధాతువు నుండి పుట్టింది. 'నట్' అనేది 'నృత్' ధాతువుకు ప్రాకృత రూపం. ఈ ధాతువుకు, దానినుండి నిష్పన్నాలైన 'నృత్త', 'నృత్య', 'నాట్య', 'నాటక' శబ్దాలకు 'చిందులు తొక్కడం' అనేది మూలార్థం. అభినయించేవాడు తాను అనుకరించే వ్యక్తి వేష, భూష, చేష్టాదులను అనుకరిస్తాడు. ఇతర పాత్రలు, పరికరాల సహాయంతో అతడు తాను అనుకరించే వ్యక్తి భావాలను ప్రదర్శించడమే కాకుండా నానా దృశ్యాలను కల్పించి ప్రేక్షకుల మనస్సులలో వివిధ రసానుభవం కలిగిస్తాడు. అదే రూపకం. రూపకాలు పది విధాలు. వాటిలో 'నాటకం' ప్రకృతి, తక్కిన రూపకాలన్నీ దానికి వికృతులే. నాటకంలోని ఒక్కొక్క భాగాన్ని గురించి ఒక్కొక్క శాస్త్రం వివరిస్తుంది. సాహిత్యశాస్త్రంలోని కావ్యాంశం, నాట్యశాస్త్రంలోని అభినయాంశం, సంగీతశాస్త్రంలోని సంగీతాంశం, వాస్తుశాస్త్రంలోని నాట్యమందిర నిర్మాణం వివరించబడ్డాయి.

మన తెలుగు ప్రాంతంలో దృశ్య, శబ్ద, సంగీతాలతో సమ్మిళితమైన వినోద ప్రదర్శన కురవంజి అనే కళతోనే ప్రారంభమయ్యింది. పూర్వం వేటకోసం అడవులకు వెళ్ళిన మహారాజులు విశ్రాంతి తీసుకునే సమయంలో, ప్రభువులను ప్రసన్నం చేసుకొనే ఉద్దేశంతో అడవిలో నివసించే తెగల వారు ఆడుతూ పాడుతూ, అడవి జీవాలను అనుకరిస్తూ, డప్పులు, కొమ్ముబూరలతో వాయిద్యాలు వాయిస్తూ, గానం చేస్తూ అడుగులు వేసేవారు. అడవులలో నివసించే కురవలనే వారి అడుగు

కాబట్టి దానిని 'కురవంజి' అని పిలిచేవారు. గంతులు, చిందులు, గొండ్లి, అంజె అనేవి నృత్య విశేషానికి సంబంధించిన పర్యాయపదాలు. కురవంజి ఒక జానపద కళ, దృశ్యకావ్యం. అచిరకాలంలోనే యక్షగానంగా, తోలుబొమ్మలాటగా, చెక్కబొమ్మలాటగా, హరికథగా, బుర్రకథగా, వీధినాటకంగా, రంగస్థల నాటకంగా వికాసాన్ని పొందినదని పండితుల, మేధావుల అభిప్రాయం. ఈ నాటకమే నూతన పరిణామాలను వెతుక్కొని, ఆధునిక సాంకేతిక మహేంద్రజాలంతో కలిసిపోయి సినిమాగా అవతరించింది. సినిమా అంటే ఒక గొప్పకళ, శక్తిమంతమైన ప్రచారసాధనం. నూరు పుస్తకాలలో కూడా చెప్పడం సాధ్యం కాని విషయాన్ని ఒక సినిమా ద్వారా చెప్పడం తేలిక. కాలక్షేపం కోసం ప్రారంభించిన విడ్డూరం ఈనాడు అనేక కళలతో మమేకమై ఏక రూపాన్ని సంతరించుకుంది. పండితుని దగ్గర నుండి పామరుని వరకూ సమస్త జనులను ఆనందింపజేసి ఆహ్లాదాన్ని అందించేది నేటి 'సినిమా కళ'. 1896 జూలై 7వ తేదీన 'ది మార్వెల్ ఆఫ్ ది సెంచరీ ది వండర్ ఆఫ్ ది వరల్డ్' (ఈ దశాబ్దపు అద్భుతం, ప్రపంచంలో మహాద్భుతం)గా 'టైమ్స్ ఆఫ్ ఇండియా'లో ఓ మూలన చోటు చేసుకున్న చిన్న ప్రకటన ఇంతటి ప్రభావాన్ని చూపుతుందని, ఇంతగా ప్రజల ఆదరణకు నోచుకుంటుందని, ఇంతగా ప్రజల జీవన విధానాలను నిర్దేశిస్తుందని ఎవ్వరూ, చివరకు ఆ ప్రదర్శన ఏర్పాటు చేసిన లూమియర్ బ్రదర్స్ కూడా ఊహించి ఉండరు. అయితే ఆ ప్రకటనల సారాంశమే నిజమై దృశ్యమాధ్యమం ఈ శతాబ్దపు అద్భుతంగా, ప్రపంచంలో మహాద్భుతంగా ఆవిర్భవించింది.

సినిమా పరిచయం :

మూవీ, ఫిల్మ్, సినిమా ఈ మూడు పదాలను చలన చిత్రానికి పర్యాయపదాలుగా వాడుతున్నాం. చలించే బొమ్మలతో కూడి ఉంటుంది కాబట్టి అర్థపరంగా చూస్తే సినిమా, మూవీ ఈ రెండు పదాలు మాత్రమే చలనచిత్రం అనే మాటకు సమానమైన పదాలు. సెకండ్‌కు 24 చిత్రాలు కదులుతుంటే దానిలోని పూర్తి చిత్రం మన కనుల ముందు సజీవమై తిరుగాడుతుంది. సినిమా చిత్రీకరించడానికి వాడబడే ముడినరుకు రీల్‌ను ఫిల్మ్ అని అంటారు.

శాస్త్రజ్ఞుల త్రిశతాబ్దకాల అవిరామశ్రమ, వైజ్ఞానిక పరాకాష్ట కలిసి సృష్టించిన అద్భుతమే సినిమా కళ. సాంకేతికత, వినోదం, ప్రసిద్ధ సంస్కృతులు, నాగరికత, సంగీతం, సాహిత్యం మొదలైన మిశ్రమ మాధ్యమాలతో కలిపి వండిన వంట చలనచిత్రం. వ్యాపారం, సందేశం ఇవి కూడా సినిమాకు ఉన్న మరో ప్రధాన ఉద్దేశాలు, దృక్పథాలు.

1882లో ఏటియన్ జూల్స్ మారీ అనే ఫ్రెంచ్ శాస్త్రజ్ఞుడు మోషన్ పిక్చర్ కెమెరాను తయారుచేశాడు. ఆ తరువాత కొంతకాలానికి ప్రముఖ శాస్త్రజ్ఞుడు థామస్ ఆల్వా ఎడిసన్ 'కినిటోస్కోప్'ను సిద్ధం చేసి, 'ఫోనోగ్రామ్' పేరిట శబ్దాన్ని రికార్డ్ చేసి వినిపించాడు. 1895 డిసెంబరు 28న సినిమాటోగ్రాఫ్ ద్వారా చలనచిత్ర ప్రదర్శన ఏర్పాటు చేశారు లూమియర్ సోదరులు.

ప్రపంచ సినిమా పరిచయం :

ప్రపంచంలోనే మొట్టమొదటి చలనచిత్రంగా రూపు దిద్దుకున్నది 'రౌన్ థే గార్డెన్ సీన్'. 1888లో లీప్రిన్స్ కేవలం రెండు సెకన్ల వ్యవధితో ఈ సినిమా తన అత్తగారింట్లో వాళ్ళ పెరడులో తీశాడు. లూమియర్ సోదరులు 1895 మార్చ్ 19న చిత్రీకరించిన ఫ్రెంచ్ చిత్రం 'లా స్టోరీ దెస్ ఉసినెస్ ల్యూమినర్ యలైన్(ల్యూమినర్ ఫ్యాక్టరీ నుంచి వస్తున్న పనివాళ్ళు)' అనే చిత్రమే ప్రపంచంలోనే మొట్టమొదటి సినిమాగా భావింపబడుతుంది. ఇలాంటివి మరో తొమ్మిది చిత్రాలతో కలిపి మొత్తం పదింటి మొదటి ప్రదర్శన 1895 డిసెంబర్ 28న ప్యారిస్‌లో జరిగింది. ఈ ప్రదర్శనకు టికెట్టు పెట్టి అమ్మడంతో ఇవే మొట్టమొదటి వ్యాపారాత్మక చలన చిత్రాలుగా చెప్పవచ్చు. మంచి ఆదరణ లభించడంతో

ప్రపంచ దేశాలలో తమ ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. భారతదేశానికి కూడా వచ్చి "1896 జూలై 7న అప్పటి బాంబేలోని ఎస్సలాండ్ మాస్టన్లోని వాట్సన్ హోటల్‌లో ప్రదర్శించారు. అదే మన దేశానికి, సినిమాకి జరిగిన తొలి పరిచయం. ఆ తరువాత మన దేశంలోనే సినిమా నిర్మాణం ఎందుకు కాకూడదు అని కొందరి మనసులో ఆలోచన మొదలైంది.

భారతీయ సినిమా పరిచయం :

హరిశ్చంద్ర సఖారాం భట్ వాడేకర్(15 మార్చి 1868 - 20 ఫిబ్రవరి 1958). ఇతను మహారాష్ట్రీయుడు. బొంబాయిలో 1880లో ఒక ఫోటోగ్రాఫిక్ స్టూడియో పెట్టిన ఆయన దేశంలోనే తొలిసారిగా 1896లో ఒక 'మోషన్ పిక్చర్ కెమెరా'ను లండన్ నుంచి దిగుమతి చేసుకున్నాడు. 1897లో ఆయన దాని సహాయంతో బొంబొయిలోని హాంగింగ్ గార్డెన్స్‌లో జరిగిన ఒక రెజ్లింగ్ మ్యాచ్‌ను పిక్చరైజ్ చేశాడు. ఇంకా ఒక ప్రొజెక్టర్‌ను కొన్నాడు. అలా చూస్తే దేశంలో తొలి ప్రొడ్యూసర్, ఫోటోగ్రాఫర్, ఎగ్జిబిటర్ అన్నీ ఆయనే అని చెప్పాలి.

దాదాసాహెబ్ ఫాల్కే :

దాదాసాహెబ్ రాకతో అసలు సిసలు చలనచిత్రాల నిర్మాణానికి భారతీయ సినిమా నాంది పలికింది. తరువాత తరువాత ఒక గొప్ప పరిశ్రమగా రుపుదిద్దుకుంది. దాదాసాహెబ్ పూర్తి పేరు 'ధండిరాజ్ గోవింద ఫాల్కే'(30 ఎప్రిల్ 1870 - 16 ఫిబ్రవరి 1944). ఇతను కూడా మహారాష్ట్రీయుడే. భారతీయ చలనచిత్ర పితామహుడిగా పేరుపొందాడు. ఈయన పేరు మీదుగానే భారత ప్రభుత్వం 'దాదాసాహెబ్ ఫాల్కే' అవార్డును సినీరంగ ప్రముఖులకు ప్రతి ఏటా ప్రదానం చేస్తూ వస్తుంది.

దాదాసాహెబ్ మనదేశంలో తొలి ఫీచర్ ఫిలిం తీసిన ఘనుడు. ఆయన తీసిన 'రాజా హరిశ్చంద్ర' 1913 మే 3న బొంబాయిలోని కార్పోరేషన్ సినిమా థియేటర్‌లో ప్రదర్శించారు. నాదకర్ణి అనే మిత్రున్ని నిర్మాతగా ఒప్పించి తన తొలి ప్రయత్నాన్ని సాగించాడు ఫాల్కే. హరిశ్చంద్రుని ఇల్లాలు చంద్రమతి పాత్రకు ఎందరో మహిళలను కోరినా ఎవరూ ముందుకు రాక చివరికి ఒక హోటలులో వంటలు చేసే ఎ.సలుంకే అనే అతని చేత నటింపజేశారు. అనుభవం లేని ఆర్టిస్టులు, ఆడవేషానికి మగవేషానికి రెండింటికీ పురుషులే నటులు. ఆ తర్వాత ఫాల్కే తీసిన 'లంకా దహన్'లో రాముడు, సీతగా ద్విపాత్రాభినయం చేశాడు సలుంకే. దాంతో తొలి హీరోయిన్, తొలి డ్యుయల్ రోల్ ధరించిన ఘనత సలుంకేకే దక్కింది. 'రాజా హరిశ్చంద్ర' అనంతరం ఫాల్కే తన కూతురు మందాకినిని ప్రధాన పాత్రధారిణిగా 'బర్త్ ఆఫ్ శ్రీకృష్ణ' అనే చిత్రాన్ని తర్వాత 'భస్మాసుర మోహిని', 'సావిత్రి' చిత్రాలను తీసినా ఇవన్నీ సాదాగా ఆడినవే. ప్రజలను అమితంగా ఆకట్టుకున్న మొట్టమొదటి బాక్సాఫీస్ హిట్ చిత్రం 'లంకాదహన్'(లంకా ఎఫ్లేమ్). అయితే ఇవన్నీ మూకీ చిత్రాలు కావడం వల్ల అవి మన చిత్రాలని సగర్వంగా చెప్పుకోలేకపోయారు మనవాళ్ళు.

టాకీయుగం :

1927లో ఇంపీరియల్ ఫిలిం కంపెనీని ప్రారంభించి 'వీరాభిమన్యు' అనే మూకీ చిత్రాన్ని నిర్మించాడు ఖాన్ బహదూర్ ఆర్దేషీర్ ఎమ్. ఇరానీ. 'షోబోట్' అనే టాకీని చూసిందగ్గర్నుంచి ఎన్ని కష్టనష్టాలెదురైనా భరించి తొలి టాకీ నిర్మించాలనే బలీయమైన కోరిక ఆయనలో బయలుదేరింది. వెంటనే రికార్డింగ్ యంత్రం ఇతర విడి పరికరాలు విదేశాల నుండి దిగుమతి చేయించుకున్నాడు. "భారత చలన చిత్ర పితామహుడు దాదాసాహెబ్ ఫాల్కే సహకారం, సూచనలతో అప్పట్లో బొంబాయిలో విశేష ప్రజాదరణ పొందిన రంగస్థల నాటకం 'ఆలం ఆరా'ను చిత్రకథగా ఎన్నుకొని, జోసఫ్ డేవిడ్ అనే నాటక రచయిత సహాయంతో దాన్ని సినిమాకు అనుకూలంగా మలిచారు" ఇందులోని మాటలు, పాటలు, నృత్యాలే ప్రధానాంశాలుగా సినిమా తెరకెక్కింది. సంభాషణలు సంస్కృత మిలితమైన హిందీలోనూ, పర్షియన్ మిలితమైన ఉర్దూలోనూ కొన సాగగా ప్రేక్షకులను ఉర్రూతలూగించిన ఏడు పాటలను

చిత్రీకరించారు. టాకీయుగం ఆరంభం నుంచి 1946వ సంవత్సరం దాకా సామాజిక చిత్ర చరిత్రలో ఒక స్వర ్ణయుగం కొనసాగింది. బ్రిటీషు వారి పాలనలో, స్వాతంత్ర్య పోరాటం, హరిజనోద్యమం తదితరాలు కొనసాగుతున్న తరుణంలో దేశవ్యాప్తంగా తెలుగు, హిందీ, తమిళం, మరాఠీ, సింధీ, బెంగాళీ భాషలలో ప్రజలపట్ల, సమాజం పట్ల తమ ప్రజల్లో ఆలోచనలు రేకెత్తించిన పలు సిపనిమాలు నిర్మితమయ్యాయి.

తెలుగు సినిమా :

తెలుగు చలనచిత్రానికి బీజాక్షరాలు రాసిన వ్యక్తిగా, తెలుగు చలనచిత్ర పితామహుడుగా, తెలుగు సినీ పరిశ్రమ గౌరవించుకున్న వ్యక్తి రఘుపతి వెంకయ్య. బెంగళూరు, ఆంధ్రరాష్ట్రంలోని కొన్ని ముఖ్య పట్టణాలతో పాటు శ్రీలంకలో కూడా తన టెంట్ సినిమాతో వెళ్ళి ప్రదర్శనలిచ్చాడు. 1913లో తన కొడుకు రఘుపతి ప్రకాశ్‌ను ఇంగ్లాండులోని బార్కర్స్ మోషన్ పిక్చర్ స్టూడియోకు సాంకేతిక విజ్ఞానాన్ని నేర్చుకోవడం కోసం పంపించాడు. ప్రకాశ్ ఆ పైన ఇటలీ వెళ్ళి మిలాన్ స్టూడియోలో కొంతకాలం, ఆ తరువాత జర్మనీ వెళ్ళి అక్కడి యుఫా స్టూడియోలో కొంతకాలం పనిచేసి సినిమా సాంకేతిక విజ్ఞానాన్ని క్షుణ్ణంగా ఆకళింపు చేసుకుని విలియమ్‌సన్ సైలెంట్ కెమెరాతో స్వదేశానికి వచ్చాడు. అప్పటికే ఆర్. నటరాజ మొదలియార్ 1918లో 'కీచకవధ' అనే చిత్రాన్ని నిర్మించాడు. దక్షిణ భారతీయ సినీ చరిత్రలో తొలి మూకీ చిత్రం అది.

రఘుపతి ప్రకాశ్ మద్రాసు చేరుకున్న తరువాత తమ సంస్థ 'స్టార్ ఆఫ్ ఈస్ట్ ఫిలిమ్' బ్యానరుపై తొలిచిత్రంగా 'భీష్మప్రతిజ్ఞ' స్వీయదర్శకత్వంలో మొదలుపెట్టాడు. 1921లో నిర్మాణం పూర్తయిన 'భీష్మ ప్రతిజ్ఞ' తెలుగువారు చెన్నపట్టణంలో నిర్మించిన తొలి మూకీగా ప్రసిద్ధికెక్కింది. తర్వాత ప్రకాశ్ 'గజేంద్రమోక్షం', 'మత్స్యావతార్', 'నందనార్' మొదలైన చిత్రాలకు దర్శకత్వం వహించాడు.

సి. పుల్లయ్య 1924లో బొంబాయి నుంచి తను పట్టుకు వచ్చిన కెమెరా, ముడిఫిలింతో తన ప్రయోగాలు ప్రారంభించాడు. వాటి ఫలమే 'భక్త మార్కండేయ' మూకీ చిత్రం, ఒక తెలుగువాడు, తెలుగు గడ్డపై నిర్మించిన తొలి మూకీ చిత్రం. ఈ సినిమా 1925 డిసెంబరులో విడుదలయ్యింది.

దాదాపు 1920వ దశకంలోనే తను పనిచేస్తున్న పోలీసు ఇన్‌స్పెక్టర్ ఉద్యోగానికి రాజీనామా చేసి, ఇంపీరియల్ ఫిలిం కంపెనీలో లైట్‌బాయ్‌గా జీవితాన్ని ప్రారంభించిన హనుమంతప్ప మునియప్ప రెడ్డి(హెచ్.ఎం.రెడ్డి) కృష్ణా ఫిలిమ్స్‌లో సమర్థుడైన నిర్వాహకుడిగా పేరు తెచ్చుకుని, అతి తక్కువ సమయంలోనే దర్శకుడుగా రూపాంతరం చెందాడు. ఆర్దేషిర్ ఇరానీ సహకారంతో హెచ్.ఎం.రెడ్డి తీసిన మూకీ చిత్రం 'రాజ్‌కుమార్' మంచి ఆదరణ చూరగొంది. ఇందులో పృథ్వీరాజ్ కపూర్ నటించాడు.

భారతీయ తొలి టాకీ 'ఆలం ఆరా' చిత్రానికి ప్రధాన సహకారుడిగా పనిచేశాడు హెచ్.ఎం.రెడ్డి. 1931లో మొదటిసారిగా 'కాళిదాసు' అనే తమిళ చిత్రానికి దర్శకత్వం వహించాడు. అదే తొలి దక్షిణ భారతీయ భాషా చిత్రం. ఆ చిత్రంలో కథానాయకుడు తెలుగులో మాట్లాడితే, కథానాయిక తమిళంలో సమాధాన మిచ్చారు. అయితే ఎక్కువగా తమిళంలోనే మాటలు, పాటలు వినిపించాయి కాబట్టి, ప్రధానంగా దాన్ని తమిళ భాషా చిత్రంగా పరిగణించారు. ఆ తర్వాత పూర్తి తెలుగు సంభాషణలతో వచ్చిన తొలి తెలుగు టాకీ 'భక్త ప్రహ్లాద', 1932 ఏప్రిల్ 2న విడుదలై ఘనవిజయాన్ని సాధించింది. తెలుగు ప్రజల నరనరాన ఇమిడిపోయిన భక్తిరసాత్మక కథ 'భక్త ప్రహ్లాద'. ఈ కథనే ఇంపీరియల్ ఫిలిం కంపెనీ పతాకంపై ఆర్దేషిర్ ఎం. ఇరానీ నిర్మాణంలో హెచ్.ఎం.రెడ్డి తొలి టాకీగా నిర్మించాడు. నాటక పితామహుడు ధర్మవరం రామకృష్ణమాచార్య రాసిన 'భక్తప్రహ్లాద' ఆ రోజుల్లో సురభి వారి నాటకంగా ప్రసిద్ధి గాంచింది. దాంతో సురభి తారాగణ, సాంకేతిక నిపుణులనే ఎక్కువగా ఉపయోగించు కొని చిత్రాన్ని నిర్మించారు. ఇక అక్కడి నుండి

తెలుగు సినిమా త్రివిక్రమ రూపాన్ని దాల్చింది. తొలి భారతీయ టాకీ 'ఆలమ్ ఆరా'లో నటించిన ఎల్.వి. ప్రసాద్, తొలి తమిళ టాకీ 'కాళిదాస్'లో ఒక చిన్న పాత్ర, తొలి తెలుగు టాకీ 'భక్త ప్రహ్లాద'లో చండామార్కుల శిష్యుడు మొద్దబ్బాయి పాత్ర ధరించారు. అలా హెచ్.ఎం.రెడ్డి, ఎల్.వి. ప్రసాద్ ఇద్దరూ తొలి మూడు భారతీయ భాషా టాకీ చిత్రాలతో (హిందీ, తమిళం, తెలుగు) సంబంధం కలిగి ఉన్నారు.

బొంబాయిలోని సాగర్ మూవీటోన్ సంస్థ ఆధ్వర్యంలో దాని అధినేత చునిభాయ్ బి. దేశాయ్ ప్రముఖ తెలుగు రంగస్థల నాటకాల సమాజాల వారిని రప్పించి 'పాదుకా పట్టాభిషేకం', 'శకుంతల' చిత్రాల నిర్మాణానికి పూనుకున్నారు. ఈ చిత్రాలకు బెంగాళీ యువకుడు బాదామి దర్శకుడు. దర్శక నిర్మాతలకు ఇద్దరికీ తెలుగు రాకపోవడం గమనార్హం.

ఇదే సమయంలో ఆంధ్రదేశంలో తెలుగువారి డిస్ట్రిబ్యూషన్ శకం ప్రారంభమైంది. దీనికి ఆద్యుడు జి.కే.మంగరాజు. వైజాగులోని కృష్ణాసినిమా 'పూర్ణా' టాకీస్‌గా మారింది. 'పూర్ణా' చిత్రనిర్మాణ సంస్థ ఆవిర్భవించింది. మరో పక్క మచిలీపట్నానికి చెందిన పి.వి.దాస్ మద్రాసులో చిత్ర నిర్మాణ సంస్థ ప్రారంభించాడు. 1933వ సంవత్సరంలో పోతిన శ్రీనివాసరావు విజయవాడ నుండి బొంబాయి వెళ్ళి 'పృథ్వీపుత్ర' చిత్రాన్ని ప్రారంభించాడు. ఈయన 1921లోనే విజయవాడలో మారుతీ సినిమా థియేటర్‌ను స్థాపించాడు. అలా తొలి తెలుగు థియేటర్ ప్రొప్రయిటర్, ఎగ్జిబిటర్‌గా ఆయన పేరుపొందాడు.

ఈస్టిండియా కంపెనీ, ఇంపీరియల్ ఫిలిం కంపెనీ, కృష్ణా ఫిలిమ్స్ కంపెనీ వారు వేరువేరు నాటక బృందాల ఆధ్వర్యంలో చిత్రనిర్మాణాలను మొదలుపెట్టారు. అలా ఈస్టిండియా నుంచి ఒక 'రామదాసు', ఒక 'సతీ సావిత్రి' విడుదల కాగా, కృష్ణాఫిలిమ్స్ వారు రెండవ 'రామదాసు'ను ఇంపీరియల్ వారు రెండవ 'సతీసావిత్రి'ని విడుదల చేసారు. ఇదే సంవత్సరం 'చింతామణి' చిత్రం కూడా విడుదలయ్యింది. తెలుగు చిత్రనిర్మాణరంగంలో పోటీ మొదలయ్యింది. ఎవరికి వారుగా ప్రేక్షకులను ఆకట్టుకునేందుకు మంచి చిత్రాల నిర్మాణం చేయాలనే లక్ష్యం వైపు మళ్ళారు. ఆ మార్పు తెలుగు సినిమాలలో ప్రథమ స్వర్ణయుగానికి దారి తీసింది.

ఈ విధంగా నాటకకళ అతిశక్తిమంతమైన మాధ్యమానికి, భావవ్యక్తీకరణకు, సమకాలీనతకు, వినోదానికి, ఉపాధికి కారణమైన సినిమాకళకు నాంది పలికింది.

ఆధారగ్రంథాలు :

1) దశరూపకసారము, గడియారము రామకృష్ణ శర్మ, ఆంధ్రసారస్వత పరిషత్తు
2) మొదలి నాగభూషణ శర్మ, Folk Performing Arts of Andhra Pradesh, తెలుగు విశ్వవిద్యాలయం
3) అరిపిరాల సత్యప్రసాద్, ప్రపంచ చిత్ర చరిత్ర 3, నవతరంగం
4) తెలుగు సినిమా చరిత్ర, బులెమోని వెంకటేశ్వర్లు
5) తెలుగు సినిమా పాట. పైడిపాల

BHAVAVEENA
Vol. 18, Issue. 10, October 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

తొలి తెలుగు సంకలన గ్రంథం 'సకలనీతి సమ్మతము'

– గోళి శ్రీలత, పరిశోధక విద్యార్థి, తెలుగుశాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం.

ఇతిహాసాలు, మహాకావ్యాలు, పురాణాలు మొదలై నటువంటి సాహిత్యంలో కథాగమనంలో మణులలాంటి మాటలు ఎన్నో తారసపడతాయి. కవి నైపుణ్యానికి, లోకజ్ఞానానికి తార్కాణంగా నిలుస్తాయి. మహాకవుల మాటలనే అర్థాలు అనునరిస్తూ శ్లోకాలు పద్యాల రూపంలో మానవాళికి దొరుకుతాయి.

రావణ సంహారం జరిగాక లంకానగర వైభవానికి అచ్చెరువొందిన లక్ష్మణుడు అన్న రామునితో ఇక్కడే ఉండి పోదాం అన్నప్పుడు -

"అపి స్వర్ణమయీ లంకా మే నరోచతే లక్ష్మణ,
జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి"

అనే గొప్ప శ్లోకాన్ని రాముని చేత పలికించాడు మహాకవి వాల్మీకి. కన్నతల్లినీ, పుట్టినదేశాన్ని ఏ విధంగా గౌరవించాలో ఈ శ్లోకం ద్వారా మనం తెలుసుకోవచ్చు. ఇది సమస్త ప్రపంచానికి ఆదర్శప్రాయమైనటువంటి సత్యం.

తిక్కన తన మహాభారతంలో ఉద్యోగపర్వంలో రాయబారఘట్టంలో శ్రీకృష్ణునిచేత భీష్మునితో -

"సారపు ధర్మమున్ విమలసత్యము బాపముచేత బొంకుచే
బారము బొందలేక చెడబాఱినదైన యవస్థదక్షు లె
వ్వార లుపేక్షచేసి రది వారలచేటగు గాని ధర్మ ని
స్తారకమయ్యు సత్య శుభదాయక మయ్యును దైవ
ముండెడున్"

అని పలికించాడు. సమర్థత కలిగివుండీ సత్యము, ధర్మము పాడయ్యేప్పుడు భీష్ముడి వంటి దక్షుడు కాపాడకపోతే ఆయనే పాడవుతాడని, కానీ ఆ సత్య ధర్మాలను కాపాడేందుకు భగవంతుడు ఉండనే ఉన్నాడని ఈ పద్యంతో చెప్తాడు.

ఇటువంటి శాశ్వతసత్యాలే కాక శాస్త్రీయవిషయాలు కూడా ఎన్నో కావ్యాలలో అక్కడక్కడ చోటుచేసు కుంటాయి. రసాస్వాదన కోసం గ్రంథాన్ని చదివినప్పుడు ఈ సత్యాలు అన్నింటిని ఒక్కచోట పోగుచేసుకుంటే బాగుండుననిపిస్తుంది. అలా మహాకావ్యాల్లోనూ ప్రబంధాలలోనూ నిక్షిప్తమైన మేలిమిరత్నాల వంటి పద్యాలను సేకరించి ఒకచోట కూర్చినటువంటి మహనీయులు కూడా ఉన్నారు. అట్టి ఆ కూర్పును సంకలన గ్రంథం అంటారు.

సంకలన గ్రంథం నిర్వచనం :

సంకలన గ్రంథాన్ని ఇంగ్లీషులో ఆంథాలజీ (Anthology) అని అంటారు. ఈ 'ఆంథాలజీ" అనే పదం గ్రీకు భాషాపదం. ఇది 17వ శతాబ్దంలో ఆంగ్లంలోకి ప్రవేశించింది. గ్రీకులోని 'ఆంథాలజీయ" (Anthologia) అనే పదం దీనికి మూలం. 'ఆంథాలజీయ" అంటే 'పుష్పగుచ్ఛం' అని అర్థం. దీన్నే మనం తెలుగులో సంకలనం అని పిలుస్తున్నాం. దీనికి ఆంగ్ల నిర్వచనం- "An anthology is a collection of literary works chosen by the compiler. It may be a collection of poems, short stories, plays, songs, or excerpts. In gener fiction anthology is used to categorize collections of shorter works such as short stories and short novels, usually collected into a single volume for publication". వివిధ కవుల రచనలను ఒక్క చోటికి చేర్చడమే సంకలనం. ఇందులో కవిత్వంగానీ, కథానికలుగానీ, నాటికలు, పాటలు లేదా ఇతరా అంశాలు ఏవైనా ఉండొచ్చు. సంకలన గ్రంథం యొక్క ప్రధాన ఉద్దేశం ఏకవస్తు, భావ సామ్యం గలిగిన అనేక రచనలను, రచయితల విషయాలను ఒక్కదగ్గర చేర్చడమే.

ఈ సంకలన రచనకంటే స్వతంత్ర గ్రంథ రచననే సులభం. కానీ ఈ సంకలన గ్రంథాల ప్రయోజనాలు

అమూల్యమైనవి. మనకు లభ్యంకాని గ్రంథాల పేర్లను, వాటి విశిష్టతను తెలుసుకోవచ్చు. కాలనిర్ణయంలో అస్తవ్యస్తంగా ఉన్న కవుల కాలాలను, సంకలనకర్త కాలాన్ని బట్టి నిర్ణయించే వీలుంది. ఈ సంకలన గ్రంథాలలో ఉదహరించబడిన రచనలు అజ్ఞాతాలైన వాటికోసం అన్వేషణ చేయొచ్చు. సాహిత్యచరిత్ర రాసేవారికి సంకలన రచనలు ఎంతగానో ఉపయోగపడతాయి.

సకలనీతి సమ్మతము :

తెలుగులో వెలుగు చూసిన ప్రప్రథమ సంకలన గ్రంథం 'సకలనీతి సమ్మతము''. ఇది మడికి సింగనకవి రచించాడు. సింగన కాలం క్రీశ. 1420 ప్రాంతమని సాహిత్యపరిశోధకులు నిర్ణయించారు. నేటి కరీంనగర్ జిల్లాకు 50 మైళ్ళ దూరంలో ఉన్న రామగిరి పట్టణ నివాసమని తెలుస్తుంది. ఇందులో ఉదహరించబడిన పద్యాలు, గ్రంథాలు, కవులు, మడికి సింగన కవికి పూర్వమే ఉన్నట్లు భావించొచ్చు. కాని ఇలాంటి గ్రంథం ఒకటి తెలుగులో ఉన్నట్టుగా క్రీ.శ.1910 నాటి వరకు ఎవరికి తెలియదు. మానవల్లి రామకృష్ణకవి "'ప్రబంధ మణి భూషణము" ముద్రించి సంకలన వాఙ్మయ శాఖ ఒకటుందని, దానికి ఆద్యుడు సింగన అని సాహిత్య లోకానికి మొదటిసారిగా తెలియజేశాడు.

సకలనీతి సమ్మతము క్రీ.శ.1923 సంవత్సరంలో మొదటసారి మానవల్లి రామకృష్ణకవిగారు, తర్వాత క్రీ.శ. 1970లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ వారు ముద్రించారు. సకలనీతి సమ్మతాన్ని సింగన ప్రబంధమని పేర్కొన్నాడు. ''సకలనీతి సమ్మతంబనుపేర నొక్క ప్రబంధంబు రచింపుదు'' అని అవతారికలో, 'సరసగుణ ధుర్య సింగనార్య ప్రణీతంబైన సకలనీతి సమ్మతంబను ప్రబంధంబునందు'' అని ఆశ్వాసాంతంలో చెప్పుకున్నాడు. దీన్లో స్వతంత్ర కావ్యానికున్నట్లే అవతారిక, షష్ట్యంతాలు, ఆశ్వాసాంత గద్య పద్యాలు ఉన్నాయి. ఇది ఐదు ఆశ్వాసాల గ్రంథం కాని మూడు ఆశ్వాసాలు మాత్రమే దొరికాయి. ఈ మూడు ఆశ్వాసాలలో రాజనీతికి సంబంధిం చిన విషయాలు మాత్రమే ఉన్నాయి. కాబట్టి సకలనీతి సమ్మతం రాజనీతి సంబంధమైన గ్రంథంగానే పరిగణించబడుతున్నది. ఇతర రెండు ఆశ్వాసాలలో లోకోక్తి, సంగీత, నాట్య, పూజాప్రతిష్టాది విషయాలు ఉండేవట. సింగన ప్రణాళికననుసరించి ఐదు ఆశ్వాసాలు దొరికితే సకలనీతి సమ్మతం, అన్ని నీతులను చాటి చెప్పే గ్రంథమయ్యేది.

సింగనకవి పూర్వకవుల కృతుల నుండి తాను సేకరించిన నీతివిశేషాలను తన ప్రణాళిక ప్రకారం వర్గీకరించి వాటిని ఒకదానితో మరొకటి అనుసంధానించ డానికి మధ్యమధ్యలో తన సొంత పద్యాలను కొన్ని చేర్చాడు. రాజభృత్యులు వారి గుణగణాలు, రాజా శ్రితులైన కరణము, వ్రాయనగాడు, వైద్యుడు, పురోహితుడు, జ్యోతిష్కుడు, రాయబారి, చారులు, సేనాపతి, మంత్రి, షోడశనంధి ప్రకారము, సప్త విధోపాయాలలోని సామము, దానము, భేదము, దండోపాయము, మాయోపాయము, ఉపేక్షోపాయము, ఇంద్రజాలోపాయాలు, సప్త వ్యసనాలైన వేట, జూదం, స్త్రీ వ్యసనం, పాన వ్యసనాల గురించిన నీతి పద్యాలను ఉదహరించాడు.

సకలనీతి సమ్మతంలో ఉదహరించబడిన గ్రంథాలు :

అన్ని శాస్త్రాలలో నీతిశాస్త్రం విశిష్టమైనది. అందుకే మడికి సింగనకవి తనకు పూర్వం వచ్చిన సత్కృతులలోని సకల శాస్త్రాలలోని అభిప్రాయాలను సంగ్రహించి సకలనీతి సమ్మతం రచించాడు. ఇందులో పాఠకుల దృష్టికి రాకుండా, కాలక్రమంలో విస్మృతికి గురైన శాస్త్ర గ్రంథాలలోని పద్యాలు చాలావరకు సకలనీతి సమ్మతంలో ఉన్నాయి.

కామందకము :

కౌటిల్యుని అర్థశాస్త్రానికి సంగ్రహరూపమైన అనువాద రచన కామందక నీతిసారం. దీనిని కొండ్రాజు వేంకటాద్రి రాజుకు అంకితంగా జక్కరాజు వేంకటకవి క్రీ.శ. 1584

సంవత్సరంలో అనువదించాడు. కానీ ఇతడు మడికి సింగనకు తరువాతి వాడు, సింగన తన రచనలో పేర్కొన్న కామందకాన్ని ఎవరు తెనిగించారో తెలియదు కాని, సింగన సకలనీతి సమ్మతంలో ఉదహరించాడు.

"శ్రీపతి బోలు భూపతియు జెల్వగు మంత్రియు రాష్ట్రదుర్గము
ద్దీపితకోశ సైన్యములు దీర్ఘసుహృజ్జనులుం బరస్పర
వ్యాపి మహోపకారులగునట్లు రాజ్య నిజాంగబుద్ధిమై
నోపి పరీక్ష సేయవలయు న్నిజశిక్షణ లక్షణంబులన్"
(సకలనీతి సమ్మతము, 1వ ఆశ్వాసం)

కవితారచనలో జక్కరాజు వేంకటకవి అనువాదంలోని పద్యాలకంటే సింగన పేర్కొన్న కామందకములోని పద్యాలు గొప్పగా ఉన్నాయి.

పంచతంత్రము :

కామందకము తర్వాత చాల పద్యాలు పంచతంత్రం నుండి సింగన గ్రహించాడు. ఈ గ్రంథకర్త పేరు కూడా తెలియదు. కవితారచనలో కామందకము తర్వాత అంతటి ప్రౌఢమైన రచన పంచతంత్రం. తెలుగులో ఇప్పటివరకూ దూబగుంట నారాయణకవి, తిప్పయ భాస్కరుడు, పర్వతరాజు వేంకటనాథ కవి పంచతంత్రాలు లభ్యమౌతున్నాయి. ఈ మూడు కూడా కృష్ణదేవరాయల కాలంలో రచించబడిన గ్రంథాలు. వీటికంటే పూర్వమే ఒక పంచతంత్రము ఉన్నట్లు సకలనీతి సమ్మతం వల్ల తెలుస్తున్నది.

"అరయగ శబ్దశాస్త్రము లనంతము లాయువు కొంచె మందులో
గరము ఘనంబు విఘ్నములు గావున సారము పట్టు టొప్పగున్
బరగనసారముల్విడిచి పాలును నీరును నేర్చరంచి నే
ర్పరుదుగ బాలు పచ్చుకొను నంచ తెజుంగున భూవరాగ్రణీ"
(సకలనీతి సమ్మతము, 1వ ఆశ్వాసం)

నీతి భూషణము :

నీతి భూషణానికి సంస్కృత మూలకర్త క్షేమేంద్రుడు అని నిడుదవోలు వేంకటరావు భారతి పత్రికలో రాసిన తెలుగులో ఆకర గ్రంథాలు అనే వ్యాసం వల్ల తెలుస్తున్నది. దీనిలోని 25 పద్యాలు సకలనీతి సమ్మతంలో సింగన చేర్చాడు. కర్త తన పుస్తకాన్ని గురించి చెప్తూ సూర్యుని ముందు దివిటీలాగా మహాకవుల ముందు తాను చిన్నవాడనైనప్పటికీ, సూర్యుడు మరుగైన చోట దీపం తన వెలుగు ప్రసాదించినట్టు మహాకవుల దృష్టికి రాని మంచి విషయాలేవైనా తాను చెప్పగలనని చెప్పుకున్నాడు.

నీతిసారము :

కామందకం, పంచతంత్రం తరువాత సకలనీతి సమ్మతంలో ఎక్కువగా ఉదహరించిన పద్యాలు నీతిసారం లోనివే. దీని కర్త ప్రతాపరుద్రదేవుడు. ఇతని కాలం క్రీ.శ. 1140 - 1195. నీతిసారంలో పద్యాలు సరళంగా, సుబోధకంగా ఉన్నాయి. అవసరమైన వాటిని జాగ్రత్త పరచుకోవడం, అనవసర వ్యయాలు తగ్గించుకోండనే ఉపదేశాలు ఇందులో ఉన్నాయి.

"ఎంతెంత గలుగు రాష్ట్రం
బంతింతయ రాజు పెద్దయగు గావునదే
శాంతారము లొత్తికొనుటని
తాంతాము ధర్మంబుగాదె ధరణీశులకున్"
(సకలనీతి సమ్మతము, 1వ ఆశ్వాసం)

పురుషార్థసారము :

పురుషార్థసారాన్ని శివదేవయ్య రాశాడు. ఇతను గణపతిదేవ చక్రవర్తికి, రుద్రమదేవికి మంత్రిగా పనిచేశాడు. దీనిలోని 89 పద్యాలను సింగన సకలనీతి సమ్మతంలో చెర్చాడు. అధర్మవర్తనుడైన రాజు పైరు గింజల కుప్పకు నిప్పుపెట్టి అందులోని పేలాలను వెతికి తినే అవివేకి లాంటివాడని, రాజు తలచుకుంటే అల్పుడు అధికుడుగా, అధికుడు అల్పుడుగా మారగలడని, పరుల మంచి గుణాలను గ్రహించి వారిని బాగా చూసుకోవాలి

గాని వారిని అణగదొక్కే ప్రయత్నాలు చేయరాదని ఇలా ఎన్నో గొప్ప నీతులను పేర్కొన్నాడు శివదేవయ్య.

ముద్రామాత్యము :

సకలనీతి సమ్మతంలో ముద్రామాత్యము నుంచి 38 పద్యాలను సింగన తీసున్నాడు. ముద్రామాత్య కర్త క్షేమేంద్రుడు. ముద్రామాత్యంలోని పద్యాలు కేవలం నీతిపద్యాలే కాక కథాభాగంలోని పద్యాలలాగ ఉన్నాయి. దీన్లో రాజనీతియే కాక లోకనీతులు కూడా చెప్పబడినాయి. ఇతడు అనాటికి వ్యవహారంలో ఉన్న ప్రసిద్ధమైన లోకోక్తులను కూడా వాడాడు.

ఇలా మడికి సింగనతో మొదలైన ఈ సంకలన గ్రంథ రచన తర్వాతి కాలంలో చాలామందికి ఆదర్శమైనది. పెదపాటి జగన్నాథకవి ప్రబంధ రత్నాకరము, అజ్ఞాత కర్తృత్వమైన ప్రబంధమణి భూషణము, వేటూరి ప్రభాకరశాస్త్రి చాటుపద్య మణిమంజరి, విద్వత్కవీంద్ర శ్రీదాసరి లక్ష్మణస్వామి వర్ణనరత్నాకరము, ముద్దుకృష్ణ వైతాళికులు తెలుగులోని ముఖ్యమైన సంకలన గ్రంథాలలో కొన్ని. తెలుగు సాహిత్యములోని మంచి ముత్యాలని ఏరి అందించే ఈ సంకలన గ్రంథాలు నిజంగా మనకు అమూల్యమైన సంపద.

ఆధార గ్రంథాలు :

1. వాల్మీకి రామాయణం, యుద్ధకాండ.
2. తిక్కన భారతం, ఉద్యోగపర్వం.
3. మడికి సింగన, సకలనీతి సమ్మతము. (1977), తెలుగు సాహిత్య అకాడమి.
4. నిడుదవోలు వేంకటరావు, ఆకర గ్రంథాలపై వ్యాసం - భారతి పత్రిక (ఎప్రిల్, 1940)

BHAVAVEENA
Vol. 18, Issue. 10, October 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

నవరసభరితం– తెలంగాణ యక్షగానం

– కె. సురేష్, తెలుగు అధ్యాపకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హయత్‌నగర్. జి. రంగారెడ్డి, తెలంగాణ.

సాహితీ ప్రకర్ష, ప్రదర్శనా విధి కలిగిన ప్రక్రియగా విశిష్ట స్థానాన్ని ఆక్రమించింది తెలంగాణ యక్షగానం. నవరసభరితమై అటు పాఠకులను ఇటు ప్రేక్షకులను సమానంగా ఆకట్టుకొని ఆదరణీయమైంది. సంగీత, సాహిత్య,నృత్యాల మేళవింపుగా సంప్రదాయ కళా రూపంగా వెలసింది. పౌరాణిక, రామాయణ, భారత, భాగవత, కాల్పనిక ఇతివృత్తాలతో రసరాజమై ఉర్రూత లూగించింది. పండితులనే కాకుండా పామరులకు సైతం ఆకట్టుకుని సాంస్కృతిక వారసత్వాన్ని అందించింది.

తంజావూరు, ఆంధ్ర, కర్ణాటక యక్షగాన పద్ధతులను తోసిరాజని తెలంగాణలో యక్షగానం ప్రత్యేక రూపు దాల్చింది. భాషలో, భావంలో కొత్త పుంతలు తొక్కి సామాన్యుని దరి చేరింది. భాగవతం, వీధిభాగవతం, బాగోతం పేర్లతో పిలువబడుతూ కళారూపంగా తెలంగాణ అంతటా విస్తరించిన ఈ యక్షగాన మూలం జానపదం. జానపదుల ఆటగా పుట్టి, పండితుల మెప్పును, రాజాశ్రయాన్ని పొంది, దేశీ శైలులతో కూడిన శాస్త్రీయ విధానాన్ని అవలంబించి, ఒక సంప్రదాయ కళగా రూపాంతరం చెందింది. తెలంగాణ మారుమూల పల్లె నుండి పట్టణాల దాకా వినోద సాంస్కృతిక వికాస కళారూపంగా పరిఢవిల్లింది.

తెలంగాణలో నిరక్షరాస్యులు సైతం, గురువుల మౌఖిక అభ్యసన ద్వారా ఎన్నో యక్షగానాలు కంఠస్థం చేసి ప్రతినిత్యం గానం చేస్తూ, సాత్విక, ఆహార్య, ఆంగిక, వాచికాభినయాల ద్వారా యక్షగాన ప్రదర్శనలను రక్తి కట్టించి, పాత్రలో లీనమై నవరసాలను అవలీలగా పోషించినట్లు తెలుస్తున్నది.

యక్షగానం - సంగీతం :

యక్షగానం శబ్దం వినగానే ప్రధానంగా గానకళా ప్రక్రియకు సంబంధితమైన శబ్దంగా వినిపిస్తుంది. 12వ శతాబ్దంలో పాల్కురికి సోమనాథుని పండితారాధ్య చరిత్రలోని వర్ణనలో యక్షవిద్య, యక్షగానం ప్రాకృత శబ్దాలు అయా ప్రాంతాల దేశీ గానకళా ప్రక్రియలుగా ప్రశంసిస్తూ, అనాదిగా వస్తున్న వినోద కాలక్షేపంగా చెప్పారు. అసలు సంగీత చరిత్రను బట్టి యక్షగానం సంగీతంలో ఒక ముఖ్య భాగమని చెబుతారు సంగీత కారులు.

తెలంగాణ యక్షగానాల్లో ముఖ్య వాయిద్య పరికరాలుగా మద్దెల, తాళాలు, గజ్జెలు కొన్ని కళాబృందాల వారు హార్మోనియం అంతకు ముందు శృతి కోసం 'బుర్ర'ను ఊదేవారని తెలుస్తోంది. సందర్భానుసారంగా డప్పులు, కొమ్ములు, బూరలు మొదలైనవి ప్రదర్శనను రక్తి కట్టించేందుకు ఉపయోగించేవారు.

తాళ ప్రస్తారాలలో ఆటతాళం, ఆదితాళం, రూపక తాళం, ఏకతాళం, ఝంపెతాళం, త్రిపుటతాళం, జుల్వ తాళంలో దరువులు మార్చుతూ శాస్త్రీయ సంగీత తాళాలకు తీసిపోకుండా జానపద శైలులతో రాగ యుక్తంగా పాటలను ఆలపిస్తూ శ్రోతలను ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేసేవారు.

యక్షగానం - సాహిత్యం :

యక్షగానాలు ప్రప్రథమంగా ఎటువంటి వ్యాకరణ భద్రత లేకుండా ఒక ఆటవిక జాతివారి జానపద కళారూపంగా వెలుగు చూసింది. క్రమంగా ఒక కథాగేయ ప్రక్రియగా, పరిణామ వికాసంలో సంవాదం, దరువులు, కీర్తన పద్ధతిలో రచనలు కొనసాగాయి. వీటితోపాటు ద్విపదలు, కందములు మొదలైన దేశి ఛందస్సులు చోటుచేసుకున్నాయి.

జానపదుల కథాగానాల్లో సంగీతం, సాహిత్యాల కన్నా భావప్రకటన పట్ల శ్రద్ధ చూపుతారు. వీటిలో కథాక్రమం,

పాత్రల తీరుకు ప్రాధాన్యమిస్తారు. అందువల్ల రస పోషణకు అవకాశం అధికంగా ఉంటుంది. ఈ కథలు నాయకుని చుట్టూ కథ అల్లుతూ చెబుతారు. కొన్ని సందర్భాలలో ఈ పాటకు అనుగుణంగా చిందులు వేస్తూ నృత్యం చేస్తూ పాటలోని భావాన్ని అందులోని పాత్రలను తమపై ఆరోపించుకొని నటించేవారని తెలుస్తోంది.

యక్షగానం - వస్తు వైవిధ్యం :

తెలంగాణ యక్షగానాలలో రచయితలు వస్తువు మీద విభిన్న ప్రయోగాలు చేసినట్లు చూడవచ్చు. రామాయణ, భారత కథలే కాకుండా కాల్పనిక కథలు, మహాపురుషుల కథలు, జానపదవీరుల కథలు వారివారి సంప్రదాయాల్లో జొప్పించుకుని జానపదకథాగేయ ప్రక్రియగా పెంపొందించారు.

యక్షగానాల్లో కాల్పనికాల సంఖ్య అధికంగానే కనిపిస్తుంది. అనేక పౌరాణిక చారిత్రక అంశాలను చిత్ర విచిత్రమైన కల్పనలు జోడించి,పాఠకులను ప్రేక్షకులను ఆకట్టుకుని, అబ్బురపరిచే ప్రయత్నం బాగానే జరిగింది.

యక్షగానం - రసపోషణ :

ఉదాత్తమైన నాయకపాత్రల ద్వారా రచయితలు వీర, శృంగార, కరుణ, రౌద్రరసాలను పండించి, నాయిక పాత్రలు ఎక్కువగా కరుణ, శృంగారాలకు పరిమితమైనట్లు గమనించవచ్చు. ప్రతినాయక పాత్రలు, అద్భుత సన్నివేశాలు, కథలో సందర్భానుసారంగా వచ్చే ఇతర పాత్రల ద్వారా మిగిలిన రసములు వెల్లడి అయినట్లు కనిపిస్తుంది. హాస్యరసం అప్పుడప్పుడు తొంగిచూసినను, హాస్యము కొరకు ప్రత్యేక పాత్రలనే సృష్టించినట్లు తెలుస్తోంది. తెలంగాణ యక్షగానాల్లోని నవరసభరితమైన కొన్ని పాత్రలను, సన్నివేశాలను పరిశీలిద్దాం.

శృంగార రసం :

యక్షగానాలు ప్రధాన కథతో పాటు, సన్నివేశానుకూలంగా నాయకానాయికల శృంగారచేష్టలు, సరస సల్లాపాలు ఉన్ననూ, కృష్ణలీలలు, కాళింగమర్ధన, అల్లిరాణిచరిత్ర, కనకతార, ఉషాపరిణయం, చంద్రహాస చరిత్రం, తారాశశాంక నాటకం మొదలగు వాటిలో సంపూర్తిగా శృంగారరసం తొణకిసలాడుతుంది.

సృష్టిలో శృంగారమంత తీయనిది లేదు. అంత బలవత్తరమైన శక్తి లేదు. అది ఒక మధురమైన మానసిక ప్రక్రియ. అందుకే ఆనందవర్ధనుడు "శృంగార ఏవ మధురః పర ప్రహ్లాదనో రసః అన్నాడు.

యక్షగానాలలో నాయికా నాయకుల శృంగార భరిత సంవాదాలు, విచ్చలవిడి పదగుంఫనాలు, అమలిన శృంగార భావనలు, జానపద జావళీలు విరివిగా కనిపిస్తాయి. చుక్కాపురి కాళింగమర్ధనలో శ్రీకృష్ణలీలలు, గోపికల ప్రణయకేళి పచ్చి శృంగారాన్ని ఒలకబోస్తాయి. చంద్రహాసచరిత్రలో చంద్రహాసుని తొలిచూపులోనే వరించిన విషయకన్య అతని వలపుకై, పొందుకై ఆరాటపడే సన్నివేశం వరూధినీ ప్రవరాఖ్యుల సరస సంభాషణలను సాక్షాత్కరింప చేస్తుంది.

వాదం - దర్వు - ఆది :

విషయకన్య : చలమేల సుందరాంగ : వలరాజు కేళిలో చెలగూచు గూడు సంపెగ పువ్వుల శయ్యలో

చంద్రహాసుడు : మగువ నీవిట్లు బల్క మరియాద యేలనే : జగతి మానవులు విన్న తగదాని యందురు

చం : కన్యా నీ వార్తవింటి తిన్నగ బల్కవే । అన్యుడ నిప్పుడు నన్నంట జెల్లదే

విష : అన్యుడవు గావు నాకు అత్యంత భర్తవి: మన్ననజేసి సరసమాడు యీ వేళను ॥చల॥

చం : మానిని యిట్టి బుద్ధి మానవు యెందుకే ! మీనాక్షి నాదు పురము నేను బోయెదనే ॥ మగు

విష : మీరుబోయిన వెనుక । మీతోడ వచ్చెదా ! నేరముగాదు రాజ నామాట, వినుమికా ॥చం॥

చం : నాతోను పురమువస్తే నవ్వేరు జనములూ ॥ మాతంతడ్రి కోపమొందు మదవతి యేలను

॥మగు

విష: కోపమొందితే నాతో కుసుమాస్త్రకేళి । నీ ప్రాపుగ
గూడినన్ను పరగను బంపుమీ
చం: ధరను వేములవాడ హరిహరులకునూ ।
పరమభక్తుండ నేను పణతిరో చెల్లదూ మగు ॥

వాదం - దర్వు - ఆటు :

విష: నరనాథ నీమది కరుగదేలనయ్య ప్రాణనాథ నే
విరహసాగరమున । విడిబడితి చూడు
ప్రాణనాథా।
చం: విరహమనెడి మాట । విడనాడవెందుకు
సుందరాంగి। నీవు
హరిని స్మరించితే । విరహతాపము దీరు
సుందరాంగీ
విష: మకరధ్వజుడు బాణ నికరములను వేసె
ప్రాణనాథా ! మనసు
వికలమాయెను ముద్దు । లిక నివ్వవేమిక
ప్రాణనాథా
చం: ముద్దులిచ్చుటకు నే పెద్దవాడను గాను
సుందరాంగి। నన్ను
రద్దిపాలు సేయ వద్దు విడుము సుందరాంగి।

మనుచరిత్రలో వరూధినికి మాత్రమే అనురాగం ఉన్నది. కావున ఆ శృంగారము రసాభాసమని శిరోమణి సన్నిధానం వారి అభిప్రాయం. ఇందులో చంద్రహాసుడు కూడా విషయను ఇష్టపడతాడు కానీ పెద్దల అనుమతి లేనిది జత గూడటం తగదని వాదిస్తాడు.

హాస్యరసం :

యక్షగానాల్లో ప్రత్యేకించి హాస్యప్రధాన ఇతివృత్తాలు లేకపోయినా సందర్భానుసారంగా ప్రతి యక్షగానంలో ఏ కథ అయినాసరే హాస్యాన్ని కల్పించుటకు కొన్ని ప్రత్యేక పాత్రలు కొనసాగించడం కద్దు. అల్లికాడు, సోడిగాడు అనే పేర్లతో ప్రత్యేకంగా హాస్యపాత్రలు సృష్టించడం జరిగింది. అలాగే ప్రధాని అంటే మంత్రి కూడా యక్షగానంలో ఒక కీలకమైన పాత్ర. ప్రారంభం నుండి చివరి వరకు నాటక ఇతివృత్తంలో అంతర్భాగంగా అనేక సామాజిక సమస్యల్ని స్పృశిస్తూ, అప్పుడప్పుడు సున్నితమైన హాస్యంతో, కొన్ని పర్యాయాలు ఘాటైన హాస్యంతో ప్రేక్షకుల్ని నవ్విస్తూ ఉంటుంది ఈ పాత్ర.

"రాజువెడలె సభకు రాజు వెడలె రవితేజములలరగ" అంటూ రాజు పాత్ర ప్రవేశం చేసేటప్పుడు,మంత్రి పాత్రకూడా రాజును అనుకరిస్తూ పాడుతూ, ఆడుతుంది. "రాజు వెడలే సభకు బదులుగా చొప్పకు లేదా సొప్పకు" అని పలకడంతో ప్రేక్షకులు పగలబడి నవ్వుతారు. ఈ ప్రధాని పాత్ర సంప్రదాయ నాటకాలు సూత్రధారుడు వంటిది.

సత్యహరిశ్చంద్రలో నక్షత్రకుడు, బాలనాగమ్మలో తలారిరాముడు, ప్రహ్లాద చరిత్రలో చండామార్కులు, ఉత్తర గోగ్రహణం ఉత్తరకుమారుని, కాళింగమర్ధనలో గోపబాలురచేష్టలు మొదలైన వాటిలో హాస్య ప్రధానమైన పాత్రలు ఎన్నో ఉన్నాయి అసలు యక్షగాన స్వరూపమే వినోద ప్రధానం కాబట్టి ఆటపాటలతో అలరించే పాత్రలు సందర్భాలు కోకొల్లలుగా మనం చూడవచ్చు.

కరుణరసం :

శోకస్పర్శ లేని జీవితానుభవం లేదు. అనుభవం కరుణాభావ స్పష్టములు అయితేగానిజీవితం పరిపూర్ణత పొందదు. నుఖమయమైన జీవితాన్ని ఆశించిన మానవుడు జీవిత ప్రయాణంలో అనుకోకుండా సంభవించిన సంఘటనల ద్వారా కొన్నిసార్లు దుఃఖ పడవలసి వస్తుంది. ఒక వస్తువును ఆశించుటలో ఆనందం, అది దూరమైనప్పుడు కలిగే దుఃఖం, ఈ రెండు మానవ జీవితంలో అవశ్యముగా అనుభూతి చెందుతాము.

రామాయణ, మహాభారతం వంటి ఇతిహాసాలైనా, చారిత్రిక, కాల్పనిక యక్షగానాల్లో కరుణ రానానికున్న ప్రత్యేకత మరి దేనికి లేదంటే అతిశయోక్తి కాదు. "ఏకో రసః కరుణ ఏవ" అని భవభూతి ప్రతిపాదించినట్లు గా భారతీయ సాహిత్యంలో అందునా తెలంగాణ యక్షగానం

లోని కథలన్నీ కరుణ రస ప్రభావితమై ప్రేక్షకుల్ని కట్టిపడేసి కంటతడి పెట్టిస్తాయి. హృదయాన్ని ద్రవింపజేస్తాయి. బాలనాగమ్మ చరిత్ర, కుశలవ నాటకం, హరిశ్చంద్ర నాటకం, పద్మవ్యూహం, బొబ్బిలిచరిత్ర మొదలైనవి కరుణరసామృతములు.

బాలనాగమ్మ చరిత్రలో పినతల్లి మాణిక్యాల దేవి పెట్టే బాధలు తట్టుకోలేక నవ భోజరాజు ఏడుగురు కూతుర్లు పడే వేదన.

వాదం - దర్వు - ఆది :

మాణిక్యాల దేవి : సవతి బిడ్డలారా మీరు చక్కనైన పున్నమా

చిల్లి పోయిన కుండలోన నీరు నింపి తెండికా

బాలికలు : చిల్లి పోయినా కుండలోన నీరు ఎట్లా నిలుచునూ

దండములు పెట్టేదాము పంప బోకు మమ్ములా

తండ్రి నవభోజరాజు భార్య మాట కాదనలేక బిడ్డలను అడవిలో వదిలిపెట్టి వచ్చేసన్నివేశం కంటతడి పెట్టిస్తుంది.

రౌద్ర రసం :

"యుద్ధప్రహార ఘాతన వికృతచ్ఛేదనవిదారరైశ్చవ
సంగ్రామసంభామాద్వైరేభి సంజాయతే రౌద్రః"
అని భరతముని చెప్పినట్లుగా రౌద్రము నందు ఉగ్రతయే ప్రధానము.

యక్షగానంలో మహాభారత యుద్ధ సన్నివేశాలు అనేకముగా ఉండుట చేత భీమార్జునులు, కర్ణదుశ్శాసనులను వధించినతీరు మదిలో మెదలును. నరసింహస్వామి హిరణ్యకశపుని చీల్చివేసిన విధానంలో క్రోధము కట్టలు తెంచుకుంది. కర్ణదుశ్శాసన వధలో భీముడు దుశ్శాసనుని రొమ్ముపై కూర్చుండి

దర్వు-మత్తకోకిల.

నంతనమ్మున దున్నసేనుని:సాహనంబున
యురమికన్
కుంతికొమరుడు చీల్చి రక్తము:గ్రోల సాగెనుక్రోధుడై
వింతగా సురలెల్ల:భీముని: వినుతు సల్పిరి లెస్సగ
అంతరంగము నందు ఖేచరు:లాత్మలో వెరవొందగా...
యని క్రోధము శిఖరాయమానంలో పలికించబడింది.

కిరాతార్జునీయం, దుర్గావిజయం, బకహిడింబాసుర వధ, వీరభద్రవిజయము, పరశురామవిజయం మొదలైన యక్షగానాల్లో తారాస్థాయికి చేరిన రౌద్ర రసం మనము చూడవచ్చు

వీర రసం :

ఉత్సాహం ఉత్తములందు దీపించు సత్త్వగుణం. కానీ ఉత్సాహము ధర్మబద్ధముగానిచో వినాశహేతువగును. ఉత్సాహము, పూనిక, విషాదరాహిత్యం, విస్మయం, వ్యామోహం లేకుండుట వలన వీరరసము జనించునని తాత్పర్యం.

గయోపాఖ్యానంలో కృష్ణార్జునుల యుద్ధఘట్టములో వీరరసం ఉట్టిపడుతుంది.

కృష్ణుడు : విడు విడువర్జున విడువరా గయుని విడవక నాతో పంతమా ఇక

ఝడియక నాతో వాదమా

అర్జునుడు : విడుచుట మా కులవృత్తి కాదురా: విడిచెటి వారము కాదు మేము జడిసి వెనకకు బోము

రుక్మిణి కళ్యాణంలో రుక్మిణి తండ్రి భీష్మకుడు మరియు అన్న రుక్మి సంవాదం ఉత్సాహాన్ని రేకెత్తిస్తుంది. కృష్ణుడు రుక్మి యుద్ధసన్నివేశాలు పోతన భాగవతానికి ఏ మాత్రం తీసిపోకుండా తెలంగాణ యక్షగాన రచయితలు రక్తికట్టించారు.

భయానక రసం :

భయానకంగాని, శాంతముగాని, అద్భుతరసంగానీ కావ్యాలలో ప్రధాన రసంగా ఉండవు. ఎక్కడో ఒక దానిలో తప్ప అవి చాలా వరకు అంగరసములుగా పోషింప బడును. భయానకం వికృతమైన ధ్వనులు, క్రూర జంతువులను చూడడం వల్లగాని, యుద్ధము, అడవిలోన సంచారము వల్లగాని, రాజుకు, గురువుకు అపరాధము చేయుట మొదలగు వాటి వలన కలుగును.

జానపద కథలు కలిగిన యక్షగానాలు క్రూరమృగాల సందర్శనము వలన, రాజు కఠినమైన శిక్షలు విధించడం మొదలగు సన్నివేశాలు అనేకం చూడవచ్చు. కీచకుని బాధలకు తాళలేక అక్క సుదేష్ణ, ద్రౌపది భయభ్రాంతులకు గురికావటం కనిపిస్తుంది. బాలనాగమ్మలో చాకలి తివ్వడు పులిని చూసి భయపడి పారిపోవుట, ఉత్తరగోగ్రహణంలో శమీవృక్షమునెక్కి పాండవుల ఆయుధాలను దించబోయిన ఉత్తర కుమారుడు పాములుగా భ్రమపడుట మొదలైనవి ఎన్నో చూడగలం.

బీభత్స రసం :

బీభత్సరసమునకు స్థాయిభావం జుగుప్స. సహృదయునకు రోత పుట్టించు ఏ విషయమైనా బీభత్సరసమును జనింపజేయును. యుద్ధభూమిలో శత్రువులను హింసించి వీరులకు సైతం రోతకలుగునట్లు రక్తాన్ని ప్రవహింప చేయును గనుక అర్జునునికి బీభత్సుడని పేరు.

పద్మవ్యూహం యక్షగానంలో అభిమన్యుడు హతుడైన తరువాత అర్జునుడు దివిటీ పట్టుకొని కొడుకుని వెతుకుటకు వెళ్ళినప్పుడు అక్కడ దృశ్యాలు అతి జుగుప్సాకరంగా వర్ణించబడ్డాయి. కీచకవధలో కీచకుని వికృత చావు, సీతాస్వయంవారంలోతాటకి విశ్వామిత్రుని యాగశాలను పాడుచేసిన తీరు, మైరావణ చరిత్ర, పరశురామ విజయంలో బీభత్సరస ప్రధాన సన్నివేశాలు కనబడతాయి.

అద్భుత రసం :

అద్భుతమైన విషయమంతయు నాటకీకరణకు ఎంతో పనికివచ్చును. అతిమానుషచర్యలు ఆశ్చర్యం కలిగిస్తాయి. ఆచర్యలను విశదముగా వర్ణించుట అద్భుతరసమును సృష్టించుటయే.

అల్లిరాణిచరిత్రలో స్త్రీవేషంలో ఉన్న అర్జునుని రూపలావణ్యములకు యుద్ధనైపుణ్యానికి అల్లిరాణి ఆశ్చర్యపోతుంది. తరువాత సేదదీరుతూ నదిలో ఇద్దరం కలిసి స్నానం చేద్దాం అంటుంది. ముందే పురుష ద్వేషి అయిన అల్లిరాణితో అర్జునుడు ఎలా వేగుతాడని ప్రేక్షకులు ఉగ్గబట్టిచూస్తారు.

అల్లిరాణి : అలివేణి వినవే అర్జునమ్మ: చెలి నదిలో స్నానం చేయుదమమ్మ:
ఎటు వంక చూసినగానెట్టి మానవుడు లేడు: బోటులామనామిద్దరమమ్మ
ఏటికింకా బిడియంబు
అర్జునుడు : అరవింద నేత్రి అల్లిరాణి మారువస్త్రంబు లేదే కీరవాణి
ఎటులా నీతోనేను జలకంబులాడగలను, మన్నించు నన్నిట్లు బలిమిని
జేయనేలా
అల్లి : కట్టినా పుట్టంబువిడువమ్మా చెలి అట్లే నదిలోన దూకవమ్మా
ఎటువంకా జూసినా ఎట్టిమానవుడులేడు బోటులా మనమిద్దరమమ్మా
ఏటికింక బిడియంబు..

అని రంజుగా సాగుతుంది వాదం. అల్లిరాణి బలిమితో అర్జునుని చెంగులాగడం, మగవాడని గుర్తించియుద్ధం చేయడం అద్భుతంగా ఉంటుంది.

కాళింగమర్ధనలో గోవర్ధనగిరిని ఎత్తిన కృష్ణుని చూసిన రేపల్లెవాసులు, జనం ఆశ్చర్యంతో తిలకిస్తారు వాల్మీకి చరిత్ర, శశిరేఖపరిణయం, కృష్ణగారడి మొదలైన యక్షగానాల్లో అద్భుత సన్నివేశాలు ప్రేక్షకులను సమ్మోహన పరుస్తాయి.

శాంతిరసం :

శాంతం రసమగునాయని కొంత వివాదం నడిచింది. అనాది కాల ప్రవాహమున వచ్చు రాగద్వేషాలను సమూలముగా నాశనము చేయుట అసాధ్యము. కనుక రసస్థితిని పొందరనుట అసమంజసం. రాగద్వేషాలను విడిచి పరమ శాంతిని పొందిన మహనీయులు అనేకులు ఉన్నారు. కాబట్టి శాంతరసం శ్రవ్య, దృశ్య కావ్యాలలో ఉండవచ్చు.

యక్షగానాలలో వేదాంతసారం, భగవత్ గుణ సంకీర్తనం ఉపదేశ రూపమున చెప్పబడింది.. సంసార తాపమును పోగొట్టి జీవులకు ఉపశమనం కలిగిస్తుంది.

సత్యహరిశ్చంద్ర నాటకంలో హరిశ్చంద్రుడు కాటి కాపరిగా ఉన్నప్పటికీ స్థితప్రజ్ఞుడు. హరిశ్చంద్రపాత్ర రాగద్వేషాలకు అతీతంగా కన్నకొడుకును దహనం చేయడానికి కూడా సుంకం అడిగిన తీరు ప్రేక్షకుల హృదయాలను నిర్వేదస్థితికి చేరుస్తుంది. పోతులూరి వీరబ్రహ్మంగారి చరిత్రలో పూర్తిగా తత్వజ్ఞానచింతన, జీవితపరమార్థం, చావుపుట్టుకలు, పరమపదం, కాలజ్ఞానం పారమార్థిక చింతన వైపు నడిపిస్తుంది.

ఈవిధంగా తెలంగాణ యక్షగానాలు నవరస భరితములై ప్రజల హృదయాల్లో విశిష్టమైన స్థానాన్ని సంపాదించుకున్నాయి. కావ్యం, దృశ్యరూపకం వలన అలౌకికానందము కలుగుతుంది. కావున ఆనందం అనుభవించు పాఠకులు ప్రేక్షకులు ఆత్మానందం పొంది సహృదయంతో జగత్ కళ్యాణమునకు తోడ్పాటును అందించవలెను.

BHAVAVEENA
Vol. 18, Issue. 10, October 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

తెలంగాణ ఉద్యమ, చారిత్రక, బహుజన, మాండలిక నవలలు – వైవిధ్యం

– డా॥. కొప్ప సుభాష్ చంద్రబోస్

1938 నాటి నేపథ్యంతో 1951లో ''ప్రజల మనిషి'', 1940-1945ల మధ్య కాలాన్ని చిత్రీకరిస్తూ ''గంగు'' నవలను వట్టికోట ఆళ్వారుస్వామి రాశారు. 1947 నాటి పరిస్థితులను చిత్రిస్తూ 1956లో ''ఓనమాలు'' నవలను దాని కొనసాగింపుగా ''దావానలం'' నవలను మహీధర రాంమోహనరావు రాశారు. ఈ దావానలం నవల విశాలాంధ్ర పత్రికలో సీరియల్ గా వచ్చింది. 1964 లో దాశరథి రంగాచార్య ''చిల్లర దేవుళ్ళు'' నవలను రాశారు. 1942-1948 మధ్య కాలాన్ని ఆధారంగా చేసుకొని 1971లో ''మోదుగు పూలు'' 1948 -1968 మధ్య కాలాన్ని ఆధారంగా చేసుకుని ''జనపదం'' నవలను రచించారు. తిరునగరి రామాంజనేయులు 1948 నాటి తెలంగాణ పరిస్థితుల ఆధారంగా ''సంగం'' నవలను సీరియల్‌గా పాఠకులకు అందించారు. 1984లో 1946 -1986ల మధ్యకాలం పరిస్థితుల ఆధారంగా ముదిగంటి సుజాత రెడ్డి ''మలుపు తిరిగిన రథ చక్రాలు'' నవలను రచించారు. 1986 లో బి.ఎన్.శాస్త్రి 1947-48లో నల్గొండలో జరిగిన పోరాటం ఆధారంగా ''విప్లవ జ్వాల'' నవలను రచించారు.

1996లో కందిమళ్ళ ప్రతాపరెడ్డి విమోచనోద్యమాలు జరుపుకునే వరకుగల పరిణామాలను చిత్రీకరస్తూ ''బందూక్'' నవలను రాశారు. వీటిలో మహీధర రాం మోహనరావు ''రథ చక్రాలు'' నవలను, భాస్కరభట్ల కృష్ణారావు ''యుగసంధి'', సిరిపల్లి కృష్ణారెడ్డి ''ఉప్పెన'' నవలను కూడా పేర్కొనవచ్చు. తెలంగాణ పోరాట చిత్రణలో 1947లోనే వెలువడిన మొదటి నవల ''మృత్యుంజయులు'. 1984లో అదే పోరాటాన్ని చిత్రీకరిస్తూ ముదిగంటి సుజాతరెడ్డి కలం నుండి ''మలుపు తిరిగిన రథ చక్రాలు'' నవల వెలువడింది. ఈ నవల రచనాకాలాలను గమనించినపుడు ఒక రచయిత్రి కలం నుండి ఈ నేపథ్యంతో నవల వెలువడానికి సుమారు నాలుగు దశాబ్దాల కాలం పట్టింది అనే విషయాన్ని గమనించవచ్చు. 1960, 70 దశకాల్లో అనేక సంఖ్యలో స్త్రీలు నవలలు రాస్తున్న తరుణంలో తెలంగాణ నుంచి మాదిరెడ్డి సలోచన, పోల్కంపల్లి శాంతాదేవి నవలలు రాశారు. తెలుగులో 1960 - 70 దశకాల్లో వచ్చిన స్త్రీ, పురుషుల వ్యాపార నవలలను పక్కన పెడితే - తెలంగాణ ప్రాంతం నుంచి వచ్చిన సీరియస్ నవలలు ఎక్కువగా ఉన్నాయి. ఇతివృత్తంలో, వస్తువులో, శిల్పం, శైలి, భాషలో తెలంగాణ నవలలు ఏ విధంగానూ తీసిపోకుండా ఉన్నాయి. తెలంగాణ ప్రాంతానికి సుదీర్ఘమైన చరిత్ర ఉంది. శాతవాహనులు 425 సంవత్సరాల పాటు తెలంగాణ కరీంనగర్ జిల్లా కోటి లింగాల, మహారాష్ట్ర పైఠాన్ రాజధానిగా సామ్రాజ్యాన్ని స్థాపించి పరిపాలించారు. ''కొమర్రాజు లక్ష్మణరావు, సురవరం ప్రతాపరెడ్డి, ఆచార్య తిరుమల రామచంద్ర మొదలుకొని, బి.ఎన్, శాస్త్రి, పరబ్రహ్మశాసి. కీ.శే సంగనభట్ల నరహరి, సంగనభట్ల నరసయ్య, ఈమని శివనాగిరెడ్డి, కుర్రా జితేంద్రబాబు, వి.వి.కృష్ణశాస్త్రి టాగూర్, మలయశ్రీ, మొదలైన ఎందరో చరిత్రకారులు, సాహితీవేత్తలు తెలంగాణ చరిత్రను, సంస్కృతిని వెలికి తీసి మనముందుంచారు.'' నోరి నరసింహ శాస్త్రి రాసిన అనేక నవలల్లో తెలంగాణ గురించి ''రుద్రమదేవి'', కవిద్వయం'' అనే నవలలు పేర్కొన దగినవి. ఓరుగంటి ఇందిరాదేవి ''ఆనంద ధార'', కాళ్ళకూరి నారాయణరావు ''ప్రోలయ నాయకుడు'' నవలను రాశారు. ముదిగొండ శివప్రసాద్ కాకతీయుల గురించి ''చంద్రకళ'', నమక్క సారక్కల గురించి, తెలంగాణ చరిత్రను చిత్రించాయి. అడవి బాపిరాజు ''గోనగన్నారెడ్డి '' సుప్రసిద్ధ చారిత్రక నవల.

సాహిత్యంలో నవల విస్తృత పరిధి కలిగిన సాహిత్య ప్రక్రియ. నవలా ప్రక్రియలో రచయితను అత్యంత

మేధావిగా భావిస్తారు. పాఠకులు రచయిత చెప్పేదంతా సత్యమని నమ్ముతారు. కాబట్టి బాధ్యతను విస్మరించని రచన చేయాలి. వాస్తవిక ఆలోచనా సరళి నవలకు ముఖ్య ధర్మం. నవల సంఘాన్ని, కాలాన్ని విడవకుండా సామాజిక జీవనాన్ని ఆసాంతం ప్రతిబింబింపచేయాలి. సామాజిక చైతన్యాన్ని రేకిత్తిస్తూ సామాజిక సుస్థిరత కోసం ఉపయోగపడే ఆశయాలను పండిస్తూ ఉండాలి. ఈ విధమైన నేపథ్యాన్ని దృష్టిలో పెట్టుకొని 1988లో బోయ జంగయ్య జాతర, 2003లో జగడం రాశారు. 1990 నుండి చాలామంది కవులు దళిత బహుజన జీవితాలను అనేక కోణాల్లో చిత్రించారు. కాలువ మల్లయ్య నవలలన్నీ ఇందుకు ఉదాహరణలుగా చెప్పుకోవచ్చు. బోయ జంగయ్య "జగడం" నవల స్వాంతంత్రానంతరం విద్యా ఉద్యోగ అవకాశాలతో ఎదిగిన దళితుల క్రమాలను మహోన్నతంగా చిత్రించింది. "పుట్టుమచ్చ" నవలలో బోయ జంగయ్య దళిత మహిళల ఎదుగుదల క్రమంలో రాజకీయాలు, సామాజిక పరిణామాలు, లైంగిక సంబంధాలను గురించి చక్కగా చిత్రించారు.

నవలల్లో అస్పృశ్యత, హరిజన సమస్యని గురించి పరిశోధించిన వాళ్ళంతా దళితేతర (ఉన్నత కులాల) రచయితలు రాసిన హేళావతి, మాతృమందిరం, మాలపల్లి, హరిజన నాయకుడు లాంటివి పేర్కొంటారు. కాని ఈ నవలల కన్నా తరువాతిదైన 'రైతుపిల్ల'ని గమనించలేరు.... ఒక దళిత నవలా రచయిత రచించిన నవల, దళితుల ఉదార ఆర్థిక సహకారంతో దళిత ప్రచురణ కర్తలు ప్రచురించిన నవల, ఒక దళిత సంపాదక బాధ్యత వహించిన నవలని విస్మరించారు.

పెద్దింటి అశోక్ "జిగిరి" నవల ఎలుగుబంట్లను ఆడిస్తూ బతికే జీవితాన్ని చిత్రించింది. వేముల ఎల్లయ్య "కక్క", "సిద్ధి" నవలల్లో దళితుల భాషను, సంస్కృతిని, జీవితాలను చిత్రించారు. కదిరికృష్ణ "పాద" నవలను రాశారు. భూతం ముత్యాలు తన నవలల్లో దళితుల జీవితాలను పొందుపర్చారు. ముదిగంటి సుజాతారెడ్డి మంగలి జీవితాలను "సంకెళ్ళు తెగాయి" నవలలో చిత్రించారు. జాజుల గౌరి "వొయినం" నవలలో దళిత స్త్రీలు వ్యవసాయ వృత్తిలో, కుటుంబంలో ఎదుర్కొనే ప్రత్యేక పరిస్థితులను, అవమానాలను, జీవితాన్ని కష్టాలను దాటుతూ ఎదిగిన తీరును చిత్రించారు. నేరెళ్ళ శ్రీనివాస్ గౌడ్ "బతుకు తాడు" నవలలో కల్లు గీత కార్మికుల జీవితంతో పెనవేసుకున్న రాజకీయాలు, సంస్కృతి, సామాజిక పరిణామాలను చిత్రించారు. కాలువ మల్లయ్య "గువ్వల చెన్నా" అనే నవలలో చేనేత కార్మికుల మొదటి తరం ఉద్యోగులుగా, విద్యావంతులుగా ఎదిగిన క్రమాన్ని ఆ తర్వాత వారి పిల్లలు గ్లోబలైజేషన్లో సాఫ్ట్వేర్ ఇంజనీర్లుగా అమెరికాలో ఉద్యోగాలు చేస్తున్న యువతరం గురించి చిత్రించారు.ఇలా తెలంగాణ నవలల్లో దళిత, బహుజన నవలకు ఒక ప్రత్యేకస్థానం ఉంది. అంతదాకా చిత్రించిన జీవితాలు, కోణాలు, సంస్కృతి, భాష, కులవృత్తి మొదలైనవి 1990 నుండి విరివిగా కథల్లో నవలల్లో చిత్రించబడ్డాయి.

తెలంగాణ ప్రత్యేక సంస్కృతే కాదు ప్రత్యేక మాండలికాన్ని కల్గివుంది. పోరంకి దక్షిణమూర్తి రాసిన 'ముత్యాల పందిరి' (1969), వట్టికోట అళ్వారుస్వామి 'ప్రజల మనిషి' (1955), దీనిలో సంభాషణాత్మక మాండలికం ఉంది. "చాలా నవలలు సంభాషణాత్మక మాండలికంలోనూ, తక్కువ సంఖ్యలో పూర్తి మాండలిక నవలలు వచ్చాయి. అవి లోక మలహరి 'జగ్గని యిద్దె' (1955) దాశరథి రంగాచార్య 'మోదుగుపూలు' అల్లం రాజయ్య 'కొలిమంటు కున్నది, ఊరు, అగ్నికణం' (1978, 1982) బి.ఎస్. రాములు 'బతుకు పోరు' (1982) సాహు & అల్లం రాజయ్య 'కొమురం భీం' (1983), దాశరథి రంగాచార్య 'చిల్లర దేవుళ్ళు' (1987), సాకేతపురి కస్తూరి 'బతుకమ్మ మునిగింది' (1996), వసంతరావు దేశ్ పాండే 'అడవి' (1996), ఐత చంద్రయ్య 'ఆడపిల్ల' (1996), వేముల ఎల్లయ్య 'కక్క (2000), భూతం ముత్యాలు 'సూర' (2004), వేముల ఎల్లయ్య 'సిద్ధి' (2005), కాలువ

మల్లయ్య 'గువ్వల చెన్నా' (2005), పరవస్తు లోకేశ్వర్ 'సలాం హైదారాబాద్' (2005), భూతం ముత్యాలు 'పురుడు' (2007), పెద్దింటి అశోక్ కుమార్ 'దాడి' (2008), కదిరె కృష్ణ 'పాద' (2010) , భూతం ముత్యాలు 'ఇగురం' (2012), జాజుల గౌరి 'ఏయినం' (2012), మొదలైనవి". ఈవిధంగా తెలంగాణ నవలా సాహిత్యంలో మొదటగా వచ్చిన నవలలను, ప్రముఖ రచయితల నవలలను పేర్కొని తెలంగాణ ఉద్యమ, చారిత్రక, మాండలిక నవలలను మరియు నాటి నుండి నేటివరకు తెలంగాణ నవలను సంక్షిప్తంగా పరిచయం చేశాను. సంఘటనలు ఉన్నాయి. ఎంబిబిఎస్ చదువుతున్న యువకుడి తమ్ముడు బుల్లెట్ తగిలి ప్రాణాలు కోల్పోయిన ఘటన ఈ నవలలో ఉంది.స్త్రీపురుష సంబంధాల ఇతివృత్తంతో మాదిరెడ్డి సులోచన రాసిన వినూత్నమైన నవల 'వారసులు'. అతి సంక్లిష్టమైన స్త్రీపురుష సంబంధాలను, కుల సమస్యను, సామాజిక కట్టుబాట్ల కారణంగా వాస్తవాలను అంగీకరించని విషయాలక ఆమె నవలా రూపం ఇచ్చింది. ధనిక వర్గం అబద్ధంబతుకుల గుట్టును ఈ నవలలో ఆమె విప్పింది. కుల వ్యవస్థలోని వైషమ్యాలు, వైరుధ్యాలు ఈ నవలలో కనిపిస్తాయి. ఓ బహుజన స్త్రీ సొంత వ్యక్తిత్వం కళ్లకు కడుతుంది. అగ్రకుల పురుషుల చేతుల్లో లైంగిక దోపిడీకి గురై కూడా నిటారున నిలబడిన స్త్రీకి ఆమె ప్రాణం పోసింది.

మిస్టర్ సంపత్ ఎంఎ నవల సహాసోపేతమైంది. వస్తువు రీత్యా వినూత్నమైంది కూడా. మగవేశ్యను తీసుకుని సంపన్న కుటుంబాల జీవిత చిత్రణ ఈ నవలలో జరిగింది. ఈ నవల ఈ తరం మనిషి పేరుతో సినిమాగా వచ్చింది. అయితే, మూలాన్ని చాలా వరకు మార్చి ఈ సినిమాను రూపొందించారు. తరం మారింది నవల కూడా సినిమాగా వచ్చింది. దానికి నంది అవార్డు లభించింది. ఆమె నవలలు పది దాకా సినిమాలుగా రూపొందాయి. ఆమె నవలలపై విస్తృతమైన అధ్యయనం చేస్తే తెలంగాణ సమాజం చలనశీలత, ఆధునికతను అందుకోవడానికి సమాజం పడిన పురుటినొప్పులు అర్థమయ్యే అవకాశం ఉంది. బొమ్మ హేమాదేవి (రుక్మిణి, దేవీరమ) 40కి పైగా నవలలు రాసినట్లు తెలుస్తున్నది. ఆమె (1931-1996) నిజామాబాద్‌లో రాజానర్సాగౌడ్ పెద్ద కూతురు. ఆమె పుట్టింటి పేర్లు యమున, రుక్మిణి. ఆమె మానకొండూరుకు చెందిన బొమ్మ నారాయణరావును వివాహం చేసుకుంది. ఆ తర్వాత హైదరాబాద్లో స్థిర పడింది. ఆమె నవధాన్యాలు, తపస్విని, లవ్ స్టోరీ, ఉపాసన, కుంకుమపూలు, భావన-భార్గవి, నవభారతి, కళావతి, నవరసాలు, తరంగాలు, నవోదయం, బంగారు గూడు (పెద్దగూడు) అనే నవలలు రాసింది.వనపర్తికి చెందిన పోల్కంపల్లి శాంతాదేవి 63దాకా నవలలు రాసింది. ఆమె నవలల్లో ప్రధానంగా కుటుంబ జీవితం కనిపిస్తుంది. హైమాదేవి 40 వరకు నవలలు రాసినట్లు పరిశోధకులు చెబుతున్నారు. ఆమె రాసిన బాససారి, పుష్యమి, చండీప్రియ, నిషా, నౌకాయానం, ప్రతిక్ష, సమర్పణ, కుంకుమరేఖలు, మరణం అంచున, అష్టదళం,ప్రేమపూజారి, పెళ్లి మంటలు, కన్నెవాగు, కోడెనాగు, మాయలేడి, మనసు ఒకరికే- మనిషి ఒకరికే, పూలపడవ, రాగదీపం, జీవన సంగీతం, ప్రేమబంధం, అడవి మంట, అత్మబంధువు, నైనా మొదలైన నవలలు రాశారు.

ఇల్లిందల సరస్వతీదేవి 20 నవలలు రాసినప్పటికీ బాంచెన్ కాల్మొక్తతో పాటు పెళ్లి కూతుళ్లు అనే నవలల పేర్లు మాత్రమే లభిస్తున్నాయి. రాజీవ నడుస్తున్న కథ నవలను రాశారు.

ముదిగంటి సుజాత రెడ్డి "మలుపు తిరిగిన రథ చక్రాలు", "ఆకాశంలో విభజన రేఖల్లేవు", "సంకెళ్ళు తెగాయి" అనే మూడు నవలలను రాశారు. "మలుపు తిరిగిన రథచక్రాలు" నవలలో 1940 లో జరిగిన సాయుధ పోరాటాన్ని కమ్యూనిష్టుల విప్లవాన్ని చిత్రించారు. ముదిగంటి సుజాత రెడ్డి గారు తప్ప మహిళలు తెలంగాణ

పోరాటాన్ని వస్తువుగా నవలలు రాయలేదు. 'ఆకాశంలో విభజన రేఖల్లేవు' నవలలో కొందరు స్త్రీ వాదులమంటూ ద్వంద్వ ప్రమాణాలను ఆచరించటాన్ని స్త్రీ, పురుషులను సమానంగా జీవితాన్ని ప్రజాస్వామ్య మార్గంలో కొన సాగించినపుడే స్త్రీ వాదం సాధింపబడుతుందని ఈ నవలలో చిత్రించింది. రాడికల్ ఫెమినిజం భావాలను ఖండించింది. ముదిగంటి సుజాత రెడ్డి ''సంకెళ్ళు తెగాయి'' నవలలో ఒక కింది వర్గం మంగలి యువకుడు విద్యార్జనలో ఎదుర్కొన్న కష్టాలు అతడు విద్య, విజ్ఞానం, క్రమశిక్షణతో ఎదిగి ప్రభుత్వాధికారిగా అధికారాన్ని సంపాదించటం ఇతివృత్తంగా వుంది. జానపదుల నిత్య జీవితం ఎలా ఉంటుందో ''వొయినం'' నవలలో జాజులు గౌరి చిత్రించారు. ఈ నవలలో పేద మహిళల జీవితం, పరిణామాలు, సంస్కృతి, తెలంగాణ భాష, తెలుగు సాహిత్యంలో అస్తిత్వ చైతన్యంతో చిత్రించ బడ్డాయి.

తెలంగాణ నుంచి స్త్రీవాద కథలే కాక నవలలు కూడా వచ్చాయి. గీతాంజలి రచించిన ''ఆమె అడవిని జయించింది'' నవల ఆదిలాబాద్ యానలో ఉంది. కుటుంబంలో స్త్రీలు, పరుషుల అభిరుచులకు అనుగుణంగా నడుచుకోవడం, వాళ్ళల్లో ఆత్మగౌరవం, ఆత్మాభిమానాలు, ఆచారాలు, సంప్రదాయాల పేరుతో అణచబడటం, పట్టణాలలో స్త్రీలు కూడా ఎటువంటి స్వాతంత్ర స్వేచ్ఛ లేకుండా హింసలకు గురికావడాన్ని గీతాంజలి ఈ నవలలో చిత్రించారు. ఈమె నవలతో పాటు కథలను కూడా రచించారు. ఈమె అసలు పేరు ''భారతి''. రచయితగా గీతాంజలి పేరుతో నవలలు, కథలు రాశారు.వావికొలను రాజ్యలక్ష్మీ ఈమె పోల్కంపల్లి శాంతాదేవి ఆడపడుచు. ఈమె 11 నవలలను రచించారు. ''హృదయసుగంధం'', ''ప్రేమ పుష్పం'' మొదలైన నవలలను రచించారు. ఈమె నవలలు కుటుంబ జీవితానికి సంబంధించినవి.సాకేతపురి కస్తూరి- బతుకమ్మ మునిగింది నవలలో నిజాం పాలించిన తెలంగాణ రాజ్యంలో దొరలు దౌర్జన్యం కళ్ళకు కట్టించారు. వావిల కొలను రాజ్యలక్ష్మి -ఆనందకిరణాలు, జీవన చక్రం, ఓపూవురాలింది, చెదిరిన మేఘాలు, కళ్యాణరేఖ, మౌనగీతం, ఆశాలదీపాలు, ప్రేమపుష్పం, హృదయ సుగంధం, ఆఖండదీపికలు, ప్రేమ సంగీతం, పూలరథం మొదలైన నవలలను రాశారు. శ్రీపాద స్వాతి పునరాగమనం, చిరుజల్లు కురిసేనా నవలలు రాశారు.

BHAVAVEENA
Vol. 18, Issue. 10, October 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

కళ్లేపల్లి బంగారు మైసమ్మ జాతర – పరిశీలన

- కార్ర రూపన్న

జానపదుల జీవితంలో జాతర స్థానం ఎంతో ఉన్నత మైంది. జానపద విజ్ఞానానికి, జాతరలకు అవినాభావ సంబంధం ఉంది. రకరకాల గ్రామీణ సంస్కృతులను ప్రతిబింబించేవి జాతరలు. వ్యక్తి నుంచి వ్యక్తికి తెగ నుంచి తెగకు, ఊరి నుంచి ఊరికి ఒక్కొక్క ప్రాంతాన్ని పరస్పరం ప్రభావితం చేసుకుంటూ దట్టంగా పాకే విస్తారగుణం జాతరకున్నది. జాతర అనేది పలు సంప్రదాయాలను, ఆచారాలను, ఆనందాలను, ఆచరణలను, వ్యాపారాలను కలుపుకొని కొనసాగే ఒక వ్యవస్థ. జాతరలో పిల్లలు, స్త్రీలు, పురుషులు, వృద్ధులు, వివిధ రకాల వృత్తుల వారు, కులాల వారు, మతాల వారు అంతా కలిసి పాల్గొంటారు. "జాతర" అనేది ద్రావిడ భాషాపదం. అందరూ కలుసుకునే కోలాహలం. జాతర అంటే ఉత్సవం, జాతా, మేలా అనే పదాలు వాడుకలో ఉన్నాయి. గుంపుకు, సంబరాలకు పర్యాయ పదాలివి. మన భారతదేశంలో ముఖ్యంగా దక్షిణ భారతదేశంలో ఈ జానపద విజ్ఞానం ఇంకా విలక్షణంగా కనిపిస్తుంది.

జాతరలు మొదట గ్రామాల నుండి ప్రారంభమై కాల క్రమేణా అవి మండలాలకు, జిల్లాలకు, పట్టణాలు మరియు రాష్ట్రాల వరకు విస్తరిస్తుంటాయి. గిరిజనుల సంప్రదాయం, ఐకమత్యం, కట్టుబాట్లు, ఆత్మ గౌరవాన్ని ప్రతిబింబించేల కళ్లేపల్లి బంగారు మైసమ్మ జాతర జరుగుతుంది. ప్రతీ రెండేళ్ళకోసారి వైభవంగా జరిగే ఈ జాతరలో గిరిజనులే కాకుండా, గిరిజనేతరులు కూడా ఈ జాతరలో పాల్గొని లక్షల మంది భక్తులు హాజరవు తారని అంచనా.

నల్లగొండ జిల్లా దామరచర్ల మండలంలో మిర్యాల గూడ పట్టణానికి 20 కిలోమీటర్ల దూరంలో జాతీయ రహదారి నుండి 5 కిలోమీటర్ల దూరంలో కొండ, కోనల మధ్య కళ్లేపల్లి గ్రామం ఉంది. పూర్వం ధీరావత్ హచ్చు నాయక్ తన కుటుంబం భాదల నుండి, కీడు నుండి విముక్తి కలగాలని కళ్లేపల్లి గ్రామ సమీపంలో బంగారు మైసమ్మను ప్రతిష్ఠించారు. గ్రామ పెద్దల నిర్ణయముతో ప్రతి రెండేళ్ళకోసారి ఏప్రిల్, మే మాసంలో శని, ఆది, సోమవారాలలో జాతరను జరపాలని నిర్ణయిస్తారు. గిరిజన పూజారులతోనే వారి సంప్రదాయ వేషధారణలతో కళ్లేపల్లి బంగారు మైసమ్మ జాతర జరుగుతుంది. ఈ మాసాలలో పంట పొలాలు ఏమీ పండించరు కనుక బంగారు మైసమ్మ గుడి పరిసర ప్రాంతాలల్లో వేలాది భక్తులతో నిండిపోతుంది. కేవలం తెలంగాణ జిల్లాల్లోని భక్తులే కాకుండా ఆంధ్రప్రదేశ్‌లోని ఇతర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తారు. కోరిన కోర్కెలు తీర్చే దేవతగా, అలా మహిమలు చూసి ప్రతి సంవత్సరము భక్తులు మొక్కలు తీర్చుకోవడానికి వేల సంఖ్యలో పెరుగుతూనే వున్నారు.

చారిత్రక నేపథ్యం :

గ్రామాలలో శక్తి దేవతలలో అతి శక్తివంతమైన గ్రామ దేవత మైసమ్మ. ఈమె వెలసిన ప్రదేశాన్ని బట్టి, ప్రాంతాన్ని బట్టి కోటమైసమ్మ, కట్టమైసమ్మ, గండి మైసమ్మ, బంగారి మైసమ్మ అను పేర్లతో వ్యవహరిస్తారు. కళ్లేపల్లి బంగారు మైసమ్మ జాతర నిర్వహణకు ముందు చారిత్రక గాథను పరిశీలిస్తే పలు ఆసక్తికరమైన అంశాలు స్పష్టమవుతాయి. బంగారు మైసమ్మ మహిమల గురించి భక్తులు విభిన్న కథలు ప్రచారంలో ఉన్నాయి. పూర్వము కళ్ళేపల్లి గ్రామంలో ధీరావత్ వంశము నందు హచ్చునాయక్, సూరానాయక్ మరో ముగ్గురు అన్నదమ్ములు నివసించు చుండేవారు. వారిలో చిన్న వారైన హచ్చు నాయక్ ఇద్దరు భార్యలను కలిగి ఉండేవాడు. వీరు సంచార జీవనము గడుపుతూ ఊరూర తిరుగుతూ ఉప్పు అమ్ముకునేవారు

మరియు పశువులను పోషించడం వీరి ముఖ్యమైన జీవనాధారము.

వీరి వద్ద వందల సంఖ్యలో పశువులు ఉండేవి, కొంత కాలవ్యవధిలోనే చాలా పశువుల చనిపోవడం జరిగింది మరియు అదే సమయములో హచ్చునాయక్ భార్య అంటుమైలతో చనిపోయంది. అన్నదమ్ములు అందరూ కలిసి ఎందుకిలా జరుగుతుందని భావించి కొలుపు చెప్పే ఎరుకల సాని వద్దకు వెళ్ళి 1.25 పైసలు పెట్టి కొలుపు చెప్పించారు. ఎరుకలసాని కొలుపు చెప్తూ నల్లగొండ జిలాల దగ్గర వున్న చెర్కుపల్లి గ్రామమందున్న బంగారు మైసమ్మ ఆవహించడం వల్ల నీ భార్య మరియు పశువులు చని పోతున్నాయని చెప్పింది. దీనికి పరిష్కారంగా మీరు బంగారు మైసమ్మను కళ్లేపల్లి యందు ప్రతిష్ఠించినట్లయితే నీ కీడు తొలగిపోతుందని చెప్పింది. ఎరుకలసాని చెప్పినట్లుగానే అన్నదమ్ములందరూ కలసి మైసమ్మను ప్రతిష్ఠించాలని నిర్ణయించుకున్నారు. దానికోసం డప్పులు వాయించే వాళ్ళను, పెద్దకాపు, పెద్దగౌడ, పెద కుమ్మరి, బవనీలు, పెద్ద చాకలి, మైసంగి, మాతంగి మొదలగు వారందరిని పిలిపించి మైసమ్మను ఆరె చెట్టు క్రింద నాలుగు చదునైన రాళ్ళతో ప్రతిష్ఠించి, దానికి సున్నం వేసి, ఒక పిల్ల తల్లి గొర్రెపిల్లను, దున్నపోతును బలి యిచ్చారు. బలి యిచ్చిన గొర్రె పేగులను బవనీడు ధరించి, "గావు" పట్టిన జీవము యొక్క రక్తాన్ని కుంభంలో కలుపుతారు. ఇట్టి కలిపిన అన్నమును ఊరి చుట్టు తిరుగుతూ చల్లుతారు. ఇలా పోలి చల్లడం వలన గ్రామానికి దుష్ఠశక్తులు రావని వీరి విశ్వాసము.

జాతర సంప్రదాయం / జాతర విధానము :

కళ్లేపల్లి గ్రామంలో బంగారు మైసమ్మ జాతర పర్వదినాన సాంప్రదాయబద్ధమైన వేడుకలు జరుగు తాయి. హచ్చునాయక్ నుంచి వంశపారంపర్యంగా వస్తున్న గిరిజనులు తొమ్మిది బంగారు మైసమ్మ వెండి విగ్రహాలను గ్రామము నుండి తీసుకురావడంతో జాతర ఊపందు కుంటుంది. మొదట కుంటుంబ సభ్యులు మాత్రమే పూజించేవారు. కాలక్రమేణ చుట్టు ప్రక్కల గ్రామాలలో నివసించే గిరిజనులు పూజించడం ప్రారంభించారు. ఈ విధంగా గ్రామాల నుండి మండలాలు, మండలాల నుండి జిల్లాల వరకు ఈ మైసమ్మ మహిమలు వ్యాపించి ఇప్పుడు మూడు రోజుల జాతరగా సాగుతుంది. ప్రస్తుత కాలంలో ఈ జాతరకు గిరిజనులే కాకుండా, గిరిజ నేతరులు వివిధ కులాల, మతాల, వృత్తులవారు వచ్చి మొక్కులు చెల్లించుకోవడం విశేషం. భక్తులు కోరిన కోర్కెలు తీర్చే దేవతగా ప్రసిద్ధిచెంది, వారి మొక్కు చెల్లింపులు దున్నపోతులు వదిలేయడం, జంతు బలి, కోళ్ళు బలి మరియు ముడుపులు కట్టడం, కానుకలు సమర్పించడం వంటివి వివిధ రూపాలలో భక్తులు మొక్కులు చెల్లించుకుంటారు. బలి యిచ్చిన యాటలు, కోళ్ళ ఎడమ కాలిని మాత్రం భక్తులు గుడి ఆవరణలో ఉన్న చెట్లకు కడతారు. దేవతకు నైవేధ్యంగా పాయసం మరియు వండిన కాలేయం లేదా కాల్చిన కాలేయంను మరియు కొబ్బరి కాయలతో పాటు కానుకలు సమర్పించు కుంటారు. జాతర చివరి రోజు ఆలయ కమిటి నిర్ణయిం చిన విధంగా దున్నపోతులను బలి యిచ్చి గుడి చుట్టు పాలి తిరిగి ఆ తొమ్మిది విగ్రహాలను తిరిగి గ్రామంలో తీసుకువెళ్తారు. దీనితో జాతర ముగుస్తుంది. కాని అదే రోజు కళ్లేపల్లి గ్రామ ప్రజలు అమ్మ వారిని తన ఇంటివద్ద యాటలు బలి ఇచ్చి మొక్కులు తీర్చుకుంటారు.

ముగింపు :

కళ్లేపల్లి బంగారు మైసమ్మ జాతర మొదట ఒక కుటుంబంతో ప్రారంభమయ్యి కాలక్రమేణ గ్రామ గిరిజనులు జరుపుకునేవారు. బంగారు మైసమ్మ మహిమలు మరియు కోరిన కోర్కెలు తీర్చే మహిమగల తల్లి అని ఆనోట ఈనోట వ్యాపించి గ్రామాల నుండి మండలాలకు, మండలాల నుండి జిల్లాలకు, జిల్లాల నుండి రాష్ట్రమంతా వ్యాపించియున్నది. ఈ జాతర సమయంలో వేలాది మంది భక్తులు గిరిజనులే కాకుండ,

గిరిజనేతరులు కూడా పాల్గొనడం విశేషం. ఈ విధంగా అభివృద్ధి చెందడం వలన తెలంగాణ ప్రభుత్వం ఆధీనంలో తీసుకొని ఇంకా అభివృద్ధి చెందడానికి ఆస్కారం ఉన్నది. కావున ఇంతటి అభివృద్ధి చెందిన జాతర మీద పరిశోధన చేయవలసిన ఆవశ్యకత ఎంతైనా వుంది.

ఆధార గ్రంథాలు :

1) డా. చింతల యాదయ్య - నల్లగొండ జిల్లా జాతరలు-పరిశీలన - 1995, పద్మావతి ఆర్ట్ ప్రింటర్స్, 1-1-517/బి/1, న్యూబాకారం, గాంధీనగర్, హైదరాబాద్-500380.

2) డా. సుతారి లక్ష్మీనారాయణ-''బోనాల ప్రదర్శన కళారూపాలు'', ప్రసన్న ఆర్ట్ ప్రింటర్స్, ఇసిఐఎల్, హైదరాబాద్-62.

3) జూలూరు గౌరీశంకర్, పెన్నా శివరామకృష్ణ-తెలంగాణ సంస్కృతి-కళలు, శ్రీ బాలాజీ గ్రాఫిక్స్, గోల్నాక, హైదరాబాద్-13.

విషయ సేకరణ :

	పేరు	వయస్సు	గ్రామం	మండలం	జిల్లా
1)	ధీరావత్ తులసీదాస్	70 సం॥లు	కళ్లేపల్లి	దామరచర్ల	నల్లగొండ
2)	ధీరావత్ బాష	62 సం॥లు	కళ్లేపల్లి	దామరచర్ల	నల్లగొండ
3)	ధీరావత్ కోమలి	85 సం॥లు	కళ్లేపల్లి	దామరచర్ల	నల్లగొండ
4)	ధీరావత్ పాచునాయక్	59 సం॥లు	కళ్లేపల్లి	దామరచర్ల	నల్లగొండ
5)	ధీరావత్ మోతిలాల్	61 సం॥లు	రాళ్లవాగుతండ	దామరచర్ల	నల్లగొండ

BHAVAVEENA
Vol. 18, Issue. 10, October 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావ వీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

జానపద సాహిత్యం – శృంగార గేయాలు

– డా॥. లంకిపల్లె జ్యోతీశ్వర నాయుడు, ఆంధ్రోపన్యాసకులు, వి.ఆర్.యస్. & వై.ఆర్.ఎన్. కాలేజి, చీరాల, ప్రకాశం జిల్లా.

జానపదుడు కల్లా కపటం లేనివాడు. మనసులోని మాట మరుగు లేకుండా బయట పెట్టే స్వభావం కలవాడు. అతనిలో ఏర్పడే ఏ భావమైనా ఆవేశంతో కలిసి అందమైన పాటగా ఆవిర్భవించి అలరింపజేస్తుంది. సృష్టికి హేతుభూతమైన కోరిక మానవుని వయసుతోపాటే పెరుగుతుంది. యవ్వనపు పొంగుతో కలిసి ఉబికి ఉ ద్రూతలూగుతుంది. ఇది సృష్టి కంతటికి సమాన ధర్మమే. యవ్వనంలోనే వలపు మొగ్గ తొడుగుతుంది. స్త్రీ, పురుషులు పరస్పర ఆకర్షణకు లోనవుతారు. చూపులు కోరికల్ని రేపుతాయి. మనసులో మదన సంగీతం మొదలవుతుంది. అప్పటిపాట్లు అనుభవైక వేద్యం. తమ మానసిక స్థితిని బహిర్గతం చేసి మనోభారాన్ని దించు కొంటాడు జానపదుడు. దానికుపయోగపడే చక్కని సాధనాలే స్వచ్ఛమైన జానపద శృంగార గేయాలు లేదా వలపు పాటలు. ఇవి స్త్రీ, పురుషులు తమ వలపును తెలుసుకోడానికి ఉపకరిస్తాయి. కష్టాలు, కడగండ్లు చుట్టు ముట్టినపుడు ఆ మానసిక స్థితి నుంచి తాత్కాలికంగానైనా తప్పుకొనేందుకు జానపదుడు వీటిని ఆశ్రయిస్తాడు. నాగరికులు వీటిని విన్నప్పుడు మానసికంగా ఆ వాతారవణంలో ప్రవేశించి తాదాత్మ్యం పొందగలుగు తాడు. ఈ శృంగార గేయాల్ని నాలుగు విధాలుగా వర్గీకరించడమైంది. అవి-

1) ప్రేయసీ ప్రియుల శృంగారం 2) భార్యాభర్తల శృంగారం 3) ప్రలోభ శృంగారం 4) వంచక శృంగారం

ప్రేయసీ ప్రియుల శృంగారం :

ప్రేమికుల ప్రేమకు వరాకాష్ఠ శృంగారం. శిష్టసాహిత్యంలో పురుషులే మొట్టమొదట స్త్రీలను వలచి పలకరించినట్లుగా పెక్కు కావ్యాల్లో కన్పిస్తుంది. కాని జానపద సాహిత్యంలో అలాగాక స్త్రీ పురుషులిరువురూ పరస్పరం పలకరించుకొనే శృంగార గేయాలు ఎన్నో కన్పిస్తాయి. భావ వ్యక్తీకరణ, కలయిక విషయాల్లో పల్లీయులకు, పట్టణ వాసులకు ఎంతో తేడా వుంది. సాధారణంగా పట్టణవాసులైన ప్రేమికులు తమ ప్రేమ కలాపాల్ని ఉత్తర ప్రత్యుత్తరాల ద్వారా తెల్పుకుంటూ, సినిమా హాళ్ళలోను, పార్కుల్లోను కలుపుకుంటుంటారు. పల్లెల్లో అలాకాదు. మాటల ద్వారానో, పాటల ద్వారానో తమ అనురాగాన్ని పరస్పరం తెలియజేసుకుంటూ పొలాల్లోనో, బావుల దగ్గరనో, తోపుల దగ్గరనో కలుసు కుంటుంటారు.

ఒక చిన్నది బావి దగ్గర పొలంలో వరినాట్లు వేస్తుం టుంది. ఆ పొలం ప్రక్కన పొరుగు గ్రామానికి చెందిన ఒక చిన్నవాడు గొర్రెలు మేపుతుంటాడు. వాడికి ఆ చిన్నదానిపై మనసు పడుతుంది. పాట ద్వారా తన ప్రేమ భావాన్ని వ్యక్తంచేస్తాడు. ఆమె కూడా అలాగే తన భావాన్ని తెలియజేస్తుంది. వాళ్ళిద్దరి మనోభావాల వ్యక్తికరణే క్రింది గేయం.

చిన్నోడు : జడనీకు ఎవరల్లీరో చిన్నదానా
జడనీకు ఎవరల్లీరో
జడనా జాజికాయ మెడనా కుచ్చుల దండా
జడనీకు ఎవరల్లీరో

చిన్నది : మానిలో పండుండాదీ చిన్నవాడా
మాటలకు మడిరాలునా ॥చిన్నావాడా॥

చిన్నోడు : దోటివేసి లాగితే పడుసుదానా
దోసిట్లో పడదూకునా

చిన్నది : బాయిలో చేపుండాది చిన్నవాడా
బాధా పాడితే దొరుకునా ॥చిన్నావాడా॥

చిన్నోడు : గాలమేసి లాగితే పాడుసుదానా
గెడ్డానా పడదూకూనూ

చిన్నది : ఏటికి వలలొడ్డితే చిన్నావాడా
ఏమేమి మెగమోచ్చునో ॥చిన్నావాడా॥

చిన్నోడు : రొమ్మున కొక్రడ్డితే పాడుసుదానా
నమ్మిన మెగమెచ్చునా

చిన్నది : పొగచుట్ట తాగబోకురా చిన్నావాడా
పొగభారం తలకెక్కునూ ॥చిన్నావాడా॥

చిన్నోడు : దానిమైకం నాకు దెలుసునే చిన్నాదానా
ముక్కల్లో రాదీతునే

పై గేయంలో చిన్నది తాను మానులోని పండులాంటి దానినని, బావిలోని చేపలాంటి దానినని పోలిక చెబుతూ మానిలోని పండు నీ మాటలకు రాలదనీ, బావిలోని చేప బాధపడితే దొరకదని ఆమె భావన. చిన్నవాడు దోటివేసి లాగితే పండు దోసిట్లో పడుతుందని, గాలమేసి లాగితే చేప గట్టున పడుతుందని సమాధానం చెప్పడం జానపదుల అలంకారికమైన సంభాషణా చతురతకు ఒక చక్కని నిదర్శనం. చివరిగా అతనిపట్ల తనకున్న సుముఖతను సూచిస్తుంది. కాని అతని వూరేమిటో చేసే పనియోమిటో తెలుసుకోవాలి గదా! అందుకే ఆ చిన్నది-

"ఏ వూరురన్న నీది... ఏ పల్లెరన్న నీదీ
కాసేటి ఎండాలో... తోలేటి గాలీలో...

అని ప్రశ్నిస్తుంది. దానికి సమాధానంగా అతడు-

"మా వూరు మదరాసు - నా పేరు రామదాసు
కాసేటి ఎండాలో - గొర్లకాడుండాను
తోలేటి గాలీలో - మేక్లకాడుండాను"

అంటాడు. చిన్నవాడి సంగతి తెలుసుకొన్న తర్వాత చిన్నది తన్ను గురించి యిలా చెబుతుంది. తాను యువతిననే విషయాన్ని నొక్కి వక్కాణిస్తూ, తన యింటి గుర్తుల్ని చెప్పి, రాత్రికి వచ్చి తనను కలుసుకొమ్మని సూచన ప్రాయంగా తెలియజేస్తుంది.

భార్యభర్తల శృంగారం :

భార్యాభర్తల మధ్య అప్పుడప్పుడు చిలిపి తగాదాలు రావడం, సర్వసామాన్యం. ఆ కారణంగా వాళ్ళిద్దరిలో ఒకరు అలక సాగించడం, మరొకరు అలక తీర్చడమనేది కూడా సహజమే. ఇలాంటి తగాదాలు, అలకలు జానపదులలో మారీ ఎక్కువ. కొత్తగా పెళ్లయిన యువతి చల్లమ్మడానికి పట్టణానికి వెళ్తుంది. "కొత్త బిచ్చగాడు పొద్దెరగడన్నట్లు" ఆ యువతి భర్త ఆమెను వెతుకొంటూ పట్టణానికి వెళ్తాడు. అదే సమయంలో చల్లమ్ముకొని ఆ యువతి ఇంటికి తిరిగి వస్తూ అతనికి ఎదురౌతుంది. అతడు ఎంతో తమకంతో వారున్నది నడిరోడ్డు అన్న విషయం మరచి ఆమె కొంగు పట్టుకుంటాడు. అందు కామె అలిగి యింటికి వచ్చి తలుపు గడియవేసు కొంటుంది. గడియ తీయమని అతడెన్నో విధాలుగా ప్రాధేయపడుతాడు. అప్పుడామె ఎన్నో కుంటి సాకులు చెప్పి అతన్ని విసిగించి చివరికి తలుపు తీస్తుంది. ఆ సన్నివేశంలో వాళ్ళిద్దరి మధ్య సాగిన శృంగార సంభాషణను జానపదులు ఎంత సున్నితంగా చిత్రించారో క్రింది సంవాద గేయంలో చూడవచ్చు.

అల్లనేరేడల్లా జంబునేరుడల్లా - ఓ ... లలన నేరేడల్లా
గెడిదీయె ఓ భామా గెడిదీయే నీవు అల్లనేరేడల్లా
॥అల్ల॥

గెడికాడా గంధపు చెక్కాలున్నాయి అల్లనేరేడల్లా
నట్టింటా బండేను గెడిదీయె నీవు అల్లనేరేడల్లా
నట్టింటా నాగులయ్య శిరుసూలున్నాయీ అల్లనేరేడల్లా
పాయ్యికాడా బండేను గెడిదీయే నీవు అల్లనేరేడల్లా
పాయ్యి మీదా పాన్నారు కాగులున్నాయో అల్లనేరేడల్లా
నీతలకాడా బండేను గెడిదీయె నీవు అల్లనేరేడల్లా
తలకాడా తల్లిసాకిన కురులూన్నాయో అల్లనేరేడల్లా
నీ సేతుల్లో బండేను గెడిదీయే నీవు అల్లనేరేడల్లా
సేతుల్లో సేలారి గాజులున్నాయో అల్లనేరేడల్లా
కాళ్ళకాడ బండేను గెడిదీయె నీవు అల్లనేరేడల్లా
కాళ్ళకాడ కంచోరి మెట్టాలున్నాయో అల్లనేరేడల్లా
సాలీయె ఓభామా సాలీయ వమ్మా అల్లనేరేడల్లా
కాలీకాకర సెట్టూ కల్లానున్నాదో అల్లనేరేడల్లా
మంచీది ఓ భామా మంచీది నీవు అల్లనేరేడల్లా

మంచీ బెల్లపు దుత్తా దొంత్యానున్నాదో అల్లనేరేడల్లా

అంటూ కొత్తగా పెళ్లయిన యువతీ యువకులు శృంగార గేయం పాడుకుంటారు.

ప్రలోభ శృంగారం :

ప్రలోభ పెట్టడం అంటే ఆశ పెట్టడం. వలచిన స్త్రీకి కమ్మలు, కడియాలు చేయిస్తామనీ. చీరా, రవికలు తీసిస్తామని, ధన, ధాన్యాలిస్తామనీ రకరకాలుగా ఆశలు పెట్టి వాళ్ళను లొంగదీసుకోవడానికి కొందరు ప్రయత్నిస్తారు. ఈ క్రింది గేయంలో ఒక పురుషుడు స్త్రీని తనతో రమ్మని చెబుతూ ఎలాంటి ఆశలు చూపిస్తాడో చూడండి.

"రావె రావె రావె రావె నా రమణి ముద్దుల గుమ్మా
నా రాజ నిమ్మల పొండు నా రమణి ముద్దుల గుమ్మా
కాటికాడ నక్కలా కాచి కాచి వుంటాను
ఆకు చాటు పిందెలా అణగి మణగి వుంటాను
అమ్మతోడు వరసకైన అబద్దాలు పలకలేను
కాసుల పేరు చేయిస్తా, కడియాలు చేయిస్తా
గుర్రం మీద ఎక్కిస్తా, గుడిసెలన్నీ తిప్పిస్తా
పులిచేత చెప్పిస్తా, ఎల్లి చేత వొపిస్తా
వాడకంతా నిన్ను పెద్ద దొరసాన్ని చేయిస్తా"

తమ గ్రామాల్లో కూలిపనులు దొరకనపుడు ప్రక్క గ్రామాలకు వెళ్ళి పని చేసుకోవడం జానపదులకు పరిపాటి. ఆ విధంగా కూలిపని కోసం ప్రక్క గ్రామానికి వెళ్లిన ఒక యువతిని వక్కాకు యిచ్చి లొంగదీసుకోవాలను కుంటాడు ఒక యువకుడు. అపుడాగడుసరి యువతి అతడిస్తానన్న ఆకు, వక్క, సున్నం, పొగాకు తీసుకుంటే సంభవించే ఫలితాలన్నీ ఈ క్రింది విధంగా ఏకరువు పెడుతుంది.

యువకుడు : ఏ వూరు ఏ నేల రంగీపిల్లా రంగసానీ పిల్లా

యువతి : మాది ఆరిగికుంట నగరి మడుగు అప్పా మాది నరసప్పామాది

యువకుడు : వక్కిస్త ఏసుకో రంగీపిల్లా - రంగసానీ పిల్లా

యువతి : వక్కిస్తే వొంగమంటారప్పా మీరు - నరసప్పా మీరూ

యువకుడు : ఆకిస్తా ఏసుకోరంగీ పిల్లా - రంగసానీ పిల్లా

యువతి : ఆకిస్తే అడుగుతారప్పా మీరు - నరసప్పా మీరూ

యువకుడు : సున్నం పెడ్త ఏసుకోరంగీ పిల్లా - రంగసానీ పిల్లా

యువతి : సున్నం పెడ్తే సూపమంటారప్పా మీరు - నరసప్పా మీరూ

యువకుడు : పొవ్వాకిస్తా ఏసుకో రంగీపిల్లా - రంగసానీ పిల్లా

యువతి : పొవ్వాకిస్తే పోనుకోమంటారప్పా మీరు - నరసప్పా మీరూ

యువకుడు : దుప్పటిస్తా కప్పుకో రంగీపిల్లా - రంగసానీ పిల్లా

యువతి : దుప్పటిస్తే దుమ్ములేపిస్తారప్పా మీరు - నరసప్పా మీరూ

పై గేయంలోని యువతీ యువకుల సంభాషణ భావ గర్భితమైంది. పల్లెల్లో ఒక యువకుని దగ్గర ఒక యువతి వక్కాకు తీసుకున్నా లేదా యిచ్చినా అతనిపై ఆమెకు మోజున్నట్లుగా జానపదులు భావిస్తారు. వాళ్లు ఎవరికీ వక్కాకు యివ్వరు, తీసుకోరు. అందువల్లే పై గేయంలోని ఆ యువతి వక్కాకు తిరస్కరిస్తుంది. ఏదైనా ఒకపని చేసే ముందు దూరదృష్టితో ముందు వెనుకలు ఆలోచించగల జ్ఞానం కలిగి వుంటారని చెప్పడానికి పై గేయం చక్కని నిదర్శనం.

వంచక శృంగారం :

జానపద శృంగార జీవితానికి సంబంధించిన జానపద గేయాల్లో స్త్రీ, పురుషుల మధ్య నయవంచనతో కూడిన గేయాలు కూడా కన్పిస్తాయి.

స్త్రీల ఆకర్షణ అయస్కాంతం లాంటిది. కొందరు

పురుషులు రకరకాల కానుకలిచ్చి యువతులను లొంగదీసుకుంటారు. మరి కొందరు ఏమీ లేకపోయినా తమకెంతో అస్తిపాస్తులున్నాయని మభ్యపెట్టి లొంగ దీసుకోడానికి ప్రయత్నిస్తుంటారు.

ఒక యువకుడు ఒక అందమైన పల్లెపడుచును ఏలాగైనా తన దానిగా చేసుకోవాలను కుంటాడు. తనకు పొలం పుట్రా వుందని, కూటికి, గుడ్డకూ లోటు లేదని ఆ యువతికి ఎన్నో మాయమాటలు చెప్పి కానుల పేరుతో సహా ఆమెను లేపుకపోతాడు. వాడికి ఇల్లూ, వాకిలీ, పొలం, పుట్రా ఏమీ లేదని, ఒక పూట కూడా తిండి పెట్టలేని దరిద్రుడని గ్రహిస్తుంది. ఆ సమయంలో అతని మాటలు నమ్మి మోసపోయిన ఆ మగువ తన కానుల పేరిమ్మని నిలదీసి అడిగే విధానం ఈ గేయంలో గమ నించవచ్చు.

"తూరుపు సిన్నదంట్రా పిల్లగా - తుమ్మిపూల సాయిందంట్రా
మూడు మడకల సేద్యమంటివీ పిల్లగా - దున్నే వాళ్ళు లేరంటివీ
నమ్మించి నన్ను దెస్తివా పిల్లగా - నా వాలు బెట్టిస్తివా
నా దండ నాకీయరా పిల్లగా - నే బోతా మా వూరికీ
పడమంట సిన్నదంట్రా పిల్లగా - పాలపూల సాయి దంట్రా
పెట్టెనిండా సొమ్ములంటివీ పిల్లాగా- పెట్టే వాళ్ళు లేరంటివీ
ఉత్తరాది సిన్నదంట్రా పిల్లగా - ఉల్లిపూల సాయిందట్రా
ఉత్తరంగ యిల్లంటివీ పిల్లగా - ఉండే వాళ్ళు లేరంటివీ
దక్షిణాది సిన్నదంట్రా పిల్లగా - దరణి పూల సాయిదంట్రా
దండెం మీద కోకలంటివీ పిల్లగా - కట్టే వాళ్లు లేరంటివీ"

ఈ గేయం జానపదుల భావుకతకు, వాస్తవిక దృక్పథానికి చక్కని ఉదాహరణగా పేర్కొనవచ్చు. ఇందులో తుమ్మి పూలసాయి. పాలపూల సాయి, ఉల్లిపూల సాయి. ధరణిపూల సాయి వంటి ప్రయోగాలు జానపదుల నిత్య జీవితంతో ముడిపడి వుండేవే వాళ్ల ఉపమానాలు. పల్లె జీవితాన్ని కళ్ల ముందుంచుతాయి. పదం పదంలో జన జీవనం ఉట్టి పడడమే గాక, వాస్తవ జీవితం తొంగి చూస్తుంది.

స్త్రీలను వంచించే పురుషులే కాదు పురుషులను వంచించే స్త్రీలు కూడా జానపద గేయాల్లో కన్పిస్తారు. కొందరు స్త్రీలు తమ ఆకర్షణ ఎరగా జూపి పురుషుల దగ్గర్నుండి అనేక రకాల వస్తువుల్ని కానుకలుగా తీసుకొని వాళ్ళను తమ చుట్టూ తిప్పుకుంటారు. మరికొందరు తియ్యని మాటలతో పురుషుల్ని తమ ఆధీనంలో వుంచుకొని సాధ్యమైనంత మేరకు దోచుకుని వారిని నిరాశకు లోను చేసి ఏదో ఓక వంకతో తప్పించుకుంటారు. క్రింది గేయంలో ఒక యువకుడు ఒక యువతికి రూపాయి పావలా యిచ్చి తన కోర్కెను తీర్చమంటాడు. ఆ యువతి డబ్బు తీసుకొని ఈ రోజు, రేపు అని వాయిదాలు వేస్తూ కాలం గడుపుతుంది. అడిగి, అడిగి నిరాశపడిన ఆ యువకుడు ఎర్రకోక కట్టుకొని ఏటిగట్టున వెళ్తున్న ఆ యువతిని చూచి-

"ఎర్రకోక కట్టుకోని
ఏటి గడ్డన బుయ్యేదానా
ఎందుకు నీయందామూ
ఏటిలో పడి దూకరాదా
ఎంత దయలేని దానవే
నిన్నడిగితే యెనకా ముందర జూసేవా
నాయుడోరి తోటలోనే
నల్లదుమ్మ సెట్టుకాడా
గునుగు సెంగాయనానీ
గుడ్డ తడి కూసున్నాదాన్నా
రూపురేఖా జూసి నేను
రూపాయి పావలా సేతికిస్తే
రేపు మాపో తెలపవా

నీకు న్యాయమా నల్లాటి దానా'' అని ఎగతాళి చేస్తూ నవ్వుతాడు అప్పుడాయువతి -

''నేను నల్ల గుండనాని
నన్ను జూసీనవ్వబోకు
నల్ల జేనుదున్ని సల్లితే
తెల్ల జొన్నలు పండలేదా'' అని వేదాంత ధోరణిలో సమాధానమిచ్చి వెళ్లిపోతుంది.

BHAVAVEENA
Vol. 18, Issue. 10, October 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

జాతీయోద్యమంలో గేయకవిత్వం – సామాజిక చైతన్యానికి సంకేతం

– యం. అనిత, పరిశోధకురాలు, తెలుగు & తులనాత్మక సాహిత్యశాఖ, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, అనంతపురము.

ప్రవేశిక :

ఏ కాలంలో అయినా ప్రజలను చైతన్య పరచేది సాహిత్యమే. అది జానపద సాహిత్యమైనా శిష్ట సాహిత్యమైనా కావచ్చు. ప్రపంచంలో జరిగిన అన్ని ఉద్యమాలకు ఊతగా నిలిచింది. ప్రజలను చైతన్యవరిచింది సాహిత్యమే. సాహిత్యంలో విభిన్న పార్శ్వాలున్నాయి. వాటిలో ప్రజలను ఉర్రూతలూగించేది గేయం. ఈ గేయం భారత జాతీయోద్యమలో విశేషమైన ప్రాధాన్యాన్ని సంతరించుకున్నది. భారతీయులలో జాతీయత అనే భావాన్ని కల్గించింది గేయమేననవచ్చు. పద్దెనిమిదవ శతాబ్దం నాటి ఫ్రెంచి విప్లవం స్వేచ్ఛ, సమానత్వం సౌభ్రాతృత్వం అనే మూడు ఆధునిక భావనలని అందించింది. వాటిని సాధించడానికి చేసిన ప్రయత్నాలోంచి జాతీయత భావన ఉద్భవించిందని చెప్పవచ్చు.

శకలాలుగా ఉన్న భారతీయ సమాజాన్ని ఆంగ్లేయులు అన్ని ప్రాంతీయ రాజ్యాలనూ ఒకే తాటిమీదకు తెచ్చి రాజకీయంగా ఏకం చేశారు. తంతి తపాలా రవాణా సౌకర్యాలు వంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. ఆంగ్ల పాలకులు వాళ్ళ పాలనా సౌలభ్యం కోసం, స్వార్థం కోసం ప్రవేశపెట్టిన మార్పులు వాళ్ళ ప్రయోజనాలకు చాలా వరకు ఉపయోగపడినా, భారతీయులు మేల్కొనడానికి వాళ్లలో జాతీయభావన కలగడానికి కూడా హేతువు లయ్యాయి. భారతదేశాన్ని ఐక్యం చేసి తమ పరిపాలనను ఏర్పరచుకున్న ఆంగ్లేయులు భారతీయుల సంపద కొల్లగొట్టడం, జాతి వివక్షను ప్రదర్శించడం వంటి దుశ్చర్యలకు పాల్పడడంలో భారతీయులలో చైతన్యం వచ్చి జాతీయోద్యమానికి దారితీసింది. ఈ భారత జాతీయతా భావం పుట్టడానికి మత సాంఘిక ఉద్యమాలు వార్తాపత్రికలు, ఆంగ్ల విద్య, ఆర్థిక పరిస్థితులు వంటివి ప్రముఖ పాత్ర వహించాయి. వాటికి ఉత్ప్రేరకంగా గేయాలు దోహదపడ్డాయి. వందలాది మంది కవులు ఆనాటి సమకాలీనాంశాలపై, గేయాలు రాసి ఒక ప్రజలను చైతన్యపరిచారు. మరోవైపు ఆంగ్లేయులు పాలనను నిరసించారు. ఆ నేపథ్యంలో వెలువడిందే గరిమెళ్ళ సత్యనారాయణ రాసిన "మా కొద్దీ తెల్లదొరతనము" ఈ గేయం ఆనాడు ప్రతి తెలుగువాడి నోట పాడబడింది. సత్యనారాయణ గారు ఆ గేయం ఆలపిస్తుంటే ప్రజల రోమాలు దేశభక్తితో నిక్కపొడుచుకునేవట. ఈ క్రమంలో అనేక గేయాలు వెలువడ్డాయి. "దేశమంటే మట్టికాదోయ్, దేశమంటే మనుషులోయ్" అని గురజాడ అప్పారావు గారు ఎలుగెత్తి చాటాడు. సరళశైలిలో వెలువడిన వీరి సాహిత్యం ఆనాడు ప్రజల్లోకి చొచ్చుకుపోయింది.

దేశభక్తి :

రాయప్రోలు సుబ్బారావు గారు ఆంధ్రలో దేశభక్తిని రగిలించారు. భరతభూమి ఖ్యాతిని శ్లాఘించమన్నాడు ఒక గేయంలో ఇలా అన్నాడు.

ఏ దేశమేగనా ఎందుకాలిడినా
ఏ పీఠమెక్కినా ఎవ్వరెదురైనా
పొగడరా నీ తల్లి భూమి భారతిని
నిలుపరా నీ జాతి నిండు గౌరవము

ఏ దేశం వెళ్ళినా, ఎక్కడ తిరిగినా ఏ స్థాయిలో ఉన్నా, ఎవరు ఎదురుచెప్పినా భారతదేశ ఔన్నత్యాన్ని పొగడమంటారు. అలా పొగడి తమ జాతి గౌరవాన్ని ఖండ, ఖండాంతరాల్లో నిలపమంటాడు. ఈ మహాకవి ప్రబోధం ఆనాడు ప్రజల్లో దేశభక్తిని రగిలించిందని చెప్పవచ్చు. ఈ గేయంలో కేవలం దేశభక్తి ఒక్కటే కాదు ఆత్మగౌరవం కూడా ఉంది. ప్రతి వ్యక్తికి ఆత్మాభిమానం, ఆత్మవిశ్వాసం మెండుగా ఉండాలి. అప్పుడే తాను అనుకున్నది సాధించగలుగుతాడు.

బానిస చదువులు :

జాతీయోద్యమంలో భాగంగా జరిగిన ఉద్యమాల్లో ప్రధానమైనది నహాయ నిరాకరణోద్యమం. ఈ ఉద్యమంలో భాగంగా పాశ్చాత్య విద్యను బహిష్కరించి స్వదేశీ విద్యను అభ్యసించమని నాయకులు ప్రజలకు పిలుపునిచ్చారు. ఆ సమయంలోనే జాతీయ విద్యా సంస్థలు వెలిశాయి. కవులు ఈ పరిణామాన్ని ఆహ్వానించారు. అయితే వలస పాలకుల ప్రయోజనాల కనుగుణంగా వాళ్ళు ప్రవేశపెట్టిన విద్యను కవులు వ్యతిరేకించారు. ఈ నేపథ్యంలో తరిమెళ్ళ వెంకట సుబ్బారావు గారు ఆంగ్లవిద్య వ్యామోహాల్ని "రామదండు" గేయంలో ఇలా అధిక్షేపించారు.

కూలి చదువులొచ్చాయి రాంభజన
బానిస చదువులొచ్చాయి రాంభజన
జ్ఞానమంత పోయింది రాంభజన
దేశమంటె రోతపుట్టె రాంభజన
దేశ భాషలంటేను రాంభజన
రుస్సు రుస్సు మంటారు రాంభజన

అంటూ ప్రజలు ఆంగ్లభాష పట్ల ఎలా వ్యామోహితులవుతున్నారో తెలిపాడు. అదే విధంగా దేశభాషల పట్ల ఎలా విముఖత చూపుతున్నారో కూడా రచయిత తెలిపాడు. ఆంగ్లభాష పట్ల భారతీయులకున్న వ్యామోహం ఈ నాటిది కాదని దీనిని బట్టి స్పష్టంగా తెలుస్తున్నది. అంత గాఢంగా ఆ భావజాలం నాటుకోవడం వల్ల దాన్ని పెకిలించడం సాధ్యం కావడం లేదు.

అనైక్యత :

ఆ రోజుల్లో భారతీయుల్లో అక్కడక్కడ పొడసూపుతున్న అనైక్యతను కొందరు కవులు గుర్తించారు. ఆ సమయంలో దాన్ని బహిర్గతపరిస్తే భారతీయులకే కష్టమని కూడా గుర్తించారు. తమ స్వార్థానికి అనుగుణంగా మలుచుకునే అవకాశం ఉందని భావించారు. అయినా సమస్యను చెప్పక తప్పని పరిస్థితుల్లో సున్నితంగా చెప్పారు. అలా చెప్పిన వారిలో అగ్రగణ్యులు నెమ్మాని వెంకటరాయ శర్మ ఇలా అన్నారు.

"సర్వదా సర్వులకు సర్వత్ర స్వాతంత్ర్య
ముంటేనే ఉన్నట్లు స్వారాజ్యం
ఒకరి నుండొకరికి ముప్పమొచ్చేట్టంటె
మూన్నాళ్ళు నిలువదీ స్వారాజ్యం"

- అని హెచ్చరించారు. స్వతంత్ర్య భారతంలో వ్యక్తి స్వేచ్ఛ వర్గ సామరస్యం ఉండాలని ఉద్బోధించాడు. స్వాతంత్ర్యం వచ్చాక భారతీయులు ఎలా మసలుకోవాలో రచయిత అద్భుతంగా చెప్పాడు. అనాడు ఆయన చెప్పిన మాటలు నేటికి ప్రామాణికాలని రూడిగా చెప్పవచ్చు. భారతీయులు ఒకరిఒకరు ముప్పు వచ్చేట్లు వ్యవహరించకూడదంటాడు కవి.

మద్యపానం :

జాతీయోద్యమంలో మద్యపాన బానిసత్వం నుండి ప్రజల్ని దూరం చేయడం ఒక ప్రధానాంశంగా ఎన్ను కోబడింది. మద్యం పేదల రక్త మాంసాలను పీల్చి ప్రజల్ని ఆర్థికంగా క్రుంగదీయడమే గాక, మనుషులు దేశాన్ని గురించి, సమాజం గురించి ఆలోచించకుండా చేసింది. జాతీయోద్యమ కాలంలో అనేక మంది కవులు తాగుడుకు వ్యతిరేకంగా ప్రజల్ని జాగృతం చేశారు. ఈ క్రమంలో చూసినపుడు జాలా రంగస్వామి భజన పాటల బాణిలో రాసిన పాటలు తాగుడు వల్ల వచ్చే అరిష్టాలను చెప్పి హెచ్చరిస్తాయి. కల్లు తీయడం ఆర్థిక సమస్యగానే గాక, వ్యక్తిత్వ సమస్యగా కూడా ఆనాటి కవులు గుర్తించారు.

కల్లుమానే విధము తెలియండీ - జనులార
కల్లుమానే విధము తెలియండీ
చిప్పముంత చేత వచ్చును - చింపిపాతలు పైకి వచ్చును
పంచలందు పరుండవలయును - పరువునంతను పాడుజేయును

అంటూ మద్యపానం వల్ల కలిగే అనర్థాలను కళ్ళకు

కట్టినట్లు చిత్రించాడు. వందలాది మంది కవులు మద్య పానాన్ని నిరసించినా, యధేచ్ఛగా కొనసాగుతూనే ఉంది. ప్రభుత్వాలు వాటిని ప్రధాన ఆదాయ వనరుగా భావిస్తు న్నాయి. ఈ పరిస్థితి భారతదేశమంతటా ఆనాటినుండి కొనసాగుతూ వస్తున్నదని చెప్పవచ్చు.

ఖద్దరుధారణ :

జాతీయోద్యమ కాలంలోని నిర్మాణ కార్యక్రమంలో ఖద్దరుధారణ, ఖద్దరు ప్రచారం అనేవి దేశభక్తి చిహ్నాలేకాదు వాటికి ఆర్థికపరమైన స్వయం సమృద్ధ స్వభావముంది. మరమగ్గాలు వచ్చి చేనేత మగ్గాలను మూలకు నెట్టడంతో కుటుంబాలకు ఆర్థిక స్వాలంబన మూలబడటమే గాక విదేశి వస్త్రాల కొనుగోళ్ళు పెరిగి మన దేశసంపద ఇంగ్లండుకి సాగిపోవడం మొదలైంది. దీనిని అరికట్టడానికి స్వదేశి వస్త్రధారణ పిలుపునిచ్చారు గాంధీజి. గాంధీజి పిలుపుకు ప్రజలు ఉవ్వెత్తున మద్దతు పలికారు. కవులు కూడా ప్రేరేపితులయ్యారు తమకున్న సామాజిక బాధ్యత నెరవేర్చారు.

స్వదేశి వస్త్రధారణకు అనుకూలంగానే గాక విదేశీ వస్త్ర బహిష్కరణకు కూడా ఆనాడు కవులు స్పందించాడు. ఈ నేపథ్యంలో మంగిపూడి పురుషోత్తమశర్మ పాశ్చాత్య నాగరికతా వ్యామోహాలను దెప్పిపొడిచాడు.

సీమగుడ్డ మానమెంతటి సిగ్గురా సోదరా
సిగ్గులేదా నీకు శరము లేదా
అన్నమైనా లేక బీదలల్లాడుతుంటేను
సీతాకోక చిలుకలాగా సీమగుడ్డ కట్టి తిరుగ - అంటూ

పాశ్చాత్య నాగరికతా వ్యామోహాలను దెప్పిపొడిచాడు. ఇలా చెప్పడం ద్వారా స్వదేశి వస్త్రాలను ధరించాలని ఉద్బోధించాడు. వీరి బోధన ద్వారా గాంధీజి పిలుపు మేరకు ఎందరో ఖాదీ ధరించారు.

ముగింపు :

ఏ ఉద్యమంలోనైనా మొట్టమొదట స్పందించేది కవులే. ఉద్యమవసరాలను దృష్టిలో ఉంచుకొని వివిధ ప్రక్రియల్లో కవులు రచనలు చేస్తారు. అయితే వాటిలో ప్రజలను చైతన్యవరిచేవి, ఉద్యమకారులను ఉర్రూతలూగించేవి గేయాలు. ఈ సత్యం అనేక ఉద్యమాల్లో నిరూపితమైంది. ఇటీవల కాలంలో జరిగిన తెలంగాణ ఉద్యమాన్ని ముందుకు నడిపింది గేయాలే అని గట్టిగా చెప్పవచ్చు.

విప్లవోద్యమాలన్నీ పాటల ద్వారా ప్రజల్లోకి చొచ్చుకు పోతున్నాయి. అంతెందుకు ప్రభుత్వాలు కూడా తమ పథకాల ప్రచారం కోసం గేయాలను రాయించి, గాయకుల చేత పాడించి ఒక ప్రక్క ప్రచారం మరోప్రక్క ప్రయోజనం పొందుతున్నాయి. నేడు ప్రతి రాజకీయ పార్టీకి గేయాలు చుక్కానిలా దోహదపడుతున్నాయని చెప్పవచ్చు అందువల్లనే జానపదుల నుంచి మొదలైన గేయం నేటికి సజీవంగా వర్ధిల్లుతున్నది.

ఉపయుక్త గ్రంధాలు :

1. భారత స్వాతంత్ర్యోద్యమంలో ఉజ్వల ఘట్టాలు - జి. రెడ్డి జితేందర్
2. ఆధునిక తెలుగు కవిత్వంలో తిరుగుబాటు ధోరణులు - ఎం. గంగాధర్
3. తెలుగులో కవితోద్యమాలు - ఆవుల మంజులత
4. భారత జాతీయోద్యమ సాహిత్యం - ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి
5. స్వాతంత్ర్యోత్తర కాలాన తెలుగుకవిత - ఆచార్య ఎన్. భక్తవత్సల రెడ్డి.
6. ఆధునికాంధ్ర కవిత్వం - సంప్రదాయం - ప్రయోగాలు - డా॥ సి. నారాయణ రెడ్డి.

BHAVAVEENA
Vol. 18, Issue. 10, October 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావ వీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

ఒంటి మిట్ట రామస్వామి చరిత్ర

– మందెల భాస్కర్, పరిశోధక విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

ఎలా బ్రతకాలో ఎలా బ్రతకకూడదో ఎది మంచో ఎది చెడో తెల్పడానికి మనిషిని మనిషిగా చూడడానికి లోకకళ్యాణార్థం భగవంతుడు ఎన్నో అవతారాలను దుష్ట శిక్షణ శిష్ట రక్షణార్థం ఈ లోకంలో అవతార పురుషునిగా అవతరించాడు. అన్ని మంచి గుణాలు కలవాడు ఎలాంటి ఆపదలు చుట్టుముట్టిన తొణకనివాడు, ధర్మం తెలిసిన వాడు, ఆశ్రయించినవారిని ఆదుకునే వాడు మాటతప్పని వాడు సకల ప్రాణులకు మేలు చేసేవాడు, వీరుడు, ధీరుడు, అసూయలేని వాడు అందమున్నవాడు ఆదర్శ మూర్తి శ్రీరామచంద్రుడు. సరయునది తీరంలో కోసల అనే సుప్రసిద్ధ దేశంలో అయోధ్యనగరంలో జన్మించాడు.

దశరథరాజు భార్య అయిన కౌసల్యకు చైత్రశుద్ధ నవమినాడు శ్రీరాముడు జన్మించాడు, దశమినాడు కైకేయికి భరతుడు, సుమిత్రకు లక్ష్మణుడు, శత్రఘ్నుడు జన్మించాడు. రాముడు ఎల్లప్పుడు తల్లిదండ్రుల సేవలో నిమగ్నమైయ్యేవాడు. లక్ష్మణుడు చిన్ననాటి నుండి అన్న సేవయే మిన్నగా భావించేవాడు, ఇతడే రాముడికి బహి: ప్రాణం, భరత శత్రఘ్నులు అన్యోన్య ప్రేమాభిమానాలు కలవాడు.

ఒక్కనాడు విశ్వామిత్రుడు అయోధ్యకేతెంచి దశరథునితో తను వచ్చిన పనిని వివరించి రామున్ని తన వెంట పది దినములు పంపమని అడిగాడు. దశరథ మహారాజు ప్రాణానికి ప్రాణమైన శ్రీరాముడిని పంపించడం ఇష్టము లేకపోయిన దుష్ట శిక్షణార్థమై రామ లక్ష్మణులను విశ్వామిత్రుని వెంట పంపక తప్పలేదు. విశ్వామిత్రుడు రామలక్ష్మణులకు ''బల'', 'అతిబల' విద్యలను ఉపదేశించాడు వీటి వలన ఆకలి దప్పికలు లేకుండా గురువుగారి వెంట మలద, కురూర అనే జనపదాలకు చేరుకున్నారు. ఆ ప్రాంతము ఇంద్రుని అనుగ్రహం చేత చాల సంపద కలిగి ఉంది. కాని తాటక అనే యక్షిణి చేత విధ్వంసానికి గురౌతూ ఉండేది. విశ్వామిత్రుడు శ్రీరామలక్ష్మణులకు ఎన్నో శస్త్ర విద్యలు నేర్పడం చేత తాటకిని శ్రీరాముడు అంతమొందించడం జరిగింది. ''జిజ్ఞాసువులైన శిష్యులు, విజ్ఞాని అయిన గురువు ఇక జ్ఞాన ప్రసాదానికి అడ్డుంటుందా''.

మిథిలా నగరంలో శివధనుర్భంగం చేసి సీతను పెళ్ళాడాడు శ్రీరాముడు. ధశరథ మహారాజు రాముడొక ఇంటివాడైయ్యాడనే ఆనందంతో రాముడుకి పట్టాభిషేకం చేసి తను విశ్రాంతి తీసుకోవాలనే ఏర్పాటు చేశాడు. కైకేయి అరణపు దాశిగా మందర కైకేయి మనస్సు మార్చింది. భరతునికి రాజ్యాధికారం దక్కేటట్టు, రామున్ని అడవులకు పంపేటట్టు చూడమని దుర్బోద చేసింది. గతంలో దశరథుడు ఇచ్చిన రెండు వరాలను ఇపుడు వినియోగించుకోమని సూచించింది. ఇది తెలిసిన రాముని ముఖంలో ఎలాంటి మార్పులేదు. సంతోషంలో పొంగొకపోవడం భాదలో కృంగక పోవడం స్థితప్రజ్ఞుని లక్షణం. తన రాజ్యమైన, వణవాసమైన సమానమేనని ప్రకటించాడు రాముడు. పతిని అనుసరించడమే సతికి ధర్మం, సుఖప్రదం, శుభప్రదమని సీత రాముని వెంట, అన్న వెంట వనాలకు బయలుదేరాడు లక్ష్మణుడు.

శ్రీరాముని ఆదేశం మేరకు ముందు లక్ష్మణుడు వెనుక సీత ఆమె వెనుక శ్రీరాముడు నడుస్తున్నారు. సాయం కాలానికల్లా భరద్వాజ ఆశ్రమానికి చేరారు. జనసంచారం లేని ప్రదేశమైన చిత్రకుటం చేరుకుని కొన్ని రోజులు అక్కడ నివశించారు. ఆ తర్వాత అత్రి మహర్షి ఆశ్రమానికి బయలుదేరారు. మహాప్రతివ్రత అయిన అనసూయ దేవి సీతకు దివ్య వస్త్రాభరణాలు ఇచ్చింది. మునీష్వరుల ఆశీస్సులతో దండకారణ్యంలోకి ప్రవేశించాడు.

విరాధుని మాట ప్రకారం శరభంగమహర్షి దర్శనానికి బయలుదేరారు, మహర్షి యొక్క తపోఫలమంత శ్రీరామునికి దారపోసాడు. సుతీక్ష్ణ మహర్షిని దర్శించమని సూచించారు శరభంగమహర్షి. అక్కడి నుండి అగస్త్య మహర్షి దర్శించుకోవాల్సిందిగా తమ ఆకాంక్షను వెలు బుచ్చాడు. అగస్త్య మహర్షి శ్రీరాముడికి దివ్య దనుస్సు అక్షయ తుణీరాలు, అమోఘమైన ఖడ్గాన్ని బహుకరిం చాడు. శ్రీరాముడు తాము నివశించడానికి అనువైన ప్రాంతాన్ని సూచించమని అగస్త్యుణ్ణి అభ్యర్థించాడు. ఇక్కడికి రెండు యోజనాల దూరంలో పంచవటి అనే ప్రదేశం ఉంది. అక్కడ ఫలాలకు జలాలకు కొదువలేదని గోదావరి నది తీరంలో జననంచారం ఉండదని ప్రశాంతంగా ఉంటుందని చెప్పాడు. అలా సీత లక్ష్మణు లతో శ్రీరాముడు అనేక ప్రదేశాలను సందర్శించాడు. శ్రీరాముడు అడుగిడిన ప్రదేశాలు పావనమై ఎన్నో పుణ్యక్షేత్రాలుగా నిలయమై రాముడు తిరుగాడిన చోటు మహాపవిత్రమై అవి దర్శించుకుంటే ఎంతో పుణ్యము కలుగుతుందని ప్రజల నమ్మకం. అందులో అలా అడుగిడిన ప్రాంతం ఒంటిమిట్ట ఒకటి.

ఒంటిమిట్ట సీతారాములు కొలువు తీరడం వెనుక పురాణ కథనం ఉంది. త్రేతాయుగంలో సీతారామ కళ్యాణానికి ముందుగా తన యాగ రక్షణానికి విశ్వామిత్ర మహర్షి రామలక్ష్మణులను తన వెంట అడవులకు తీసుకవెళ్ళి యాగ రక్షణం చేయించుకున్నాడు. అలాగే ఒంటిమిట్టకు కూడా శ్రీ రామలక్ష్మణులు వెళ్ళారు. ఒంటిమిట్టను ఏకశిలానగరమని మరొకపేరు. ఆ ప్రాంతము మృకండ శృంగి మహామునులు ఆశ్రమాలను నిర్మించుకొని రావణుని అనుచరులైన పలువురు రాక్షసులు యాగశాలలను ధ్వంసం చేస్తూ మునిజనాన్ని పలు విధాలుగా భాదించసాగిరి. ఆ బాధనుండి శ్రీరాముడు విముక్తి చేశాడు. తర్వాత ఒక సారి సీతారామలక్ష్మణులు ఏకశిలా నగరాన్ని దర్శించుకోవడానికి వెళ్తూ ఒక చోట అన్నగారి విల్లంబులు చేత పట్టుకొని నడుస్తూన్న లక్ష్మణుడు అన్న నీ దనుర్భాణాలను నేనేందుకు మోయాలని ప్రశ్నించాడు. రాముడు ఆ సమయంలో మారుమాట్లాడకుండ విల్లంబులు తీసుకున్నాడు. సీతాదేవికి ఆశ్చర్యం వేసింది. మరి కొంత సేపటికి కొద్దిదూరం వెళ్ళిన తర్వాత లక్ష్మణుడు తన అన్నను చూసి అన్న దనుర్భాణాలను నీవు మోయడం ఏమిటని భాదతో పలికాడు. ఇప్పటివరకు లక్ష్మణుడు అలా ఎందుకు ప్రవర్తించాడని అడిగింది సీత. దానికి సమాధానంగా స్థల ప్రభావమేనని సమాధానపర్చాడు రాముడు. అలా ప్రయాణిస్తూ ఏకశిలా నగర ప్రాంతానికి చేరుకోగానే సీతాదేవి తనకు ధాహంగ ఉన్నట్లు శ్రీరామున్ని కోరింది. వెంటనే తమ దివ్యమైన అస్త్రాలను రాముడు ఒకచోట లక్ష్మణుడు మరోచోట భూమిపై ప్రయోగించారు. అలా రెండునీటి గుండంలు ఏర్పాడ్డాయి. వాటిని రామ లక్ష్మణుల పేరుపై వేరు వేరు తీర్థాలు వెలిశాయి. ఏకశిలానగరంలో బసచేసిన శ్రీ సీతారామ లక్ష్మణుల మృకండ శృంగ మహర్షులు ఒక నల్ల రాతిపై వాల్ల ముఖ చిత్రాలను చెక్కించాడు.

వనవాస సమయంలో సీత పంచవటిలో మాయావి రావణుడు అపహరించడం జరుగుతుంది. సీతమాతను అన్వేషణ చేస్తూ కిష్కిందకు చేరుకున్న శ్రీరాముల వారికి సుగ్రీవ, హనుమంత, జాంబవంతుడు, అంగదుడు తదితర వానర వీరులు పరిచయం అవుతారు. సుగ్రీవునికి మరియు వాలీకి మధ్య వివాదాలను పరిష్కరించే తరుణంలో వాలిని సంహరించి సుగ్రీవునికి రాజ్యాధికారం అప్పచెప్పాడు. సుగ్రీవుడు సీతా అన్వేషణకు నలుదిక్కుల వానరులను పంపించాడు. దక్షిణ దిక్కుకు అంగదుని నాయకత్వంలో హన్మంతుడు, జాంబవంతుడు మొదలైన ప్రముఖులతో కూడిన సేనలను పంపుతాడు. ఆ సమయంలో సీతా జాడ వెదుకుతూ జాంబవంతుడు అంగదుడు ఏకశిలానగర ప్రాంతానికి చేరుకుంటారు. అక్కడే ఒకరోజు రాత్రి విడిది చేస్తారు. అపుడు జాంబ వంతుని కలలో సీతారామ లక్ష్మణులు సాక్షాత్కరిస్తారు.

కనుక ఈ ప్రాంతము ఎంతో మహిమగలదని చెబుతారు. ఒకే శిలపై నిర్మించబడిన శ్రీ సీతారామలక్ష్మణ స్వామి విగ్రహాన్ని జాంబవంతుడు అంగదుడు దర్శిస్తాడు. ఏ ఆచ్ఛాదం లేని విగ్రహాన్ని జాంబవంతుడు ప్రతిష్టింపజేసి ఒక ఆలయాన్ని నిర్మింపచేస్తాడు. జాంబవంతుడు స్వయంగా ప్రతిష్టించి అర్చించడం చేత ఆ ప్రాంతం మరింత ప్రసిద్ధి చెందింది.

ఆలయ అభివృద్ధికై చోల విజయనగర స్థానికులు ఎంతో కృషి చేశారు ఆలయ ముఖ రాజగోపురం ఎత్తు నుమారు 160 అడుగులుగా నియమించారు. ఆలయంలో 32 అపురూప శిలాస్థంభాలను నిర్మించారు. దూరం నుండి చూస్తే ఆలయం మూడు గోపురాలు ఒకే వరుసలో కనిపిస్తాయి. సేద తీరడానికి విశ్రాంతి సత్రాలను నిర్మించారు. ఇక్కడ అంజనేయ విగ్రహానికి చోటు లేదు. ఎందుకంటే శ్రీరామ ప్రభువు హనుమంతుడు పరిచయం కాక మునుపే ఇక్కడ వెలసి ఉండడం వలన. తర్వాత కాలంలో ఒట్టిమిట్ట కోదండ రామాలయానికి అభి ముఖంగా అంజలి ఘటించిన రూపంలో దాదాపు 6 అడుగుల ఎత్తున ఆంజనేయస్వామి కొలువుదీరి ఉన్నాడు. ఇతనిని సంజీవరాయుడని కూడా పిలుస్తారు.

కోదండరాముని కృపవల్ల ఎందరో కవులు ప్రఖ్యాతి గాంచినారు. బమ్మెర పోతన కోదండరాముని నిరంతరం ధ్యానించేవారు. ఒకనాడు పోతనకు కోదండరాముడు కలలో కనిపించి భాగవతాన్ని రచించమని ఆదేశించాడు. అందుకు ఆంధ్రమహాభాగవతాన్ని రచించి కోదండ రామునికి అంకితమిచ్చాడు. స్వామి వారి ఉత్సవాల సమయంలో భక్తపోతనకు కూడ సముచిత రీతిలో గౌరవిస్తూ ఉండడం ఆచారంగా వస్తూంది. అష్టదిగ్గజ కవులలో ఒకరైన అయ్యలరాజు రామభద్రుడు రామాభ్యుదయం అనే గ్రంథాన్ని రచించారు. పదకవితా పితామహుడు అన్నమయ్య కూడ స్వామిపై కీర్తనలు రచించి ఆలపించారు. ఉప్పుగుండూరు వెంకటకవి వంటి వారు కూడా స్వామి కీర్తించి తరించారు. ఆంధ్ర వాల్మీకి వాసుదాసుగా ప్రసిద్ధి చెందిన వావిలికొలను సుబ్బారావు ఎన్నో రచనలు చేసి స్వామివారికి అంకితమిచ్చారు, అంతేకాకుండా ఇతడు ఈ ఆలయ అభివృద్ధికొరకు 10 లక్షల రూపాయలు విరాళంగా ఇచ్చాడు. ఈయన రచించిన రామాయణాన్ని మందారమని పేరు పెట్టడం జరిగింది.

ఒట్టిమిట్ట ఆలయం లో కుటమత భేదాలు లేకుండ ఎవరైన ప్రవేశించవచ్చు. మాల ఓబన్న అనే భక్తుడు పాటలు పాడి శ్రీ రామచంద్రున్ని పరవశింపచేశాడు. శ్రీరామ భక్తునిగా మారిన ముస్లిం పాలకుడు హీమామ్ భేగ్ శ్రీరాముని మహిమను తెలుసుకోగోరి పిలుస్తే పలికే దైవం శ్రీరాముడని హీమామ్ భేగ్ పిలిచాడు అపుడు శ్రీరామ చంద్రుని విగ్రహం నుండి "ఓ" అని పలికే సమాధానం వచ్చింది. అందుకు ప్రతిగా బావిని త్రవ్వించెను. అది నేటికి హీమామ్ భేగ్ బావిగా పిలువబడుతుంది. ఒంటిమిట్ట ప్రాంతం ఆంధ్రప్రదేశ్‌లోని వై.యస్. ఆర్ కడప జిల్లా పరిదిలో ఉంది. ఈ ప్రాంతం చుట్టు కొండలు ఉండి మద్యదలో ఒంటిగా ఉన్న చిన్నపాటి గుట్ట ఉండడం వల్ల ఒంటి మిట్ట అని పిలిచేవాళ్ళు. తిరుమల వెంకటనాధుని దర్శించడానికి వెళ్తూ ఈ ప్రాంతాన్ని దర్శించుకుంటారని కాశి యాత్ర మజిలి కథలు రచయిత ఏనుగుల వీరస్వామి తన యాత్ర సందర్భంగా ఏక శిలానగరాన్ని సందర్శించి ఇది ఒక మహోన్నతమైన నగరంగా పేర్కొన్నారు, ఫ్రెంచ్ యాత్రికుడు ట్రావెర్నియర్ 1652 సంవత్సరం భారతదేశ పర్యటనలో భాగంగా ఈ ఏకశిలా నగారానికి వచ్చారు. గోపుర నిర్మాణం చిత్రకళలను పరిశీలించి భారతదేశంలో మహోన్నతమైన ఆలయాలలో కోదండరామాలయం ఎంతో గొప్పదని చెప్పారు. 2015లో మొదటిసారి రాష్ట్రప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్వామి వారికి పట్టువస్త్రాలు ముత్యాల తలంబ్రాలతో పాటు రూపాయలు 50కోట్లు ఆలయానికి మంజూరు చేసారు.

ఒంటిమిట్ట కోందడరామస్వామి బ్రహ్మోత్సవాలు

ఎంతోవిశిష్టమైనవి. స్వామివారి ఉత్సవాలు చైత్రశు ద్ధనవమినాడు ప్రారంభమవుతాయి. ఈ ఆలయంలో చైత్రశుద్ధ పౌర్ణమి రోజు రాత్రి శ్రీ సీతారామకళ్యాణం జరగడం ఈ ఆలయ విశేషం. త్రేతాయుగం నుండి ఈ ఆచారం కొనసాగుతుంది. గర్భగుడిలో ఎడమవైపున శ్రీమన్నారాయణుడు, శ్రీదేవి, భూదేవి సమేతుడై ఉన్నారు. కుడి వైపున శ్రీ ఆంజనేయ స్వామి ఉన్నాడు. ప్రధాన మూలవిరాట్ విగ్రహాల చెంతనే శ్రీ ఆంజనేయ గర్భగుడిలో ఒక చిన్న ఉప ఆలయంలో కొలువై ఉన్నారు. ఈ ఆంజనేయ స్వామిని భక్త ఆంజనేయస్వామి అని పిలుస్తారు. ఆలయ ప్రక్కన ఈశాన్య మూలలో నమ్మళ్వార్, కులశేఖర్‌వార్, పెరియాళ్వారు విగ్రహాలు కలవు. ప్రదాన ఆలయ మండపానికి ఎదురుగా శ్రీ గరత్మంతుడు కొలువై ఉన్నాడు. వీరి ప్రక్కనే భక్త పోతన విగ్రహం ఉన్నది. రథప్రాంతములో కూడా మరో విగ్రహం ఉన్నది. ఈ ఆలయంలో శ్రీకృష్ణదేవరాయలు 32 స్థంభాలతో నిర్మించిన మండపంలోని శిల్పకళలను చూడవలసినదే కాని వర్ణింపనలవి కాదు. రామాలయంలో శ్రీరామలింగేశ్వరస్వామి తెల్లనిస్పటిక రూపంలో కొలువై భక్తులను కాపాడుతున్నాడు. దీనిని దర్శిస్తే రామేశ్వరంలో శ్రీకైలాసనాధుని దర్శించిన పుణ్యం కలుగుతుందని పురాణ కథనం, అందుకే ఈ క్షేత్రం శివకేశవ క్షేత్రంగా పలువబడుతుంది. భక్త సంజీవరామస్వామి ఆలయానికి మధ్యన మహాభక్తుడు మాల ఓబన్న నిలిచి కీర్తనలు పాడిన ప్రాంతంలో ఆ భక్తునికి గుర్తుగా చిన్న మండపం నిర్మించారు. ఈ మండపం మద్యలో ఓబన్న శిలావిగ్రహాన్ని ప్రతిష్టించారు. ఒట్టిమిట్ట ఆలయం రెండవ అయోద్యగా ప్రశస్తి పొందింది.

సృష్టిలో రామనామాన్ని మించిన మంత్రం మరొకటి లేదు. "రామా" అన్నంతనే సహస్రనామాలు పలికిన ఫలితం వస్తుందని మహాశివుడు తెల్పెను. రామా నామాస్మరణంలో అనే వేల యగ్నయాగాదులు ఫలితం దక్కుతుంది. రామానామం జపించి మహాకూరుడైన బోయవాడు వాల్మీకి అయ్యాడు.

"శ్రీరామరామ రామేతి రమే రామే మనోరమే
సహస్రనామ తత్తుల్యం రామనామ మాననే"

అనే తారకమంత్రం పటిస్తే చాలు మోక్షం లబిస్తుందని ఈశ్వరుడు తన సతి పార్వతికి చెప్పాడు.

రామ అనే పదం ర + ఆ + మ అనే అక్షరాలు కలిసిన శబ్దం

'ర' అనగా రుద్రుడు 'ఆ' అనగా బ్రహ్మ 'మ' అనగా మహావిష్ణువు అని సంబోదించిన అర్ధము వస్తుంది. రామ అన్న శబ్దం జీవాత్మ పరమాత్మ సర్వరూపమే రామ అని ఒక్కసారి స్మరిస్తే త్రిమూర్తులైన బ్రహ్మ, విష్ణువు, మహేశ్వరులను పూజించిన ఫలం లబిస్తుంది. రామ అన్న పదంలో 'ర' అని పలికినపుడు మనలోని ఎన్నో జన్మల పాపాలు బయటికి పోతాయి. అలాగే 'మ' అని ఉచ్చ రించినపుడు బయటి పాపాలు మనలోకి ప్రవేశించవు. అందుకే రామనామము అంత పవిత్రమైనది. ముక్తిని ప్రసాదించేది.

రాముడు అడుగిడిన నేల రాముని పై రాసిన రామా యాణం అంత పవిత్రమైనది. ఇప్పటికి కూడా ప్రశంసపొందుతూ వస్తూంది. రాముడి ఆలయాలు ఎక్కడ ఉన్నా దేదీప్యమానంగా వెలుదొందుతూ భక్తులతో కళకళలాడుతూ పూజలందుకుంటున్నాడు.

BHAVAVEENA
Vol. 18, Issue. 10, October 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

సి.యస్.రావు నవలల్లో స్త్రీ చైతన్య పాత్రలు (సాహిత్య వ్యాసం)

– మొర్ర పిచ్చయ్య, పరిశోధక విద్యార్థి, తెలుగుశాఖ, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.

తెలుగు సాహిత్యంలో ఆధునిక కాలంలో వచ్చిన ప్రక్రియల్లో ఒక సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్న ప్రక్రియ నవల. ప్రాశ్చాత్య పోకడలతో మన సాహిత్యంలోకి ప్రవేశించి విస్తృతంగా ప్రచారం పొంది ఎందరో రచయితలు, రచయిత్రులు ద్వారా ఎన్నో వేల నవలలు తెలుగు సాహిత్యంలో వచ్చాయి. ఒక దశలో సగటు మనిషికి నవలే కాలక్షేపంగా ఉండేది. నవల రచయితలు, రచయిత్రులకి కూడా నటీనటులతో సమానమైన గుర్తింపు, హోదా కూడా ఉన్న సందర్భాలు ఎన్నో ఉన్నాయి. అంతగా నవలా ప్రక్రియ తెలుగు పాఠక లోకంలో చిరస్థాయిగా నిలిచిపోయింది. ఈ క్రమంలో ఎందరో రచయితలు, రచయిత్రులు నవలా రచనలో కొత్త ఒరవడిని తీసుకు వచ్చారు. భారతీయ భాషల్లో నవలల్లో వచ్చిన ప్రయోగాలు అనేకం. అటువంటి నవలాప్రక్రియ అత్యంత సహజమైన విషయాలతో మనం నిత్యం చూస్తున్న సంఘటనలను ఆధారంగా చేసుకొని రచనలు చేసిన వారు సి.యస్.రావు.

సి.యన్.రావుగా ప్రసిద్ధులైన చింతపెంట సత్య నారాయణ రావు గారికి ఆధునిక సాహిత్యంలో ఒక ప్రత్యేక స్థానం ఉంది. ఈయన 20 డిసెంబర్ 1935 న తూర్పు గోదావరి జిల్లాలోని ద్రాక్షారామంలో సత్యవతి, రామారావు గార్లకు జన్మించారు. ఈనాడు గ్రూప్ ఆఫ్ మ్యాగజైన్స్ వారు ''చతుర మాసపత్రిక''ను 1978లో స్థాపించగా దీనిలో ప్రారంభ సంచికగా సి.యన్.రావు రచించిన ''కమలమ్మ కమతం'' అనే నవల ప్రచురింపబడింది. ఈయన బహుముఖ ప్రజ్ఞాశాలి. జాతీయ చలనచిత్ర అభివృద్ధి సంస్థ స్క్రిప్ట్ ప్యానల్‌లో సభ్యునిగా పనిచేశారు. మెగాస్టార్ చిరంజీవి నటించిన మొదటి చిత్రం ''ప్రాణం ఖరీదు'' సినిమాకు కథను రాశారు. జాతీయ అవార్డు చిత్రం ''ఊరుమ్మడి బ్రతుకులు'' సినిమాకు కథను రాశారు. వీరు 14 ఏప్రియల్ 2020న హైదరాబాద్‌లో మరణించినారు. వీరు తెలుగు సాహిత్యంలో 80 కథలు, 15 నవలలు, 25 నాటికలు, 25 నాటకాలు, 15 టివి సీరియల్స్, 10 సినిమాలు, కొన్ని వ్యాసాలు రాశారు. వీరు లెక్చరర్‌గా పనిచేసి పదవీవిరమణ పొందారు. వీరి రచనలు కొన్ని సినిమాలుగాను, కథలు, ధారావాహికలుగా కూడా ప్రసారం అయ్యాయి.

సి.యన్.రావు రచించిన నవలలో స్త్రీ పాత్రలు ఆధునిక భావాలు కల్గినవిగా వున్నాయి. సమాజంలో ఎదురవుతున్న సంఘటనలు ఎలా ఎదుర్కోవాలో ఆ విధంగా కొన్ని పాత్రల స్వభావం కనిపిస్తుంది. మారుతున్న కాలంతో పాటు స్త్రీలలో కూడా చైతన్యం రావాలని ఆశించి రచయిత ఇటువంటి పాత్రలను తీర్చిదిద్దారు. నేటి కాలంలో ఎందరో స్త్రీలకు ఈ పాత్రలు సాక్ష్యంగా నిలుస్తాయి. అటువంటి పాత్రలే స్త్రీ చైతన్య పాత్రలు.

సాధన :

''తపస్వి'' నవలల్లో ప్రధాన పాత్ర సాధన. సాధన మధ్యతరగతి అమ్మాయి. తండ్రి లేడు. తల్లితోనే ఉంటుంది. సాధన ఉద్యోగం చేస్తుంది. మధ్యాహ్నం పద కొండు గంటలకు వెళ్తుంది. అర్ధరాత్రి ఎప్పుడో వస్తుంది. ఆ కాలనీకి వాళ్ళు కొత్తగా వచ్చారు.

సాధన ఉద్యోగం నుంచి వచ్చే సమయంలో భారీ వర్షం పడుతుంది. ఇంటికి వచ్చిన సాధనకి తన తల్లి కాంతమ్మ జ్వరంతో బాధపడటం చూసి దగ్గరలో డాక్టర్ ఎవరైనా ఉన్నారేమో అని తెల్సుకుని డాక్టర్‌ని ఇంటికి తీసుకువస్తుంది. వచ్చిన డాక్టర్ మందుతాగి ఉంటాడు. అతను సాధనని చేతులు కట్టేసి బలాత్కరిస్తాడు. కాని ఆ చీకటిలో వచ్చిన డాక్టర్ ఎవరు, అతని పేరు, ఊరు ఏమీ సాధనకు తెలియవు. ఆ సంఘటన ఫలితంగా సాధనకు ఒక బాబు పుడతాడు. ఆ బాబుకి రాహుల్ అని పేరు పెట్టుకుని పెంచుకుంటుంది. రాహుల్‌నే లోకంగా బతుకుతుంది సాధన. ఒకరోజు సినిమా

హాల్‌వద్ద జరిగిన అల్లర్ల ప్రమాదంలో సాధన కళ్ళకు దెబ్బ తగులుతుంది. కొన్నిరోజులకు సాధనకు చూపు మంద గిస్తుంది. చివరకు చూపు తగ్గిపోతుంది. ఆ సమయంలో సాధన వాళ్ళు ఉంటున్న ఊరికి దగ్గరలోనే కంటివైద్య శిబిరం జరుగుతుంది అని తెలుసుకుని రంగమ్మ సాధనను అక్కడకు తీసుకు వెళ్తుంది. సాధన కొడుకు రాహుల్ కూడా స్కూల్ తరపున వైద్యశిబిరంలో సేవ చేయడానికి వస్తాడు. అక్కడికి వచ్చిన సాధనను అందరికీ పరిచయం చేసి డాక్టర్‌కు చూపిస్తారు. ఆ వైద్యశిబిరంలో కంటిపరీక్షలు చేసి, ఆపరేషన్ చేస్తున్న డాక్టర్ పేరు గౌతం అని తెలుసుకుని అతని గురించి ఆరా తీస్తుంది.

సాధనకు డాక్టర్ పరీక్షలు చేసి ఆపరేషన్ చేస్తారు. సాధన వైద్య అవసరాలకు ఒక నర్సు దగ్గర ఉంటుంది. ఆమె పేరు మంజు. అమెద్వారా డాక్టర్ గౌతం గురించి అన్ని విషయాలు తెలుసుకుంటుంది సాధన. గౌతం గురించి, అతని ప్రవర్తన, పద్ధతులను మంజు ఎంతో గొప్పగా చెబుతుంటే అతని గురించి "నీకన్నా నాకే ఎక్కువ తెలుసు. నాకితని వైద్యమూ వద్దు, మందూ వద్దూ దయచేసి నన్ను ఇంటికి వెళ్ళనివ్వండి అంటూ అక్కడ నుంచి వెళ్లాలని చూసింది" (తపస్వి, సి.యస్.రావు, పుట 16) సాధన. అతను తనను గురించి బాధపడుతున్నాడని నర్సు మంజు చెబితే సాధన నమ్మదు. చివరకు జరిగిన అన్ని విషయాలు తెలుసుకుని గౌతం వచ్చి సాధనను క్షమించమని వేడుకుంటాడు. అందరం కలిసి ఉందామని అడగడంతో మనసు మార్చుకుని గౌతంతో కలిసి జీవించడానికి ఒప్పుకుంటుంది సాధన.

సాధన ఆత్మాభిమానం కలిగిన అమ్మాయిగా, తండ్రి లేకపోయినా తల్లికి తోడుగా ఇంటి అవసరాలు చూస్తూ ఉద్యోగం చేస్తూ తల్లిని పోషిస్తుంది. ఎవరితో మాటపడే మనస్తత్వం కాదు. తన తప్పు లేకపోతే ఎవరికీ సంజాయితీ చెప్పాల్సిన పనిలేదు అని గట్టిగా నమ్ముతుంది. డాక్టర్ గౌతంవల్ల తన జీవితం నాశనం అయినా తాను చేయని తప్పుకి ఎందుకు బలవ్వాలి అని ధైర్యంగా ఎదిరించి నిలుస్తుంది. తల్లిని, కన్నబిడ్డను కష్టపడి పోషిస్తుంది సాధన. జీవితంలో ఎదురుదెబ్బలు తగిలినా తట్టుకుని నిలబడి జీవిస్తున్న జయించాలని సందేశమిచ్చిన పాత్రగా సాధన పాత్రను చిత్రించాడు రచయిత.

పద్మావతి :

"అమ్మ కావాలి" నవలల్లో ప్రధానపాత్ర పద్మావతి. పద్మావతి అన్నయ్య గోవిందరావు, వదిన కనకమహాలక్ష్మి. గోవిందరావు, పద్మావతి యిద్దరు ఒక తల్లిబిడ్డలు కాదు. సవతి తల్లి బిడ్డలు. కాని గోవిందరావు పద్మావతిని ఎప్పుడు అలా చూడలేదు. పద్మావతి ప్రతి సంవత్సరం నాగపంచమికి పుట్టలో పాలుపోయడానికి వెళ్తుంది. ఒకసారి అలా వెళ్ళినప్పుడు, ఆమెవెంట ఉన్న వ్యక్తిమీద పులి దాడి చేస్తుంది. అది గమనించిన ఇంజనీరు వాసువారి ప్రాణాలు కాపాడతాడు. అప్పుడే పద్మావతి మొదటిసారిగా వాసుని చూస్తుంది. అతనిపై పద్మావతికి ఒక అభిప్రాయం ఏర్పడుతుంది. పద్మావతికి అన్న గోవిందరావు పెళ్లి చేయడానికి సంబంధం మాట్లాడి మూహూర్తం కూడా పెట్టిస్తాడు. పెళ్లికూతురుని చేసేరోజు వరకు ఆ విషయం పద్మావతికి తెలియదు. చివరి నిమిషంలో పెళ్ళికొడుకు ఎవరనేది తెలుసుకుని ఆశ్చర్యపోతుంది. చిన్ననాటి నుంచి ఎంతో ప్రేమగా పెంచిన అన్నయ్య ఇలాంటి సంబంధం చేయడం ఏమిటి అని నిర్ఘాంతపోతుంది. గోవిందరావు చూసిన పెళ్లికొడుకు నరసింహం ప్రక్క ఊరిలో ఉంటాడు. తాగుబోతు, తిరుగుబోతు అటువంటి వ్యక్తితో పెళ్లి అని తెలియగానే పద్మావతికి ఏమిచేయాలో తోచదు. చివరికి ఒక నిర్ణయం తీసుకుని ఆ అర్ధరాత్రివేళ తనని పులి బారినుంచి కాపాడిన ఇంజనీరు వాసు ఉంటున్న క్యాబేజ్‌కి వెళ్తుంది. అంతాచెప్పి తనని కాపాడమని వేడుకుంటుంది. తనతోపాటు ఉంటానని అంటుంది. నలుగురికి తెలిస్తే ఏమనుకుంటారన్న వాసుకు "మీరు నా మెడలో తాళికడితే యెవరు ఏమీ అనుకోలేరుగా అంటుంది పద్మావతి" (అమ్మ కావాలి, సి.యస్.రావు, పుట 32) చివరికి యిద్దరు సింహాచలం వెళ్లి పెళ్లి చేసుకుని వస్తారు. వస్తూ వస్తూ పోలీస్‌స్టేషన్‌లో గోవిందరావుతో ప్రాణహాని

ఉందని చెప్పి కేసుపెట్టి వస్తారు. కొంతకాలం అక్కడే ఉంటారు. ఉద్యోగరీత్యా వాసుకి ధవళేశ్వరం బదిలీ కావడంతో అక్కడికి మారతారు. ధవళేశ్వరం వచ్చిన పద్మావతి, వాసులకు ఇద్దరు మగపిల్లలు పుడతాడు. యిద్దరు మగపిల్లలతో పద్మావతి, వాసుల జీవితాలు హాయిగా సాగిపోతుంటాయి.

రాజమండ్రిలో గోదావరిపై కడుతున్న బ్రిడ్జ్‌కి అధికారిగా వాసు అక్కడికి బదిలీ అవుతాడు. పిల్లలు యిద్దరిని బాగా చదివించాలని హైదరాబాద్‌లో స్కూల్‌లో చేర్పించి చదివిస్తుంటారు. ఆ బ్రిడ్జ్ పనుల్లో అనుకోకుండా జరిగిన ప్రమాదంలో వాసు మరణిస్తాడు. వాసు తన ఆఖరి కోరికగా పిల్లలిద్దరినీ బాగా చదివించమని పద్మావతి దగ్గర మాట తీసుకుంటాడు. వాసు సంపాదించిన ఆస్తి అంతా వారి చదువులకు ఖర్చు కావడంతో సొంత ఇల్లు కూడా అమ్మేసి ఒక చిన్న అద్దె ఇంటిలోకి మారుతుంది పద్మావతి. పిల్లల చదువులు చివర దశలో ఉండగా పద్మావతికి ఆర్థిక యిబ్బందులు మరింత ఎక్కువ అవుతాయి. ఆ సమయంలో పక్క ఇంటిలో ఉంటున్న టీచర్ పేపర్‌లో 'అమ్మకావాలి' అనే ప్రకటన చూస్తుంది. అది పద్మావతికి ఉపయోగపడవచ్చు అని భావించి ఆమెకు ఇస్తుంది. సారంగధరమిట్ట వద్ద ఉన్న హవేలిలో జరుగుతున్న ఇంటర్వ్యూకి వెళ్ళమని సలహా ఇస్తుంది.

పద్మావతికి అక్కడికి వెళ్తుంది. అమ్మకావాలి ప్రకటనలో ఆంతర్యాన్ని, అవసరాన్ని గురించి పద్మావతికి వివరించి చెబుతుంది రాణివారు. తమకి వారసులు లేరని రాజావారి వలన వారసుణ్ణి కనియిచ్చే అమ్మకావాలి. ఆ ప్రకటన ఉద్దేశ్యాన్ని చెబుతుంది రాణి. ఆ మాటలకు నివ్వెర పోతుంది పద్మావతి. ''క్షమించండి, యిది చాలా విడ్డూరమైన కోరిక. మీ వంశాన్ని నిలబెట్టుకోవడం మీకు ఎంత ముఖ్యమో, మా వంశాన్ని మలినం కాకుండా కాపాడుకోవడం నాకు అంత ముఖ్యం'' (అమ్మకావాలి, సి.యస్.రావు, పుట 68) అని చెప్పి అక్కడ నుంచి వచ్చేస్తుంది పద్మావతి. ఇంటికి వచ్చిన పద్మావతికి కొడుకులు యిద్దరు రాసిన ఉత్తరం అందుతుంది. అందులో తమకు పరీక్షలు దగ్గరకు వస్తున్నాయని, యివే చివరి అవకాశం ఎలా అయినా ఫీజుకట్టాలని వుంది. ఆ ఉత్తరం చూడగానే తీవ్రంగా ఆలోచిస్తుంది. పద్మావతి, ఎటువైపు నుంచి తనకి ఆసరా దొరికే అవకాశం కనిపించదు. చివరికి చేసేది లేక అమ్మకావాలి ప్రకటన ఒక్కటే తనకు ఉన్న అవకాశంగా భావించి ఆ హవేలికి వెళ్తుంది. పద్మావతి. తన పరిస్థితిని అంతా చెబుతుంది. రాణివారు దివాన్ జీ చేత పద్మావతి కొడుకులకు కట్టాల్సిన ఫీజులు, మరి యితర అవసరాలకు డబ్బు వెంటనే పంపమని చెబుతుంది. మరసటిరోజు రాణివారు అనుకున్న కార్యక్రమం జరిపిస్తుంది.

నెలలు నిండిన పద్మావతి పండంటి మగబిడ్డకు జన్మనిస్తుంది. తర్వాత రాణి పద్మావతితో బిడ్డను యికనుంచి తానే చూసుకుంటానని చెప్పి మరొక పదివేల రూపాయలు ఇస్తుంది. కనీసం బిడ్డని ఒకసారి కూడా కళ్ళారా చూడనివ్వలేదని పద్మావతి ఎంతో బాధపడుతుంది.

పద్మావతి సంప్రదాయం కుటుంబంలో పెరిగిన అమ్మాయి. చిన్నతనం నుంచి అన్నీ అన్నయ్య చూసుకునే వాడు, చివరికి అన్నయ్య చేసిన పనికి తన జీవితం బలి అవుతుందని గ్రహించింది. తానే నిర్ణయం తీసుకుని వాసుని పెళ్లి చేసుకుంటుంది. ప్రమాదంలో భర్త మరణించినప్పుడు క్రుంగిపోకుండా ఇద్దరి పిల్లలను పెంచి పెద్ద చేస్తుంది. చివరకి వారి చదువులు ఆగిపోయే పరిస్థితి వచ్చినప్పుడు ఏ తల్లి చేయని సాహసం చేసి పిల్లల చదువులు పూర్తి అయ్యేలా చేస్తుంది. ఒక స్త్రీగా, మాతృమూర్తిగా తన కన్నబిడ్డల కోసం ఎటువంటి పనికైనా సిద్ధం అవుతుందని, అవసరం అయితే తన ప్రాణాలనే ఫణంగా పెడుతుందని పద్మావతి పాత్ర నిరూపించింది. తల్లి పిల్లల అభివృద్ధికి ఎలాంటి త్యాగానికైనా సిద్ధపడుతుందని ఈ నవల్లోని పద్మావతి పాత్రచిత్రణ ద్వారా రచయిత తెలిపాడు.

రంగమ్మ :

"తపస్వి" నవలల్లో రంగమ్మ. సాధన, చిన్నోడు అందరూ ఉండే కాలనీలోనే ఉంటుంది రంగమ్మ. ఆ కాలనీలో సారా దుకాణం నడుపుతూ ఉంటుంది. ఒకరోజు అర్ధరాత్రి ఉద్యోగం నుంచి రిక్షాలో వస్తున్న సాధనకు అడ్డుతగిలి ఆమెతో గొడవపడతాడు చిన్నోడు. సాధనకి, చిన్నోడుకి వాదన ఎక్కువవుతుంది. ఆ సమయంలో రంగమ్మ వచ్చి చిన్నోడిని బ్రతిమాలి అక్కడ నుంచి తీసుకువెళ్ళిపోతుంది. దానికి కారణం ఆ కాలనీలో చిన్నోడు ఒక రౌడీలా చెలామణి అవుతుంటాడు. తన వ్యాపారానికి చిన్నోడి అండ అవసరం అని భావిస్తుంది రంగమ్మ.

తర్వాతకాలంలో సాధన ప్రభావం వల్ల సారా దుకాణం మూసేసి కూరగాయలు అమ్ముతూ జీవనం సాగిస్తుంది రంగమ్మ. సాధనకు చేదోడు వాదోడుగా ఉంటుంది. సాధనకు ప్రసవ సమయంలో పురుడు పోస్తుంది. సాధనకు సినిమాలో ప్రమాదం జరిగి కంటిచూపు పోయినప్పుడు తనను తీసుకుని ఊరికి దగ్గరలో జరుగుతున్న కంటి వైద్యశిబిరానికి వస్తుంది. సాధన కళ్ళను చూసి పరీక్షచేసి ఆపరేషన్ అవసరమని చెప్పి సాధన కళ్ళకు ఆపరేషన్ చేస్తాడు డాక్టర్ గౌతం. సాధన గురించి వీళ్ళకు బాగా తెలుసు అని రంగమ్మని, చిన్నోడిని డాక్టర్ గౌతంకి పరిచయం చేస్తాడు రాజా. "అందుగురించే వచ్చాం బాబు. తమర్ని చూసి మా సాధనమ్మ నిప్ప తొక్కిన కోతిలా అలా సిందులేసేసి, పూనకం వచ్చిన మనిషిలా అయిపోతే మా కనుమానం వచ్చి తనర్నో మాట అడిగిపోదామని వచ్చాం బాబూ అంది రంగమ్మ." (తపస్వి, సి.యన్.రావు, పుట 49)

హైదరాబాద్‌లో సరోజని నర్సింగ్ హోమ్ యజమానురాలు సరోజనమ్మ గారు తెలుసా అని డాక్టర్‌ను అడుగుతుంది రంగమ్మ. ఆమెను తెలుసు అనగానే మరింక సాధనమ్మ తవర్ని చెడామడా తిట్టడంలో తప్పే ఉంది అంటుంది రంగమ్మ. ఆడదాని గుండెకోత, ఆడది చెప్పగలదు గాని, మొగాడు ఏం చెప్తాడయ్యా, తనకు తెలీక అడుగుతాను కలసిన ఆడదాన్ని అంత సులువుగా ఎలా మర్చిపోగలవయ్యా అంటూ నిలదీస్తుంది రంగమ్మ. ఆమె మాటల్లో గౌతంకి ఆ రోజు జరిగిన అన్ని విషయాలు గుర్తుకు వస్తాయి.

రంగమ్మ కాలనీలో సారాకొట్టు పెట్టుకుని జీవనం సాగిస్తుంది. మగదిక్కు లేకపోవడంతో తన పొట్టకూటి కోసం తను సంపాదించుకుంటుంది. చివరకు సాధన చెప్పిన మాటల్లో ఆ సారాకొట్టు వదిలి కూరగాయలు అమ్ముకుని బతుకుతుంది. సాధనకు జరిగిన అన్యాయానికి కోపంతో రగిలిపోతుంది. దీన్నిబట్టి సాటిస్త్రీకి అన్యాయం జరిగితే చూస్తూ వూరుకోకూడదని, ఎదిరించి తప్పు చేసినవాడిని నిలదీసి, న్యాయంకోసం పోరాడాలని రంగమ్మ పాత్ర సూచిస్తోంది.

దుర్గమ్మ :

'దుర్గాంబిక' నవల్లో ప్రధానపాత్ర దుర్గమ్మ. అందరూ దుర్గి అని పిలుస్తారు. తెలతెల వారుతున్నప్పుడు లేచి గూడెంలోని తోటివారితో కలిసి వీధులు ఊడవడానికి, ఇళ్ళల్లో ఉన్న పాకీదొడ్లు శుభ్రం చేయడానికి వెళ్ళేది. దుర్గికూడా మునిసిపల్ కార్మికుల్లో ఒకర్తి. ఉదయం ఏడు ఏడున్నరకల్లా ఈ పని పూర్తయిపోయేది. ఎనిమిదిన్నరకల్లా పెద్ద బజారులో కూరల మార్కెట్‌లో దుర్గి ప్రత్యక్షం అయ్యేది. రెండు వెదురుపెళ్ల బుట్టలు బోర్లించి ఆ బుట్టల మీద ఓ తెల్లటి బట్టపరిచి వాటిమీద మామిడిపళ్లను పేర్చేది.

అల్యూనిమియం కార్మికులు సమ్మె చేయడం వల్ల వారి జీతాలు పెరిగాయని, దానికి కారణం ప్రభాకరం అని తెలుసుస్తుంది. దుర్గి మునిసిపల్ కార్మికుల అందరిని కలిసి ప్రభాకరం నాయకత్వంలో మనం కూడా సమ్మె చేయాలని చెబుతుంది. అందుకు అంగీకారం తెలిపాక అందరి తరుపున ప్రభాకరంతో దుర్గి మాట్లాడుతుంది. "ప్రభాకరం బాబూ, సొతంత్రం వచ్చిందని పెద్దపండగ చేసుకున్నాం. రేడియోల్లో చెప్పారు. పాటలు పాడారు. సినిమాల్లోనూ చూపించారు. కాని మనలాంటోళ్ళకు ఒరిగిందేమీ లేదు. నా సిన్నప్పుడు ముప్పయేళ్ళక్రితం ఆ

తర్వాత ఎంత జీతం ఉందో యిప్పుడూ అంతే జీతం. ఇళ్ళల్లో దొడ్లు శుభ్రం చేసినందుకు అప్పుడూ నెలకు ఆ రూపాయే యిప్పుడూ అదే రూపాయి. అందుకే మునిసిపల్ పనోళ్ళం అందరం కలిసి మా జీతాలు పెంచాలని సమ్మె చేద్దాం అనుకుంటున్నా. ఆ పద్ధతులూ పాడూ మాకు తెలవవు. ఆళ్ళకి ఎలా అయితే నువ్వు నాయకుడివో అలాగే మాకు నాయకుడివి నువ్వు. ముందుండి సమ్మె నడిపి మా జీతాలు పెరిగేలా నూడాలి బాబూ నువ్వు అంటూ దణ్ణం పెడుతుంది.'' (దుర్గాంబిక, సి.యస్.రావు, పుట 10) సమ్మెలో భాగంగా ఏమేమి చేయాలో అన్నీ వివరంగా చెబుతాడు ప్రభాకరం. మునిసిపాల్ అధికారి మీ జీతాలు గురించి మాట్లాడటానికి చర్చలకు రమ్మని చెబుతాడు.

తర్వాత కొన్ని రోజులకు కమ్యూనిస్ట్ పార్టీపై నిషేధం రావడంతో చాలామంది నాయకులు, కార్యకర్తలు పొరుగు రాష్ట్రాలకు, అజ్ఞాతంలోకి వెళ్ళిపోయారు. ఆ క్రమంలో ప్రభాకరం మీద కూడా కనిపిస్తే కాల్చి వేయాలని ఆజ్ఞలు జారీ చేసింది ప్రభుత్వం. ఎక్కడ చూసినా పోలీసుల నిఘా ఎక్కువయ్యింది. ప్రభాకరం దుర్గితో ఎక్కువ మాట్లాడ తాడని, దుర్గికి కూడా ప్రభాకరం అంటే ఎంతో గౌరవం అని దుర్గిమీద కూడా పోలీసులు నిఘాపెట్టారు. ఈ క్రమంలో ప్రభాకరం తండ్రికి ఆరోగ్యం క్షీణించడంతో చివరిచూపు కోసం మారువేషంలో తండ్రివద్దకు వస్తాడు. పోలీసులకి అనుమానం రావడంతో అక్కడనుంచి తప్పించుకుంటూ దుర్గి ఇంటికి వస్తాడు ప్రభాకరం. తనని పోలీసులు వెతుకుతున్నారని కాపాడమని దుర్గితో చెబుతాడు. ఆ గుడిసెలో మనిషిని దాచే స్థలం కాని, అవకాశం కాని లేదు. కాని దుర్గి బాగా ఆలోచించి ప్రభాకరం బాబు వాళ్ళు వచ్చి నన్ను ఏమన్నా, ఏం చేసినా నువ్వు మాత్రం కదలవద్దు. బయటికి రావద్దు అంటూ ఒకచోట కూర్చోమని చెబుతుంది. వెనకకు తిరిగి కూర్చో అని చెప్పి తన కాళ్ళను ఎడం చేస్తుంది. ఆమె చెప్పి నట్లుగానే కూర్చుంటాడు ప్రభాకరం. ఇంతలో పోలీసులు వచ్చి గుడిసె అంతా వెతుకుతారు. ప్రభాకరం గురించి దుర్గిని అడుగుతారు. తనకు ఏం తెలియదని చెబుతుంది. పోలీస్ లాటీతో ఎడాపెడా రెండుదెబ్బలు కొడతాడు. తెలియనప్పుడు కొడితే మటుకు నేనేం చెప్పగలను బాబూ అంటుంది దుర్గి. చివరికి ప్రభుత్వం తరపున ఉండటానికి ఇల్లు, మార్కెట్‌లో దుకాణం ఏర్పాటు చేస్తానని ఆశ చూపిస్తాడు పోలీస్. ప్రభాకరాన్ని పట్టిస్తే యివి అన్నీ యిచ్చేటట్లయితే, యిప్పుడు నాకు తెలియదండీ తెలిస్తే తప్పకుండా చెబుతానని అంటుంది దుర్గి. చివరికు పోలీసులు వెళ్ళిపోతారు. ఈ విధంగా ప్రభాకరాన్ని కాపాడుతుంది దుర్గి.

దుర్గమ్మ చేసే పని పాకీపని అయినా అందరికీ తల్లోనాలుకలా ఉంటుంది. కష్టపడి పనిచేసుకుని బతికే తత్వం కలిగిన మనిషి. ఎవరికి హాని చేయని మనస్తత్వం కలది. తమకోసం కష్టపడుతున్న మనిషి కోసం ప్రాణాలు ఇవ్వడానికైనా వెనుకాడదు. అందుకే ప్రభాకరం గురించి పోలీసులు ఎంతగా అడిగిన ఆచూకి చెప్పదు. తప్పు జరుగుతున్న చోట అది తప్పు అని ఎంతటి పెద్ద అధికారితోనైనా వాదించడానికి వెనుకాడదు. ప్రభాకరాన్ని గురించి చెబితే యిల్లు, మార్కెట్లో స్థలం యిస్తామని ఆశచూపినా దుర్గి చలించలేదు. దుర్గిలాంటి శ్రమజీవులు తమకోసం పనిచేసే నాయకులను ఎంతటి త్యాగం చేసైనా కాపాడుకుంటూనే నిబద్ధత, నిజాయితీ వుంటాయని రచయిత ఈ పాత్రద్వారా తెలియజేశాడు.

మంజుల :

'రాతిపువ్వు' నవల్లో ప్రధాన పాత్ర మంజుల. తన పదమూడవ ఏటనుంచే నాటకాలు వేయడం మొదలు పెట్టింది. ఆమె నటనే ఆమెమీద ఆధారపడివున్న తల్లిని, ఇద్దరు తమ్ముళ్ళనీ, మొగుడు వదిలేసిన అక్కని ఆరు సంవత్సరాల నుంచి పోషిస్తుంది. మంజుల తండ్రి రాజయ్య. కొన్నిరోజులు యింట్లో ఉండటం, కొన్ని రోజులు పనికోసం దూరంగా వెళ్ళడం చేసేవాడు. తాగుడువల్ల ఆరోగ్యం పాడు చేసుకున్నాడు. టీచర్ అరుణ సహాయంతో నాటకాలు వేయడం మొదలుపెడుతుంది. తండ్రి చనిపోయాక పూర్తిగా ఇంటి బాధ్యతలు తనపైనే పడతాయి. అలా నాటకాలు వేస్తూ నాటక సమాజాలతో

పరిచయం పెరుగుతుంది మంజులకి. ఎవరైనా నాటకానికి పిలిస్తే వెళ్ళడం రిహార్సల్స్ చేయడం, నాటక ప్రదర్శన ఇవ్వడం మంజులకి అలవాటు అయ్యింది.

డాక్టర్ రావూజి నాటకంలో నటించడానికి మంజులను హైదరాబాద్ రమ్మని కబురు పెడతాడు. నాటక సమాజాల్లో నటించే అందరికి డాక్టర్ రావూజి గురించి తెలుసు. రావూజి నాటకంలో రిహార్సల్స్ చేసే సమయం లోనే మోహన్‌ని కలుస్తుంది. మోహన్ మంజులకు అంతకుముందే తెలుసు.

రెండవసారి నాటకం రిహార్సల్స్‌కి వచ్చినప్పుడు రావూజి ఇంట్లో కాకుండా మోహన్ రూమ్‌లో ఉంటుంది. అతనితో కలిసి నాటకం రిహార్సల్స్‌కి వస్తుంది. మోహన్‌తో మరింత చనువు పెరుగుతుంది. వాళ్ళిద్దరి ఆలోచనలు ఒక్కటి అవుతాయి. ఈ విషయం రావూజీకి కూడా తెలుస్తుంది. మంజులతో మాట్లాడాలని పిలిపిస్తాడు. మంజుల తన గతం అంతా రావూజికి చెబుతుంది. "నటిగా నేను చాలా పేరు సంపాదించాను. మంజుల అంటే తెలుగుదేశంలో ప్రతి నాటక సమాజంలోనూ తెలుసు. దాదాపు రెండు వందల నాటకాలు వరకు ఆడేను." (రాతిపువ్వు, సి.యన్.రావు, పుట 15) నిన్న రాత్రి మోహన్‌తో చాలాసేపు మాట్లాడాను. తను చెప్పిందే మోహన్‌కి కూడా చెప్పాను అని చెబుతుంది రావూజికి మంజుల.

ఒకరోజు నాటకం నుంచి వస్తున్న మంజులను పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తీసుకువెళ్ళారు. అక్కడ ఉన్న పోలీసు మంజుల మీద అత్యాచారం చేసాడు. ఎన్నో రోజులుగా ఎందరినుంచో తనను తాను కాపాడు కుంటున్న మంజుల ఆరోజు ఆ పోలీసులకి బలై పోయింది. కొన్ని రోజులకు మోహన్ ట్రైనింగ్ పూర్తి చేసుకుని నేరుగా విజయవాడలో ఉన్న మంజుల ఇంటికి వస్తాడు. పెళ్ళికి ముహూర్తం పెట్టించాను. ఎల్లుండే మన పెళ్ళి అని మోహన్ చెప్పగా ఎలాంటి సంతోషం లేకుండా ఉండిపోతుంది మంజుల.

"ఒక విషయం ఆలోచించు మోహన్, నువ్విప్పుడు పెద్ద హోదాలో ఉన్నావు. సర్వాధికారాలూ గల పోలీసాఫీసరువి. నన్ను ప్రేమించావు కాబట్టి ఎంతో విశాల హృదయంతో నామీద ఎన్ని నిందలున్నా, నేను చెడిపోయానని నమ్మడానికి ఎన్ని అవకాశాలున్నా నిజంగా చెడిపోయినా, నన్ను స్వీకరించడానికి చేతులు చాస్తున్నావు. మనం పెళ్లి చేసుకుంటాం. సుఖంగా ఉంటాం. కాని ఈ దేశంలో నాలాంటివాళ్ళు చాలామంది ఉన్నారు. అనాదులకు, సతితులకు, భ్రష్టులకు లోటులేని దేశం మనది. మన సంప్రదాయానికి, సంస్కృతికి చిహ్నాలు వాళ్ళు. మరి వాళ్ళందరి సంగతి ఏమిటి? నన్ను చేపట్టి నా జీవితం బాగు చెయ్యదలచుకున్నావు. నా ఒక్కర్తినీ ఉద్ధరిస్తే ఏం సాధించినట్లు నువ్వు? అందుకే వాళ్ళం దరిన్నీ ఉద్ధరించడానికి నువ్వు ఆలోచించాలి అని చెబుతుంది మోహన్‌కు.

మంజుల తన కన్నవారికోసం, తోడబుట్టిన వాళ్ళకోసం శ్రమిస్తుంది. తమ జీవితాలను బలి చేసుకున్న ఎందరో అమ్మాయిలకు ప్రతీకగా ఆమె కన్పిస్తుంది. ఆపదలు కలిగినప్పుడు ఎలా పోరాడాలో, వాటిని ఎదిరించి ఎలా నిలబడాలో తెలియజేసే పాత్ర. కన్నతల్లి, అక్క తన జీవితాన్ని నాశనం చేయాలని చూసినా వాళ్ళకోసం తాను నిరంతరం కష్టపడే మనస్తత్వం కలిగింది. తోడబుట్టిన వాళ్ళకోసం అనుక్షణం పరితపించే మనిషిగా, బంధాలకు విలువచ్చే మనిషిగా మంజుల పాత్ర చిత్రితమైంది. తనలాంటి ఎందరో అభాగ్యులను బాగు చేయమని ప్రేరేపించిన ఆదర్శ మహిళ మంజుల.

లక్ష్మి :

"జీవనవీణ" నవలల్లో ప్రధాన పాత్ర లక్ష్మి, సుబ్బయ్య, కనకమ్మ తల్లిదండ్రులు. లక్ష్మి అన్నయ్య పేరు చంద్రం. పల్లెటూరు వాతావరణంలో పెరిగిన అమ్మాయి. అన్నయ్య అంటే ఎంతో యిష్టం. ఒకరోజు అనుకోకుండా చంద్రం యిద్దరు వ్యక్తులను ఇంటికి తీసుకువస్తాడు. వాళ్ళ పేర్లు మురళి, వాణి. అన్నాచెల్లెళ్ళు. వాళ్ళు కారు చెడిపోతుంది. వాళ్ళు తమకు దూరపు బంధువులే అవుతారని తెలుసు

కుంటుంది తండ్రి సుబ్బయ్య ద్వారా లక్ష్మి. వచ్చిన గంటలోనే లక్ష్మితో కలిసిపోతుంది వాణి. వాణి, మురళీ లను ఎంతో మర్యాదగా, ఆప్యాయతగా చూసుకుంటారు లక్ష్మి వాళ్ళ ఇంట్లో అందరు. ఆ మర్యాదలు మురళి, వాణిలకు నచ్చుతాయి. దూరపు బంధువులు కావడంతో లక్ష్మి వాణితో వెటకారం కూడా ఆడుతూ ఆటపట్టిస్తూ ఉంటుంది. మరనటిరోజు కూడా కారు బాగుకాక పోవడంతో ఆ పాలం చూడటానికి వెళ్తారు. అక్కడ వాతావరణం అంతా వాణికి దగ్గర ఉండి చూపిస్తుంది లక్ష్మి. లక్ష్మి, వాణీలు రెండు రోజుల్లోనే బాగా కలిసి పోయారు. మరొక రెండు రోజులు ఉంటే బాగుంటుంది అని కారు ముందు టైర్ గాలి తీసేస్తుంది లక్ష్మి. ఊరి మునసబ్‌కి సుబ్బయ్య బాకీ ఉండటంతో తన కొడుకుకి లక్ష్మిని యిచ్చి పెళ్లి చేయమని అడుగుతాడు. మునసబ్ కొడుకు వ్యసనపరుడు. అది తెలుసుకుని సుబ్బయ్య చేయనని చెబుతాడు. ఆ మాటలు విన్న మురళికి లక్ష్మిపై అభిమానం పెరుగుతుంది. లక్ష్మికి కూడా మురళి అంటే ప్రత్యేకమైన అభిమానం.

ఊరిలో జాతర జరగడంతో సుబ్బయ్య, రాఘవయ్య కుటుంబాన్ని ఆహ్వానిస్తాడు. మురళి, వాణి, రాఘవయ్య అందరూ వస్తారు. రాఘవయ్య సుబ్బయ్యతో చంద్రానికి వాణికి, మురళి లక్ష్మిలకు పెళ్ళిళ్ళు చేద్దామని అడుగు తాడు. పిల్లలు కూడా ఇష్టపడటంతో సుబ్బయ్య సరే అంటాడు. ఆ విధంగా లక్ష్మి మురళికి పెళ్లి జరుగుతుంది. పెళ్లి తర్వాత లక్ష్మి విజయవాడలో కాపురం వుంటుంది. అత్తవారింటిలో అందరి అవసరాలను తెలుసుకుని అన్నీ సమయానికి చక్కబెడుతూ అందరి మెప్పును పొందు తుంది లక్ష్మి. అప్పటివరకు పట్టణంలో పెరిగిన వాణి పల్లెటూరు వాతావరణం నచ్చక చంద్రంతో గొడవ పడి పుట్టింటికి వచ్చేస్తుంది. విషయం తెలుసుకున్న లక్ష్మి వాణిని సముదాయిస్తుంది. రాఘవయ్యకు విషయం తెలిసి వాణిని నిలదీసి అత్తవారింటికి వెళ్ళమంటాడు. అక్కడి విషయం అంతా ఉత్తరం రాసి తండ్రిని, అన్నయ్యను వెంటనే రమ్మని కబురు పెడుతుంది లక్ష్మి. ఆ రోజు రాత్రి వాణి మనసు బాగోలేక ఏమి నిర్ణయం తీసుకుంటుందో అని ఆమెనే గమనిస్తూ ఉంటుంది. ఉదయాన్నే ఇల్లంతా వెతికినా శాంతమ్మకి లక్ష్మి, వాణి కనిపించకపోవడంతో కంగారుపడుతుంది. కొంతసేపటికి వస్తారు యిద్దరు. "ఎక్కడ కెళ్లారమ్మా, ఇంత రాత్రివేళా అన్నాడు రాఘవరావు. నవరాత్రులు కదూ మామగారూ దుర్గ గుడిదగ్గర హరికథ జరుగుతుంటే వెళ్లాం అంది లక్ష్మి. "ఆ మాటలకు అందరూ ఊపిరిపీల్చుకున్నారు. ఆ మాటలకు వాణి మనసులో కృతజ్ఞత చెప్పింది లక్ష్మి.

లక్ష్మి పల్లెటూరులో పుట్టి పెరిగిన అమ్మాయి. అందం, చలాకీతనం కలగలిసిన మనిషి. నలుగురితోను ప్రేమగా, ఆప్యాయంగా ఉంటుంది. అందరి అవసరాలు దగ్గర ఉండి చూసుకుంటుంది. పల్లెటూరు అయినా, పట్టణం అయినా ఎక్కడ ఎలా ఉండాలో తెలిసిన స్త్రీ. కుటుంబంలో చిన్న చిన్న మనస్పర్థలు వచ్చినప్పుడు వాటిని ఎంతో నేర్పుగా పరిష్కరించే తెలివి కలిగిన అమ్మాయి.

పై పాత్రలను పరిశీలిస్తే సి.యస్.రావు తన నవలల్లో ఎంతో శక్తివంతమైన, చైతన్యమైన స్త్రీ పాత్రలను తీర్చిదిద్దారో అవగతం అవుతుంది. ఎటువంటి పరిస్థితులు ఎదురైనా వెనకడుగు వేయకుండా ముందుకు సాగిన స్త్రీ పాత్రలే సి.యస్.రావు నవలల్లో కనిపిస్తాయి.

ఆధారగ్రంథాలు :

1. సి.యస్.రావు - తపస్వి
2. సి.యస్.రావు - అమ్మకావాలి
3. సి.యస్.రావు - దుర్గాంబిక
4. సి.యస్.రావు - రాతిపువ్వు.
5. సి.యస్.రావు - జీవనవీణ

BHAVAVEENA
Vol. 18, Issue. 10, October 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావ వీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

దళిత సాహిత్య ద్వారం – భీమన్న శంఖారావం

– నేతల లలిత, పరిశోధక విద్యార్థి, ఆంధ్ర విశ్వకళాపరిషత్, విశాఖపట్నం.

సామాజిక ప్రగతికి ఉన్నతమైన తాత్విక చింతనను అందించిన వారిని, అరమరికలు లేని వ్యక్తీకరణతో రాజీలేని పోరాటం చేసిన వారిని ప్రపంచం గుర్తించుకుంటుంది. దళితులు ఆత్మగౌరవంతో, మిగిలిన వారితో పాటు సమాన స్థితికి ఎదగాలని పీడిత ప్రజల పక్షాన కలాన్ని బలంగా వాడిన ప్రముఖుల్లో భీమన్న ఒకరు.

భీమన్న సాహిత్యాన్ని పరిశీలించి వారి వారి అభిరుచులకు అనుగుణంగా భీమన్న దృక్పథాన్ని వెల్లడించే పరిస్థితి వుంది. నాస్తికుడిగా, హేతువాదిగా, మానవవాదిగా, దళితవాదిగా, గాంధేయవాదిగా, అంబేద్కర్ వాదిగా భీమన్న దర్శనమిస్తారు. హైందవంతో దళిత, అంబేద్కరీయులకు కుదరదు. నాస్తిక హేతు వాదాలు మతంతో పొసగవు. ఇలాంటి పరస్పర భిన్న దృక్పథాలు వున్నప్పుడు భీమన్నను ఏ మార్గానికి, ఏ దృక్పథానికి చెందినవాడౌతాడోననేది గందరగోళ పరిస్థితిగా అన్పించవచ్చు. భిన్న దృక్పథాల కూడలి భీమన్న సాహిత్యం అని సూత్రీకరించుకోవడం సముచితంగా ఉంటుంది. భీమన్న భిన్న దృక్పథాల్లో బలీయంగా కన్పించేది దళిత దృక్పథమే.

ఏ విషయాన్నైనా కుండబద్దలు కొట్టినట్లు చెప్పే భీమన్న దళిత ప్రగతి కోసం పూరించిన కావ్యమే "శంఖారావం". ఉదయం శంఖం, ఉదాత్త శంఖం అనే ఉపశీర్షికలతో ఈ రచన సాగింది.

శ్రీకృష్ణుడికి చదువు నేర్పిన గురువు సాందీపుడు. సముద్ర స్నానానికి వెళ్ళి తిరిగిరాని తన కొడుకును తెచ్చి ఇమ్మని గురుదక్షిణగా శ్రీ కృష్ణుని కోరతాడు సాందీపుడు. శ్రీ కృష్ణుడు గురువు పుత్రుడి కోసం వెతుక్కుంటూ సముద్రతీరానికి వెళితే అక్కడ పంచజనుడు అనే వ్యక్తి కన్పిస్తాడు. బాలుడు సముద్రంలో మునిగి చనిపోయి, యమలోకంలో వున్నాడని, శంఖాన్ని పూరించడం ద్వారా యముణ్ణి జయించి బాలుణ్ణి తెచ్చుకోవచ్చనే సలహాతో పాటు శంఖాన్ని బహూకరిస్తాడు పంచజనుడు. పంచ జనుడు ఇచ్చిన శంఖం కాబట్టి అది పాంచజన్యం అయింది. కృష్ణుడు విష్ణువు అవతారం కాబట్టి పాంచజన్యం విష్ణు శంఖం అయింది. ఆ పంచజనుడు పంచముడేనని, భీమన్న పేర్కొన్నాడు. ఇతణ్ణి జలరాక్షసుడిగా భాగవతంలో చిత్రించడం అహేతుకమని, జలం ఆధారంగా జీవించే దేశీయుడైన పంచజనుడు జలజీవి అని, కర్షకుడని కవి భావన.

"పాంచజన్యం - పాంచజన్యం
పంచముడి మహా ప్రసాదం
ప్రగతి సాధక వీరనాదం
పంచమ స్వర ప్రభాతం
పరమ శంఖా నంద గీతం
సర్వమానం సమైశ్వరం
సతృసుందర సాహచర్యం"

మానవ పురోగమనంలో వ్యవసాయం నాగరికతకు ప్రారంభం. మానవ నాగరికతకు పంచముడే ఆది పురుషుడని, మూలవాసుడని పేర్కొన్నారు.

"పంచజనుడనేను పాంచజన్యము నాది
ఆనాటి పంచజనులీనాటి పంచములు
తొలినేల దున్నితిరి, తొలి మూననాటితిరి
జలజీవులు నుండి సాగుచేసిరి భూమి
సాగైన భూమెల్ల భోగజీవుల జేర
భోగులెల్లను కలిసి భూస్వాములైనారు
జలములను వెంటాడి సాగు చేసెడి మాకు
పొలములన్నియు పోయి జలధులే మిగిలినవి"

అంటూ దళితులు సాగు చేసిన భూమిని అధికార బలంతో, కుతంత్రాలతో ఆక్రమించుకున్నవారు భూస్వాములయ్యారని వివరించారు.

సమాజాన్ని విభజించి, సౌఖ్యాల్ని అనుభవించడానికి పెత్తందారీ వర్గం సృష్టికర్తకు నాలుగు తలలు సృష్టించిందని వివరిస్తూ-

"నరుల విభజించి నాల్గువర్ణాలు చేయ
నాల్గు తలలను కల్పించినాడు మనిషి
సృష్టికర్తకు, ఎంత ఔచిత్య రచన
చిత్తమలరించి ప్రజల వంచించు రచన"

అని స్పష్టం చేశారు. భారతీయ సంస్కృతి సాహిత్యాలకు మూలపురుషులైన ఆదికవి వాల్మీకి, వేదవ్యాసుడులాంటి వారు కింది వర్గాలకు చెందిన వారైనపుడు వర్ణవ్యవస్థకు తావులేదని భీమన్నవాదం.

"అల అరుంధతి, వాల్మీకి, వ్యాసమౌని
ధర్మవ్యాధ, మతంగులు, తత్వకర్త
కపిలుడును, కర్ణమబ్రహ్మకలరు నాకు
పూర్వులెందరో నావంశమూలమందు"

అంటే పురాణాల్లో తన వంశం వారిని తరచుగా ప్రస్తావించడం, ప్రశంసించడం కన్పిస్తుంది. అలాగే పురాణాల్లో శూద్రులకు అతి శూద్రులకు కులం పేరుతో జరిగిన అన్యాయాన్ని ప్రశ్నిస్తూ-

"ఒక కులమె గుత్తగొన్నది వికట వృత్తి
మంచివారిని కూడా శపించు హక్కు
ఏమి చేసె నుదంకుడు? ఏకలవ్య
నేమి చేసెద్రోణుడు? స్వార్థమె మతమ్ము"

అంటూ మతం స్వార్థానికి కేంద్ర బిందువు అయిందని స్పష్టం చేశారు భీమన్న.

ఇంకా మతం హైందవజాతి చేసిన కీడును గూర్చి-

"వేనరాజునేల ఖూనీ యెనర్చిరి?
పృధువు చేసుకున్న పుణ్యమేమి?
ద్రవిడ రాజ్యమేల దగ్ధమై పోయెను?
వేదజాతికివియె వెర్రితలలు"

అంటూ ద్రవిడులకు, దేశీయ మూలవాసులకు వైదిక జాతి వలన జరిగిన అన్యాయాల్ని, అరమరికలు లేకుండా ప్రశ్నించారు.

దళితాభ్యుదయానికి కృషి చేసిన నాయకుల్ని, దళితోద్యమానికి భావజాలాన్ని అందించిన పూర్వీకుల్ని స్తుతించడం, స్మరించడం భీమన్న సాహిత్యంలో ప్రధానంగా కన్పించే అంశం.

'శంఖారావం'లో కూడా-

"చావదలచిన గాంధీని చావనీక
అతడు చచ్చిన నేవరుందురని తలంచి
కలిసి వచ్చె నంబేద్కరు, కాకయున్నా
ఇంత బాంచజాతి స్వతంత్ర మెట్టులయ్యె
పూనె ఒప్పంద మొక్కటి, బుద్ధమతము
స్వీకరించుట ఒకటి, రక్షించె హైంద
వమును, కాకున్న నక్కల పాలయెది
పితయె నవహైందవమున కంబేద్కరుండు"

అంటూ పూనా ఒడంబడిక ద్వారా గాంధీ ప్రాణాల్ని రక్షించడానికి, బౌద్ధమతం స్వీకరించడం ద్వారా హైందవ మతాన్ని సంస్కరించడానికి అంబేద్కరే కారణమని వివరించారు. ఇంకా డా॥ అంబేద్కర్ రాజ్యాంగ రచనా ప్రావీణ్యాన్ని అది సమాజంలో తెచ్చిన గణనీయమైన మార్పుల్ని ప్రస్తావిస్తూ-

"హైందవ సమాజమంది ఈ అరువదేండ్ల
లోన రాలేదె గణనీయమైన మార్పు?
మనువు స్థానములోకి వచ్చిన మనీషి
డాక్టరంబేద్కరుడు మాలడౌను కాదె?"

అంటూ ప్రస్తావించాడు. బ్రాహ్మణత్వంపై అంబేద్కర్ నిరాఘాటంగా జరిపిన పోరాటాన్ని అందిపుచ్చుకున్న భీమన్న "బ్రహ్మ పదార్థం" అనే శీర్షికలో-

"బ్రహ్మపదము నుంచి బ్రాహ్మణము జనించె
బ్రాహ్మణము నెరింగి బ్రాహ్మణుడయె
బ్రహ్మవిద్యయనగ పట్టార్హంతయె కాని
బ్రహ్మణత్వము ఎవరి బాబు సొమ్ము"

అంటూ బ్రహ్మణత్వం గుత్తాధిపత్యానికి లోనై, ఒక వర్గంగా పరిమితం కావడాన్ని ప్రశ్నించారు. అలాగే బ్రహ్మని, బ్రహ్మరాతల్ని, కర్మల్ని గూర్చి వివరిస్తూ-

"బ్రహ్మరాసతగ మనసును భ్రాంతి పరచు
ఘటనల లెన్నియో కనిపించు కాలగతిని
తద్గతిని కర్మ అనిరి పెద్దలు, త్రికాల
ములకు పంచిరి మూడు ముక్కలుగ చేసి"

అంటూ మనసు భ్రాంతికి లోనుకావడాన్ని ప్రస్తావించారు.

బాబాల్ని, దొంగ సన్యాసుల్ని ఘాటుగా విమర్శిస్తూ-

"బాబాలును, దాదాలును
డాబులు ఏమైన కూటిడబ్బులు కొరకే
జేబులు నిండుట ముఖ్యము
ఏ బొందను కట్టుకొన్న నేమిర భీమ్నా"
"దొంగ సన్యాసులెందరొ దొరలు కాగ
అంధ విశ్వాసమే దైవ మని వచింత్రు
బ్లాస్మేమీ పేర మేధావులను వధింత్రు
ప్రశ్న వలదండ్రు న్యాయ ధర్మముల గూర్చి" అని అన్నారు.

బ్రతుకు తెరువు కోసం, విలాస జీవితం కోసం బాబాలుగా, సన్యాసులుగా అవతారమెత్తి, సమాజ అభివృద్ధి కోసం, సహేతుకంగా ప్రశ్నించే మేధావుల్ని దైవనింద పేరుతో వేధించడాన్ని, చంపడాన్ని విమర్శించారు.

దళిత ప్రగతికి శంఖారావాన్ని పూరించిన భీమన్న దళిత సాహిత్యంలోనే కాదు, తెలుగు సాహిత్యంలో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారు.

BHAVAVEENA
Vol. 18, Issue. 10, October 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావ వీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

సి.నా.రె ప్రపంచ పదుల్లోని మానవీయ విలువలు

-పెదనారప్పగారి సురేష్, పరిశోధక విద్యార్థి, తెలుగు & తులనాత్మక సాహిత్య శాఖ,
శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, అనంతపురము.

సామాన్య రైతు కుటుంబంలో జన్మించినా హలాన్ని-వదిలి కలాన్నే హలంగా మలచి అక్షర సేద్యం చేసిన మహాకవి సింగిరెడ్డి నారాయణ రెడ్డి. ఈయన కరీంనగర్ జిల్లా, వేములవాడ మండలం, హనుమాజీపేట గ్రామంలో ప్రజోత్పత్తి నామ సంవత్సరం నిజాషాడ పౌర్ణమి (గురుపౌర్ణమి) నాడు అనగా 29/7/1931 నాడు ఉదయం 4-5 గంటల మధ్య జన్మించారు. తల్లిదండ్రులు శ్రీ సింగిరెడ్డి మల్లా రెడ్డిగారు, శ్రీమతి సింగిరెడ్డి బుచ్చమ్మ గారు. మల్లారెడ్డి అరక పట్టిన రైతు "పదుగురు పాలేర్లున్నా పదరా" అని స్వయంగా రేగడిని దున్నే కృషీవలుడు. నల్లని రేగళ్ళు దున్ని నారాయణ రెడ్డి బ్రతుకున రవ్వలు పండించిన కర్షకమణి మల్లారెడ్డి. "బ్రతికినంత కాలం బంగారు మమతలు పొంగించిన పాలవెల్లి" తల్లి బుచ్చమ్మ

నారాయణరెడ్డి భార్య పేరు సుశీలగారు వీరికి నలుగురు కూతుళ్ళు గంగ, యమున, సరస్వతి, కృష్ణవేణి. సి.నా.రె.లో సహజంగా లయాత్మకత, ఆశుగుణం, గానశీలం ఉన్నాయి. చిన్నప్పటి నుండి జానపదగేయాలను ఆలపించేవారు. హరికథలు, బుర్రకథలు, అంటే చెవి కోసుకునేవారు హరికథా కథనాన్ని అనుకరించేవారు వేముల వాడ వాస్తవ్యులు 'శ్రీచౌటి నరసయ్య' గారి హరికథాగానం సి.నా.రె. గారికి ఛందస్సు పట్ల అభిరుచిన కలిగించడానికి ప్రేరకమైనది. సి.నా.రె. అధికార భాషా సంఘం అధ్యక్షులుగా (1981), సార్వత్రిక విశ్వవిద్యాలయం ఉపాధ్యాక్షులుగా (1985), తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులుగా (1989), భాషా సాంస్కృతిక సలహాదారుగా, సాంస్కృతిక మండలి అధ్యక్షులుగా, రాజ్యసభ సభ్యులుగా (1997), సినీగీతా రచయితగా, కవిగా, విద్యారంగంలోను పాలనా పరంగాను ఆధునిక తెలుగు సాహిత్యానికి ఎనలేని తన సేవలను అందించారు. ఈయన కలం నుండి ఎన్నో గ్రంథాలు అంటే దాదాపు 90 గ్రంథాలు వెలువడ్డాయి. అందులో ముఖ్యమైనది 1.ఆధునికాంధ్ర కవిత్వం - సంప్రదాయాలు - ప్రయోగాలు. 2. విశ్వంభర. 3.కర్పూర వసంతరాయలు. 4.ప్రపంచ పదులు. 5.మంటలూ - మానవుడు. 6.మట్టి మనిషి ఆకాశం. 7.నాగార్జున సాగరం. 'ఆధునికాంధ్ర కవిత్వం - సంప్రదాయాలు - ప్రయోగాలు' గ్రంథం సాహిత్య పరిశోధక విద్యార్థులకు కల్పవృక్షం లాంటిది. సాహిత్యంలో ఉత్తమ పురస్కారమైన జ్ఞానపీఠ పురస్కారం అందుకున్న ద్వితీయకవి. మొదట విశ్వనాథ సత్యనారాయణ గారు రాసిన 'శ్రీ మద్రామాయణ కల్పవృక్షం' రచనకు 1970లో, అలాగే చివరగా రావూరి భరద్వాజ రాసిన 'పాకుడు రాళ్ళు' రచనకు 2012లో ఈ పురస్కారం లభించింది తెలుగులో ముగ్గురు కవులకి మాత్రమే ఈ పురస్కారం లభించింది.

సి.నా.రె కవి గురించి కుందుర్తి గారు ఈ విధంగా పొగిడాడు "నారాయణరెడ్డి తిలక్ లాగా రెండంచుల పదును గల కత్తి కవిత్వంలో అగ్ని చల్లగలడు, అమృతం కురిపించగలడు.

'ఎన్ని తెన్నుల కైత కన్నె విహరించినను పాటలలోనే నాదు ప్రాణాలు గల వందు' అని సి.నా.రె ఒక సందర్భంలో చెప్పారు. అలాగే 'నేను నగరానికి రాకుండా ఆధునిక కవిగా కాకుండా ఉంటే గద్దర్ లాగా భుజాన చద్దర్(దుప్పటి) పోసుకొని పాటగాడిగా మారిపోయి ఉండేవాడిని అని చెప్పారు.

ప్రపంచ పదుల పరిచయం :

తెలుగు సాహిత్యంలో ఒక గొప్ప సాహిత్య సృష్టి ఈ

'ప్రపంచ పదులు' వైవిద్య భరితమైన ఛందస్సు ఈ ప్రపంచ పదుల్లో ఉంది. సింగిరెడ్డి నారాయణ రెడ్డిగారు రచించిన రచనలలో 'ప్రపంచపదులు' గొప్ప ప్రయోగం. వేమన ఆట వెలదులతో సమాజాన్ని మేల్కొలిపితే సి.నా.రె. గారు ప్రపంచ పదులతో సమాజాన్ని మేల్కొలిపినారు. 'ప్రపంచ పదులు' అనగా 'ప్ర' అన్న ఉపసర్గకు 'విశేషం' అని అర్థం అంటే మామూలు పంచ పదులు కారు 'విశేషమైన పంచ పదులు' అని అర్థం. ప్రపంచ అంటే లోకతత్వం. సమాజంలో మానవులు ఏవిధంగా ఉన్నారో వాళ్ళ లక్ష్యం గురించి ఇందులో చెప్పారు.

గురజాడ అప్పారావు సృష్టించిన ముత్యాల సరాలు ఛందస్సు లాగే సి.నా.రె గారు కూడా కొత్త ఛందస్సును ప్రయోగించారు.

ఒక నిర్ధిష్ట గేయగతిలో అయిదు పాదాలతో సాగి పోయే రచన అందుకే దానిని 'ప్ర' పంచపదులు అన్నారు. ఇది పార్శీనుంచి వచ్చి ఉర్దూ సాహిత్యంలో ఉన్న 'రుబాయి' ని పోలి ఉంటుంది. ప్రపంచంలోని దుర్మార్గాన్ని విమర్శించడం, ఈ ప్రపంచ పదుల లక్ష్యం ఇది ఆత్మా శ్రయ రీతిలో ఉంటుంది.

ప్రపంచ పదులు కూడా రుబాయీ లాగే సాగిపోతూ ఇంకొక పాదాన్ని చేర్చి రచించారు. అందుకే దీనిని 'పంచపదులు' అన్నారు. నాలుగు పాదాలకు ఎంతటి ప్రాధాన్యం ఉంటుందో ఐదవ పాదానికి అంతే ప్రాధాన్యం ఉంటుంది. నాలుగు పాదాలలోని విషయానికి ఐదవ పాదం వల్ల మరికొంత విషయం బొదించడం చేశారు. ఐదు పాదాలలో మొదటి రెండు పాదాలకు మరియు చివరి రెండు పాదాలకు సమాధానం మధ్య పాదం అయిన మూడవ పాదంలో దొరుకుతుంది.

ప్రపంచ పదుల్లో నాలుగు రకాల చంధోరీతులు ఉంటాయి అవి 1.మిశ్రగతి 2.చతురస్రగతి 3.ఖండగతి 4.త్రిస్రగతి వీటిలో త్రిస్రగతిలో రాసినవి ఎక్కువగా ఉన్నాయి. మూడవ పాదానికి తప్ప మిగిలిన నాలుగు పాదాలకు అంత్య ప్రాస నియతి ఉంటుంది. కొన్నింటికి రెండు పాదాలకు మాత్రమే ఉంది. అధునిక కాలంలో ఇటువంటి ఛండోరీతులు నియమాలను పాటిస్తూ రచన చెయ్యడం గొప్ప ప్రయత్నం ఇది మాత్రా ఛందస్సులో వచ్చిన ప్రక్రియ.

నింగిలోతును చూడగోరితేనీటి చుక్కను కలుసుకో
రత్నతత్వం చూడగోరితె రాతి ముక్కను కలుసుకో
అణువునడిగితె తెలియదా బ్రహ్మాండమంటే ఏమిటో
మౌనశిల్పం చూడగోరితె మంచు గుడ్డను కలుసుకో
మనిషి మూలం చూడగోరితె మట్టి బెడ్డను కలుసుకో

ఒక్కొక్క విషయానికి సంబందించిన దానిని తెలుసు కోవాలి అంటే ముందు దాని మూలాన్ని తెలుసుకోవాలి. నింగిలోతును కనుకోవాలి అంటే ముందు నీటి చుక్క గురించి తెలుసుకోవాలి సముద్రంలోని నీరు ఆవిరి రూపంలో పైకి వెల్లి మేఘావృతమై చల్లగాలి తగిలి మళ్ళీ వర్షం లాగా వచ్చి సముద్రంలో కలుస్తుంది. రత్నం గురించి తెలుసుకోవాలి అంటే ముందు రాతి ముక్క గురించి పరిశీలించాలి రత్నం కూడా రాతి ముక్క నుంచే వస్తుంది. అలాగే బ్రహ్మాండమంటే ఏమిటో అని బ్రహ్మాండం మొత్తం వెతకాల్సిన పని లేదు. చిన్న అణువుని పరిశీలిస్తే చాలు జరిగే ప్రతి పని బ్రహ్మాండంలో భాగమే. మనిషి యొక్క మూలం గురించి తెలియాలి అంటే, గర్భంలో ముందు పిండం లాగా మొదలై చనిపోయిన తరువాత మట్టిలో కలిసే వరకు జరిగే ప్రక్రియను అంతా పరిశీ లించాల్సిన పని లేదు మట్టిని అడిగితే తెలుస్తుంది.

ఇక్కడ సమాజానికి కేంద్రం స్థానం మనిషి ఆ మనిషి ఎంత ఎత్తుకి ఎదిగినా వచ్చిన మూలాలను మర్చిపోరాదు.

సమాజంలో ఒక ఉన్నత స్థానానికి ఎదగాలి అనుకొనే వారికి ఇది చక్కని ప్రపంచ పది. మనిషికి మట్టితో ఉన్న బంధాన్ని తెలుసుకోవాలి. మట్టి రైతుకు ప్రాణం అవుతుంది. అదే మట్టి కవికి కవితా వస్తువు అవుతుంది. వ్యాపారస్తునికి వ్యాపారం అవుతుంది. అలాంటి మట్టి

నుండి వచ్చిన వారు మూలాలను క్షుణ్ణంగా తెలుసు కోవాలి.

ఎంతటి సత్యానికైన ఏవో కల్లల బాధలు
ఎంతటి దేశానికైన ఏవో ఎల్లల బాధలు
బాధలు లేనిది ఎవరికి ఏదో ఒక రూపంలో
ఎంతటి శీలానికైన ఏవో ధూర్తుల బాధలు
ఎంతటి సింహానికైన ఏవో దోమల బాధలు

ఈ ప్రపంచ పదిలో ఎంతటి వారికైనా ఏదో ఒక బాధ ఉంటుంది. అని సి.నా.రె. చక్కగా చెప్పారు. నేటి సమాజంలో ఉన్నతంగా ఎదుగుతున్న వారిని చూసి ఉండలేక అసూయ పడేవారు అధికంగా ఉన్నారు. నిజం అనేది బయటకు రావాడానికి చాలా సమయం పడుతుంది. అదే అపద్ధం కొద్ది సమయంలోనే ప్రపంచాన్ని చుట్టి వస్తుంది. ఇప్పుడు కొత్తగా సాంకేతిక విధానం రావడంతో అది ఇంకాస్త పెరిగింది. అలాగే ఇప్పుడు ప్రతి దేశానికి పక్కనే ఉన్న ఏదో ఒక దేశంలో సరిహద్దుల విషయంలో గొడవలు జరుగుతూనే ఉన్నాయి. భారతదేశానికి పాకిస్తాన్‌కి కాశ్మీర్ సమస్యపై ప్రతిరోజు ఏదో ఒక రూపంలో పాకిస్థాన్ తన కోపాన్ని చూపిస్తోంది.

ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశం అమెరికాకు మెక్సికోతో సరిహద్దు వివాదం ఉంది. అలాగే శీలవంతులైన వారిపై నిందలు వేయడం త్రేతాయుగం నుండి ఉంది. అయోనిజ, శీలవతి, ధర్మపత్ని అయిన సీతకూ ఆ కష్టాలు తప్ప లేదు. నేటి సమాజంలో అది ఇంకా ఎక్కువ. బాధలు లేనిదే ఎవరికి అందరికీ ఉంటాయి. అడవికి రారాజు అయిన సింహానికి దోమలతో బాధలు ఉంటాయి. అలాగని కృంగిపోరాదు. బాధలను జయించ కలిగే శక్తి కావాలి. బాధ పడుతూ కూర్చుంటే ఏమి లాభం ఉండదు. దానిని ఎదుర్కొవాలి ధైర్యంగా నిలబడాలి. ఇలా చక్కగా ఉపమానాలతో బాధల గురించి చెప్పారు.

కరగనిదే కొవ్వొత్తికి కాంతి ఎలా పుడుతుంది?
చెక్కనిదే శిలకడుపున శిల్పమెలా పుడుతుంది?
ఫలితం అందేది తీవ్ర పరిణామంలోనే సుమా!
మరగనిదే నీరు ఎలా మబ్బు రూపు కడుతుంది?
నలగనిదే అడుగు ఎలా నటన రక్తి కడుతుంది?

"కష్టఫలి" అనగా కష్టం చేస్తేనే ఫలితం లభిస్తుంది. దీనిని ఆంగ్లంలో "No Pain - No Gain" అంటారు. అంటే కష్టాలు లేకపోతే లాభాలు ఉండవు అని అర్థం. ఇంకా కఠోర శ్రమ చేయవలసి ఉంటుంది. కొవ్వొత్తి కరిగితేనే కాంతి పుడుతుంది. అది కొందరికి వెలుగును ఇస్తుంది. అలాగే బండరాయిని శిల్పి అందంగా చెక్కితేనే శిల శిల్పం అవుతుంది. ఉలి దెబ్బలకు తట్టుకోకపోతే శిల్పం కాలేదు. బాగా మరిగితేనే కదా నీరు మబ్బు రూపు కడుతుంది. అది ఆవిరి రూపంలో మళ్ళీ నీరు లాగే వస్తుంది. అలా ప్రతి ఒక్కరూ కష్టపడితేనే తగిన ఫలితం లభిస్తుంది. అని సి.నా.రె. గారు చక్కగా చూపించారు. ఏరంగంలో నైనా శ్రమిస్తేనే ఫలితం అది ఏదైనా సరే. చేసేపని ఇష్టంతో చేస్తే కష్టమైన సుఖమే.

పక్షి రెక్కలకు మబ్బుల గొడుగులు కట్టినప్పుడే సార్థక్యం!
పారే ఏటికి పైరు గొంతులో పారినప్పుడే సార్థక్యం!
ఏ లక్ష్యానికి కట్టుబడక బతుకీడ్చుకు పోతే ఏం లాభం!
నేర్చిన చదువుకు జాతి జాతకం మార్చినప్పుడే సార్థక్యం!
కట్టు బానిసకు సంకెళ్ళు మట్టి గరచినప్పుడే సార్థక్యం!

అబ్దుల్ కలాం గారు "కలలు కనండి వాటిని సాకారం చేసుకోండి అన్నారు. అలా ప్రతి మనిషికి జీవితంలో ఏదో ఒక లక్ష్యం గాని, గమ్యం గాని ఏర్పరచుకోకపోతే ఆ జీవితానికి అర్థమే ఉండదు అంటారు సి.నా.రె. మనం నేర్చుకున్న విద్యను పదిమందికి ఉపయోగపడినప్పుడే ఆ చదువుకి ప్రయోజనం ఉంటుంది. ఆ చదువు

ఇతరుల అభివృద్ధికి కారణం కావాలి. సమాజ అభివృద్ధిలో మనం భాగస్వామ్యం అవ్వాలి. కొంతమంది లక్ష్యాన్ని ఏర్పరుచుకొని అడుగు ముందుకు వేస్తారు. ఆటంకం కలుగవచ్చు. 'ఆదిలోనే హంసపాదం' అన్నట్లు వెను తిరుగుతారు. అలాగే ఇంకొంతమంది నగం వరకు ప్రయత్నించి మధ్యలో వదిలేస్తారు. అది కాదు జీవితం లక్ష్యాన్ని అందుకోనే వరకు పోరాడాలి అనే అసలైన జీవితం. ఎవరికైనా ప్రయోజనం కలిగే విధంగా ఉంటేనే ఆ జీవితానికి సార్థకం.

ఎక్కడో అందనిది వుందని ఆపేక్షించకు మిత్రమా!
ఎదుట వున్నది నీది కాదని ఉపేక్షించకు నేత్రమా!
చిన్న దీపం మేలుకాదా చీకటింట్లో గడపగా
రాని దానికి అనుక్షణమూ నిరీక్షించకు హృదయమా
రాయినైనా మాటిమాటికి పరీక్షించకు దైవమా!

ఈ ప్రపంచ పదిలో సి.నా.రె. అత్యాశపరుల గురించి చెప్పారు. అత్యాశ పరులు ఉన్న దానిని వదిలేసి లేని దాని కోసం ఎదురుచూస్తూ ఉంటారు. అది ఇంక రాదు అనుకొనే దాని కోసం ఎదురు చూడరాదు. ఒక వస్తువు ఇంక నిష్ప్రయోజనం అని తెలిసినా దాన్నే పరీక్షించి చూసి సమయం వృథా చేస్తున్నారు. చిన్న దీపం చీకటిలో వెలుగును ఇస్తుంది. అలాకాక నీకు చందమామ వంటి వెలుగు కావాలి అంటే కాదు అది జరగని పని. అందువల్ల జరిగేది మాత్రం ఆలోచించాలి.

ముగింపు :

మనిషి సమాజానికి కేంద్ర స్థానం అలాంటి మనిషి సమాజంలో బాగా బ్రతకాలి అంటే అతనికి మానవతా విలువలు చాలా అవసరం ఎలా బ్రతికామన్నది కాదు ముఖ్యం ఎంత మంచిగా బ్రతికామన్నది ముఖ్యం. ఈ 'ప్రపంచ పదుల'లో సి.నా.రె మానవతా విలువల గురించి చాలా చక్కగా చెప్పారు.

ఈ సమాజానికి కావల్సిన సందేశాలను ఈ 'ప్రపంచ పదులు'లో చూడవచ్చును. ఇవి సమాజంలో మార్పు తెచ్చె విధంగా ఉన్నాయి. ఈ యువతరం మంచి ప్రవర్తనతో మెలగాలి అంటే ఈ 'ప్రపంచ పదులను' చెప్పి వారిలో మార్పు తేవచ్చు. వేమన, బద్దెన, భర్తృహరి మొదలైన వారి శతకాలలో నీతిని, సామాజిక, మానవ వికాసాలను తెలియజేసినట్లే ఈ ప్రపంచ పదుల్లో సామాజిక, మానవ వికాసాలు, వ్యక్తి యొక్క లక్ష్యం గురించి తెలియజేయడమైనది.

ఉపయుక్త గ్రంథసూచికలు :

1. 'ప్ర'పంచ పదులు సి.నారాయణరెడ్డి
2. తెలుగుసాహిత్య చరిత్ర - ద్వా.నా.శాస్త్రి

BHAVAVEENA
Vol. 18, Issue. 10, October 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

సరస్వతీ స్తుతి శతకాల పరిచయం

– శ్రీవైష్ణవ వేణుగోపాల్, పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, ఫ్యాకల్టీ ఆఫ్ ఆర్ట్స్, కాశీ హిందూ విశ్వవిద్యాలయం, వారణాసి.

తెలుగులో శతక ప్రక్రియ అత్యంత ప్రాచీనమైనది. 12వ శతాబ్దంలో ప్రారంభమైనప్పటినుంచి ఇప్పటివరకు అసంఖ్యాకములైన శతకములు వెలువడినవి. పద్యం వ్రాయాలనుకునే ఆసక్తికల ప్రతి తెలుగు కవి ప్రారంభ దశలో ఏదో ఒక ఇష్ట దైవాన్ని సంబోధిస్తూ శతకములు వ్రాయడం వల్ల తెలుగులో ఈ శతక వాఙ్మయము బాగా అభివృద్ధి చెందింది. తెలుగు సాహిత్యంలో ''శివకవి యుగాన్ని'' ''శతకావతార యుగంగా'' పేర్కొంటాము.

శతక లక్షణాలు :

సంఖ్యా నియమం, మకుట నియమం, ఛందో నియమం, రస నియమం ఆత్మాశ్రయత్వం, ముక్తకత.

శతకాలు వర్గీకరణ :

భక్తి, నీతి, వాజ్యస్తుతి, హాస్య, అధిక్షేప, వేదాంత, శృంగార, వైరాగ్య, కథాత్మక, తత్త్వ, ప్రకీర్ణ, చారిత్రక, శాస్త్ర సంకలన, ప్రహేళికా, అనువాద, వివిధ వస్తుక శతకములు అని శతక సాహిత్యాన్ని వర్గీకరించవచ్చు. తెలుగు శతక సాహిత్యంలో మొదటగా భక్తి శతకాలే రచించారు. భక్తి శతకాల శాఖ చాలా విస్తృతమైనది. భగవన్నుతి పూరకమైన శతకాలు భక్తి శతకాలు. భక్తి శతకాలలో పాటించబడని శతక లక్షణం సంఖ్యా నియమం. భక్తి శతకాలను శైవభక్తి, వైష్ణవ భక్తి, దేవీభక్తి శతకాలని మూడురకాలుగా వర్గీకరించవచ్చు. దేవీభక్తి శతకాలకు సంబంధించి సరస్వతి స్తుతి శతకాలను గురించి సూక్ష్మంగా పరిచయం చేయడం ఈ వ్యాసం యొక్క ప్రధాన ఉద్దేశ్యం.

సరస్వతి స్తుతి శతకాల పరిచయం :

1. సరస్వతి శతకము : వెండిగటము గురునాథకవి రచించిన ఈ 'సరస్వతి శతకము' రుధిరోద్గారి నామ సంవత్సరము భాద్రపద శుద్ధపంచమి గురువారమునాడు (కీ.శ 1863)లో ''వర్తమాన తరంగిణి'' ముద్రాక్షరశాలలో ముద్రించడం జరిగింది. ఈ శతకంలోని మకుటం ''సత్యవతీ సరస్వతీ''. ఈ శతకము ఆంధ్ర శతక వాఙ్మయమునందలి తొలి శతకముగా ఆంధ్రకవి సప్తశతి కృతకర్త బులుసు వేంకటరామణయ్య మరియు శతకకవుల చరిత్ర కృతికర్త వంగూరి సుబ్బారావులు నిర్ణయించారు. ఈ శతకంలోని ఉత్పలమాల, చంపకమాల ఛందస్సులో పద్యాలు ఉన్నవి. ఈ శతకాన్ని కవి తన అరవై సంవత్సరాల వయస్సులో (తనవార్ధకదశలో) రచించినట్లు తెలుస్తుంది. ఈ శతకంలో 131 పద్యాలు ఉన్నాయి. శబ్దాలంకారాలు, అర్థాలంకారాలు, జాను తెలుగు పదాలు, లోకోక్తులు జాతీయాలు, సంస్కృత సమాసాలు కూడా వాడటం జరిగింది.

2. భారతీ శతకం : బొబ్బిలి సంస్థానంలోని ఆస్థాన కవియైన కొటికెలపూడి కోదండరామకవి (కీ.శ 1807 - 1883) ఈ శతకాన్ని రచించాడు. ఈ శతకంలోని మకుటం ''భారతీ''. ఈ కవి కొటికెలపూడి వేంకటకృష్ణ సోమయాజి నాల్గవ పుత్రుడు. భారతి అనగా సరస్వతి. దేవిని స్తుతిస్తూ రచించిన శతకం ఇది. ఈ శతకంలో కవి భారతీదేవిని స్తోత్రం చేయడంతో పాటు అనేక శాస్త్రాలలోను, రాజనీతి వంటి పరిపాలనా విషయాలలోను తనకు గల గాఢ పరిచయాన్ని తెలిపాడు. బొబ్బిలి రాజవంశంవారు విశిష్టాద్వైతాన్ని అనుసరించేవారు కనుక విశిష్టాద్వైత వేదాంత విషయాలను ఇందులో తెలుపడం విశేషణమని చెప్పవచ్చు.

3. శ్రీ శారదాంబ శతకము : ఈ శతకాన్ని దుగ్గిరాల ప్రాంతానికి చెందిన సత్తెనపల్లి హనుమంతరావు గారు రచించారు. ఈ శతకాన్ని దుగ్గిరాల రైస్మిల్ వారి ఆర్థిక సహాయంతో స్వరాజ్య ముద్రశాలయందు 1925లో కొల్లి

వెంకటసుబ్బారావు గారిచే ముద్రించడం జరిగింది. ఆత్మధర్మనిర్వహణమునకే ఈ శతకాన్ని రచిస్తున్నట్లు కవి ఈ శతక పీఠికలో చెప్పాడు. ''సద్గుణకదంబ జగదంబ శారదాంబ'' అనే మకుటంతో సీసము మరియు కందపద్యాలతో ఈ శతకం రచించాడు.

4. శ్రీ సరస్వతీ శతకము : 'కవి కలహంసి' బిరుదాంకితురాలైన చేబ్రోలు సరస్వతీదేవి తెలుగు కవయిత్రి ఈ శతకాన్ని రచించింది. నూజువీడు గౌరీ ప్రెస్సువారు ఈ శతకాన్ని 1931లో ముద్రించారు. ఇందులో ఉత్పల మాల చంపకమాల వృత్తాలలో 100 పద్యాలు ఉన్నాయి. భక్తిప్రధానమైన శతకం ఇది. శ్రీ సరస్వతీ !' అన్న మకుటంతో ఈ శతకం రచించింది. ఈ శతకంలోని ప్రతి పద్యము శ్రీచందనపు చెక్కవలె రసన్ఫూరణము కలిగియున్నది.

5. భారతీ శతకము : ఈ శతకాన్ని గిడుగు వేంకట సీతాపతి రచించారు. నవ్యసాహిత్య పరిషత్తు, గుంటూరు వారు 1940 లో ప్రచురించారు. ఇందులో ఉత్పలమాల, చంపకమాల ఛందస్సులో 101 పద్యాలు ఉన్నాయి. ఈ శతకంలోని మకుటం ''భారతీ''. వాడుక భాషలోని తియ్యని పలుకుల తీరు, వాటి పరిణామము, ప్రయోగములు మొదలైన విషయాలను ఈ శతకం ద్వారా నిరూపించాడు. లోకవ్యవహారములో మనం నిత్యము వాడే భాషయొక్క సొష్టవాన్ని, ఆ భాషను మహాకవులు తమ గ్రంథాలలో ఏ విధానంగా ప్రయోగించిన విధానాన్ని ఈ శతకములో చూపించాడు. భాషాభివృద్ధిని నిరూపిస్తూ, భాష తనంతట తాను వృద్ధిచెందే రీతిని, ఇతర భాషల సాంకర్యంవల వృద్ధిపొందే రీతిని ఈ శతకం వివరిస్తుంది. తెలుగు పలుకులను మహాకవులు తమ కావ్యాలలో ఏ విధంగా ప్రయోగించినదీ చూపిస్తూ లక్ష్యలక్షణ సమన్వయం ఈ శతకంలో చేయబడింది. సంధి, విసంధి, శకటరేఫ మొదలైన వాటిని గురించి కూడా ఈ శతకము చర్చించింది. భాష తాలూకు స్వరూప స్వభావాలను చాలా సుబోధకంగా ఈ శతకం వివరిస్తుంది.

6. వాసరేశ్వరి శతకము : ఈ శతకాన్ని బ్రాహ్మీ విభూషణ, అవధాని శిరోమణి అష్టావధాని అష్టకాల నరసింహరామ శర్మ గారు రచించారు. కవి బాల్య దశలోనే 1964 సంవత్సరంలో వాసరేశ్వరీ శతకమును ప్రారంభించి 47 పద్యాలు మాత్రమే రచించించారు. మళ్ళీ 1996 సంవత్సరంలో మిగితా శతకము పూర్తి చేశారు. శ్రీ సరస్వతీ యజ్ఞ సేవాసమితి, శ్రీ సరస్వతీ క్షేత్రం అనంతసాగర్, మెదక్ జిల్లా వారు మొదటగా 1997లో ప్రచురించారు. వాసర సరస్వతీ శతక వాఙ్మయమునందు తొలిశతకముగా అష్టకాలవారి వాసురేశ్వరి శతకము ప్రసిద్ధి చెందింది. ఈ శతకంలోని 116 పద్యాలు ఉన్నాయి. మకుటం ''వాసరేశ్వరి''. తల్లిగా వాగ్దేవిని భావించి బాలునిగా తనను చిత్రించుకొని ఆ తల్లి కృపారసం కోసం బహువిధాలుగా స్తుతిచేయడం ఈ శతకంలోని అంతర్నిర్మాణ శిల్పం. జీవుడు, ప్రకృతి, భ్రాంతి, నిత్య సత్యాలు, వాక్చక్తి పారమార్థికత, ధర్మం, శీలం, వ్యక్తిత్వం, శాస్త్రం, యోగం ఇలా ఎన్నో అంశాలను ఈ శతకంలో ఉన్నాయి.

7. శారదాంబ పద్యాలు : ఈ శతకం నల్గొండ జిల్లాకు చెందిన నీల జంగయ్య గారు రచించారు. ''చారుగుణ కదంబ శారదాంబ!'' అనే మకుటం కలిగి ఆటవెలది ఛందస్సులో కవి 516 పద్యాలు రచించాడు. మొదటి ముద్రణ 1982 జరిగింది. ఈ శతకంలోని ప్రతి పద్యం హృద్యంగా ఉన్నది. ఇది నాది అని చెప్పదగిన పదార్థం, ఓ మాటా లేనప్పుడు అదంతా భగవంతునిదే - కవిత్వానిదే అయి ఈ పద్యాలు మీ చేతికి అందాయని ఈ శతక ప్రారంభంలో రచనోద్దేశం - ప్రవేశంలో కవి తెలియజేస్తున్నాడు. కవి ఈ శతకంలో ప్రకృతితత్వాన్ని పరమేశ్వరతత్వాన్ని జీవన విధానాన్ని దర్శించిన తీరు అద్భుతం. ఈ శతకాన్ని నీలా జంగయ్య గారు కల్లూరు నివాసియైన శ్రీ.కె. రాధాకృష్ణయ్యకు అంకితమిచ్చాడు. రచనా సామాన్యంగా సూటిగా సూక్తి బద్ధంగా ఉండి, సుఖావ బోధనగా ఉండవలెనని చెప్పడానికి చేసిన ప్రయత్నమే ఇంత గ్రంథంగా తయారైందని కవి 516 పద్యాలు రాయడానికి గల కారణాలు తెలియజేస్తున్నాడు.

8. వాగధీశ్వరీ శతకము : వాగధీశ్వరీ శతకాన్ని మెదక్ జిల్లా ప్రాంతానికి చెందిన అష్టావధాని జి.యం. రామశర్మ గారు రచించారు. ఈ శతకంలో 108 పద్యాలు ఉన్నాయి. ఈ శతకంలోని మకుటం ''వాగదీశ్వరి''. శ్రీ సరస్వతి క్షేత్రము అనంతసాగర్ వారు 1992లో ప్రచురించారు. ఈ శతకంలో సాహిత్యపు విలువలు, యోగాభినివేశము, తాత్విక చింతన, మెండుగా ఉన్నాయి. ఈ శతకాకృతికి మూలము వాగ్వాదినియైన సరస్వతీ మాతయే కావున అనంతసాగర్వేశ్వరియైన సరస్వతీ మాతృ పదసన్నిధికి ఈ శతకము అంకితం ఇవ్వడం తన పూర్వజన్మ భాగ్యవిశేషంగా కవి భావించాడు. శతక ప్రక్రియకు పూర్వ వైభవం ఆపాదించుటకా అన్నట్లు ఈ ''వాగధీశ్వరీ'' శతకం ఆవిర్భవించింది. ఇందులో భక్తి, నీతి, యోగం, ఆర్తి, విమర్శ మొదలగు తత్వాలన్నీ కలగలిపి సంపూర్ణ రూపాన్ని సంతరించుకొని విలక్షణమైన శైలిలో కవి ఈ శతకరచన చేశాడు.

9. భారతీ శతకము : భారతీ శతకాన్ని పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన వరిగొండ శ్రీరామారావు గారు రచించారు. ఈ శతకం మొదటి ముద్రణ 1994లో జరిగింది. ఈ శతకానికి ప్రతిపద్యం చివరిలో ''భారతీ'' మకుటంతో ముగించాడు. ఈ శతకంలో 108 పద్యాలు వున్నాయి. అందరు శతకకవుల మాదిరిగానే ఈ కవి కూడా భక్తిని ప్రధానంగా తీసుకొని ప్రకృతికి అనుగుణంగా సంఘములో జరుగుతున్న దుష్టత్వమును తెలియచేస్తూ వాటిని రూపుమాపమని భగవతి భారతిని కవి ప్రార్థిస్తున్నాడు.

10. వాసరాంబా నివేదనము : ఈ శతకాన్ని నాగర్ కర్నూల్ ప్రాంతానికి చెందిన వెలుదండ సత్యనారాయణ గారు రచించారు. ఈ శతకం 1994 లో ప్రథముద్రణ జరిగింది. ఈ శతకంలో 105 పద్యాలు ఉన్నాయి. ఇది పద్యమయ శతకము. ఇది హృద్యగేయ శతకం. ''వాసరాంబా నివేదన'' ఆత్మాశ్రయయుక్తంగా, మకుట యుక్తంగా, ముక్తలక్షణోక్తంగా, శతకసంఖ్యాపరిమిత ముక్తకంగా శతకలక్షణ లక్షితమై భాసిస్తున్నది. కాబట్టి ఈ రచన శతక వాఙ్మయానికే చెందినది. ఈ వాసారాంబా నివేదము వస్తువును బట్టి భక్తి శతకాల కోవకు, ఛందస్సును బట్టి గేయ శతకాల కోవకు చెందుతుంది. కాబట్టి ఇది ''భక్తిగేయశతకం''. ఈ కృతి వాసరక్షేత్ర భాసురయైనా సరస్వతీ స్త్యుత్యాత్మకం. సంగీత సాహిత్య విద్యాధి దేవతయైన ఆ తల్లికి చేసిన ''నివేదన''ను సంగీత సాహిత్యాత్మకమైన గేయశతకంగా వెలువరించడంలో వెలుదండవారి ఛందఃప్రయోగ ఔచిత్యం ద్యోతక మౌతున్నది. వాసరాంబా దయావిశేషాన్ని కీర్తిస్తూ మాత్రా ఛందస్సులో సాగిన గేయ శతకం అనవచ్చు. ఇందులో గేయాలన్నీ కూడా వాగ్దేవతా విధేయాలై అలరారుతున్నవి.

11. శ్రీ శారదా స్తవరాజము : అభినవ పోతనగా ప్రసిద్ధి చెందిన వానమామలై వరదాచార్యులు రచించిన స్తవరాజ పంచశతి అనే అయిదు శతకాల సంపుటి పుస్తకంలోని మొదటి శతకమే శ్రీ శారదా స్తవరాజము. ప్రథమ ముద్రణ 1994లో జరిగింది. భక్తి రసామృత భాగీరథిని ప్రవహింప చేసేదే ఈ శారదా స్తవరాజము. వీరి వంశంలో ఏడు తరాల వరకు వీరి ఇంటిలో నివాసం చేస్తానని సరస్వతీ దేవి సెలవిచ్చినట్లు జనశ్రుతి కలదు. వరదాచార్యులవారు తమ 13 ఏటా శ్రీ వాగధీశ్వరీ మంత్రం ఉపాసించి ఆ దేవి సాక్షత్కారము పొంది విద్వత్కవులై విరాజిల్లినారు. ఈ శతక రచన తెలుగులో జరిగినా సంస్కృత శతక లక్షణాలే ఎక్కువగా పాటింపబడినవి. ఛందోనియమం పాటింపబడలేదు. ఉత్పలమాల, చంపకమాల, శార్దూలం తరుచుగానూ, మత్తేభం అరుదుగా ప్రయోగించాడు. ఈ శతకంలో 108 పద్యాలు ఉన్నాయి. ఈ శతకం మొత్తము భక్తిరసం నిండి నిభిడీకృతం అయినది. ఈ శతకంలో అష్టోత్తరసంఖ్య కలదై ప్రత్యేక బావం భక్తి విలసిల్లినది. మకుట నియమం చాలా వరకు అన్నిపద్యాల్లో ఉన్నది. శ్రీ శారదా స్తవరాజములో అక్కడక్కడ ''శారదా! శ్రీ సరస్వతీ!'' అని ఉన్నా పద్యాలన్నిటిలోను ''భారతి'' అన్న మకుటమే ఉండి ''భారతి శతకము'' అనదగియున్నది.

12. వర్ధల్ వాణీ శతకము : వర్తమాన పద్యకవులలో

సుప్రసిద్ధుడైన రాధశ్రీ గారు ఈ శతకాన్ని రచించారు. కలం పేరుతో సాహిత్యలోకానికి పరిచితుడైన ఇతని అసలు పేరు దిడుగు అనంత వేంకట రాధాకృష్ణ ప్రసాద్. మొదటి ముద్రణ శ్రీ విద్య సరస్వతి శనైశ్చ దేవాలయం, వర్గల్, మెదక్ జిల్లా వారు 2002లో ప్రచురించారు. సమకాలీన సమాజ ప్రతిబింబంగా వివిధ లోకరీతులను, నీతులను వివరిస్తూ, దశావతారాల అవతారలక్ష్యాలను, తెలుగుపద్య విద్యాభిమానాన్ని శతకాల నిండా కవి ప్రవహింపచేసాడు. ఈ భక్తి సుమహార శతకంలో 110 పద్యాలు ఉన్నాయి. వర్గల్ క్షేత్రం అత్యంత సనాతనమై, నిత్య వినూతనమైన ఎందరెందరో సాధువులకు, సిద్ధపురుషులకు తపోభూమిగా ప్రసిద్ధికెక్కింది. అందుకే కవి ఈ క్షేత్రానికి చెందిన మహనీయ మూర్తులనందరిని వినమ్రంగా ఈ శతకంలో కీర్తించాడు.

13. ఏకప్రాస బాసర సరస్వతీ శతకము : ఈ శతకాన్ని సిద్ధిపేటకు ప్రాంతానికి చెందిన ఉమాపతి బాలాంజ నేయశర్మ గారు రచించారు. మొదటి ముద్రణ 2004లో జరిగింది. ఈ శతకము ఏకప్రాసలో రచించడం జరిగింది. 'వాసరవాసినీ ప్రధిత వాగ్వరదాయిని! శ్రీ సరస్వతీ' అనే మకుటంతో ఫలశ్రుతితో కలుపుకొని ఈ శతకంలో 108 పద్యాలు ఉన్నాయి. వాసర సరస్వతీ అమ్మవారి కరుణ కలిగి ఈ శతకం రచించిడానికి ఆ తల్లి యొక్క ప్రేరణే అని కవి ఈ శతకం ముందుమాటలు 'మనవి'లో చెప్పుకున్నారు. శ్రీ బాసర సరస్వతీ అమ్మవారిని స్తుతిస్తూ రచించిన శతకం ఇది.

14. చదువులమ్మ శతకం : కరీంనగర్ జిల్లాకు చెందిన తెలుగు ఉపాధ్యాయులు కుకట్ల తిరుపతి గారు ఈ శతకాన్ని రచించారు. లక్ష్మిసాయి ప్రచురణలు, మద్దిగుంట కరీంనగర్ వారు 2006లో మొదటిసారిగా ఈ శతకాన్ని ప్రచురించారు. ఈ శతకాన్ని కవి ఆటవెలది పద్యాలతో రచించారు. ''చక్కజేయుమమ్మ చదువులమ్మ'' అనే మకుటంతో 118 పద్యాలుగల శతకము ఇది. ముందుగా కవి ఈ శతకంలో తనయొక్క వంశావళిని కూడా సంక్షిప్తంగా పొందుపరిచారు. శతక ఆరంభంలో విఘ్నేశ్వర స్తుతి, ఇష్ట దేవత స్తుతి, గురుస్తుతి, తల్లిదండ్రుల స్తోత్రం లాంటి ప్రాచీన శతక లక్షణాలు పాటించాడు. సంప్రదాయ పద్య రచనా పద్ధతిని పాటిస్తూ ప్రారంభంలో ''శ్రీ సరస్వతమ్మ శీఘ్రము రావమ్మా'' అంటూ శ్రీకారముతో ఈ శతకాన్ని ఆరంభించాడు. వస్త్వాశ్రయ పద్యాలే ఎక్కువగా ఉన్నాయి. ముక్తక లక్షణాన్ని చక్కగా పాటించారు. శతకం చివరలో ఫలశ్రుతిని సైతం కోరడం మనకు కనిపిస్తుంది. ఈ కవి ఈ శతకం ద్వారా తనకేమి కోరక తన విద్యార్థులకు, సమాజానికి, దేశానికి తరువాత తరానికి శుభం జరగాలని కోరుకున్నాడు.

15. శ్రీ బాసర సరస్వతి శతకము : ఆదిలాబాద్ జిల్లాకు చెందిన తెలుగు భాషోపాధ్యాయులు డి.యల్.యన్.చారి గారు రచించారు. ఈ శతకం ఆటవెలది ఛందస్సులో 108 పద్యాలు ఉన్నాయి. బాసర సరస్వతీ అమ్మవారికి ఈ శతకం అంకితం ఇచ్చాడు కవి. మకుటం ''రక్ష వాసరాంబ రక్ష నీవే''. 2013లో ఈ శతకాన్ని ప్రచురించారు. ఇది భక్తి, నీతి ప్రభోదిత శతకము. శతకలక్షణాలను పాటిస్తూ విఘ్నేశ్వర స్తుతితో ప్రారంభించి, ఇలవేల్పు శ్రీ లక్ష్మినరసింహస్వామిని ప్రార్థించి, ఇష్ట దేవతలు ఆది శంకరుడు, శిరిడిసాయి, అయ్యప్ప స్వామి, ఆంజనేయ స్వామిని ఆటవెలదిలోనే అర్చించాడు. ''శ్రీకరంబుతోడ సిరులెన్నొ గురియించ'' అంటూ శ్రీకారముతో ఈ శతకాన్ని ఆరంభించాడు. పండిత పామర జనులలో ఆలోచనా శక్తిని రేకెత్తించే సమాజంలోని సార్వజనీనమైన అనేక అంశాలను కవి ఈ శతకంలో ప్రస్తావించాడు.

16. వాణీ శతకము : సిద్ధిపేట జిల్లా చిన్నకోడూర్ సమీపాన ఉన్న ప్రసిద్ధ అనంతసాగర క్షేత్రంలో వెలసిన మహిమాన్విత సరస్వతి మాతను స్తుతిస్తూ అదే జిల్లాకు చెందిన రచయిత్రి ఎం. జలజారాణి గారు ఈ శతకాన్ని రచించారు. ''వీణ చేత బట్టి వాణి నిలిచే'' అనేది ఈ శతకంలోని మకుటం. ఇందులోని ఆలవెలది ఛందస్సులో 101 పద్యాలున్నవి. శ్రీ సరస్వతీ సేవా సమితి, అనంత

సాగర్, సిద్ధిపేటవారు 2014లో మొదటిసారిగా ఈ శతకాన్ని ప్రచురించారు. సరస్వతీ మాత కొలువుదీరిన అనంతసాగర్ క్షేత్ర వర్ణనతో ఈ శతకం ప్రారంభమవుతుంది. భారతీయతకు నిదర్శనాలు, సౌభాగ్యాలైన సత్యం, ధర్మం, సహనం, సంస్కృతులు, చిరకాలం వర్ధిల్ల జేయటానికి మరియు వాక్కుకు మూలమైన వర్ణమాలలో దాగి తనను వర్ణన జేయడానికా అన్నట్లు అమ్మవారు ఈ క్షేత్రంలో స్థిరీకృతమైనదని ఈ శతకంలో వివరించారు. శబ్దాలంకారాలు కూడా ఈ శతకంలో ఉన్నాయి. ఈ విధంగా ప్రతి పద్యము భక్తి రస స్ఫోరకమై విరాజిల్లుచున్నది.

17. శ్రీశ్రీశ్రీ వాసరంబ స్తుతి శతకము : ఈ శతకాన్ని కరీంనగర్ జిల్లా ప్రాంతానికి చెందిన దేవరం సతీశ్ రచించాడు. మొదటి ముద్రణ 2017 జరిగింది. ఇది భక్తి ప్రధానమైన శతకము. చదివిన పాఠకుడికి, వ్రాసిన కవికి ఒకే విధమైన అనుభూతి కలిగించుననుటలో సందేహము లేదు. దాదాపు 222 ఆటవెలది పద్యాలలో ''వాసరాంబ నీకు వందనంబులు'' అను మకుటములో సాగిన అత్యంత రమణీయంగా, కమనీయంగా ఆ దేవిని స్తుతించిన శతకము. ఇది కావ్యము వలె సాగినది. మొదట అవతారికగా స్వపరిచయము, నతులు వినతులు, నామాట, శుభాభివందనములు, అంకితం తరువాత శతకము పరిచయము నుండి విన్నపము వరకు పది భాగములుగా విభజించుకుని అమ్మవారిని స్తుతించాడు. ఇది శతకములలో ఒక నూతన ప్రక్రియ అని అనవచ్చు. ''పరిచయము'' తర్వాత సూచ్యకములు శీర్షికలో అమ్మవారి పుస్తకము, వీణ, జపము, కమలముల గురించి చక్కగా వివరించాడు.

18. వాగ్దేవతా శతకం : ఈ శతకాన్ని మెదక్ జిల్లాకు చెందిన అష్టావధాని అవుసుల భానుప్రకాశ్ రచించారు. ప్రథమ ముద్రణ జనవరి 2019లో జరిగింది. ఈ శతకంలోని ఒక్కొక్క పద్యం మకరంద బిందువు. ముత్యాల మాటలను కలబోసి, సువర్ణమాలలో బిగించిన కంఠాభరణమే ఈ వాగ్దేవతా శతకం. ఆశతో, ఆవేదనతో, ఆతురతతో రచించిన పద్యాలే ఈ శతకంలో అడుగడుగునా ఉన్నాయి. ''వాగ్దేవతా'' అను మకుటంతో ఈ శతకంలో 108 పద్యాలు ఉన్నాయి. మత్తేభ శార్దూలాల్లో అనే రూపాలో అమ్మవారిని ఆరాధించాడు. వాగ్దేవతా శతకంలో ఆరాధనా భరితమైన అమ్మ సంపూర్ణరూపం ద్యోతకమౌతుంది. ఈ శతకంలోని పద్యాలన్నీ శబ్ద సౌందర్యంతో శోభిస్తూ, ధారాశుద్ధితో పరుగులు తీస్తూ, పఠితలను నిర్వ్యాజ్యంగా ఆనందింపజేసిస్తాయి. పద్యాలలో కవి తమ ఆకాంక్షలను వినయంగా అమ్మకు నివేదించుకున్నాడు. ప్రతి పద్యం సారస్వత మయమే వేరు వేరు ప్రదేశాల్లోని అష్టాదశ శక్తి స్వరూపిణిగా కొలుస్తూనే, సరస్వతీ దేవి ఆభరణాలను, హస్తంలోని పుస్తకాదులను అన్నింటినీ ప్రత్యేకంగా కొలిచి నమస్కరించాడు.

19. శారదాంబ శతకము : మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన రావూరి వనజ గారు ఈ శతకాన్ని రచించారు. ఈ శతకంలో 108 పద్యాలు ఉన్నాయి. తెలుగు సాహితీ పీఠము, హైద్రాబాద్ వారు 2019 ప్రచురించారు. ''సకల కళల రాణి శారదాంబ'' అనే మకుటం గ్రహించి నిర్మల హృదయంతో జ్ఞానదేవతను స్తుతిచేస్తూ వ్యక్తి వికాసం నిమిత్తం, కుటుంబ పటిష్టత నిమిత్తం, సమాజంలో చైతన్యం నిర్మించే నిమిత్తం, నైతిక విలువలు ప్రతిష్టించే నిమిత్తం, అనుశాసనయుత జీవితం ఆవశ్యకత తెలిపే నిమిత్తం విదుషీమణీ శ్రీమతి రావూరి వనజ గారు ఈ శతకాన్ని రచించారు. రచయిత్రి వనజ గారు ఆటవెలది పద్య పుష్పాలను వికసింపజేసి పరిమళాల సుగంధాలను పదుగురికి పంచి సమాజంపట్ల తనకున్న బాధ్యతాయుతను చాటుకున్నారు. కర్షక జీవితం, వృక్షాలు, పర్యావరణ పరిరక్షణ, పద్య ప్రభావం, మాతృ భాషా ప్రాశస్త్యం, సదాచారాల వాళ్ళ కలిగే లాభాలు, ఓటు విలువ, ఇలా ఎన్నో ఆధునిక జీవనానికి మార్గదర్శనం చేసే అంశాలను ఈ శతకంలో స్పృశించారు. ఈ శతక రచయిత్రి పద్యాలలోనూ సామెతలా లాంటి పాదాలు కనిపిస్తాయి.

20. శ్రీ శారదాంబ శతకము : ఈనాడు, ఆంధ్రప్రభ దినపత్రికలలో ఉప సంపాదకుడిగా పనిచేసిన గుంటూరు ప్రాంతానికి చెందిన పిన్నలై వెంకట రామ్ గోపీనాథ్ గారు ఈ శతకాన్ని రచించారు. ఇందులో 104 పద్యాలు ఉన్నాయి. ఈ శతకాన్ని శ్రీమతి నమ్మి మధుబాల ప్రోత్సాహంతో 2019 మొదటిసారిగా ప్రచురించారు. "విద్యాకన్న గొప్ప విత్తమేది?!" అటువంటి గొప్ప విత్తాన్ని మాకిచ్చి "సాకుమమ్మ మమ్ము శారదాంబ" అంటూ అద్భుతంగా శారదాంబను స్తుతిస్తూ ఈ శతకాన్ని కవి ఆటవెలది ఛందస్సులో రచించారు. చక్కని ధారతో చిక్కటి భావంతో ద్రాక్షాపాకములో ఈ శతకాన్ని రచించాడు. కవి ఈ శతకంలో సరస్వతీదేవికి గల ద్వాదశ నామ స్తోత్రంలో నామాల విశిష్టతను గురించి వివరిస్తూ పద్యాలు రచించాడు. అవి వరుసగా వాక్కు, సరస్వతీ, శారదా దేవి, హంసవాహన, జగతిఖ్యాతం, వాగీశ్వరి, కౌమారి, బ్రహ్మచారిని, బుద్ధిధాత్రి, వరదాయిని, క్షుద్రఘంట, భువనేశ్వరి. ఆ తర్వాత సరస్వతీ అష్టోత్తర శతనామాలి నామాలు తీసుకొని వాటిని గురించి వివరిస్తూ ఒక్కో పద్య రచించాడు.

21. శ్రీ జ్ఞానసరస్వతి శతకము : స్వామీ సర్వేశ్వరానంద ఉదాసీన గారు జ్ఞాన నరస్వతీ దేవిని స్తుతిస్తూ మే, జూన్ 2019 మధ్యకాలంలో యంచ విఠలేశ్వరాలయంలో ఈ శతకాన్ని రచించారు. ఈ శతకంలో బ్రహ్మాండపురాణంలో చెప్పబడిన అష్టోత్తరశతనామావళిని సంగ్రహించి, నామార్థములను స్ఫురింపజేయుచు, భక్తిరసప్రధాన, మకుటరాజిత, సకారప్రాసాలంకృత, తాత్పర్య సహితముగా, ఈ శతకాన్ని రచించాడు. "వ్యాసపురాధివాసిని! సుహాసిని ! జ్ఞానసరస్వతి! నమో!" అనే మకుటరాజితముగా, ఉత్పలమాలా ఛందోరీతిలో ఈ శతకాన్ని రచించాడు. ఈ శతకంలో 111 పద్యాలు ఉన్నాయి. సాహిత్య కళ్యాణిక శ్రీ విఠలేశ్వరాలయం, యంచ గ్రామం, నవీపేట మండలం, నిజామాబాదు జిల్లా వారు శ్రావణమాసం 2019 మొదటిసారిగా ప్రచురించారు. ఈ శతకాన్ని శ్రీ జ్ఞాన సరస్వతీ దేవీ అమ్మవారి ఆలయంలో 27-07-2019న ఆవిష్కరించారు.

22. శ్రీ వాసర జ్ఞాన సరస్వతీ స్తవం (పద్య శతం) : శ్రీ వాసర జ్ఞాన సరస్వతీ స్తవం (పద్య శతం)ని నిర్మల్ జిల్లాకు చెందిన జాతీయ ఉత్తమ తెలుగు ఉపాధ్యాయులైన మడిపల్లి భద్రయ్య గారు రచించారు. ప్రథమ ముద్రణ 2019 జరిగింది. ఈ శతకంలో 111 కంద పద్యాలుకాగా, భారతీస్తుతి పేరిట 24 కందాలున్నాయి. సాధారణంగా స్తవాల్లో (స్తోత్రాల్లో) భగవంతుని (భగవతి) గుణవర్ణన, లీలావర్ణన, ఉంటుంది. ఈ రొండిటితోపాటు ఈ కవి ఆత్మ నివేదన కూడా ఇందులో చేర్చారు. ఈ శతకాన్ని అమ్మ యొక్క దయామృత ధారలని నాపై మరియు జిజ్ఞాసువులయిన వారందరిపై కురియుటకై ప్రార్థించ నైనది. ఇది భక్తి ప్రపత్తులతో వ్రాసినదే కానీ మరో తీరు కాదని రచయిత పుస్తకము ముందుమాటలలోని "ప్రణుతి" లో తెలియయజేశారు. శ్రీ వాసర జ్ఞాన సరస్వతీ స్తవం కూడా అమ్మవారి స్తుతే! అయితే ఇందులో స్తుతి ఉంది, వేదన ఉంది. లోకం పోకడ ఉంది, ఆత్మా నివేదన ఉంది. ఆత్మాశ్రయమైన సరళశైలిలో కందాలను అందించి కవి చదువులతల్లిని మన కళ్ళముందు నిలిపాడు.

అలభ్య సరస్వతి శతకములు :

1. జ్ఞాన సరస్వతీ శతకము - కర్రి శ్యామసుందరం రావు, 2. భారతీ శతకము - జోశ్యుల సూర్యనారాయణ మూర్తి, 3. భారతీ శతకము - కొండూరి నరసింహమూర్తి, 4. వాణీ శతకము - వెలగా వెంకటప్పయ్య, 5. సరస్వతీ శతకము - గోవిందుల శ్యామసుందరి చారి, 6. బాసర సరస్వతీ శతకం - చిల్లర భావనారాయణరావు, 7. శారదా శతకము - భమిడిపాటి రామమూర్తి, 8. శారదా శతకము - వకలంక శ్రీనివాసరావు, 9. శ్యామలాంబా శతకము - మల్లంపల్లి మల్లికార్జున పండితుడు, 10. శ్రీ శారదా శతకము - సంకా సత్యవతమ్మ, 11. శ్రీ వాణి శతకము - లక్ష్మీపతి, 12. శ్రీ వాణి శతకము - మల్లాది నరసింహ మూర్తి.

అముద్రిత శతకం : శ్యామలాంబ శతకం - సత్యవోలు సోమసుందరకవి

ఈ విధంగా ఎందరో కవులు వాగ్దేవతను, అమ్మవారి వైభవాన్ని, వర్ణిస్తూ ప్రత్యేకించి శతకాలు రచించారు. ఈ శతకాలన్నిటిలో ఒక్కో శతకంలో ఒక్కొక్క విశేషం కనిపిస్తుంది. శతకసాహిత్యంపై మక్కువ ఉన్నవారు కేవలం సరస్వతీ అమ్మవారి గురించి వచ్చిన శతకాలపైన మంచి పరిశోధన చేయవచ్చు.

ఆధార గ్రంథాలు :

1. వంగూరి సుబ్బారావు - శతక కవుల చరిత్రము, (మొదటి ముద్రణ) 1924
2. వేదం వెంకటకృష్ణశర్మ - శతక వ్మాయ సర్వస్వము, 1954
3. వంగూరి సుబ్బారావు - శతక కవుల చరిత్రము, (రెండవ ముద్రణ) 1957
4. కోవూరు గోపాలకృష్ణారావు - ఆంధ్ర శతక సాహిత్య వికాసము, 1976

BHAVAVEENA
Vol. 18, Issue. 10, October 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

తెలుగు సినిమాపాటల్లో జాన'పద సౌందర్యం'

- తిరునగరి శరత్‌చంద్ర, పరిశోధక విద్యార్థి, తెలుగుశాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం

ఆధునికయుగంలో అభ్యుదయపథంలో పయనిస్తున్న మానవుడిపై అత్యంత ప్రభావాన్ని చూపుతున్న అద్భుతశక్తి "సినిమా". అగర్భశ్రీమంతుడి నుండి అతి సామాన్యుడి దాకా అందరికీ అందు బాటులో ఉన్న వినోద సాధనం సినిమా ఒక్కటే. సినిమా అనే పదం 'కినెమా' అనే గ్రీకు భాషా పదం నుండి పుట్టింది. కినెమా అంటే 'పురోగ మించడం' అని అర్థం. తెలుగు సినిమాల్లో భక్తి, ప్రబోధం, వినోదం, ప్రణయం మొ॥ అంశాల దృష్ట్యా ఎన్నో పాటలు వచ్చినా జానపదగీతాలకున్న బలమైన ముద్ర మరే ఇతర ప్రక్రియకూ లేదనే చెప్పాలి. అలాగే యథాతథంగానో, పాక్షికంగానో సినిమాల్లో జానపదలంత విరివిగా ఉపయోగించిన ఇతర ప్రక్రియలు లేవు. కీర్తి ప్రతిష్ఠలకోసం ఆశించని జానపదకవుల గీతాలు కొన్ని సినిమాల్లో కవుల సొంతమైతే కొన్నింటిలో మాత్రం నిజాయితీగా "పాత జానపదగీతాలు" అని స్పష్టంగా పేర్కొన్నారు.

సినిమాపాట సంగీత, సాహిత్య సమ్మేళనం. కొన్ని సందర్భాల్లో సన్నివేశం కూడా ప్రాణం పోస్తుంది. మనిషి జీవన నడవడిలో, అతడు దిద్దుకున్న సంస్కృతి సంప్ర దాయాల ఒరవడిలో సమాజహితాన్ని ఆశిస్తూ మనకు సినిమా పాటలు కన్పిస్తాయి, సినిమాపాటల్లో భక్తి, ప్రణయం,ప్రబోధం, వినోదం, విషాద గీతాలెన్నో ఉన్నప్పటికీ జానపదగీతాలనగానే మనసెందుకో ఆనందంతో పరవళ్లు తొక్కుతుంది. అందులోని పదసౌందర్యం.పోహళింపే బహుశా అందుకు కారణమై ఉండవచ్చు. అయితే సందర్భాన్ని బట్టి భక్తి ప్రబోధం, విషాదం, ప్రణయం, వ్యంగ్యం వంటి అంశాల దృష్ట్యా రచించబడిన జానపదగీతాలను కూడా మనం వింటూ ఉంటాం. అంశం ఏదైనా జానపదగీతమనగానే పల్లెసౌందర్యం, యాన, నుడి మనల్ని ఇట్టే ఆకట్టు కుంటుంది. అలాంటి గీతాలెన్నో మన వెండితెరపై గజ్జెకట్టి నాట్యమాడాయి. జనుల హృదయవేదికలపై చిందు లేశాయి. ఇంచుమించుగా సినిమాపాటల్లో ఎక్కువ గీతాలపైన జానపద ముద్ర ఉంది. జానపదగీతాన్ని విశ్లేషించడమంటే మహాసముద్రాన్ని మధించడమే. అందుకే ఈ వ్యాసం దృష్ట్యా కొన్ని జానపదగీతాల్ని గూర్చి మాత్రమే చర్చించుకుందాం.

తెలుగు సినిమాటాకీ 1931 లో ప్రారంభమైనప్పటి నుండి జానపదగీతాలు సినిమాల్లో పరిమళాలు వెదజల్లుతూనే ఉన్నాయి. ముఖ్యంగా తొలిదశకం నుంచి 1980 దశకం వరకు ఎక్కువగా జానపదగీతాలు రాసిన సినీగేయరచయితగా కొసరాజు రాఘవయ్యచౌదరి పేరు చెప్పుకోవచ్చు, సినీకవుల్లో "జానపద కవి సార్వభౌముడు" అన్న బిరుదును సార్థకం చేసుకున్నాడు.

1939 సం॥లో "రైతుబిడ్డ" సినిమా కోసం కొసరాజు రాసిన "సై సై చెన్నాపరెడ్డి నీ పేరే బంగారపు కడ్డి" లాంటి వీరరసాన్ని ప్రబోధించిన జానపదగేయాలునప్పటకీ అవి జానపదముద్ర నుంచి పూర్తిగా మారి వచ్చినవిగా చెప్పుకోవచ్చు.

'చిల్లరదేవుళ్లు' (1977) సినిమాలో తెలంగాణ ప్రాంతానికి చెందిన "శ్రీ లక్ష్మీ నీమహిమలూ గౌరమ్మా చిత్రమై తోచునమ్మా" అనే భక్తిగీతం జానపదుల నోట నాట్యమాడినదే. నాటి నుండి నేటిదాకా స్త్రీలు పాడుకునే ప్రత్యేకమైన గీతంగా దీనిని గమనించవచ్చు.లక్ష్మీ పార్వతి సరస్వతులకభేదం చెప్పడం ఈ పాటలోని విశేషం. ఇంకా ఈ చిత్రంలోనే "ఏటికేతాంబట్టి ఎయిపుట్లు పండించి ఎన్నడా మెతుకెరగనన్నా!" అనే శ్రామికగేయం ఏడాది పొడవునా ఏటికేతమేసి నీరుతోడి పండించిన పంట తనదాకా రాకుండా భూస్వామి పట్టుకుపోతే నిలువెల్ల కుంగిపోయి, నీరసించి, నిస్సహాయుడై ఈ బ్రతుకు

బ్రతకడం కంటే పుట్టినప్పుడు చస్తే బాగుండునని కుమిలిపోతున్న రైతు కూలీని ఈ పాట మన కళ్లముందుంచుతుంది. శ్రామికగేయాల జాబితాలోను, ముఖ్యంగా జానపద గీతాల వరుసలోను అగ్రేనర స్థానంలో నిలిచిన పాట ఇది. ఈ జానపదగీతాలన్ని యథాతథంగా సినిమాల్లోకి వచ్చినవే. ఇవి అత్యంత ప్రజాదరణ పొందిన జానపదగేయాలు కావడంతో యథాతథంగా వీటిని సినిమాల్లో వాడుకోవడం జరిగింది.

ఆ తరువాతి దశకంలో స్వల్ప మార్పులతో రాసిన జానపదగీతాలెన్నో సినిమాల్లో చోటు చేసుకున్నాయి. మచ్చుకు "దొంగరాముడు" సినిమాకోసం కొసరాజు రాసిన "రావోయి మా ఇంటికి మావా మాటున్నది మంచి మాటున్నది" అనే పాట స్వల్పమార్పులతో ప్రయోగించిన జానపదగీతంగా చెప్పుకోవచ్చు, జానపదగేయాల్లోని పల్లవులందుకుని ప్రాణం పోసుకున్న సినిమాపాటలనేకం

ఉన్నాయి. అందులో ముఖ్యంగా సి. నారాయణరెడ్డి రాసిన ముత్యాలముగ్గు (1975) సినిమాలోని

"గోగులుపూచె గోగులుపూచె ఓ లచ్చగుమ్మడి
గోగులు దులిపే వారెవరమ్మా ఓ లచ్చగుమ్మడి"

పల్లవితో ప్రారంభించి

"పొద్దుపొడిచే పొద్దుపొడిచే ఓలచ్చగుమ్మడి
పుత్తడి వెలుగులు కొత్తగ మెరిసే ఓ లచ్చగుమ్మడి"

అనే తన స్వతంత్ర పదబంధాల్ని జానపదపల్లవికి అద్ది పదసౌందర్యం పెంచాడు.

"రోజులు మారాయి" (1955) సినిమాలో కొసరాజు రాసిన జానపదగీతం నేటికీ ఏనాటికీ అజరామరమై అలరారుతుంది.

"ఏరువాకా సాగారోరన్నో చిన్నన్న
నీ కష్టమంత తీరునోరోరన్నో చిన్నన్న
నవధాన్యాలను గంపకెత్తుకొని
చద్దియన్నమును మూటగట్టుకొని..." ॥ఏరువాకా॥

ఇందులో ధాన్యం గంపకెత్తుకోవడం, అన్నం మూట గట్టుకోవడం మొ॥ వన్ని ఏరువాక సాగుతున్న రైతును కళ్లముందుంచుతున్నాయి. జానపదస్పర్శ సుమనోహరంగా ప్రతిఫలిస్తున్న గీతంగా దీన్ని చెప్పుకోవచ్చు.సినీ జానపద గీతాల్లో ఈ పాట పదిలంగా చిరస్థాయిగా నిలిచిపోతుంది.

ఇంకా "అమ్మమాట" (1970) సినిమాలో సి.నారాయణరెడ్డి రాసిన జానపద గీతాన్ని కూడా విశేషంగా చెప్పుకోవచ్చు.

"మాయాదారి సిన్నోడు - నా
మనసేలాగేసిండు నా మనసేలాగేసిండు
లగ్గమెప్పుడురా మావా అంటే
మాగమాసం యెల్లేదాకా మంచిరోజులేదన్నాడే"

తెలంగాణ మాండలికంలో రాయబడిన ఈ పాట తెలుగుదేశమంతటా మారుమ్రోగింది. భాష, భావం, సంగీతం మూడింటితో అల్లుకుపోయి, మన హృదయాలను పెనువేసుకుందీపాట. లగ్గం, పానాలు వంటి తెలంగాణ మాండలిక పదసౌందర్యం ఈ పాటల్లో ప్రధానమైనవిగా చెప్పుకోచ్చు. ఇంకా నారాయణరెడ్డి రాసిన "జీవితం" చిత్రంలోని

"మామిడి తోపుల్లోనా మాపటేల మాటేసి
సిక్కుడు పాదుకాడ సీకటేల పట్టేసి
సెప్పలేని రుచులెన్నో చిటికెలోన చూపించి
మాయచేసి పోతివిరో నాగులు "

అనే పాట కూడా ప్రత్యేకమైన జానపదగీతంగా చెప్పుకోవచ్చు. ఇందులో కూడా తెలంగాణ భాషా సౌందర్యం గుబాళిస్తుంది. జానపదముద్ర ప్రత్యేకంగా దర్శనమిస్తుంది.

గుండమ్మకథ (1962) చిత్రంలోని పింగళి నాగేంద్ర రావు రాసిన

"కోలోకోలోయన్న కోలో నా సామీ

కోమ్మలిద్దరు మంచిజోడు" అనే గీతాన్ని కూడా ప్రత్యేకమైనదిగా పేర్కొనవచ్చు. ఇద్దరు యువతులను ఉద్దేశిస్తూ కథానాయకుడు పాడే హుషారైన గీతమిది.

జానపదముద్రతో పింగళి నాగేంద్రరావు రాసిన గీతాల్లో ఆణిముత్యమిది. ఇంకా దసరా బుల్లోడు (1971) సినిమాలో ఆచార్య ఆత్రేయ రాసిన

"పచ్చగడ్డి కోసేటి పడుచుపిల్లో
నీ పైట కొంగు జారిందే గడుసుపిల్ల" అనే పాట శృంగారగీతమైనా జానపద సౌందర్యం ధ్వనించి, ఎక్కడా అశ్లీలతకు తావివ్వని తీరు కన్పిస్తుంది. ఇంకా 'ప్రేమనగర్' (1971) సినిమాలోని

"కడవెత్తుకొచ్చింది కన్నెపిల్లా
అది కనబడితే చాలు నా గుండెగుల్లా" అనే పాట కూడా నిర్మలమైన జానపదత్వాన్ని ప్రకాశింపజేసే ప్రణయగీతంగా వినుతికెక్కింది. ఇంకా మేలుకొలుపు గీతాల్లో కూడా జానపద ముద్ర ప్రత్యేకంగా కన్పించినవెన్నో ఉన్నాయి. కాని, సినిమాపాట కోసం కొన్ని మార్పులు కూడా ఇందులో చోటు చేసుకోవడం ఇక్కడ విశేషాంశంగా చెప్పుకోవచ్చు. జానపదమాతృకనూ సినిమా పాటను ఒకేసారి పాడుకుంటే పోలికలు స్పష్టమవుతాయి. ''మంగమ్మగారి మనవడు'' (1984) సినిమాకోసం సి.నారాయణ రెడ్డి రాసిన..

"శ్రీ సూర్యనారాయణా మేలుకో- మా
చిలకమ్మ బులపాటమూ చూసిపో" అనే పాటకు జానపద మాతృక....

"శ్రీ సూర్య నారాయణా మేలుకో
హరి సూర్యనారాయణా మేలుకో" అనే పాట

'ఇంకా "తెల్లవారవచ్చె తెలియక నా సామి" (చిరంజీవులు), ''ఎల్లమంద కోటయ్య ఏలుకో ఏలుకో'' (కన్నెవయసు) మొ॥ గీతాలను మేలుకొలుపు గీతాలుగా పేర్కొనవచ్చు.

తాత్త్విక స్పర్శ కల్గిన జానపదగీతాలు కూడా తెలుగు సినిమాల్లో చోటు చేసుకున్నాయి.

"ఇల్లు ఇల్లనియేవు ఇల్లు నాదనియేవు
నా ఇల్లు యెక్కడే చిలుకా" అనే గీతాన్ని "కన్యాశుల్కం" చిత్రంలో ప్రయోగించారు. విశేషమేమిటంటే ఇది గురజాడ అప్పారావు రాసిన కన్యాశుల్కం నాటకంలోని తత్త్వమే. ఇలాంటి తాత్త్విక స్పర్శ కల్గిన జానపదగేయాలెన్నో మన తెలుగు సినిమాపాటల్లో కన్పిస్తాయి. అది ఏ స్పర్శ కల్గిన అందులో జానపదముద్ర మాతృకంగా పదిలంగా కన్పించడం విశేషంగా చెప్పుకోవచ్చు.

ఇంకా.. సంవాదాలు కూడా జానపదగీతాల్లో దర్శనమిస్తాయి. "మానవుడు దానవుడు"(1972) సినిమాలో ఉషఃశ్రీ రాసిన " కొప్పు చూడు కొప్పందం చూడు" గీతాన్ని ప్రత్యేకంగా చెప్పుకోవచ్చు. ఇంకా " కోడలా కోడలా కొడుకు పెళ్లామా" " ఒకరికి చేతులిచ్చావ్ ఒకరికి కాళ్లానిచ్చావ్" మొ॥ సంవాదయోగ్యంగా రాసిన జానపదగీతాలుగా చెప్పుకోవచ్చు. ఇంకా.. "అత్తా ఒకింటి కోడలే" చిత్రం కోసం ఆరుద్ర రాసిన

"మాయదారి కీచులాట మా మధ్య వచ్చింది
రాయబారం సెయ్యవే తడికో తడికా" ఇది జానపద గేయాల్లో ప్రసిద్ధి పొందిన ''తడిక రాయబారం''కు సంబంధించినది.భార్యాభర్తల మధ్య చిన్న కీచులాట వస్తుంది ఇంట్లో ఇంకెవ్వరూ లేకపోవడంతో వారి మధ్యనున్న తడికే వాళ్లకు రాయబారి అయింది. ఆ గేయాన్ని కొంత మార్పులతో ఆరుద్ర సినిమాలో ప్రయోగించాడు. ఇలా భార్యాభర్తల సంవాదాలు, బావా మరదళ్ల సంవాదాలు, ఆడపడచుల సంవాదాలు మొ॥వి మనకు జానపద గీతాల్లో కన్పిస్తాయి. ఇంకా ''కాశీకి పోయాను రామా హరే గంగ తీర్థంబు తెచ్చాను రామా హరే" అనే "అప్పచేసి పప్పుకూడు' సినిమాలోని పింగళి నాగేంద్రరావు రాసిన హాస్య స్ఫోరకమైన గీతం. ఖైదీబాబాయ్ సినమాలో సినారే రాసిన

"ఓ బాబూ
బయ స్కోప్ పిల్లొచింది" అనేగీతం, అక్కాచెల్లెలు (1970) సినిమాలో ఆత్రేయ రాసిన ''పాండవులు పాండవులు తుమ్మెద'' అనే గీతం, "అదృష్టవంతులు"

(1969) సినిమాలో ఆరుద్ర రాసిన "చింత చెట్టు చిగురు చూడు చిన్నదాని పొగరుచూడు" అనే గీతం, జీవన జ్యోతి సినిమాలో సినారె రాసిన "సిన్ని ఓ సిన్నీ" అనే గీతం, వెలుగునీడలు (1961) సినిమాలో శ్రీశ్రీ రాసిన "ఓరంగయో పూలరంగయో" అనే గీతం, దేవుడు చేసిన పెళ్లి (1975) సినిమాలో దాశరథి రాసిన 'సూదిలో దారం సందులోబేరం' అనే గీతం. శుభోదయం (1980) సినిమాలో వేటూరి సుందరరామ్మూర్తి రాసిన "కంచికి పోతావ కృష్ణమ్మా" మొ॥ పాటలన్ని జానపద సౌందర్యాన్ని పొదుగుకుని పరిమళించినవే అని చెప్పవచ్చు. సాధారణంగానే జానపదగీతమనగానే గానయోగ్యమైనది.అది సినీజానపదగేయమనగానే అందలిగానసౌందర్యం మిన్నులందుకుంటుందని చెప్పవచ్చు.

ముత్యాలముగ్గు (1975) సినిమాలో ఆరుద్ర రాసిన "ముత్యమంతా పసుపు ముఖమెంతో ఛాయ" అనే సుప్రసిద్ధగీతం, ఉయ్యాల జంపాల (1960) సినిమాలోని " కొండగాలి తిరిగింది గుండె ఊసులాడింది" అనే పాటలకు మూలాలు జానపదంలోనే ఉన్నవని ఆరుద్ర స్వయంగా ఒక ఇంటర్వ్యూలో చెప్పాడు.

గోరింటాకు (1979) సినిమాలో దేవులపల్లి కృష్ణశాస్త్రి రాసిన"గోరింటపూచింది కొమ్మాలేకుండా మురిపాల అరచేత మొగ్గా తొడింగింది" అనే పాటలోని...

"మామిడి చిగురెరుపు మంకెన పువ్వెరుపు
మణులన్నింటిలోన మాణిక్యం ఏరుపు" అనే పదబంధాలు, జానపదగీతంలోని "చిక్కుడుపువ్వెరుపు చిలకముక్కేరుపు చిగురెరుపు చింతల్లి దోరపండెరుపు అనే పంక్తులకు దగ్గరపోలికగా ఉండడం విశేషం. మన మహాకవులెందరిమీదో జానపద ముద్ర ప్రత్యేకంగా ఉందని చెప్పడానికి ఇదొక చిన్న ఉదా॥ ఇంకా "ఆనంద మానందమాయెనే మా అన్నయ్యపెండ్లి కొడుకాయెనే (పంతులమ్మ సముద్రాల) వంటి పెళ్లిపాటల్లో "కాళ్ల గజ్జె కంకాళ్లమ్మ" (ఆదర్శకుటుంబం-అత్రేయ) "దాగుడుముతా దండాకోర్" (బండరాముడు-ఆత్రేయ) "తప్పెట్లోయ్ తాళాలోయ్ దేవునిగుళ్లో బాజాలోయ్ (వాగ్దానం-నార్ల చిరంజీవి) వంటి పిల్లల పాటల్లో జానపద స్పర్శ కన్పిస్తుంది. మన పల్లెలసౌందర్యం, వృత్తులు, వినోదాలూ, వేడుకలూ, తిరునాళ్లు, తీర్థాలు. ఆటపాటలు, గారడీలు మొ॥వి అన్ని కూడా మన సినీ జానపదగీతాల్లో కనిపిస్తాయి. ఇంకా హరికథలు, బుర్రకథలు, ఒగ్గుకథలు, యక్షగానాలు, జంగంకథలు, వీధి భాగోతాలు మొ॥ జానపదకళారూపాల దృష్ట్యా కూడా ఎన్నో సినిమా పాటలు కన్పిస్తాయి.

నేటి తరం జానపదగీతాల విషయానికొస్తే 'కుబుసం' సినిమాకోసం గోరేటివెంకన్న రాసిన "పల్లే కన్నీరు పెడుతుందో కనిపించనికుట్రల" అనే పాటలో పల్లెల్లో మరుగున పడిపోతున్న వృత్తులగూర్చి, పల్లె ప్రజల దీనావస్థను గూర్చి చెప్పబడింది. ఇంకా సుద్దాల అశోక్ తేజ రాసిన భద్రాచలం సినిమాలోని "ఇదే నా పల్లెటూరు ఇదే నా తల్లిగారు" అనే పాటలో పల్లెని తల్లిగా భావించి సాగిలపడి మొక్కిన తీరు కనిపిస్తుంది. పల్లెసౌందర్యం భాసిస్తుంది. ఇంకా "మొండి మొగుడు పెంకిపెళ్లాం" సినిమాలో సాహితి రాసిన "లాలు దర్వాజ లష్కర్ బోనాల్ పండగ తెత్తనని తేకపోతివి" అనేపాట ప్రతి హృదయాన్ని కూడా హుషారెత్తించి చిందులేయిస్తుంది, ఇలాంటి జానవదగీతాలెన్నో మన తెలుగు సినిమాల్లో సందర్భోచితంగా పలికించబడి మన హృదయాల్లో చెరగని ముద్రవేశాయి. విశేషమైన పద సౌందర్యంతో మనల్ని ఆకట్టుకున్నాయి.

జానపదగీతమనగానే లేని సందర్భాన్ని కల్పించి మరీ సినిమాల్లో వాడుకున్న దర్శక నిర్మాతలున్నారు. దానికి కారణం జానపదగీతాల్లోని అచ్చమైన పదగుంఫనమే. ఇలా జానపదగీతాలు తెలుగు కావ్యసాహిత్యంలోనే కాకుండా సినిమా సాహిత్యంలో కూడా విశేషమైన ముద్ర వేశాయని చెప్పవచ్చు.

ఉపయుక్త గ్రంథసూచి :

1. తెలుగు సినిమా పాటచరిత్ర- డా॥ పైడిపాల, సునయన క్రియేషన్స్, బెంగుళూరు
2. తెలుగు సినిమాపాటల్లో సాహిత్యపువిలువలు - చిట్టిబోయిన కోటేశ్వరరావు (ప్రో॥ఆంధ్రవిశ్వవిద్యాలయం)
3. తెలుగు జానపదగేయ సాహిత్యం- డా॥ బిరుదు రాజు రామరాజు.
4. దాశరథి సినిమా పాటలు (సంకలనం)- ప్రభాకర్.
5. పగలే వెన్నెల (సినారె సినీగీతాల సంకలనం) -యువభారతి ప్రచురణలు.
6. నేలమ్మా నేలమ్మా (గేయరూపకవిత్వం)- సుద్దాల అశోక్ తేజ

BHAVAVEENA
Vol. 18, Issue. 10, October 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

తెలంగాణ సంస్కృతిలో బతుకమ్మ పండుగ విశిష్టత

- ఐ. ఐనయ్య కుమార్, పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ (ఓరియంటల్ విభాగం), ఉస్మానియా విశ్వవిద్యలయం.

భాద్రపద అమావాస్య నుంచి తొమ్మిది రోజుల పాటు తెలంగాణ ప్రజలు ప్రపంచంలో ఏ మూల ఉన్నా బతుకమ్మను ఆటపాటలతో నిర్వహించుకుంటారు. వివిధ పుష్పాలతో బతుకమ్మలను పేర్చి ఆరాధిస్తారు. బతుకమ్మ అమరిక కవిత్వం పేనినట్లు ఉంటుంది. అయిదు, ఏడు, తొమ్మిది అంతస్తులతో బతుకమ్మలను అలంకరిస్తారు. నిత్యజీవితంలో ఎదురయ్యే అనుభవాలే బతుకమ్మల ముందు పాటలుగా మారతాయి. తుకమ్మ పండుగసోంటి పండుగ కలీగంలనే లేదు ఇది పూల పండుగ.. ఆడపిల్లల పండుగ.. అక్కచెల్లెల్ల పండుగ.. అమ్మ.. అమ్మమ్మల పండుగ.. ఇది నీళ్ల పండుగ.. చెర్ల పండుగ.. పెద్ద సంబురమైన పండుగ.. దేశం పోయినోల్లు దసర బతుకమ్మలకే మల్ల ఊల్లెకు వచ్చేది అంటారు. తెలంగాణ సంస్కృతీ వారసత్వానికి బతుకమ్మ ఒక గీటురాయి. గ్రామాల్లో ప్రతిరోజూ పూలను సేకరించడమే అతి పెద్ద సంబురం. తంగేడుపూలు, గునుగు, కట్లపూలు, చామంతి, దానిమ్మ, గన్నేరు, పట్టుకుచ్చుల పూలు వంటి పూలతో బతుకమ్మలను పేరుస్తారు. అమావాస్య నుంచి ఆశ్వయుజ శుద నవమి దాకా రోజుకో తరహా నైవేద్యాలు సమర్పిస్తారు. పల్లీలు, బెల్లం, నువ్వుల బెల్లం, వంటివి ఉంటయి. అందరూ కలిసి చెరువు కట మీదికిపోయి బతుకమ్మలను జలప్రవేశం చేయించిన తరువాత ఆ నైవేద్యాలను ఇచ్చుకో వైనం..

పుచ్చుకో వైనం అంటూ ఒకరికొకరు అందించు కుంటారు. బతుకమ్మను కూర్చడానికి వినియోగించే పువ్వులన్నీ ఆరోగ్యప్రదాయకాలే. వర్షాలు తగ్గి, శీతాకాలం ఆరంభమయ్యే తరుణంలో శ్వాసకోశ వ్యాధులు ప్రబలుతాయి. ఈ సందర్భంలో వివిధ పువ్వుల సువాసనల్ని ఏకీకృతంగా ఆస్వాదించడం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం చేకూరుతుందని చెబుతారు. బతుకమ్మను తయారుచేయడం కోసం పువ్వులను సేకరించడం మొదలు ఆ బతుకమ్మను జలాశయంలో నిమజ్జనం చేసే వరకూ జానపదులు పలు నియమాలు క్రమం తప్పకుండా పాటిస్తారు. పూల సేకరణలో భాగంగా ముందుగా తమ ఇంటి ఆవరణలో మచ్చుల ఉన్న పువ్వుల్ని కోసి పూజా మందిరంలో దైవానికి అలంకరిస్తారు. తంగేడు పూలతో ఆరంభిస్తారు. పువ్వుల్ని పోయి తలలో తురుముకుని మహిళలు బతుకమ్మను పేర్చడానికి మ్ సమాయత్తమవుతారు.బతుకమ్మ కూర్పుకు ఎన్నో విధి విధానాలున్నాయి. సింహద్వారానికి ఎదురుగా (తూర్పు లేదా ఉత్తరానికి అభిముఖంగా) కూర్చుని బతుకమ్మను తయారు చేస్తారు. మహిళలు తాము ధరించిన చీర కొంగును తలపై నుండి లేదా భుజాల నిండా కప్పు కుంటారు. ఒక రాగి లేదా ఇత్తడి తంబాళం తీసుకుని దానిలో గుమ్మడి ఆకులు పరుస్తారు. ఆ ఆకులపై పసుపుకుంకుమలు, అక్షతలు వేస్తారు. బతుకమ్మ పేర్చడానికి వచ్చిన మహిళలకు నుదుట బొట్టు, మెడకు గంథం అలంకరిస్తారు. బతుకమ్మను పేర్చే తంబాళం వద్ద ఒక ఇత్తడి లేదా రాగి చెంబునిండా నీళ్లు కూడా ఉంచుతారు. బతుకమ్మ దాహానికి ఆ నీరు ఉ పకరిస్తుందని అభిప్రాయం. ముందుగా తంబాళంలో వర్తులాకారంగా అమరుస్తారు. నైపుణ్యంతో, సృజనాత్మకతలో, ఓపికగా పూలను దొంతర దొంతరలుగా పళ్లెంలో పేరుస్తారు. బతుకమ్మను ఎత్తుగా పేర్చడానికి గునుగు పువ్వుల్ని మొదళ్లలో కత్తిరిస్తారు. వాటిని కట్టలుగా కట్టి పలురంగుల్లో ముంచుతారు. ఆ రంగుల గునుగు పువ్వుల్ని అందంగా, హృద్యంగా పూలదొంతరల మధ్య అమరుస్తారు. పూల లభ్యతను బట్టి తాము తయారు చేయబోయే బతుకమ్మ ఆకృతిని నిర్దేశించుకుంటారు. అందుకు అనుగుణంగా తంబాళాన్ని ఎంచుకుంటారు.

వృత్తాకారంగా, గోడకట్టిన రీతిలో పూల అమరిక త్రికోణంగా ఉంటుంది. వృత్తాకేంద్రంలో గుమ్మడి, సొర, ఆముదం, కాకర, బీర, తంగేడు ఆకుల్ని నింపుతారు. బతుకమ్మ పటిష్టంగా ఉండడానికి పసుపు దారాన్ని నిలువునా పాయలు పాయలుగా చుడతారు. గుమ్మడి ఆకులతో ప్రారంభమైన బతుకమ్మ కూర్పు శీర్ష భాగాన గుమ్మడి పువ్వు అలంకారంతో ముగుస్తుంది. గుమ్మడి తీగ విస్తరించే సౌభాగ్యానికి, సహృదయానికి సంకేతం.

గుమ్మడి పువ్వు బంగారు రంగులో ఉంటుంది. బంగారం సంపదల వృద్ధికి చిహ్నం. గుమ్మడి గింజ భూమిలో నాటితే అతి త్వరగా మొక్కై ఆపై తీగగా విస్తరించి,అంతే వేగంగా పూలు పూసి పిందెలు,కాయలతో పాదు కళకళలాడుతుంది. గుమ్మడి సాఫల్యశక్తికి సంకేతం. బంగారు వర్ణంలో మెరిసే గుమ్మడి పువ్వు బతుకమ్మ పైభాగంలో ఉండడం వల్లనే బతుకమ్మ బంగారు బతుకమ్మ అయింది.బతుకమ్మను పేర్చిన తరువాత మొదటిగా సింహద్వారం ఎదురుగా వీటవేసి ఉంచుతారు. పెద బతుకమ్మ చెంతనే మరో చిన్న పళ్లెంలో తోడుబతుకమ్మగా చిన్న బతుకమ్మను పేరుస్తారు. పసుపుతో గౌరమ్మను చేసి చిక్కుడు కానీ తమలపాకు కానీ పెట్టి పత్తితో వస్త్రం చేసి గౌరమ్మకు అలంకరిస్తారు. బతుకమ్మను ఆటపాటల కోసం తీసుకెళ్లడానికి ముందు పూజామందిరం దగ్గర ఉంచి మంగళహారతి ఇస్తారు. ధూపదీప నైవేద్యాలు సమర్పిస్తారు. తమ కుటుంబం సుఖసంతోషాలతో,ఆనంద సౌభాగ్యాలతో వరిల్లాలని గృహిణులు ఆకాంక్షిస్తారు. పసుపు గౌరమ్మను బతుకమ్మ శీర్షభాగాన ఉన్న గుమ్మడిపువ్వులో ఉంచుతారు.బతుకమ్మ ఉత్సవాల్లో మొదటిరోజైన మహాలయ అమావాస్యను పెతరమాస అని సంబోధిస్తారు. ఇది పితృదేవతలకు ఎంతో ప్రీతిని కలిగించే రోజు. పెతర అనే పదం పితృ అనే పదానికి వికృతిగా చెప్పవచ్చు. ఈ దినాన పితృదేవతల ప్రీతికోసం ఎంగిలిపూల బతుకమ్మను పేర్చి, నువ్వులు, బియ్యంపిండి, నూకలు కలిపి నైవేద్యంగా పెడతారు. రెండో రోజైన ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నాడు బతుకమ్మను పేర్చి, అటుకులు, చప్పడిపప్పు, బెల్లంతో చేసిన పదార్థాన్ని నైవేద్యంగా సమర్పిస్తారు. మూడోనాడు ముద్దపప్పు బతుకమ్మకు పాలు, బెల్లంతో కలిపిన పదార్థాలను నివేదిస్తారు. నాలుగోనాటి బతుకమ్మకు నానవేసిన బియ్యం, పాలు, బెల్లం కలిపి నైవేద్యంగా సమర్పిస్తారు. అయిదో రోజున బతుకమ్మకు అట్లను నివేదన చేస్తారు. కనుక అట్ల బతుకమ్మ అని పిలుస్తారు. ఆరోరోజున అలుక పూనుతుంది కనుక, ఆమెకు ఈ దినాన నైవేద్యం ఏమీ ఉండదు. ఆమె అలుక తీర్చడమే ఆనాటి అర్చన. ఏడో రోజున బతుకమ్మకు బియ్యం పిండితో వేపకాయల ఆకృతిలో వండిన పిండివంటలను నైవేద్యంగా పెడతారు. ఎనిమిదినాడు నువ్వులు, వెన్న, నెయ్యి, బెల్లం కలిపిన పదార్థాన్ని నివేదన చేస్తారు. తొమ్మిదో రోజు దుర్గాష్టమి. ఇది బతుకమ్మ పండుగకు ముగింపు రోజు. ఆ రోజున బతుకమ్మకు ఎన్నోవిధాలైన చద్దులను నివేదించడం పరిపాటి. ఆ చద్దులలో పెరుగుతో కలిపినవి, పులి సూరలా చేసినవీ, నిమ్మ రసంతో కలిపినవి, కొబ్బరితో కలిపి చేసినవి, నువ్వుల అన్నంతో కలిపినవి అయిన రకరకాల చద్దులను బతుకమ్మకు సమర్పిస్తారు. మానవాళి ప్రాణధారణకు అవసరమైన అన్నివిధాల శక్తులను అందించే అన్నాన్ని బతుకమ్మకు నివేదించి, దానిని ప్రసాదంగా అరగించడమే ఈ చద్దుల బతుకమ్మ పండుగలోని పరమార్థం. దుర్గాష్టమినాడు బతుకమ్మలను సమీప జలాశయాలలో నిమజ్జనం చేయడం సంప్రదాయం. ప్రతినిత్యం బతుకమ్మను జల నిమజ్జనం చేస్తారు. చివరి రోజైన చద్దుల బతుకమ్మ వండుగ మాత్రం విశేష సేవలతో అలరారుతుంది.

ఒక్కేసి వెలగ పండే గౌరమ్మ / దూరాన దోర పండే గౌరమ్మ
దూరాన దొరలైరి గౌరమ్మ / పట్నాన పంతులైరి గౌరమ్మ

అటు చూసి మాయన్నలు గౌరమ్మ / ఏడు మేడ లెక్కిరి గౌరమ్మ
ఏడు మేడ లెక్కి ఎత్తులు దాటంగా / ఎదుర్కోలి యంగా
దొంగలెవరు దోసిరి గౌరమ్మ బంగారు గుండ్ల వనమే గౌరమ్మ
శ్రీ లక్ష్మీ నీ మహిమలు గౌరమ్మ / చిత్రమై తోచునమ్మ గౌరమ్మ
భారతీ దేవివై బ్రహ్మకిల్లాలివై / పార్వతీదేవివై పరమేశు రాణివై
పరగ శ్రీలక్ష్మివై గౌరమ్మ / భార్యవైతివి హరికినీ గౌరమ్మ
ఎన్నెన్నో రూపాలు / ఏడేడు లోకాలు / ఉన్న జనులకు / కోరికలు సమకూర్చగా
కన్న తల్లివైతివి గౌరమ్మ / కామధేనువు అయితివి గౌరమ్మ
ముక్కోటి దేవతలు / సక్కని కాంతలు / ఎక్కువ పూలు గూర్చి
పెక్కు నోములు నోమి / ఎక్కువ వారిరై గౌరమ్మ / ఈ లోకముల నుండియు గౌరమ్మ
తమరి కంటే ఎక్కువ / దైవము ఎవ్వరూ లేరు / తమకింపు పుట్టింపు
క్రమముచే పాలించగా గౌరమ్మ / కన్నుల పండుగాయే గౌరమ్మ
ఒక్కేసి వెలగ పండే గౌరమ్మ / దూరాన దోర పండే గౌరమ..

తెలంగాణా ప్రాంతీయులకు బతుకమ్మ అపురూపమైన పూలపండుగ, నెలరోజుల పండుగ, మేలిమి పండుగ, తెలంగాణా మట్టిపరిమళం సంస్కృతి, జీవనవిధానం, ఆడబిడ్డల ఆదరణ ఈ పండుగచుట్టూ పెనవేసుకుని ఉంటాయి. బట్టలు, నగలు, సత్తుపిండి కమ్మదనాలు, కొత్త పెండ్లి కూతుర్లకు బతుకమ్మవాయినాలు. తల్లి గారింటికి ఆడబిడ్డల ఆగమనంతో బొడ్డెమ్మను నిల్పిననాటి నుండే పండుగసందడి నెలకొంటుంది. ఆడామగా తేడాలేకుండా అందరూ పువ్వులు సేకరించితేగా, అందంగా బతుకమ్మలు పేర్చుకుని, తమ జాతిజీవితాన్ని స్త్రీలు ఉయ్యాలపాటలుగా ఆడిపాడి తరిస్తారు. 1. జూలూరి గౌరీ శంకర్ - తెలంగాణ సంస్కృతి (సం) బతుకు తెరువుపండుగ. తెలంగాణా ప్రజల సాంఘిక జీవితంలో పచ్చనిచెట్లకు, పశువులకు ప్రాధాన్యత ఎక్కువ. బతుకమ్మ పండుగలో తంగెడు పువ్వుది తిరుగులేని స్థానం. స్థానికమైన ఆచార వ్యవహారాల్లో కూడా తంగెడు చెట్టుకు అతీతశక్తులుం టాయని విశ్వాసం. ఇక కాముని పండుగకు, శివరాత్రికి-మోదుగపూలకు విడదీయరాని సంబంధం, తెలంగాణా ప్రజలు ఆయా సందర్భాల్లో వాడే తంగెడు, వెంపలి, బలుసు, జమ్మి, మోదుగ మొదలైనవన్నీ మెట్టభములోనే పుట్టి పెరిగే చెట్లు. కనుక తెలంగాణాది అచ్చమైన స్థానికసంస్కృతి. బతుకమ్మ పండుగ ఈ విషయాన్నే ధృవీకరిస్తుంది.బతుకమ్మ చుట్టూ జీవితం-జీవితం చుట్టూ బతుకమ్మ పెనవేయబడిన అచ్చమైన తెలంగాణా కథ "పొన్నగంటి చెరువు". ఉత్సవం-ఉత్సాహం, జీవితం-విశ్వాసం ఈకలో సజీవంగా కన్పిస్తాయి. "తెలంగాణా తనాన్ని వేడుకపరిచే అద్భుతమైన కథ ఇది. బతుకమ్మలు పేర్చటం కోసం పూలుతెంపటానికి వెళ్ళిన అక్కకు కళ్ళల్లో జిల్లేడు పాలుపడి కళ్ళుపోతాయి. నమ్మిన బతుకమ్మ అంతపని చేస్తుందా అని తమ్ముడికి దేవతమీద కోపం వస్తుంది. అక్క శాశ్వతంగా గుడ్డిది కాబోవడం లేదని తిరిగిచూపు వస్తుందని తెలిసి పారేసిన బతుకమ్మను తిరిగి పట్టుకుని సగౌరవంగా వదులుతాడు. కథంతా బతుకమ్మ పరిమళం, జీవితపు పచ్చివాసన. ఇక్కడి నేలకే ప్రత్యేకమైన జీవనశైలి. స్థానిక నైసర్గికతను, పరంపరాగత సంస్కృతిని మిళితంచేసి స్థానికతావాదం పరమరూపంగా, మట్టిలో మనుషులను అంతర్భాగంగా చిత్రించినకథ పొన్నగంటి చెరువు".ఆబాలగోపాలానికి ఆనందాన్ని పంచి పెట్టేది బతుకమ్మ. ఎంగిలిపూలువేసింది మొదలు పల్లెల్లో

పిల్లలహుశారు ఇంతింతని చెప్పటం సరిపోదు. సద్దుల బతుకమ్మకు మూడు రోజుల ముందునుండే పువ్వులు సేకరించేందుకు పిల్లలు జట్లు జట్లుగా చేన్లుచెలుకలు, చెట్లు గుట్టలు, చెరువుకట్టలు గాలిస్తుంటారు. వేకువజామునే నిద్రలేచి తంగెడు, గునుకపువ్వుకోసం పరుగులు తీస్తారు. ఇరుగుపొరుగుకంటే తమబతుకమ్మ ఎత్తుగా, అందంగా ఉండాలని నిద్రాహారాలు లెక్కచేయక ప్రతిఇంట్లో పిల్లలు ఆరాటపడుతుంటారు. జిల్లేడు పువ్వులు శివపార్వతులకు ప్రీతి పాత్రమైనవి. బతుకమ్మ గౌరీ స్వరూపం కనుక కొన్ని ప్రాంతాల్లో జిల్లేడు పువ్వులతో బతుకమ్మను అలంకరిస్తారు. పొన్నగంటి చెరువుకథ పైనచెప్పుకున్న విషయాల్ని యథావిధిగా రికార్డు చేసింది.

చిలుక కొరికిన పండు	ఉయ్యాలో	చింతించరాదు	ఉయ్యాలో
అమ్మ నీ కోడళ్ళ	ఉయ్యాలో	బద్ధించరాదు	ఉయ్యాలో
బద్ధించి వదినెతో	ఉయ్యాలో	మాటపడరాదు	ఉయ్యాలో
మాటపడి పుట్టింట	ఉయ్యాలో	మరియుండారాదు	ఉయ్యాలో
అమ్మ ఏమన్నదే	ఉయ్యాలో	ఓ రామచిల్క	ఉయ్యాలో
అమ్మ అంచూ చీరే	ఉయ్యాలో	కట్టుక పొమ్మంది	ఉయ్యాలో
అన్న ఏమన్నడే	ఉయ్యాలో	ఓ రామచిల్క	ఉయ్యాలో
అన్న అరునెలలు	ఉయ్యాలో	ఉండిపొమ్మనెను	ఉయ్యాలో
వదినె ఏమన్నడే	ఉయ్యాలో	ఓ రామ చిల్క	ఉయ్యాలో
వదినె వన్నెలాడి	ఉయ్యాలో	వద్దూ పొమ్మనెను	ఉయ్యాలో
తమ్ముడేమన్నడే	ఉయ్యాలో	ఓ రామ చిలుక	ఉయ్యాలో
తమ్ముడూ తన పెళ్ళి	ఉయ్యాలో	చేసిపొమ్మనెను	ఉయ్యాలో

వివిధ రూపాంతరాలతో పాడే ఈ పాటలో ఆడపిల్లపై పుట్టింటిలోని వివిధ కుటుంబ సభ్యులకుండే మమతానురాగాలు, అనూయాద్వేషాలు వ్యక్తమవుతున్నాయి. అత్తింటినుండి వచ్చిన ఆడపిల్లను తల్లి అక్కున జేర్చుకొని పక్కనే పదకో బెట్టుకుంటుంది, తండ్రి ఆరునెలలు ఉండి పొమ్మంటే. అన్న అవులేగ మొదలైన కానుకలు తీసుకొని వెళ్ళిపొమ్మని అన్నాడు. పరాయి ఇంటి నుండి కోడలు స్థానంలో వచ్చిన వదినె మాత్రం వాకిట్లో నుండే వెళ్ళిపొమ్మంటుంది. తమ్ముడు మాత్రం తన పెళ్ళి చేసి పొమ్మని కోరుతాడు, పెళ్ళి తర్వాత అమ్మాయికి మెట్టినిల్లే స్థానం. ఆ మెట్టిల్లు దాటి వచ్చిన స్త్రీని సమాజంతో పాటు పుట్టింటి వారు కూడా తక్కువ చూపు చూస్తారన్న ధ్వని ఈ పాటల్లో కన్పిస్తుంది.

BHAVAVEENA
Vol. 18, Issue. 10, October 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావ వీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

వట్టికోట జైలు లోపల కథలు – ప్రజా రాజాకీయాలు

– చిరంజీవి వోనె, పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం.

పట్టికోట ఆళ్వారుస్వామి నల్లగొండ జిల్లాలోని నకిరేకల్ సమీపాన ల 'మాధవరం' అనే గ్రామలో 1 నవంబర్, 1916న నిరుపేద శ్రీ వైష్ణవ బ్రాహ్మణ దంపతులు శ్రీమతి సింహంద్రిమ్మకు, శ్రీమాన్ రామచంద్రా చార్యులకు జన్మించాడు. స్వయంకృషితో చదువుకొని విజ్ఞానవంతుడై గొప్ప రచయితగా సాహిత్యంలో స్థానం పొందాడు. అదే క్రమంలో ప్రజా ఉద్యమాల్లో పాల్గోని ప్రజల మనిషిగా ఎదిగాడు పట్టికోట ఆళ్వారుస్వామి రచయితగా, ఉద్యమకారుడిగా సమానంగా కృషి చేశాడు. గ్రంథాల యోద్యమంలో పాల్గొన్నాడు. గ్రంథమాలను స్థాపించి సాహిత్యావ్రేచురణలు చేసి పాఠకులను పెంచాడు. సాహిత్యాసక్తిని కల్గించాడు. ఒక పంటల వాడుగా, హోటల్ సర్వర్‌గా, ప్రూవ్ రీడర్‌గా, సామాన్యునిగా జీవితం ప్రారంభించిన పట్టికోట కమ్యూనిస్ట్ పార్టీలో సభ్యునిగా ఉద్యమకారునిగా గొప్ప సాహిత్య సృష్టికర్తగా రూపొందాడు, తెలంగాణలో ఆయన పాల్గోనని ఉద్యమం లేదు.

1943 ఆంధ్రప్రాంతంలో ఆరంభమైన అభ్యుదయ రచయితల సంఘం సమావేశాలకు తెలంగాణ నుంచి ఎకైక ప్రతినిధిగా పట్టికోట ఆళ్వారుస్వామి హాజరు అయ్యారు. కాంగ్రెస్ ఆలోచనాపరుడిగా సంఘ సంస్కరణకు పాటుపడే విమర్శకుడిగా, కార్యశీలిగా ఆళ్వారుస్వామి గుర్తింపు తెచ్చుకోన్నాడు. గ్రంథాల యోద్యమం, నేత్రికోద్యమం, సత్యాగ్రహాల్లో విశిష్ట భూమిక పోషించాడు.

పట్టికోట గారు నిత్యం ప్రజల సమస్యలపై పోరాటాం చేసేవారు. నగర ప్రాంతంలో కార్మికలు సమస్యల పరిష్కారం కోసం వారు కృషి చేస్తూ వచ్చేవారు. 1944లో గుమస్తాల సంఘంను నెలకొల్పాడు. వెట్టి చాకిరీకి దగ్గరగా బతుకులులీడుస్తున్న కార్మికులకోసం వారానికికొక సెలవు దినాన్ని ఇతర రాయితీలను పోరాటం చేసి సాధించారు. వారి కోసం 'గుమాస్తా' పత్రికనునడిపాడు. 1946లో హైదరాబాదులోని రిక్షాలను నిజాం సర్కారు రద్దు చేయడానికి సిద్ధం అయింది. అది తెలిసిన వెంటనే రిక్షా కార్మికులందరిని ఏకం చేసి ప్రభుత్వ నిర్ణయానిన వెనక్కి తీసుకునే దాక పట్టికోట పోరాటం చేశాడు. రైల్వేశాఖ వారు తాత్కాలిక ఉద్యోగులను తీసివేసినపుడు ఆళ్వారుస్వామి వారితో కలిసి ఉద్యమం కొనసాగించారు.

1938 నుంచి 1961లో చనిపోయే వాటి వరకు తెలంగాణ చైతన్యానికి, పోరాటానికి అనునిత్యం పాటుబడ్డ స్వార్థత్యాగి ఆళ్వారుస్వామి ఆయన కథలు, నాటికలు, నవలలు రాశాడు. మొదటి నవల దేశోద్ధారక గ్రంథమాల తరపున 1955 జనవరిలో ప్రచురితమయింది. దాని పేరే ప్రజల మనిషి ఈ పేరు సరిగ్గా సరిపోతుంది.ఈ నవలలో తెలంగాణ జనసామాన్యతో పాటు, సర్వ సామాన్యంగా అందరూ మాట్లాడే భాషను సంభాషణల్లో రాశాడు. 'గంగు' నవల 'ప్రజల మనిషికి' కొనసాగింపు, గంగు నవలలో కమ్యూనిస్టు పార్టీ తెచ్చిన చైతన్యం పోరాట స్ఫూర్తి వర్ణించబడినాయి.

పట్టికోట 1946-51లో జైలులో వున్నప్పుడు రచించిన కథలను 1952లో 'జైలు లోపల' పేరుతో దేశోద్ధారక గ్రంథమాల 13వ ప్రచురణగా అంటె జైలు ఉంచి విడుదల కాగానే గ్రంథమాలను పునరుద్ధరించి దాని తరుపున ఈ కథల సంపుటిని ప్రచురించాడు. దీనిలో ఆరు కథలు ఉన్నాయి. ఇవి గాక సుజాత స్రవంతి. తెలుగుతల్లి మొదలైన పత్రికల్లో 'ధర్మారాజు' మొదలూన కలం పేర్లతో పట్టికోట వ్రాసిన కథలు 15 దొరుకు తున్నాయి.

పట్టికోట వారు ఎక్కడ ఉన్నా అక్కడి దుర్వ వ్యవస్థను బాగు చేయాలని తపన పడ్డాడు. జైలులో వున్న పరిస్థితు

లను చూసి స్పందించాడు. ఆయన జైలులో ఉన్న ఖైదీల జీవిత నేపథ్యం చేత చలించిపోయే పట్టికోట 'జైలు లోపల' కథలను రచించారడు. ఈ కథలు నిజంగా జరిగిన సంఘటనలు నిజమైన జీవితాల చేత ప్రేరణను పొంది వ్రాసి కథలే కొన్ని కథల్లో ఖైదీల సామాజిక జీవితం నేపథ్యం అయితే కొన్ని కథల్లో రాజకీయ పరిణామాలు నేపథ్యంగా వున్నాయి.

ఈ కథానికల్లో జైలే కథా స్థలం, 1940-50 మధ్య కాలమే కథ కాలం, ఈ సమయంలో రెండవ ప్రపంచ యుద్ధం, నిజాం వ్యతిరేక పోరాటం రెండు ఉన్నాయి. జైలు పరిసరాలే కథానికలలోకి, జైలులో ఉన్న పాత్రలకీ విస్తరిస్తుంది. జైలు బయట వున్న పాత్రలను కూడ ప్రభావితం చేస్తుంది. కష్టజీవుల కోసం ఉద్యమకారుల కోసం, వర్గ సమాజం ఈ లోకంలో నిర్మించిన నరకం పేరే జైలు. జైలు ఒక పెద్ద తలకిందులవ్యవహారం, జైల్లో ఉండవలసిన నేరస్తులంతా బయట స్వేచ్ఛా ప్రపంచంలో వుంటారు. బయట ఉంవల్సిన మంచి వాళ్ళంతా జైలు లోపల ఉంటారు. నెహ్రూ గారు అన్నట్టు "మన దేశంలో జైళ్ళలో శిక్ష అనుభవిస్తున్న వారిలో నూటికి 85 మంది నేర ప్రపృత్తి గలవారు కాదు, తక్కిన 15 మంది కూడ స్వభావత: నేరగాండ్రు కారు, పరిస్థితులే వారినావిధంగా చేశాయి". ఐతే 'జైలు లోపల' కథల్లో జైల్లో ఉన్నవాళ్ళంతా అమాయకులే అని మనం నమ్మితే చాలు ఆళ్వారుస్వామి కథల ప్రయోజనం నెరవేరినట్లే.

"జైలు లోపల' కథల్లో మొదటి కథ 'పరిగె'.తెలంగాణ పల్లెలో సామాన్యుని జీవితం ఎంత దీనంగా వుండేదో ఈ కథ చెప్తున్నది. వెట్టిచాకిరి చేసే కింది కులాల వాళ్ళకు వాళ్ళ పొట్ట పోసుకోవటానికి సమయం ఉండేదికాదు. గ్రామంలోని దొరలకు, గ్రామాధికారులకు, దొరాలకు వచ్చే ప్రభుత్వోద్యుగులకు జీతబత్తాలు లేకుండా పనులు చేయాలి. ఈ కథలో మల్లయ్య ఖానాపురంలో వంతు మాదిగ, కూతుర్ని కన్న తల్లి చనిపోయింది. జీవితమంతా వెట్టిచాకిరి చేసి కండలు కరిగించిన తండ్రి మంచం పట్టాడు. ప్రేమతో పెంచి పెద్ద చేసిన చెల్లెలుకు తండ్రికి ఇంత తిండి పెట్టని స్థితిలో వున్నాడు మల్లయ్య ఒకరోజు మల్లయ్య వెట్టిచాకిరికి పోయి సాయంత్రం వచ్చాడు. ఆకలితో మలమలమాడుతన్న తండ్రికి, చెల్లెలుకు తినటానికి ఏమైనా గింజలు సంపాదించి తస్తానని బయలుదేరిన మల్లయ్య ఒక చెనలో పరిగె కర్రలను పోగు చేసుకొని కట్ట కట్టుకొని సంతోషంగా బయలు దేరుతాడు. ఇంతలో అజానుబాహువైన రైతు వచ్చి తన కల్లంలోంచి ధాన్యం కట్టలను దొంగిలించాడని పోలీసు పటేలుకు అప్పజెస్తాడు. చెల్లెలును పక్క గ్రామానికి వంతుకి పంపి పోలీసు పటేలు మల్లయ్యను పోలీసులకు అప్పజెప్పాడు. మల్లయ్యకు దొంగతనం నేరం క్రింద మూడు నెలలు జైలు శిక్ష పడుతుంది. జైలులో వున్నప్పుడు తండ్రి మరణించాడని చెల్లెలు ఊరు విడిచి ఎక్కడికో వెళ్ళిపోయిందని ఇల్లు పాడుపడిందని మల్లయ్యకు తెలుస్తుంది. ఆ వార్త విని మల్లయ్య గత్యంతరం లేక పెద్దగా ఏడుస్తాడు, తపిస్తాడు అది ఖైదీ మల్లయ్య జీవితం.

'పతితుని హృదయం' కథలో ఉరిశిక్ష నిషేధింప బడాలన్న విషయాన్ని పట్టికోట చర్చించాడు. ఒక ఖైదీ ఉరితీయబడ్డాడని తెలిసిన గండయ్య చాలా చలించి పోతాడు. 'ఓ మనిషి ఇంకో మనిషి చేతులు కట్టి ఉరిపెట్టి వేలాడ దీస్నే చచ్చిందాక గుడ్లు మిటకరిస్తూ చూడటానికి అక్కడ నిలుచున్నవాండ్లకేటా మనసొప్పిందో' నాకైతే అతని సీనిగెను చూడటానికి కూడ మనసొప్ప లేదురా' అని గండయ్య విచలితుడవుతాడు. విద్య, విజ్ఞానం లేక వేరే పని చేయలేక నేరం చేసేవాళ్ళ పరిసరాల ప్రభావంతో నేరాలు చేస్తున్నారు. వాళ్ళను బాగు చేస్తే బాగు పడ్డారు కాని ఉరి తీయటమన్నది మానవత్వానికి విరుద్ధమని మట్టికోట అభిప్రాయం. ఆ రోజుల్లో ఒక వైపు నిజాం ప్రభుత్వంతో పోరాటంలో మునిగి తేలుతూ కూడా పట్టికోట పౌరహక్కులు, మానవ హక్కుల గురించి

ఆలోచించాడు. ఉరిశిక్ష వుండకూడదని రద్దు కావాలని మానవతా దృక్పథంతో బాదపడ్డాడు.

'విధిలేక' కథలో నర్సయ్య పేదరికం, నిరుద్యోగం, నైరాశ్యంతో విధిలేక వేరే మార్గం లేక క్రమంగా దొంగ అవుతాడు. మూడు నెలల కఠిన శిక్ష పడుతుంది. బీదతనం, నిరాదరణ, నిరుద్యోగం, దుష్టసహవాసం, వీటి ఒత్తిడి వల్ల నేను ఈ విధంగా అయ్యాను. నా వంటి వాళ్ళు తయారు కావటానికి కారణమైన దుష్ట శక్తుల గురించి ఆలోచించండి. దుష్ట జూడ్యమైన బీదతనం విషక్రిములను ఊరు పేరు లేకుండా చేయండి. చేయాల్సి కర్తవ్యం మీరు బాగా గుర్తించాలె. అని నర్సయ్య కాంగ్రెస్ వాదితో అంటాడు. ఎన్నికల్లో గెల్చి రాబోయే కాంగ్రెస్ ప్రభుత్వం కర్తవ్యాన్ని పట్టికోట ఇక్కడ గుర్తు చేసాడు. బీదతనాన్ని తొలగించకపోతే నర్సయ్య లాంటి చీడ పురుగులు తయారవుతారు నర్సయ్య జైలులో వుండగానే అతని భార్య ఆకలి బీదతనం భరించలేక లక్ష్మయ్య అనే దొంగను పెండ్లి చేసుకొని నర్సయ్య జీవితం నుంచి వెళ్ళిపోతుంది. ఆ విధంగా నర్సయ్య జీవితం మంట గలుస్తుంది. 'విధిలేక ! విధిలేక ! అంటూ జైలు గోడల మధ్య నర్సయ్య బుసకోడ్తూ వుండిపోతాడు.

'మా కంటే మీరేం తక్కువ' కథ చిన్నదే. కాని ఆ కథలో చెప్పిన విషయం ఆనాటి సమాజాన్ని విమర్శి సున్నది. రంగడు, వెంకడు దొంగలు, వాళ్ళున్న జైలుకు ప్రభుత్వం చేత నియమింపబడిన జైలు విజిటర్‌గా ఇంద్రసేనారెడ్డి వస్తాడు. అతన్ని చూసి రంగడు, వెంకడు గుర్తుపడ్తాడు 'మా రాజులు కష్టపడ్డందుకు గట్టెక్కిను మేము వున్న చోటనే ఉన్నాం. పాపపు పుటకలు అంటాడు రంగడు. కొందరు 1948 సెప్టెంబర్ 17న పాలిసి చర్యతో నిజాం లొంగుబాటు కావటంతో పోరాట విరమణ చేశారు. అటువంటి వారు ప్రభుత్వంలో ఉద్యోగాలు కూడా సంపాదించుకొని లౌక్యం పాటించరని ఈ ఇంద్రసేనారెడ్డి వృత్తాంతాన్ని బట్టి తెలుస్తుంది.

ఈ సంపుటిలో 'మెదడుకు మేత' కథ చాలా పెద్దది. ఈ కథలో పట్టికోట హిందూ ముస్లింల మధ్య కోట్లాలలు చెలరేగటానికి అసఖ్యతకు కారణాలను విశ్లేషించారు. ఒకటి హిందూ ముస్లింలలో వున్న విభిన్న ఆచారాలు అలవాట్లు వాళ్ల మధ్య అసహనం కలగటానికి కారణాలు కాగా, వాళ్ళ వాళ్ళ మతసంప్రదాయాల విభిన్నత మరో కారణం అని ఈ రెండు విషయాల్లో ఇద్దరూ సహనం వహించి పరస్పరం గౌరవించుకోవటం చేత సఖ్యత సమ కూడుతుందని కమ్యూనిస్టు భావాలు గల మోహన్‌బాబు పాత్ర మూలంగా పట్టికోట చెప్పాడు. 'అవకాశమిస్తే' కథలో చాలా తేలికైన సంభాషణలతో హస్యపూర్ణంగా నడిచింది, పాత్రలు గంభీరమైనవి కావు. సంభాషణాలు గంభీరంగా లేవు ఈ కథలో పట్టికోట ధ్వనింప చేసిన విషయాలు గంభీరమైనవి, పోరాటంలో పాల్గొన్న వాళ్ళు కొందరు ఎట్లా అన్ని విధాల బాదపడ్డారో చిత్రించాడు. మామూలు కార్యకర్తలు ఎక్కడున్నా వాళ్ళు అక్కడే వుండి పోయారు. వాళ్లను పట్టించుకొనేవాళ్ళు లేక పోయారు. ఇటువంటి సంఘటనలతోనేమో జైలు నుంచి విడుదల య్యాక 1951, 52ల్లో పట్టికోట రాజకీయాలకు విముక్త డయ్యాడు పార్టీకి దూరంగా వున్నాడు. పట్టికోట ఆళ్వారు స్వామి మొదట్లో రచించిన కథల కన్న 'జైలు లోపల' కథలు భాష శైలిలో, కథనం, కథన శిల్పంలో ఉ త్కృష్టమైనవి. అంటే ఆయన కథా రచనలో చేసి సాధన, కథన శిల్పంలోని ప్రస్థానం తెలుగు సాహిత్యంలో కొన్ని ఉత్తమమైన, అపురూపమైన కథలను సృష్టించారు. అవి తెలుగు సాహిత్యంలో గౌరవాన్ని తెచ్చి పెట్టాయి.

వ్యవస్థతో రాజీపడి రాయదలచుకున్న వాళ్ళకు, దానితో సంఘర్షస్తూ రాసిన వాళ్ళకు పొంతన వుండదు. నిరంతరం సంఘర్షణలో సంభవించిన అగ్ని పుంజాలే ఆళ్వారు రచనలు అని చెప్పవచ్చు. ఒక హోటల్ కార్మికుడు రచయిత కావటం ఆశ్చర్యం కాకపోవచ్చు. కాని రచయితలనే ఆశ్చర్యపరిచే రచయిత కావటం మాత్రం

అనుహ్యం. సాహిత్య సృజన అన్నది ఆళ్వారుకు పేరు తెచ్చి పెట్టే వ్యాపకం కాదు. ప్రజలు చైతన్యపరిచే వాహిక. పట్టికోట నవలల్లోగాని, కథల్లోగాని వాస్తవికతను తగిన సరళ సులభ భాషాశైలిని ప్రయోగించాడు. ఆయన వస్తువును ఎంత సరళంగా మన ముందుంచుతాడో శైలి కూడా సరళంగా వుంటుంది. నవలాకారునిగా, కథల రచయితగా, వ్యాస రచయితగా, పత్రికా నిర్వాహకుడిగా, గ్రంథాలయ నిర్మాతగా తెలుగు సాహిత్యంలో చెరగని స్థానాన్ని సంపాదించుకున్నాడు. తన తరాన్ని తన తరువాతీ తరాలనూ ప్రభావితం చేసిన తెలంగాణ విమోచనోద్యమ కథా రచయిత ఆళ్వారుస్వామి జీవితం, సాహిత్యం, వ్యక్తిత్వం స్ఫూర్తిదాయకం, చిరస్మరణీయం.

ఆధార గ్రంథాలు :

1. తెలంగాణ తొలి తరం కథలు ముదిగంటి సుజాతరెడ్డి
2. తెలంగాణ ఆధునిక సాహిత్య చరిత్ర తెలుగు అకాడమి
3. జైలు లోపల కథలు పట్టికోట ఆళ్వారుస్వామి
4. తొమ్మిది పదుల 'తెలంగాణ కథ' కాలువ మల్లయ్య
5. మాట పదేళ్ళ తెలుగుకథ విభిన్నధోరణులు
6. పట్టికోట ఆళ్వారుస్వామి రచనలు ఒక పరిశీలన అమ్ముంగి వేణుగోపాల్
7. 20వ శతాబ్ది తెలుగు సాహిత్య చరిత్ర ఆచార్య ఎస్వీ రామారావు

BHAVAVEENA
Vol. 18, Issue. 10, October 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావ వీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

స్త్రీ విముక్తి – సాధికారత

– డా॥. పెండ్యాల లావణ్య
లెక్చరర్, తెలుగు విభాగం,
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రాజోలు,
తూర్పు గోదావరి జిల్లా.

– డా॥. బూసి వెంకటస్వామి
సహ ఆచార్యులు, తెలుగు విభాగము,
శ్రీ ఎ.ఎస్.ఎన్.ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల
(స్వయంప్రతిపత్తి), పాలకొల్లు, పశ్చిమ గోదావరి జిల్లా.

"కార్యేషుదాసి కరణేషు మంత్రి
రూపేచ లక్ష్మీ క్షమయాధరిత్రి
భోజ్యేషుమాత శయనేషురంభ
షఢ్ ధర్మయుక్తా కులధర్మపత్ని"

అన్న పురాణశ్లోకం పురాణకాలం స్త్రీల ఉత్తమ గుణగుణాల్ని తెలియజేశాయి. అయితే మారుతున్న కాలానుగునంగా, పరిస్థితుల దృష్ట్యా నేటి సమాజం స్త్రీని గౌరవించాలని పేర్కొంటూనే కట్టుబానిసగా తయారు చేశాయి. ఆడది అబల కాదు సబల అని నిరూపించిన సాహిత్యం స్త్రీవాద సాహిత్యం. తెలుగు సాహిత్యంలో స్త్రీవాద సాహిత్యం సంచలనాన్ని రేకెత్తించింది. మొదటి దశలో రచయిత్రులకు పరిమితమైన స్త్రీవాదం క్రమంగా మొత్తం సమాజవాదంగా మారిపోయింది. స్త్రీవాదం కేవలం స్త్రీల వాదమే కాదు సమాజంలోని అన్ని వర్గాల వారిది. స్త్రీల చైతన్యాన్ని వ్యక్తిత్వాన్ని గౌరవించే స్త్రీ పురుష పాత్రల్ని జండర్ భేదం లేకుండా అందరూ తమ రచనల్లో చిత్రిస్తున్నారు. ఈ పరిణామాల్ని స్త్రీవాదం సాధించిన విజయంగా చెప్పవచ్చు. అయితే ఈ మార్పు సమాజంలో ఆశించిన రీతిలో లేకపోయినప్పటికీ సాహిత్యంలో మాత్రం కనిపిస్తుంది. చదువుకోవడంతో ఆరంభమైన స్త్రీ చైతన్యం నెమ్మదిగా ఆర్థిక స్వాతంత్ర్యం, ఆత్మగౌరవం, స్వాభిమానం, కుటుంబ, సమాజంలో సమానస్థానం. సమాన హక్కులు మాట్లాడడం వరకు వచ్చింది. సామాజికంగా స్త్రీలలో క్రమక్రమంగా వచ్చిన ఈ చైతన్యానికి రచయిత్రుల సాహిత్యం దర్పణం పడుతుంది.

1910 సంఘ సంస్కరణోద్యమం, 1935 జాతీయోద్యమం, 1950 తెలంగాణా పోరాట ఉద్యమం, 1970 శ్రీకాకుళంలో గిరిజన పోరాట ఉద్యమం, చలం, శ్రీపాద, కొ.కు. ఎగెన్‌స్మెడ్లి, కమలాదాస్, శరత్ మొదలగు వారి సాహిత్యాలు స్త్రీ పురుషుల్లో చైతన్యాన్ని కలిగించాయి. ముఖ్యంగా స్త్రీలలో వాళ్ళ అణచివేతకు సంబంధించిన అవగాహనను కలిగించాయి. ఈ నేపథ్యంలో స్త్రీవాద సాహిత్యం పుట్టుకొచ్చింది. ఏ సమాజంలోనైనా స్త్రీ వంచించబడుతూనే ఉంది. వివాహం, కుటుంబం, మాతృత్వం, ఆర్థికావసరాలు, సాంఘిక సంబంధాలు ఎక్కడ వుంటాయో అక్కడ సమస్యలు ఉత్పన్నమౌతాయి. సమస్యల యొక్క పరిపక్వత పరాకాష్ట దశను సూచించే చైతన్యం, ప్రతి ఘటన ఈ రెండు ఎక్కడ ఉంటాయో అక్కడ ఉద్యమాలు ఊపిరిపోసుకుంటాయి. స్త్రీవాదం అలా పుట్టిందే. సమాజంలోని సాంఘిక సంబంధాల్ని కుటుంబంలో ఉన్న పురుషాధికారాన్ని మౌలికంగా ప్రశ్నించడం స్త్రీవాదం యొక్క ముఖ్య ఉద్దేశ్యం.

ప్రాచీన సాహిత్యంలో స్త్రీలు కవిత్వం రాయటం భక్తి కవిత్వంతో ప్రారంభమైంది. ప్రాచీన కవయిత్రులందరూ భక్తిభావంతో భగవంతుణ్ణి ఉద్దేశించి తమతమ అభిప్రాయాల్ని రచనల ద్వారా తెలియజేశారు. తొలి తెలుగు కవయిత్రిగా కీర్తించబడిన తాళ్ళపాక తిమ్మక్క కవిత్వం భక్తి కవిత్వమే. ఆ తర్వాత మొల్ల, మధురవాణి, రంగాజమ్మ, రామభద్రాంబ, తరిగొండ వెంగమాంబ, గంగాదేవి మొదలగువారు పురుష భావజాలంతో పురుష దృక్పథంలో నుండే కవిత్వం రాశారు. కొంత స్వేచ్ఛాయుతంగా స్త్రీ పురుషుల శృంగారాన్ని ముద్దుపళని వర్ణించింది.

స్త్రీల జీవితాల గురించి సమాజంలో స్త్రీల భాగస్వామ్యాన్ని రచయిత్రులు ఇతివృత్తాలుగా మలిచి మొదటి

నుండి కథలు రాస్తూనే ఉన్నారు. తమలోని స్త్రీత్వాన్ని నిర్వచించుకుంటూ రచయిత్రులు రాసిన కథలున్నాయి. అయితే స్త్రీవాదం మొదటిగా 1902లో వెలువడ్డ భండారు అచ్చమాంబ 'స్త్రీ విద్య' కథ నుండి మొదలుపెడితే మొదట స్త్రీ విద్యతోనే రచయిత్రులు కథ మొలైంది. 'స్త్రీ విద్య' ఇతివృత్తం అప్పటి సమాజ పరిస్థితులకు అద్దం పడుతుంది.

20వ శతాబ్దంలో మహిళా సాధికారత సరికొత్త రూపాన్ని సంతరించుకుంది. మహిళాలోకంలో ఈ పరిణామం సరికొత్త విప్లవం. ఈ శతాబ్దంలో స్త్రీలలో విద్యాధికుల శాతం గణనీయంగా పెరిగింది. దీనితోపాటు స్త్రీలపై అరాచకాలు కూడా అదేస్థాయిలో పెరిగాయి. అణచివేత, అత్యాచారాలు, లైంగిక వేధింపులు, కుల దూషణలు, లింగవివక్ష, అశ్లీల, అనభ్య పదజాల సంస్కృతి, వరకట్న దురాచారం, ఇంటాబయట ఇలా అన్నిచోట్ల రకరకాల వేధింపులు ఒక ప్రక్క అయితే, మరోప్రక్క గృహహింసలు విపరీతంగా పెరిగాయి. అందుకే స్త్రీలు 20వ శతాబ్దం నుండి తమ హక్కులను తామే రక్షించుకోవాలనే ధృడ సంకల్పంతో కలాన్ని గళాన్ని ఆయుధంగా చేసుకుని తమకోసం తామే రచనలు చేసుకుంటూ మహిళా సాధికారత సాధించే దిశగా ప్రయత్నం చేస్తున్నారు. అటువంటి సాహిత్యమే స్త్రీవాద సాహిత్యం స్త్రీవాద సాహిత్యాన్ని స్త్రీలే సృష్టించుకుని వాళ్ళ సమస్యలను వారే పరిష్కరించుకునే దిశలో అనేక రచనలు చేశారు. ఇప్పటికీ చేస్తూనే ఉన్నారు.

తొలి స్త్రీవాద కవితగా 1972లో 'ఓల్గా' రాసిన 'ప్రతి స్త్రీ నిర్మల కావాలి' అనే కవితను విమర్శకులు గుర్తించారు. 1980 నుండి వచ్చిన స్త్రీవాద కవితలను త్రిపురనేని శ్రీనివాస్ 'గురిచూసి పాడేపాట' పేరుతో 1990 సంవత్సరంలో తొలి స్త్రీవాద కవితా సంకలనాన్ని ప్రచురించారు. 1984లో ఆంధ్రజ్యోతి వారపత్రికలో సావిత్రి రాసిన 'బందిపోట్లు' కవితా ఖండిక సంచలనం సృష్టించింది. తర్వాత నీలి మేఘాలు (1993) సంకలనంలో ఈ కవిత చోటు చేసుకుంది. స్త్రీవాద కవితా ధోరణులపై ఎన్నో వాదాలు, వివాదాలు చెలరేగాయి. ఈ వాదాలన్నింటిని ఎస్.వి. సూర్యప్రకాశ్ సంకలనకర్తగా అ.ర.సం 1997లో ప్రచురించింది. ఆచార్య ఎన్.గోపి ఎండ్లూరి సుధాకర్, భగ్వాన్, ఆశారాజు వంటి కవులు కూడా స్త్రీవాద ధోరణిలో కవితలు రాశారు.

స్త్రీవాద కవిత్వం వచనంతోనే పదునెక్కి ఎర్రదనాన్ని సంతరించుకుంది. స్త్రీవాద కవయిత్రులలో మహిళా సాధికారత సాధించే దిశగా ప్రయాణిస్తున్న వారిలో ఓల్గా, జయప్రద, సావిత్రి, విమల, కొండేపూడి నిర్మల, హేమలత, నిర్మల, రావులపల్లి సునీత, పాటిబండ్ల రజనీ, కె.గీత, ఎస్.జయ, మెహజబీన్, శిలాలోలిత, చల్లపల్లి స్వరూపారాణి, షాజహాను, మోసా ప్రభావతి, శారదా అశోకవర్ధన్, చిల్లర భవానీదేవి, భార్గవీరావు, శరత్, జ్యోత్స్నారాణి మొదలైనవారు ముఖ్యులు.

ఫెమినిజం అనే మాటకు తెలుగులో వ్యవహారనామ స్త్రీవాదం. స్త్రీవాదానికి 150 ఏళ్ల చరిత్ర వుంది. పారిశ్రామిక విప్లవం వలన పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ రూపుదిద్దుకుంటూ అందుకు అనుగుణంగా ఉదార ప్రజాస్వామిక రాజకీయ భావాలు అభివృద్ధి చెందుతున్న చారిత్రక క్రమంలో అణచివేతకు గురౌతున్న వర్గంగా స్త్రీలు గుర్తించబడ్డారు. మానవ సమాజంలో సగభాగంగా ఉన్న స్త్రీలు పురుషులకంటే తక్కువ సాంఘిక స్థితిలో ఉండటాన్ని ప్రశ్నిస్తూ వాళ్ళ అభ్యుదయాన్ని, విముక్తినీ వాంఛిస్తూ వచ్చిన స్త్రీవాద భావన 19వ శతాబ్ది ఉత్తరార్ధానికి ఉద్యమరూపం దాల్చింది. బ్రిటీష్ వలన పాలన కారణంగా స్త్రీవాదం భారతదేశంలోకి మధ్య తరగతి వారి భావజాల వ్యవస్థను యధాశక్తిగా ప్రభావితం చేయటం ద్వారా ప్రవేశించింది. 1975 నుండి ప్రారంభమై కొనసాగిన అంతర్జాతీయ మహిళా దశాబ్దిలో స్త్రీవాదం ఒక బలమైన ధోరణిగా వేళ్ళూనుకుంది. తెలుగు సాహిత్య సాంస్కృతిక రంగాలలో గొప్ప మార్పుకు లోను చేసింది. (స్త్రీవాద ధోరణులు - సమకాలీన సాహిత్యం - 75)

తెలుగు సాహిత్యంలో స్త్రీజనోద్ధరణకు మొట్ట మొదటిగా దీక్షా కంకణం కట్టుకున్న మహోన్నత మూర్తి కందుకూరి వీరేశలింగం పంతులు. స్త్రీ అభివృద్ధిని కాంక్షిస్తూ ప్రత్యేకంగా స్త్రీలకోసం పత్రికలు స్థాపించారు. సత్యవతీ చరిత్ర నవలను స్త్రీలకోసం రాశారు. ఇందులో సుఖసంసార జీవితానికి స్త్రీవిద్య ఆవశ్యకతను నొక్కి వక్కాణించారు. వితంతు పునర్వివాహం, స్త్రీవిద్య, బాల్య వివాహాలు మొదలైన విషయాలపై ధ్వజమెత్తి స్త్రీలకోసం కందుకూరి సేవ అనితరసాధ్యమైనది.

గురజాడ వారికి తెలుగు సాహిత్యంలో మహోన్నతమైన స్థానముంది. గురజాడ సృష్టించిన స్త్రీలందరు ప్రేమ మూర్తులు, ఆదర్శమూర్తులు, సజీవమూర్తులు, సౌజన్య మూర్తులు, సచ్చీలులు, సంస్కారవంతులు డబ్బుకు లోబడి తల్లిదండ్రులు తమ ఆడపిల్లల్ని ముసలివాళ్ళకు ఇచ్చి బలవంతంగా అంటగడితే జరిగే విపరీత పరిణామాలకు పూర్ణమ్మ కథ నిదర్శనం. అధికార గర్వంతో స్త్రీని బలాత్కారంగా పొందాలని చూస్తే దాని ఫలితం ఎలా ఉంటుందో 'కన్యక' తెలియజేసింది. 'మాతంగ కన్య' ఆదర్శ దాంపత్యానికి మారుపేరు. 'మధురవాణి' విచక్షణా జ్ఞాన సంపన్నురాలు. గురజాడ వారి స్త్రీ నేటి సమాజంలోని వాస్తవాలకు నిలువుటద్దం అనడంలో ఎటువంటి సందేహం లేదు.

స్త్రీ యొక్క మనసు లోతుల్ని మానసిక క్షోభను వాళ్ళ అంతరంగిక ఆవేదనను క్షుణ్ణంగా పరిశీలించి వారు చలం. స్త్రీ అభివృద్ధి కోసం అహర్నిశలు పాటుపడిన మహాను భావులు. స్త్రీ కూడా మనిషే అని ఆమెకు కూడా రంగు, రుచి, వాసన కావలసి వుంటుందని గుర్తించాలని అంటూ 'స్త్రీకి శరీరముంది, దానికి వ్యాయామం ఇవ్వాలి. ఆమెకు మెదడు వుంది. దానికి అనుభవం ఇవ్వాలి' అని చలం గారు అంటారు. నేటి సమాజంలో స్త్రీ బానిసగా మారిందని బాధపడ్డాడు. స్త్రీకి సంపూర్ణ. స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు కోసం పాటుపడిన కీర్తి చలానికి దక్కుతుంది. చలం తన రచనలలో స్త్రీకి విశిష్టమైన స్థానాన్ని అందించారు. చలం 'స్త్రీ' అనే గ్రంథంలో స్త్రీకి సముచితమైన స్థానం కల్పించారు. చలం స్త్రీని వివిధ కోణాల నుంచి సునిశితంగా పరిశీలించిన స్త్రీ అభ్యుదయవాది.

విశాల జగత్తులో స్త్రీ మనుగడను అధఃపాతాళానికి తొక్కేశారు. స్త్రీ శారీరకంగా పురుషుడికన్నా బలహీనమైనది. కనుక మానసికంగా కూడా ఆమెను ఆధీనంలోకి తెచ్చుకుంది పురుష సమాజం. స్త్రీని శక్తి స్వరూపిణి అని ఒకవైపు దేవతారూపమని పొగుడుతూనే వాస్తవంగా మాత్రం హీనంగా చూడడం మొదలుపెట్టారు. స్త్రీ ఇల్లుద ఆటి బయటకు రానివ్వకుండా కట్టడి చేశారు. ఆంక్షల వలయంలో ఆమెను అణచి ఉంచారు. తన మనసులోని ఏ మాటను స్వేచ్ఛగా చెప్పే అవకాశం ఆమెకు ఎప్పటికి రాదు. స్త్రీ ఎంత చదువుకున్నా ఎంత పెద్ద పెద్ద ఉద్యోగాలు చేస్తున్నా స్త్రీ స్థానం మాత్రం ఇప్పటికీ ప్రశ్నార్థకమే.

ఒకప్పుడు చదువులేక లోకజ్ఞానం తెలియక బానిసగా బతికితే ఇప్పుడు అన్ని ఉన్నా కూడా స్త్రీ మగాడి అహంకారానికి కీలుబొమ్మ. ప్రాచీన కాలాన్ని పరిశీలిస్తే స్త్రీకి చదువు ఎందుకు అంటూ చదువును దూరం చేశారు. ఆడపిల్ల ఆడపిల్లనే ఈడ పిల్లకాదనే ముద్రవేశారు. పుట్టగానే ఆడపిల్ల అని పరాయిని చేసినా, బాల్యంలో దిక్కుతోచని పసిమనసు దీనంగా ఏడ్చింది. సమాజం చివరికి ఆడపిల్ల ఏడుపు ఇంటికి అరిష్టం అంటూ మనసారా ఏడ్చే స్వేచ్ఛను కూడా లేకుండా చేశారు.

నేటి సమాజంలోనైన స్త్రీకి స్వేచ్ఛ ఉందా? అని ప్రశ్నించకుంటే అది ప్రశ్నగానే మిగిలిపోతుంది. ఎందుకంటే ఎంత చదువుకున్నా ఉద్యోగం చేస్తున్నా సమాజం మగాడినే గుర్తిస్తుంది కాని ఆడదాని త్యాగాన్ని గుర్తించదు. స్త్రీని పనిచేసే యంత్రంలానే చూస్తారు. అక్కడ తండ్రి, మరోచోట భర్త, ఇక్కడ కొడుకు అన్నీ మగమహారాజుల పుట్టుకలే. కూతురిగా, భార్యగా, అమ్మగా అబలకెపుడూ నిరాధరణ ఛీత్కారాలే.

ఈ సమాజం మారనంత కాలం ఆడవాళ్ళకి స్వేచ్ఛ లేదనే చెప్పాలి. భారతదేశ జనాభాలో మోసగింపబడుతోంది. సమాజం స్త్రీని పనిచేసే యంత్రంగానే చూడబడుతుంది. ఆర్థిక స్వేచ్ఛ లేదు. మత, సాహిత్యపరమైన గ్రంథాలలో కూడా స్త్రీని నీచంగా చిత్రించబడింది. వ్యాపార ప్రకటనలలో, సినిమాలలో స్త్రీని ఒక ఆట బొమ్మగా సెక్స్ సింబల్‌గా మాత్రమే చూపిస్తున్నారు. అన్నిచోట్ల పురుషాధిక్యమే రాజ్యమేలుతుంది. కాబట్టి స్త్రీకి సాంఘిక న్యాయం చేకూరాలని స్త్రీవాదం బయలుదేరింది. స్త్రీవాదం ఆశయం విద్యతో పాటు ఉద్యోగాలలో సమాన ప్రతిపత్తితోపాటు ఆర్థిక స్వాతంత్ర్యం కలిగి ఉండాలన్నదే ప్రధాన ఆశయం.

BHAVAVEENA
Vol. 18, Issue. 10, October 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావ వీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

ఆధునిక జానపదం బుల్లెట్టు బండి పాట

– డా॥. చింతల రాకేశ్ భవాని, అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు శాఖ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హయత్‌నగర్, రంగారెడ్డి జిల్లా.

తెలంగాణ పాట ట్రెండు మారింది. జానపదం స్టైలు మార్చింది. బుల్లెట్టు బండెక్కి డుగ్గుడుగ్గని మన వాకిళ్ళలోకి వచ్చేసింది. తెలంగాణ పల్లెపదాలను నింపుకున్న ఆధునిక జానపదం తెలుగు నేలంతటా పలుకుతున్నది. భాషలో, భావంలో, రాగంలో కొత్త అందాలొలికిస్తున్నది.

"పాట అంటేనే తెలంగాణ, తెలంగాణ అంటేనే పాట" అని పద్మ పేరుని జానపదంలో ఆధునికతతో జతచేసి మనకు అందించాడు రచయిత లక్ష్మణ్. జానపదగీతం అంటేనే ఎటువంటి నిర్బంధాలు, ఆడంబరాలు లేనటువంటిది, ఎవరైనా తమ సందర్భానికి అనుగుణంగా మార్చుకోవడానికి కుదిరేటువంటిది. పెళ్లి కాబోయే ఆడపిల్ల మనస్సును తెలిపే ఈ పాట ప్రజల్లోకి వచ్చిన తర్వాత పిల్లలను బడికి రప్పించే బడిపిల్లలపాటగా, కరోనా భూతాన్ని తరిమివేయాలనే అవగాహనామంత్రంగా, ఇంకా ఒక్కొక్కరి అవసరానికి అనుగుణంగా ఒక్కోవిధంగా మారిపోయింది. ఆ పాటలన్నీ మనం యూట్యూబ్‌లో వింటూనే ఉన్నాం. వింటూ మూలగీతం 'బుల్లెట్టు బండి' పాటను తలుచుకుంటూ మురిసిపోతూనే ఉన్నాం.

జనరంజకమై అశేష ప్రజల విశేషామోదాన్ని పొందిన ఈ బుల్లెట్టు బండి పాట పెళ్లీడుకొచ్చిన ఆడపిల్ల ఆశలు, కనే కలలు పరోక్షంగా ప్రతిబింబిస్తుంది. పాటలోని గొప్పతనం ఏమిటంటే ఆమె తాను భర్తకు ఏమివ్వగలననేదే చెప్పుంది కానీ తనకు భర్తనుండి ఫలానాది కావాలని అని అడగడం లేదు. మనకు కావాల్సింది ఒకరి నుండి పొందినప్పటికంటే ఒకరికి కావాల్సింది మనం అందిచ్చినప్పుడు మనం పొందే ఆనందం అనంతం, అనిర్వచనీయం. ఈ పాటలో ఆ అమ్మాయి కూడా అటువంటి ఆనందాన్ని అనుభవిస్తూ తాను గొప్ప ప్రేమల మధ్య మంచిగా పెరిగానని ఆ మంచితనాన్నీ, ప్రేమను నీకు పంచుతాను అని చెప్తుంది. ఇది ప్రత్యక్ష భావం. గురజాడ సూక్తి ప్రకారం "ప్రేమ నిచ్చిన ప్రేమ వచ్చును" అన్నట్టుగా ఆమె 'నేను ప్రేమించినప్పుడు, ప్రేమగా చూసుకున్నప్పుడు' అతను కూడా 'నన్ను ప్రేమిస్తాడు, ప్రేమగా చూసుకుంటాడు' అని పరోక్షంగా భావిస్తుంది. అందుకనే "చెయ్యి నీ చేతికిస్తానురో, అడుగు నీ అడుగులేస్తానురో, నేను మెచ్చి నన్నే మెచ్చేటోడా, ఇట్టే వస్తారా నీవెంటా" అంటుంది. ఈ పల్లవి చివరనే కాక పాట ప్రతి చరణం చివరనా వచ్చే పదాల్లో చాలా గొప్ప కవిత్వం ఉంది.

వర్ధమాన గేయరచయిత లక్ష్మణ్ విలక్షణ పద ప్రయోగంతో రాసిన ఈ 'బుల్లెట్టు బండి' పాటలో "పట్టుచీరనే గట్టుకున్నా, గట్టుకున్నుల్లో గట్టుకున్నా" అంటూ అందమైన తెలంగాణ నుడికారాన్ని వినూత్న రీతిలో ప్రకటించాడు. మధ్య తెలంగాణ ప్రాంతంలో అంటే జగిత్యాల, సిద్దిపేట జిల్లాల ప్రాంతంలో వాడే అందమైన పదప్రయోగం 'ఉల్లో'. అభిమానంతోనో, ఆప్యాయతతోనో, ఆశ్చర్యంతోనో, ఒకింత వెటకారంతోనో మాట్లాడినప్పుడు ఈ పదప్రయోగం అక్కడ సర్వసాధారణం. ఏకవచనంలో కన్నా బహువచనంలో ఈ ప్రయోగం ఎక్కువ. 'ఏమంటరుల్లో, ఏం జేస్తున్నరుల్లో, మావోడచ్చిండుల్లో, ఇంకా వండలేదుల్లో' అనడం మనం చూస్తాం. ఇదే ప్రయోగం దక్షిణ తెలంగాణలో 'అల్లా'గా వాడబడుతుంది. 'ఏడికి బోతున్నరల్లా, ఏంజేస్తున్నరల్లా' అని అక్కడి ప్రజలు మాట్లాడుతారు. కూరగాయలు అమ్మేటప్పుడు కూడా వరుసలో నాలుగైదు కూరగాయల పేర్లను చెప్పి చివరన 'ఉల్లో' పదంతో ముగించడం కూడా మామూలే. "దొండకాయలు బెండకాయలు దోసకాయలు టమాటలుల్లో" అంటూ కూరగాయలు అమ్మేవాళ్ళ

గొంతు గట్టిగా మనం వినే ఉంటాం. ఎన్నోసార్లు విన్నా కూడా ఈ మాట ఎక్కడా ప్రత్యేకంగా ప్రయోగింపబడక పోవడంతో మన స్మృతిపథంలో అంతగా ముద్రించుకు పోలేదు. అయితే పాట వింటున్నప్పుడు అందమైన రాగంతో అందమైన భావాన్ని చెప్పడానికి ఈ అందమైన పదాన్ని తొలిసారిగా ఉపయోగించడంతో తెలిసిన పదమే మనకు మళ్ళీ కొత్తగా తెలియడంతో ఆశ్చర్యం ఆనందం కలగలిసిన ఒక కొత్త మధురానుభూతికి మనం లోనవు తున్నాం.

''నీ బుల్లెట్టు బండెక్కి వచ్చేత్త పా డుగ్గు డుగ్గు డుగ్గు డుగ్గు డుగ్గనీ, నా అందాల దునియానే సూపిత్త పా చిక్కు చిక్కు చిక్కు చిక్కుబుక్కనీ'' ఇక్కడ బండెక్కి వచ్చేస్తా పద అనకుండా 'వచ్చేత్త పా' అనడం, నా అందాల దునియాని చూపిస్తా పద అనకుండా 'సూపిత్త పా' అనడం పాటకు అందాన్ని నిండుతనాన్ని కలిగించాయి. ఇవి రెండు అచ్చమైన అందమైన తెలంగాణ పల్లె పదాలే. 'చిక్కుబుక్కు' అనే పదాలు ఇంతకుముందు మనం విన్నా 'డుగ్గు డుగ్గు' అనే సౌండ్ మాత్రం మనం పాటల్లో తొలిసారి వింటున్నాం. ఇంకా ''టిక్కీ బొట్టే వెట్టుకున్నా'' కూడా ఓ మధురమైన ప్రయోగం. పాట పల్లవిలో వచ్చిన అందమైన విలక్షణమైన ఈ పదజాలం పాట అందాన్ని ద్విగుణీకృతం చేయడంలో సఫలమయ్యాయి. ఈ పాటలో అమ్మాయి కాబోయే భర్తకు తన గురించి చెప్పడమే కాదు, పాటను రాస్తున్న రచయిత కూడా ఈ సమాజానికి తన అభిప్రాయాన్ని చెబుతున్నాడు. తెలం గాణ పల్లెల అందాలని, పల్లె ప్రజల అందమైన మనసు లని, అక్కడి మట్టి పరిమళాలని, పల్లెటూరి శ్రామిక కుటుంబంలోని సభ్యుల మధ్య ప్రేమానుబంధాలని, ఆడపిల్లల పట్ల తల్లిదండ్రులు, అన్నదమ్ములు చూపించే ఆప్యాయతానురాగాలనీ రచయిత మరొకసారి మన ముందుకు తీసుకువచ్చాడు. అంటే పాటలోని మాటల్లో అటు అమ్మాయి గొంతు ఇటు కవి గొంతు రెండూ వినిపిస్తున్నాయన్నమాట.

రచయిత చెప్పినట్టుగానే ఈ పాటలో 30 ఏళ్ల కిందటి తెలంగాణ పల్లెసొగసులు వర్ణించబడ్డాయి. ''చెరువుకట్ట పొంటి చేమంతివనం'', ''మా ఊరు వాగంచున మల్లెవనం'' అన్నప్పుడు తెలిసేది తెలంగాణ పల్లె అందమే కాదు తెలంగాణ భాషా సౌందర్యం కూడా. 'చెరువుకట్ట పొంటి, వాగు అంచున, చేమంతులు దెంపి, మల్లెలు దెంపి' అనేవి అందమైన తెలంగాణ పదాలే. ఇంకా బతుకమ్మ పేర్చడంలో తంగేడు పూలు, గునుగు పూలు ఆ తర్వాత బంతులు, చేమంతులు ఎక్కువగా వాడతారు. కనుక ఇక్కడ బంతివనం, చేమంతివనం అనడం తెలంగాణ ప్రాంతీయతలో కలిసిపోయి పాటకు మంచి అందాన్ని ఇచ్చింది. ఆ రోజుల్లో మల్లెచెట్టు ప్రతి ఇంట్లో ఉండే చెట్టే, మల్లెపువ్వు ప్రతి ఆడపిల్ల మెచ్చే పువ్వే. బంతి చేమంతుల పూలదండ నీ మెడలో వేసి నీ చెయ్యి పట్టుకుంటా, మల్లెపూలు నా జడలో పెట్టుకుంటా అని చెప్తూ ''మంచి మర్యాదలు తెలిసినదాన్ని, మట్టి మనుషుల్లోనా వెరిగినదాన్ని'' అని తన పెంపకంలోని గొప్పతనాన్ని తెలియజేస్తుంది. తనకు తెలిసిన మంచీ మర్యాదలన్నీ తనను పెంచిన ఆ మట్టిమనుషుల నుంచే నేర్చుకున్నానని అన్యాపదేశంగా చెప్తుంది ఇక్కడ. తన వాళ్ల ఔన్నత్యాన్ని చెప్పకనే చెప్తుంది. తను ఎందరి ప్రేమల మధ్యలో పెరిగిందో తర్వాత చరణంలో తెలియజేస్తుంది. ఏడింట్లలో తను ఒక్కతే ఆడపిల్లనని, తల్లిచాటు పిల్లనని, తండ్రిగుండెలో ప్రేమనని అన్నదమ్ములకు ప్రాణమని అంటుంది. వెన్నెల్లో గోరుముద్దలు తినిపిస్తూ ఎంతో గారంగా ''చేతుల్లో పెంచారు పువ్వల్లే నన్ను, నీ చేతికిస్తారా నన్నేరా నేను'' అని ప్రేమగా చెప్తుంది. చేతుల్లో పెంచడం అనేది తెలంగాణాలోని ఒక గొప్పమాట. లేకలేక పుట్టిన పిల్లలని కిందికి దించకుండా ఎప్పుడు చేతుల్లో ఎత్తుకునే పెంచడం అంటే చాలా ప్రేమగా పెంచడం అన్నమాట. అలా అపురూపంగా పువ్వులాగా పెరిగిన తనను నీ చేతికిచ్చుకుంటాను అని చాలా అందమైన పదాలలో తెలిపింది.

పెళ్లి అయినాక నేను మీ ఇంటిలోకి కుడికాలు పెట్టి వచ్చాక మీకు తప్పకుండా కలిసొస్తుంది. నిన్ను కన్నవాళ్ళని నా కన్నవాళ్ళుగా చూసుకుంటా, నీ కష్టాలలో నేను పాలు పంచుకుంటా. అందరూ మనల్ని చూసి మురిసిపోయేలా "నా ఏడు జన్మాలు నీకిచ్చుకుంటా, నీ తోడులో నన్ను నే మెచ్చుకుంటా" అంటూ ఏడు జన్మలు నీతోనే జీవిస్తా అని చెప్పింది. మన సమ్మకాల ప్రకారం పెళ్లి అనేది ఏడేడు జన్మల బంధం. నా ఏడు జన్మలు నీకు ఇచ్చు కుంటా అనేది చాలా అందమైన ప్రయోగం. భారతీయ ధర్మంలో భారతనారీ హృదయంలో అనాదిగా అల్లుకున్న సంప్రదాయం -

"కార్యేషు దాసీ కరణేషు మంత్రీ"
"రూపేచ లక్ష్మీ క్షమయా ధరిత్రి"

సమానత్వం కోసం ఎన్ని పోరాటాలు చేసినా, గడప దాటి ఎన్ని ఉద్యోగబాధ్యతలు నెత్తికెత్తుకున్నా పైన చెప్పిన ఏ ధర్మాన్నీ ఈనాటికీ దాటకుండా మోస్తూ వస్తున్న భారతీయస్త్రీ నిజంగా 'క్షమయా ధరిత్రి'. అందుకే ఆ భావం మొత్తాన్ని నింపుకొని వచ్చిన "నీ బుల్లెట్టు బండెక్కి వచ్చేత్త పా" పాట సూపర్‌హిట్టు.

'ఆపాతమధురం సంగీతం ఆలోచనామృతం సాహిత్యం' అనేది అందరూ ఎరిగిన సత్యమే. విన్నంతనే ఆనందాన్ని కలిగించేది సంగీతమయితే విని ఆలోచించి అర్థం చేసుకున్నాక ఆనందం కలిగించేది సాహిత్యం. అందమైన భావాల కన్నా అందమైన రాగాలే శ్రోతల మనసుల్ని తొందరగా పరవశింపజేస్తాయి. పాటల్లో అంద మైన భావాలని ఎంతో గొప్పగా వర్ణించినా ఆకట్టుకునే లక్షణం బాణీలో లేక అంత గొప్ప భావాలు శ్రోతల చెవుల్లోకి ఎక్కకుండా మరుగున పడిపోయిన పాటలు ఎన్నో. అలా కాకుండా భావం మామూలుగా ఉన్నా బాణీ అందంగా ఉంటే ఆ పాటలు శ్రోతల మనసుల్లోకి ఎక్కు తాయి, వారి నోళ్లలో నానుతుంటాయి. ఇక సంగీతమూ సాహిత్యమూ రెండూ కూడా శ్రోతల్ని ఆకట్టుకునేవే అయితే ఆ పాట విజయం 'బుల్లెట్టుబండి' పాటలాగా ఉంటుంది. ఈ ఘనత కూడా గీత రచయిత లక్ష్మణ్‌కే చెందుతుంది. గాయని మోహన భోగరాజు పెళ్లి కాబోయే ఆడపిల్ల కలలని తెలిపేలా ఓ పాట కావాలని అడిగి నప్పుడు, ఇరవై రెండు రోజులు తపస్సు చేసి పాట రాయడమే కాదు దానికి అందమైన వరుస కట్టి మరీ ఆమెకు వినిపించాడు. అది ఆమె స్వరంలో తీయని మధువై మనకు వీనులవిందు చేసింది, మనల్ని ఆనంద పారవశ్యంలో విహరింప జేసింది. పాటలోని రాగం, లయ చెవులకు ఇంపుగా ఉండడమే కాదు పాటలోని భావం ప్రజల మనోభావాలకు అద్దం పడుతుండడం పాట విజయానికి ముఖ్య కారణం.

ఆధార గ్రంథాలు :

1) తెలుగు మాండలికాలు కరీంనగర్ జిల్లా, డా. బూదరాజు రాధాకృష్ణ(సం), తెలుగు అకాడమీ, హైదరాబాద్.2004
2) తెలుగు మాండలికాలు నల్లగొండ జిల్లా, డా. ఎస్. ఎస్. మోహన రావు, తెలుగు అకాడమీ, హైదరాబాద్.2007
3) తెలుగు మాండలికాలు రంగారెడ్డి జిల్లా, ఉషా పన్నాల, తెలుగు అకాడమీ, హైదరాబాద్. 1998
4) తెలుగు మాండలికాలు మహబూబ్ నగర్ జిల్లా, డా. కె. లక్ష్మీనారాయణ శర్మ, తెలుగు అకాడమీ, హైదరాబాద్.1999
5) తెలుగు భాషాచరిత్ర, ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి, తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

BHAVAVEENA
Vol. 18, Issue. 10, October 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

Gandhian's "Sarva Dharma Sambhavi" and Indian Relion

- ***B. Venkateshwarlu***, Research Scholar Dept. of Philosophy, Osmania University, HYD, TS

Abstract :

"Sarva Dharma Samabhava" is a unique notion of Indian secularism steeped in Hindu culture and tradition that evolved in independent India under the influence of Gandhian thinking. In Hindi, India's primary language, the word "Sarva Dharma Samabhava" literally means "equal respect for all religions." It arose during postcolonial India's state construction and is frequently seen as an Indian intellectual contribution to political thinking. The concept differs from the western definition of secularism, which argues for the complete separation of state and church rather than treating all religions equally.

In his letters to the prisoners of his Sabarmati Ashram in Ahmedabad, Gandhi frequently discussed the notion of "Sarva Dharma Samabhava" while in Yervada Jail in Pune in 1930. Gandhi was always drawn to the ideal of Hindu-Muslim unity and peace, and he worked tirelessly to achieve it. In a culture where religion was a fundamental component of mass belief and behaviour, his challenge was how to create a secular social space.

Key Words : Dharma, Religion, Unity, Thought, Secularism, Politics, Truth.

Introduction :

Gandhi's syncretic approach to religion, reflected in his idea of Sarva Dharma Sambhava (Equal respect for all religions), goes much beyond secularism and multiculturalism. While accepting the fundamental equality of all religions, he distinguished between religion and irreligion. Gandhi's attitude towards religion was not of a patronizingtoleration; rather it sought to develop the spirit of a fellowship. For Mahatma Gandhi, religion was the foundation of all his activities from spiritual to mundane including politics which were governed by the spirit of religion. According to him, the state should look after secular welfare, health, communications, foreign affairs but not one's religion which is purely a personal concern. He was contemplating a secular state in free India which would give freedom to its citizens to express religious, atheist or any other identity.

